In Public domain. Digitization Muthulakshmi Research Academy

సంస్కృత అకాడమీ గ్రంథమాలా - 122

భగవత్పతఞ్జలికృతం

యోగదర్శనమ్

పద్మశ్రీ పురస్కృతులు మహామహోపాధ్యాయ

ఆచార్య డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

రచించిన బాలానందినీ వ్యాఖ్యతో

ప్రధాన సంపాదకః
ఆచార్య కే. నీలకంఠః
నిదేశకః, సంస్కృత అకాడమీ

సహాయకః
కే వి సూర్యప్రకాశః

సంస్కృత అకాడమీ
కేంద్రీయసంస్కృతవిశ్వవిద్యాలయేన మానితా ఆదర్శశోధసంస్థా
ఉస్మానియా విశ్వవిద్యాలయః, హైదరాబాద్.
2022

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సంస్కృత అకాడమీ గ్రంథమాల – 122
In Public domain. Digitization Muthulakshmi Research Academy

భగవత్పతఞ్జలికృతం

యోగదర్శనమ్

పద్మశ్రీ పురస్కృతులు మహామహోపాధ్యాయ

ఆచార్య డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

రచించిన బాలానందినీ వ్యాఖ్యతో

ప్రధాన సంపాదకులు

ఆచార్య కే. నీలకంఠః

నిదేశకః, సంస్కృత అకాడమీ

సహాయకః

కే వి సూర్యప్రకాశః

సంస్కృత అకాడమీ

కేంద్రీయసంస్కృతవిశ్వవిద్యాలయేన మానితా ఆదర్శశోధసంస్థా

ఉస్మానియా విశ్వవిద్యాలయః, హైదరాబాద్.

2022

In Public domain. Digitization Muthulakshmi Research Academy

Sanskrit Academy Granthamālā 122

Yogadarshasam

By

Prof. P. Sriramachandrudu

Publisher

Director, Sanskrit Academy

Copies can be had from:

Director
Sanskrit Academy
Adarsha Shodha Sanstha
Osmania University Campus,
Hyderabad – 500 007

Phone & Fax:
8331021001

Email:
sanskritacademyhyd@gmail.com

Web:
https://sanskritacademy.net/

Printed at
Karshak Art Printers,
Vidyanagar, Hyderabad

yogadarshasam

ISBN – 978-93-80171-72-2
© Sanskrit Academy

Year	:	2022
Pages	:	xxxvi+207
Copies	:	300
Price	:	Rs 300

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఉపోద్ఘాతము

ఓమ్ శ్రీ గురుభ్యో నమః

||శ్రీ శఙ్కరభగవత్పాదాః విజయన్తే||

శ్రీపతఞ్జలిసన్మౌనిం వ్యాసం తత్త్వవిదాం వరమ్।
యోగసూత్రకృతం భాష్యప్రణేతారం చ సంస్తుమః॥

న్యాయవ్యాకరణాద్వైతతత్త్వజ్ఞం విబుధాగ్రణీమ్।
కావ్యశాస్త్రవిదాం శ్రేష్ఠం ధర్మశాస్త్రార్థకోవిదమ్ ॥

వ్యాఖ్యానచతురం ప్రాజ్ఞం పద్మశ్రీబిరుదాన్వితమ్।
పుల్లెలాన్వయసమ్భూతం రామచన్ద్రం గురుం భజే॥

భారతీయులకు మాత్రమే కాకుండ ప్రపంచప్రజానీకానికంతటికి ఆధ్యాత్మిక-యోగవిశేషాలను పరిచయం చేసి అత్యుత్తమమైన మోక్షసాధనమార్గాన్ని వివరించి ఉత్తములైన సాధకులను తయారు చేయగలిగే అసాధారణమైన యోగశాస్త్రగ్రంథాన్ని సమస్తలోకానికి ప్రసాదంగా అందించిన మహనీయుడు పతంజలి మహర్షి. షడ్దర్శనాలలో అన్యతమమైన ఈ యోగదర్శనమును సమాధి, సాధన, విభూతి, కైవల్య అనే నాలుగు పాదాలలో 196 సూత్రాలతో రచించాడు పతంజలియోగి. ప్రథమపాదమున యోగముయొక్క ఉద్దేశము, లక్షణము, వృత్తుల లక్షణము, యోగోపాయములు, యోగభేదములు, రెండవ పాదమున క్రియాయోగము, క్లేశములు, కర్మవిపాకము, దాని దుఃఖ స్వరూపము, చతుర్వ్యూహములు, తృతీయ పాదమున, అంతరంగ-అంగములు, పరిణామములు, సంయమభేదములు,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విభూతి, వివేకజ్ఞానములు, నాల్గవ పాదమున ముక్తియోగ్యమగు చిత్తము, పరలోకసిద్ధి, బాహ్యార్థసిద్ధి, ఆత్మసిద్ధి, ధర్మమేఘసమాధి, జీవన్ముక్తి, విదేహకైవల్యము ఇత్యాద్యనేక విషయాలను వివరించాడా మహానుభావుడు. పతంజలి యోగసూత్రాలకు వేదవ్యాసుడు రచించిన వ్యాసభాష్యము, భావాగణేశ-నాగేశ-భోజరాజాదుల-యొక్క వ్యాఖ్యానాలు వాచస్పతిమిశ్రుల తత్త్వవైశారదీ మొదలగునవి అత్యంతప్రసిద్ధాలు. అయితే ఈ వ్యాఖ్యానాలన్ని సంస్కృతభాషలో ఆయా శాస్త్రాలలో కూడ నిష్ణాతులైనవారికి మాత్రమే అవగతమౌతాయి కనుక భారతదేశంలో ఆయా ప్రాంతాలకు చెందిన పండితప్రకాండులెందరో వారి వారి ప్రాంతీయభాషలలోనికి అనువదించి వ్యాఖ్యానాలు రచించి ఈ పతంజలియోగదర్శనాన్ని ఉత్సాహవంతులైనవారందరి అందుబాటులోనికి తీసుకువచ్చి లోకానికి మహోపకారం చేశారు. వీటిలో స్వామీ వివేకానందులు రాజయోగమనే పేరుతో ఆంగ్లభాషలో రచించిన గ్రంథం, స్వామి బలరామయతీంద్రులు హిందీలో రచించిన పాతంజలదర్శన ప్రకాశము, ఓ.వై. దొరస్వామి అయ్యంగార్ రచించిన పతంజలి యోగసూత్రతెలుగువ్యాఖ్యానం ఇత్యాదులు కొన్ని భాషలలో చాలామందికి ఉపయోగపడ్డాయి. తెలుగులో యేర్పేడు వ్యాసాశ్రమం ద్వారా ప్రచురితమైన శ్రీమాన్ తిరుక్కండూర్ తిరువెంగళాచార్యులు భాష్యార్థప్రకాశిక పేరుతో రచించిన గ్రంథం కూడా యోగసూత్రాధ్యయనం చేసేవారికి చాలా ఉపయోగపడింది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఇవే కాకుండా కొంతమంది ఇతర పండితులు రచించిన ఈ యోగసూత్రాలకు అనువాదాలు కూడ లోకంలో లభ్యమౌతున్నాయి కాని దర్శనశాస్త్రరీత్యా అధ్యయనం చేసేవారికి అవి అంతగా ఉపయోగపడక పోవచ్చును.

ప్రస్తుతగ్రంథవిషయానికి వస్తే.... బాలానందినీ పేరుతో శ్రీమద్వాల్మీకిరామాయణం, శ్రీమద్భగవద్గీతశంకరభాష్యం, బ్రహ్మసూత్రభాష్యం ఇత్యాదులతో పాటు యాభైకి పైగా గ్రంథాలకు తెలుగులో వ్యాఖ్యానం రచించిన వ్యాఖ్యానచతురులు అస్మద్ గురుచరణులు భారతప్రభుత్వముచేత **పద్మశ్రీ** బిరుదముతో సత్కరింపబడినవారు మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారు పైన సూచించిన యోగశాస్త్రానికి సంబంధించిన సంస్కృతభాష్య గ్రంథాలన్నింటిని ఆకళింపు చేసికొని పతంజలియోగదర్శనానికి తెలుగులో ఉదాత్తమైన వ్యాఖ్యానాన్ని రచించారు. సుమారుగా 35 సంవత్సరములు వివిధశాస్త్రాలు బోధించిన అనుభవంతో అధ్యేతృగణానికి అర్థమయ్యే రీతిలో వారు రచించిన వ్యాఖ్యానం యోగశాస్త్రతత్త్వాన్ని సుకరంగా అందజేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ యోగదర్శనగ్రంథాన్ని గురువర్యులకు అత్యంత ఆప్తులైన జస్టిస్ పమిడిఘంటం కోదండరామయ్య గారు ఆర్షవిజ్ఞానట్రస్ట్ ద్వారా 1992 లో ప్రప్రథమంగా ముద్రించారు. గురువుగారి సంపూర్ణ శ్రీమద్వాల్మీకిరామాయణాన్ని ముద్రించి లోకానికి ముఖ్యంగా తెలుగువారందరికి మహోపకారం చేసిన వదాన్యులు జస్టిస్

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కోదండరామయ్యగారు. ఆ తరువాత మరల 2001 లో కూడ ఈ ట్రస్ట్ ద్వారానే యోగదర్శనం రెండవసారి ముద్రింపజేశారు.

స్నాతకోత్తరతరగతుల్లోని పాఠ్యప్రణాలికలో ఈ యోగశాస్త్రం ఉండుటవలన, ప్రస్తుతం ఈ గ్రంథం ఆపణం లో లభ్యం కాకపోవుటవలన, గురువర్యులు పుల్లెల శ్రీరామచంద్రుడు గారి పుస్తకాలన్ని సాధారణంగా సంస్కృత అకాడమీలో లభ్యమౌతాయన్న ఆశతో ఎంతోమంది మమ్మల్ని సంప్రదిస్తున్నందున ఆచార్యుల పుత్రులు శ్రీ పుల్లెల సత్యనారాయణ శాస్త్రి గారి దృష్టికి తీసుకువెళ్ళి మన సంస్కృత అకాడమీ తరపున ముద్రించుటకు అనుమతించమని ప్రార్థించగా వారు వెంటనే అంగీరించారు. అలాగే ఆర్షవిజ్ఞానట్రస్ట్ కార్యదర్శి శ్రీ పమిడిఘంటం శ్రీరఘురామ్ గారికి సూచించగా వారు కూడ అంగీకరించారు. ఈ విషయాన అస్మద్ గురువర్యులకు ప్రియశిష్యులైన శ్రీ కరణం అరవిందరావు (ప్రాక్తన డి.జి.పి అవిభక్త ఆంధ్రప్రదేశ్) గారు మమ్మల్ని ప్రోత్సహించారు. గురువుగారి పుస్తకాలెన్నో అకాడమీ ద్వారా ప్రచురింపబడి అకాడమీకి కీర్తిని తేచ్చిపెట్టాయి. ఇప్పుడు ఈ యోగశాస్త్రగ్రంథాన్ని పునర్ముద్రణ చేసే భాగ్యం కలిపించినందులకు శ్రీ పుల్లెల సత్యనారాయణ శాస్త్రి గారికి, శ్రీరఘురామ్ గారికి, శ్రీ అరవిందరావు గారికి నమస్సులు తెలుపుకుంటున్నాము. ఈ గ్రంథాన్ని యథాతథంగా తీసుకున్నప్పటికిని కొన్నిచోట్ల మాత్రమే కాలానుగుణంగా భాషలో చిన్న మార్పు చేయుటకు ప్రయత్నించాము. ఆర్షవిజ్ఞానట్రస్ట్ వారు ముద్రించిన ప్రస్తావనలన్నింటిని ఆరంభంలో యథాపూర్వం అచ్చు వేశాము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

చివరలో సూత్రపట్టిక, వ్యాఖ్యానంలో గురువుగారు ఉదాహరించిన శ్లోకసూచి ఇత్యాదులను అధ్యయనం సుకరం చేసుటకై విడివిడిగా ముద్రించాము.

"యదత్ర సౌష్ఠవం కించిత్ తద్గురోరేవ మే న హి
యదత్రాసౌష్ఠవం కించిత్తన్మమైవ గురోర్న హి"

ఈ పుస్తకప్రచురణలో డిటిపి మొదలుకొని అన్నింటిలో సంపూర్ణంగా సహకరించిన మా అకాడమీలో శోధసహాయకుడు కే. వి. సూర్యప్రకాశ్ కు, ఉపనిదేశకులు డా. సుబ్రహ్మణ్యమ్, డా. కే. వరలక్ష్మి లకు, ఇంకొక శోధసహాయకుడు డా. జోషి. సంతోష్ కుమార్ కు, చిరంజీవ భరద్వాజ్ కు అందరికి శుభాభినందనలు.

శోధగ్రంథాలతో పాటు ఇటువంటి అరుదైన మఱియు సాధారణవిద్యార్థులకు కూడ ఉపయోగపడే పుస్తకాలను కూడ అకాడమీ ద్వారా ముద్రించుటకు మమ్మల్ని నిరంతరం ప్రోత్సహిస్తున్న కేంద్రీయసంస్కృత విశ్వవిద్యాలయం కులపతివర్యులు **ఆచార్య శ్రీనివాస వర్ఖేడి** గారికి, ఉస్మానియా విశ్వవిద్యాలయం కులపతివర్యులు **ఆచార్య డి రవీందర్** గారికి, విశ్వవిద్యాలయసంచాలకులు **ఆచార్య పి. లక్ష్మీనారాయణ** గారికి నమోవాకములు తెలుపుకుంటున్నాను. కేంద్రీయసంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదర్శసంస్థల విభాగానికి నిదేశకులు అస్మన్మిత్రులు **ఆచార్య గాయత్రీమురళీ కృష్ణకు** ధన్యవాదములు తెలుపుతున్నాను.

ఈ గ్రంథాన్ని తక్కువ సమయంలో సుందరంగా ముద్రించి ఇచ్చిన కర్షక్ ఆర్ట్స్ ప్రింటర్స్ విద్యానగర్ వారికి కృతజ్ఞతలు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

యస్త్యక్త్వా రూపమాద్యం ప్రభవతి జగతోఽనేకధాఽనుగ్రహాయ
ప్రక్షీణక్లేశరాశిర్విషమవిషధరోఽనేకవక్త్రస్సుభోగీ।
సర్వజ్ఞానప్రసూతిర్భుజగపరికరః ప్రీతయే యస్య నిత్యం
దేవోఽహీశస్స వోఽవ్యాత్సితవిమలతనుర్యోగదో యోగయుక్తః॥

బుధజనవిధేయః
ఆచార్యో కే. నీలకంఠః
నిదేశకః, సంస్కృత అకాడమీ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రీః

కృతి సమర్పణము

శ్రీరామకృష్ణపరమహంసనుండి అద్భుతమైన ఆధ్యాత్మికశక్తిని సంపాదించి దేశవిదేశాలలోని జిజ్ఞాసువులందరికీ స్వయంగా ఆ శక్తి రుచిచూపి, రామకృష్ణమఠాన్ని స్థాపించడం ద్వారా నాటినుండి నేటివరకు సాధకహృదయాలలో జ్ఞానజ్యోతిస్సును అవిచ్ఛిన్నంగా ప్రజ్వలింపచేస్తున్న మహోదారమూర్తి

స్వామి వివేకానందకు

సాదరముగా సమర్పితము

అద్వైతం వినుతం తథౌపనిషదం సర్వైః సుధీభిర్మతం
యోగం చాఖిలయోగరాజమతులం పాతఞ్జలం ప్రాఞ్జలమ్,
నీత్వా సార్వజనీనతాం సువితతాం కీర్తిం య ఆప్నోత్ స్థిరాం
యోఽకార్షీత్ పరమాం చ సంస్కృతిమిమాం లోకోత్తరాలంకృతిమ్.

తస్మై వివేకానన్దాయ వివేకానన్దసిన్ధవే,
జ్ఞానమార్గప్రతిభువే కృతిరేషా సమర్ప్యతే.

మహామహోపాధ్యాయ
ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రీః

ప్రస్తావన
(ద్వితీయముద్రణ)

దాదాపు ఎనిమిది సంవత్సరాలకు పూర్వం ముద్రితమైన బాలానందినీ సహితపాతంజలయోగసూత్రం (యోగదర్శనం) పునర్ముద్రణ చేయవలసిన అవసరం రెండు మూడు సంవత్సరాల క్రితమే ఏర్పడింది. అందుకు కారణభూతులైన ఆధ్యాత్మికదృష్టిసంపన్నులైన పాఠకులకు కృతజ్ఞత తెలుపుతున్నాం. ఈ పునర్ముద్రణకార్యాన్ని అనుకొన్నదానికంటే ముందుగా చేపట్టడానికి శ్రీ కే. అరవిందరావు I.P.S. Additional Commissioner of Police Hyderabad గారి ప్రోత్సాహం కారణం. ఈ పుస్తకం ప్రాగ్రూపాలను Proofs సరిచూచే క్లిష్టకార్యం కూడ వీరు సోత్సాహంగా చేపట్టారు. వీరి శ్రద్ధకు కార్యదక్షతకు మా అభినందనలు.

వెనుకటి ముద్రణిలో అక్కడక్కడ దొరలిన దోషాలను యథోపలబ్ధంగా సవరించడంతో పాటు ఈ ముద్రణలో వర్ణక్రమానుసారంగా యోగసూత్రసూచి, యోగసూత్రపాఠం, ఉదాహృతశ్లోకసూచి అను మూడు అనుబంధాలు, ఆంగ్లంలో ఉన్న శ్రీ స్వామి రంగనాథానందగారి ఆశీస్సులకు తెలుగు అనువాదము క్రొత్తగా చేర్చబడ్డాయి. ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి గారి **పరిచయం**, జస్టిస్ పమిడిఘంటం కోదండరామయ్యగారి **ముందుమాట**, మా ప్రస్తావన, శ్రీ స్వామి రంగనాథానందగారి, ఆంగ్లంలో ఉన్న **ఆశీస్సులు** యథాతథంగా కూర్చబడ్డాయి.

ఇలాంటి శాస్త్రగ్రంథాలను చదివే అలవాటున్న పరిణతధీశాలులకు ఏమీ చెప్పనవసరం లేదు కాని, క్రొత్తగా ఇలాంటి వాటిని చదవదలచినవారికి ఒక్క సలహా ఇస్తున్నందుకు వారు మన్నిస్తారని ఆశిస్తున్నాం. రామాయణ-మహాభారతాదిగ్రంథాలను ఆంధ్ర-ఆంగ్లాద్యనువాదాల సాహాయ్యంతో శ్రమ లేకుండా చదువుకొంటూ పోతూ ఆనందించవచ్చును. శాస్త్రగ్రంథాలలో, అంతకు మునుపు మనకు అంతగా పరిచితాలు కాని విషయాలు, వాటికి సంబంధించిన వివరణలు, వాదప్రతివాదాలూ,ఉంటాయి. ఎన్నో పారిభాషిక

In Public domain. Digitization Muthulakshmi Research Academy
పదాలు కనబడుతూంటాయి. అక్కడ ఉన్న విషయాన్ని పట్టి ఒకటి రెండు పేజీలు చదివిన తరవాత మళ్లీ వెనుకకు వెళ్లి పునర్మననం చేసికోవాలి. అప్పుడు విషయం మనస్సుకు హత్తుకొంటుంది. తరువాతి గ్రంథభాగంలో క్రొత్త విషయాలతో పాటు వెనుక చెప్పిన విషయాలు నిర్దేశించినప్పుడు అనాయాసంగా సమన్వయం కుదురుతుంది. అందుచేతనే ఈ గ్రంథాలలో **అధ్యాయ** విభాగం ఉంటుంది. **అధ్యాయం** అనగా 'చదవడం చదవ బడేది' అని స్థూలంగా అర్థం. అనగా అదొక 'అధ్యేయగ్రంథపరిమాణం' (Study Unit). ఒక అధ్యాయం సరిగా అర్థం అయిన తరువాత దాని తరువాతి అధ్యాయానికి వెళ్లాలని ఈ నామధేయం మనకు చేసే సూచన. ఈ శాస్త్రమే కాదు, ఏ శాస్త్రం తెలిసికొనదలచినవారైనా ఈ పద్ధతిని అనుసరిస్తే లాభం పొందకలుగుతారు. పట్టుదల ఉంటే ధీమంతులకు అసాధ్యం ఏముంటుంది?

అతిప్రాచీనమైన భారతీయతత్త్వశాస్త్రానికీ తదంగభూతమైన యోగ శాస్త్రానికీ ప్రపంచంలోని తత్త్వశాస్త్రపరంపరలో అత్యున్నతస్థానాన్ని సంపాదించిన మహాపురుషుడు శ్రీ స్వామి వివేకానంద. పాతంజలయోగ సూత్రాలకు వీరు రచించిన వివరణరూపానువాదం వీరి గ్రంథావలిలో (Complete works of Swami Vivekananda) మొదటి సంపుటంలో ఉన్నది. ఈ మహనీయునికి ఈ గ్రంథం అంకితం చేయబడింది. తెలుగుపాఠకలోకం ఈ గ్రంథంలోని విషయాలను గ్రహించి, వాటిలోని కొన్నింటినైనా అనుష్ఠానంలోకి తీసికొనివచ్చి ఆత్మోద్ధరణం చేసికొనడమే కాకుండా భారతీయసంస్కృతిపరిరక్షణకు తోడ్పడగలరని కూడ ఆశిస్తున్నాం.

వృషనామసంవత్సర
విజయదశమి
26.9.2001 పుల్లెల శ్రీరామచంద్రుడు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

RAMAKRISHNA MATH
Ramakrishna Math Marg,
Domalaguda, Hyderabad - 29

The Arsha Vignana Trust, Hyderabad, has already brought out Telugu translations of books like Valmiki Ramayanam, with word for word meaning and running translation and brief comments.

The Trust is now bringing out, in a similar way, the well-known Sanskrit book: Yoga Sutras of Patanjali. Since Swami Vivekananda's English exposition and rendering of it by name RajaYoga, a little less than a century ago, many editions of the Yoga Sutras have been published by different persons in different languages, Indian and foreign.

The present edition in Telugu will be of immense help to our Telugu readers to study and understand and benefit from a book which deals with a subject, which we have neglected in the modern age due to our being attracted to the sensory world through physical science, namely, the depth dimension of the human personality.

I hope the book will have a wide circulation. It will help our people to understand that the source of all values lies in our own infinite self, the Atman, and the ways by which we can manifest these values in our life, work, and inter - human relations. The Trust and the translator deserve all thanks from the readers.

Hyderabad
22nd May, 1992 SWAMI RANGANATHANANDA

In Public domain. Digitization Muthulakshmi Research Academy

(శ్రీస్వామి రంగనాథానందగారి ఆశీస్సులకు తెలుగు అనువాదం)

రామకృష్ణమఠం, రామకృష్ణమఠమార్గం,
దోమలగూడ, హైదరాబాదు – 500029. –

వాల్మీకి రామాయణం మొదలైన గ్రంథాలను తెలుగులో ప్రతిపదార్థ తాత్పర్యాలతోను సంక్షిప్తవ్యాఖ్యలతోను ఆర్షవిజ్ఞానట్రస్ట్ ఇదివరకే ముద్రించి ప్రకటించి ఉంది.

ఇప్పుడీ ట్రస్టు ప్రసిద్ధ సంస్కృతగ్రంథమైన పాంతంజలయోగ సూత్రాన్ని ఆంధ్రభాషావ్యాఖ్యానంతో ప్రకటిస్తూన్నది. దాదాపు ఒక శతాబ్దానికి పూర్వం స్వామి వివేకానంద ఈ గ్రంథానికి రాజయోగం అనే పేరుతో ఆంగ్లభాషానువాద–వివరణలు సంతరించి ఉన్నారు. అది మొదలు ఎంతో మంది భారతీయభాషలలోను ఇతరదేశభాషలలోను ఈ గ్రంథాన్ని ఎన్నో అనువాదాలతో ప్రకటించారు.

మానవులలో నిగూఢంగా ఉన్న అపారమైన శక్తిని గూర్చి భోధించే గ్రంథం పాతంజలయోగసూత్రం. ఆధునికయుగంలో భౌతికవిజ్ఞానం ద్వారా బాహ్య ప్రపంచం వైపు అత్యధికంగా ఆకర్షింపబడిన మనం ఈ ఆధ్యాత్మిక విషయాన్ని గూర్చి తగు శ్రద్ధ చూపడం మానివేశాం. ఇలాంటి తరుణంలో తెలుగు వ్యాఖ్యానంతో వెలువడుతూన్న ఈ గ్రంథం ఆంధ్రపాఠకులందరూ ఈ అత్యున్నతవిషయాన్ని అర్థం చేసికొని దానివల్ల లాభం పొందడానికి ఎంతగానో ఉపకరిస్తుంది.

ఈ గ్రంథానికి విస్తృతప్రచారం లభించగలదని ఆశిస్తున్నాను. అత్యున్నతములైన జీవనప్రమాణాలన్నింటికీ నిత్యమూ శాశ్వతమూ అయిన మన ఆత్మయే మూలాధారం; ఈ ప్రమాణాలను మన జీవితవిధానంలో ఆవిష్కరింపచేయగలిగిన మార్గాలకీ, ఆయా కర్మలకీ, మానవుల పరస్పర సంబంధానికీ కూడ మూలోద్గమస్థానం ఆత్మయే అనే విషయాన్ని మనవాళ్లు గ్రహించడానికి ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుంది. ట్రస్టూ, గ్రంథరచయితా కూడ పాఠకుల కృతజ్ఞతకు పాత్రులు.

22.5.1992 (స్వామి రంగనాథానంద)

పరిచయం

భారతీయమత – దార్శనిక సాహిత్యాలలో పతంజలి యోగసూత్రం, దాని వ్యాసభాష్యం అతిప్రసిద్ధమైన గ్రంథాలు. వేదాంత అలంకర శాస్త్రాల్లోను, సాహిత్యంలోను కృషి చేసి యావద్భారతకీర్తినార్జించి, రాష్ట్రపతినుండి, విశ్వ విద్యాలయాలనుండి, యు.జి.సి. నుండి, పరిషత్తులనుండి సన్మానాలు పొందిన విద్వదగ్రగణ్యులు ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారు. అందుచేత, ఈ గ్రంథాన్ని గాని, దీని అనువాద – వ్యాఖ్యానాలు చేసిన ఈ మహాపండితుణ్ణి గాని పరిచయం చేయటం అనవసరం. ఖండకావ్యాలు, ముక్తకాలు రాసి, రామాయణాదులకు సరళ అనువాదాలు చేసి, అలంకారగ్రంథాలకు తెలుగులో అర్థం-టీక టిప్పణులు ఏర్పరచి, నాగానందం వంటివాటి నాంధ్రీకరించి, భారతీయవైజ్ఞానికుల జీవితాలు – కృషిని గూర్చి లోకరంజకమైన పుస్తకాలు వెలువరించి, వివేకచూడామణిపై శ్రీచంద్రశేఖరభారతీప్రణీతవ్యాఖ్యానాన్ని ఆంధ్రులకందుబాటులో ఉండేట్లు చేసి, వివిధ అభిరుచులు కలవారికి ఉపయోగపడే బహుగ్రంథాలు రచించిన పండితప్రవరులైన వీరిని పరిచయం చేయటం ఏమిటి? పోతే, మహర్షి పతంజలిని పరిచయం చేయటం....!! కాని, న్యాయమూర్తి శ్రీ పి. కోదండరామయ్యగారు నన్ను ఈ పుస్తకానికి పరిచయం రాయమన్నారు; వేద – శాస్త్ర – ఇతిహాసాల పఠన– బోధన ప్రచారాలకు ఎంతో –పోషణ, ప్రోత్సాహం ఇస్తున్న వీరు కోరినట్టు చేయటానికి, నా ఆదరణీయ మిత్రులైన ఈ గ్రంథకర్తను ప్రశంసించటానికి ఇది అవకాశమిస్తుందని దీన్ని రాస్తున్నాను. సత్పురుషులైన విపశ్చిద్వరేణ్యుల్ని స్తుతించటం శ్రేయస్కరం.

వివిధ ధ్యానపద్ధతులు, వాటి ద్వారా విభిన్నభూముల్ని (అవస్థల్ని) జయించటం, వైదిక–అవైదికసంప్రదాయాలు రెండింటిలో చాలా ప్రాచీనకాలం నుంచి వస్తున్నవే. వాటినుంచి వేర్వేరు అంతర్దృష్టులలో, అనుభూతుల్లో పర్యవ సించే ధ్యానపద్ధతుల్ని కనుక్కోవటం, వాటిని ప్రమాణీకరించటం జరిగింది. ఇదంతా **యోగ** శబ్దంచే నిర్దేశింపబడింది. ధ్యానపద్ధతులు అతిభౌతికవిశ్వాసాల పై ఆధారపడి ఉంటాయి; వేర్వేరు రకాలైన ధ్యానాల ఫలితాలైన అనుభూతులు విభిన్న అతిభౌతిక సిద్ధాంతాల ప్రతిపాదనలకు దారితీస్తాయి. ఉదాహరణకు,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఆత్మ అనేది ఉందనే విశ్వాసముంటే యోగం ఆత్మదర్శనోపాయం అవుతుంది; ఆత్మ హృదయంలో ఉందని, అది వడ్లములికంత చిన్నదని, స్వర్ణకాంతితో, పొగలేని దీపంవలె వెలుగుతుంటుందని విశ్వసిస్తే, అట్టి ఆత్మదర్శనం పొందించగల ధ్యానమే సరైన ధ్యానంగా ఎంచబడుతుంది. అసలు ఆత్మాస్తిత్వంలో విశ్వాసం లేనివారు, అట్టి ఆత్మ ఉందని నమ్మనివారు ఇటువంటి ధ్యానపద్ధతిని యోగంగా భావించరు; వారికింకో రకమైన ధ్యానం, యోగం ఉండవచ్చు; అవి వారి విశ్వాసాన్ని ధ్రువపరచవచ్చు. జైనులు, బౌద్ధులు, సాంఖ్యులు, ఔపనిషదులు, భాగవతులు, ఇట్లా వీరిలో ప్రతి ఒక్కరికి ఒక్కొక్క యోగపద్ధతి దానికనురూపమైన అనుభూతి ఉన్నాయి; ఇవి ఆ యా పరస్పరవిరుద్ధసిద్ధాంతాల్ని ధ్రువీకరిస్తాయి. అట్లా ప్రతిసిద్ధాంతం ఆధ్యాత్మిక అనుభవంచే నిరూపితమని దాని ప్రతిపాదకులు ఉటంకించారు. బౌద్ధులు తమ యోగంవలన అనాలంబనం, శూన్యతా, భాగవతులు తమ యోగంద్వారా చిదానందమూర్తి అయిన భగవంతునితో సాయుజ్యమున్ను లభిస్తుందనగా, అద్వైతవేదాంతులు తమ యోగంచే నిర్గుణనిరుపాధికమైన అద్వయవిజ్ఞానానందతత్త్వాన్ని సాక్షాత్కరించవచ్చంటారు. యోగమని ఒక్కటే లేదు; ఎన్నో యోగాలున్నాయి అని దీనివలన స్పష్టమౌతుంది. ప్రతివారు తమదే నిజమైన యోగం అంటారు. పాతంజలయోగాన్ని బ్రహ్మసూత్రం నిరాకరించింది; "భగవత్పాదులు పాతంజలయోగం బ్రహ్మజిజ్ఞాసలో అపేక్షితమని ఎక్కడా చెప్పలేదు" అని మధుసూదనసరస్వతి చెప్పారు.

పాతంజల యోగసూత్రంలో చెప్పబడిన సమాధి, యోగతత్త్వ త్రిశిఖ-బ్రాహ్మణ-శాండిల్యాది ఉపనిషత్తుల్లో చెప్పబడిన సమాధి, ఈ రెండూ ఒకటి కావు. యమనియమాద్యంగాలను, ముఖ్యంగా ధారణా-ధ్యాన-సమాధులను తేజోబిందూపనిషత్తు వివరించిన రీతికి, పాతంజలయోగసూత్రంలో వివరించిన రీతికి సంబంధం లేదు. శంకరాచార్య కృతులుగా చెప్పబడే అపరోక్షానుభూతి లో (శ్లో 104 నుండి), సర్వవేదాంతసిద్ధాంతసార-సంగ్రహంలో ఆ ఉపనిషన్మంత్రములే ఉదహరించబడినాయి. –

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కాని, ఒక దర్శనం ఉపాదేయమని పరిగ్రహించని యోగం గాని సిద్ధాంతం గానే అసత్యమనటానికి వీలు లేదు, ఎందుకంటే మరొక దర్శనం వాటిని ఉపాదేయమని పరిగ్రహించినందున; ఒక దర్శనంచే ఆదృతం అవటమే కారణంగా ఏ యోగం గాని సిద్ధాంతం గాని సత్యమనటానికి కూడా వీలు లేదు. కఠాదిప్రధాన ఉపనిషత్తుల్లోను, భగవద్గీత (ముఖ్యంగా ఆరో అధ్యాయం) లోను వర్ణించబడిన యోగపద్ధతి, వేదాంత తత్వాన్ని కరతలామలకం చేసుకోవటానికి ఎంతగానో ఉపకరిస్తుంది; కాని అది దానికి ప్రధానోపాయం గాని సన్నిహితసాధనం గాని కాదు. అయితే, పాతంజలకైవల్యానికి పాతంజల యోగమే సరైన మార్గం. వేదాంతం బోధించే బ్రహ్మాభవనానికి (బ్రహ్మము అవటానికి) బ్రహ్మావేదనమే (బ్రహ్మమును ఎరుగుటయే) ఏకైకమార్గం; "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి".

ఇక్కడొక విచికిత్సకు తావుంది. పాతంజల యోగసూత్రంలో రెండు రకాల యోగాల్ని సమన్వయం చేసే ప్రయత్నం గోచరమౌతుందా? 1) చిత్తవృత్తి నిరోధం యోగం; అది ప్రకృతి-పురుషుల సంబంధాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. దానివల్ల పురుషుడు తన స్వరూపమందు ప్రతిష్ఠితుడై ఇక ప్రకృతియొక్క పరిణామాల్లో చిక్కడు. ఈశ్వరప్రణిధానం సమాధికొక మార్గం, సమాధి చిత్తనిరోధానికి చివరి దశ. 2) బౌద్ధంనుంచి ప్రేరణ పొందిన అష్టాంగమార్గం యోగం. కాని ఇది తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం -వీటిపై ఆధారపడింది. ఇది జ్ఞానం ద్వారా సాంఖ్యులు చెప్పిన మోక్షాన్ని ఇచ్చేది. ఇట్లా రెండు యోగాల్ని సమ్మేళనం చేసే ప్రయత్నం క్రీస్తుకు చాలా పూర్వమే మహాభారతయుగానికి ముందో లేక దానికి ఆరంభదశలోనో జరిగి ఉండవచ్చు. అది పాతంజలయోగ సూత్రంలో ప్రతిబింబించినట్టుంది. ప్రధానంగా సాంఖ్యంపై ఆధారపడి కొన్ని ముఖ్యమైన బౌద్ధభావాలను స్వీకరించి, క్రీ.శ. 500కు పూర్వమే వ్యాసులవారు ఈ సూత్రంపై భాష్యం వ్రాశారు. అది యోగదర్శనాన్ని రూపొందించింది. అదొక మహానిర్వాహం.

వ్యాకరణమహాభాష్యాన్ని రాసింది, చరకసంహితను ప్రతిసంస్కరించింది, యోగసూత్రాన్ని రాసింది ఒకరే; పతంజలేనని, ఈ విధంగా ఈ

In Public domain. Digitization Muthulakshmi Research Academy
మహానుభావుడు చిత్త-వాక్- శరీరమలాలను (లేక మనోవాక్కాయదోషాలను) అపాకరించాడు (లేక హననం చేశాడు), అనే సంప్రదాయం కనీసం 10-11 శతాబ్దాలనుంచి అమల్లో ఉంది. దీన్ని రుజువు చేయటానికి, కాదని గట్టిగా చెప్పటానికి ఆధారం లేదు. "తన ఆదిరూపాన్నొదిలి జగత్తుననేకధా అనుగ్రహించడానికి ప్రభవించేవాడు, క్లేశరాశిని క్షీణింపజేసేవాడు, విషమ విషధరుడు, సర్వజ్ఞానప్రసూతి అయినట్టి, తెల్లని విమలశరీరం గల యోగదుడు యోగయుక్తుడు అయినట్టిన్ని అహీశుడు మిమ్ముల్ని రక్షించుగాక" అని మంగళాచరణంతో తన భాష్యాన్ని ప్రారంభించారు వ్యాసులవారు. కాబట్టి, యోగసూత్రకర్త శేషభగవానుడనే భాష్యకర్త నమ్మకం. అట్లాగే, ఈ భాష్య కర్తైన వ్యాసులవారూ, బ్రహ్మసూత్ర కారుడూ, మహాభారత అష్టాదశ పురాణాలకర్త ఒకరేనని సంప్రదాయం అంటుంది. అది వాస్తవం కాక పోయినా, యోగసూత్రభాష్యకారుడు మాత్రం మహాప్రజ్ఞావంతుడు, గొప్ప దార్శనికుడు, సొగసైన భాషలో, గంభీరమైన భావాల్ని స్పష్టంచేసిన మహామహుడు. ఈ భాష్యంపై సర్వతంత్రస్వతంత్రుడైన వాచస్పతిమిశ్రులు **తత్వవైశారది** అనే పేరున వ్యాఖ్య రాశారు. యోగసూత్రంపై ఇంకా ఎన్నో టీకాటిప్పణులున్నాయి గాని, అవి ఈ భాష్య-వాఖ్యలకు సాటికావు.

యోగదర్శనాన్ని గురించి ఎన్నో తర్కవితర్కాలకు తావుంది. కాక, ఆధునికకాలంలో 'స్వాములు', 'యోగులు', 'మహర్షులు' ఈ దేశంలోను విదేశాల్లోను ప్రచారం చేస్తూంది ఒకేరకమైన యోగమా కాదా? వాటిలో ఏది లేక ఏవి పతంజలి-వ్యాసుల సిద్ధాంతాల పద్ధతులను అనుకరించినది(వి)? పాఠశాలల్లో బోధింపబడటానికి ఉపయుక్తమైన యోగం ఉందా? అన్ని రోగాల్ని నివారించ గలిగినటువంటి, శరీరమనసుల్ని అన్ని విధాల పుష్టిగా - తుష్టిగా నిరపేక్షంగా ఉంచగల్గేది ఏ యోగం? ఇవి ఆలోచించాల్సిన విషయాలు.

ఆచార్య శ్రీరామచంద్రుడు గారు సూత్రాల్ని, భాష్యాల్ని, తత్త్వవైశారదిని, భావాగణేశనాగేశుల టీకల్ని, భోజవృత్తిని కూలంకషంగా పరిశీలించి, **బాలానందినీ** అనే పేరుతో తెలుగులో ఈ వ్యాఖ్య రాశారు. చాలా చోట్ల, ఒక్కో సూత్రానికి పూర్వులు చెప్పిన అర్థాల్ని ఉదాహరించారు. కొన్ని

చోట్ల వాటిలో ఏది తమ దృష్టిలో బాగుందో సకారణంగా చెప్పారు. ఈ వ్యాఖ్యను సందేహాలకు తావియ్యని పద్ధతిగా తేటతెల్లంగా, తెలుగు బాగా చదువుకున్నవారందరికి చక్కగా అర్థమయ్యే సరళశైలిలో రాశారు. వ్యాఖ్యాతకు షడ్దర్శనాల సాధికారజ్ఞానం, విశ్లేషించి విషయాన్ని బోధపరిచే శక్తి, ఈ రెండు ఉండటాన, నిజంగానే ఈ వ్యాఖ్య బాలుల్ని (పృథగ్జనుల్ని) ఆనందింపచేయ గల్గుతుంది; వ్యుత్పన్నమతుల్ని తప్పక తృప్తి పరుస్తుంది.

తెలుగులోని దార్శనికసాహిత్యానికి ఈ వ్యాఖ్య ఒక నూతన అలంకారం.

కొత్త సచ్చిదానందమూర్తి
Ex Vice Chairman
Of UGC
9-6-1992

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ముందుమాట

జస్టిస్. పమిడిఘంటం కోదండరామయ్య
శ్రీరామసదనం
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి
ఆర్షవిజ్ఞాన ట్రస్టు స్థాపకాధ్యక్షులు
జూబ్లీహిల్స్ హైదరాబాద్ - 34

భారతదేశమున షడ్దర్శనములు ప్రఖ్యాతి చెందిన తత్త్వశాస్త్రములు. అవి సాంఖ్యము, యోగము, న్యాయము, వైశేషికము, పూర్వమీమాంస, ఉత్తరమీమాంస. ఇవి అన్నియూ ఋషిప్రోక్తములై, దివ్యమైన విజ్ఞానసౌధము లను నిర్మించినవి. ప్రతిశాస్త్రము మానవుని దుఃఖమునుండి ఉద్ధరించుటకు కంకణమును కట్టుకొని ప్రత్యేకపథమును సూచించినవి. మహర్షులైన ఈ దర్శనకారులు మానవవిజ్ఞానమునకు ఈ శాస్త్రములందు సమకూర్చిన సాధన సంపత్తిని గ్రహించి ఈ విజ్ఞానసౌధములను కూల్చుటకు ప్రయత్నించక జగద్గురువులు శ్రీశంకరభగవత్పాదులు అద్వైతమహాసౌధమును నిర్మించి తద్వారా ఈ సౌధములు చిన్నబోవునట్లు చేసిరి.

ప్రతిశాస్త్రము చెప్పు సాధనము మానవులకు వారి వారి అధికారమును బట్టి వారి సాధనమునకు దివ్యముగా సాయపడును. ఉదాహరణకు సృష్టి, మీమాంసయందు కర్మచేత, న్యాయవైశేషికములందు పరమాణువులచేత, యోగమునందు పురుషార్థముచేత, సాంఖ్యయోగమునందు ప్రకృతిచేత, వేదా న్తమునందు బ్రహ్మచేత జరుగునని తెలియనగును. సమన్వయదృష్టితో చూచిన ఇవన్నియూ యథార్థములని చెప్పక తప్పదు. న్యాయవైశేషికములు భౌతిక విషయమునకు, సాంఖ్యయోగములు మనస్సునకు, మీమాంసాద్వయము ఆధ్యాత్మికవిషయమునకు ప్రాముఖ్యమునిచ్చును ఇవి అన్నియూ ప్రతివ్యక్తియూ అంచెలంచెలుగా పయనించవలసిన ఒకే మార్గము. కావున ఈ శాస్త్రమును అధ్యయనము చేయు విద్యార్థి ఆ మార్గముననే గల పై మెట్టును అందుకొనుటకు ప్రయత్నించవలయును. అట్లు కాక శ్రీ శంకరభగవత్పాదులు

సర్వసిద్ధాంతసారమును చెప్పు సందర్భమున పలికిన అధిక్షేపవాక్యములను మాత్రము వల్లించి ఈ శాస్త్రములను వాటి వాటి దృక్కోణములతో పరిశీలించుట మానివేసినాము. అట్లు కాక ఈ దర్శనకారులు చూపించిన మార్గముననే పురోగమించి పై స్థాయినందుకొనుటకు ప్రయత్నించినచో, ఈ శాస్త్రములు నూతనత్వమును చేకూర్చుకొని పరిపుష్టి చెంది, వాటి ప్రత్యేకతను కోల్పోకుండ మానవాళికి తగు కళ్యాణమును చేకూర్చగలవు.

ప్రస్తుత యోగదర్శనసూత్రకారుడు శ్రీపతంజలి మహర్షి. ఈ శాస్త్రము సాంఖ్యదర్శనములోని భాగమని పండితుల అభిప్రాయము. ఈ రెండును చాలా ప్రఖ్యాతి చెందిన ప్రాచీనదర్శనములు. **నాస్తి సాంఖ్యసమం జ్ఞానం, నాస్తి యోగ సమం బలమ్** అని ఆర్యోక్తి. ఇది సాధనశాస్త్రమని, అనుభవగ్రంథమని పేరెన్నిక గన్నది. అనుభవమునకు రాని శాస్త్రచర్చ వృథా. స్వామి వివేకానంద నుడివినట్లు "వేయి పౌనుల శాస్త్రజ్ఞానముకన్న ఒక ఔన్సు అనుష్ఠానము మేలు". ఆయన ఈ శాస్త్రమును రాజయోగమని కొనియాడిరి. మనస్సున ఏకాగ్రత ధ్యానసాధనము, తద్వారా అంతర్దృష్టి, ఆత్మానుభవము, తనకు తాను సాధించు మార్గమును ఈ శాస్త్రము తెలుపునని వాక్రుచ్చిరి.

యోగశబ్దమునకు ధ్యానము, ఉపాయము, యుక్తి అను నర్థములు కలవు. ఈ శాస్త్రమునందు యోగశబ్దము ధ్యాననిష్ఠకే పరిమితమైనది. భగవద్గీత యందు వేదవ్యాసభగవానులు ఉపయోగించిన యోగశబ్దము సర్వతోముఖమైన సాధనసంపత్తిని సమకూర్చు ప్రక్రియ అని అరవిందమహర్షి వక్కాణించిరి. ఈ రాజయోగము హఠయోగముకన్న భిన్నమైనదని గుర్తెరుంగవలయును. హఠయోగి శరీరవ్యాయామమునభ్యసించును. అష్టసిద్ధులు, చిరంజీవిత్వము మొదలగు దివ్యశక్తులు వాని ఆశయము. ఈ రాజయోగగమ్యము జ్ఞాన వైరాగ్యముల సిద్ధి. "ధ్యానమనేది యాంత్రికజీవనప్రక్రియ కాకూడదు. నిత్య నూతనసముజ్జ్వలకాంతిపుంజమై భాసించాలి" అని శ్రీస్వామి సుందరచైతన్యా నంద నుడివిరి. ఈ శాస్త్రము ఏ మతమునకు సంబంధించినది కాదు. మతవిషయములైన నమ్మకములు, అవిశ్వాసములు అవసరము లేదు. ఆస్తికులు, నాస్తికులు, సర్వులూ దీని ననుష్ఠింపదగును. పాశ్చాత్యులు దీనిని మనోదౌర్బల్యనివారణకు ప్రత్యేకమార్గముగా పరిగణించిరి. కాని మన దేశస్థులు మొట్టమొదటినుండి దీనిని దివ్యమైన అధ్యాత్మవిద్యగా పరిగణించిరి. ఇందు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మొదటిపాదమునందుగల ఈశ్వరప్రణిధానాద్వా అను సూత్రముతో మొదలగు ఏడు సూత్రములు అసంగతములని, వాటిని పరిహరించిననూ శాస్త్రసమగ్రతకు లోటురాదని పండితుల అభిప్రాయము. కారణమేమన ఇందు ఈశ్వర ప్రణిధానము ఏకాగ్రతను సాధించుటకు దోహదక్రియగా పేర్కొనబడినదే కాని వేదాంతులు చెప్పునట్లు ఈశ్వరునితో సాయుజ్యము చెందు ప్రక్రియ కాదు. పరిపూర్ణ ఆత్మవికాసము, లేక కైవల్యము ఈ శాస్త్రముయొక్క ఆశయము. దానికి కావలసిన సాధనములు శ్రద్ధ, వీర్యము, స్మృతి, సమాధి, ప్రజ్ఞ అని తెలిపి ఈ శాస్త్రము తన ప్రత్యేకతను దివ్యముగా చాటిచెప్పినది. అవిద్య, అస్మిత, రాగ, ద్వేష, అభినివేశములు మానవునికి పంచకేశములని, మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్షలు సుఖదుఃఖ-పుణ్య-అపుణ్యవిషయములందు మనఃప్రసన్నతకు మానవుడు అనుసరించవలసిన మార్గములని నుడివిన రెండు సూత్రములు ప్రపంచఖ్యాతి పొంది అంతర్జాతీయసభలలో కూడ వేనోళ్ళ ప్రశంసించబడినవి.

ఇట్టి యోగదర్శనమును సమకూర్చిన మహర్షి శ్రీపంతజలిమహర్షి వ్యాకరణమహాభాష్యమును వ్రాసిన పతంజలి, యోగదర్శనకర్త ఒకరేనాయను సందేహము కలదు. కాని మన భారతజాతీయసాంప్రదాయమునునసరించి ఈ సందేహము అనవసరమని మాక్డోనెల్ మరియు శ్రీ అనుభవానందస్వామి వారు నుడివిరి. అట్టి పతంజలి ఆదిశేషుని అవతారమని మన శిష్టుల విశ్వాసము. మానవకళ్యాణమునకు ఆయన మనో-వాక్- శరీరపారిశుద్ధ్యములకు మూడు శాస్త్రములను రచించిరి.

ఆర్షవిజ్ఞానట్రస్టువారు, శ్రీ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారిచే సమకూర్చబడిన ఈ గ్రంథమును ప్రచురించుట చాలా ముదావహము. ఆచార్య కె. సచ్చిదానందమూర్తిగారి పరిచయవాక్యములు, స్వామి రంగనాథానంద ఆశీస్సులు ఈ గ్రంథమునకు శోభను చేకూర్చినవి. ఈ ట్రస్ట్ వారు మిగతా దర్శనములను కూడా ప్రచురించగలరని ఆశించుచు శ్రీమహర్షి పతంజలికి అంజలి ఘటించుచున్నాను.

యోగేన చిత్తస్య పదేన వాచాం
మలం శరీరస్య చ వైద్యకేన,
యోఽపాకరోత్తం ప్రవరం మునీనాం
పతంజలిం ప్రాంజలి రానతోఽస్మి.

పమిటిఘంటం కోదండరామయ్య

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రీః

ప్రస్తావన

వేదాల ప్రామాణ్యాన్ని అంగీకరించడంచేత "ఆస్తికదర్శనాలు" అని చెప్పబడే ఆరు దర్శనాలలో సాంఖ్య-యోగదర్శనాలు, పూర్వమీమాంసా ఉత్తరమీమాంసాదర్శనాలు, న్యాయవైశేషికదర్శనాలు పరస్పరసంబంధం ఉన్నవి. ఇవన్నీ మోక్షమార్గాన్ని, తత్త్వాన్ని దర్శింపచేసేవి అవడంచేత వీటికి "దర్శనాలు" అని పేరు.

క్రీస్తుకు పూర్వం 200-150 సంవత్సరాల ప్రాంతం వాడైన పతంజలి రచించిన "యోగసూత్రం" యోగదర్శనానికి ఆకరగ్రంథం. పాణినీయమైన అష్టాధ్యాయికి వ్యాఖ్యానంగా **మహాభాష్యం** రచించిన పతంజలి సుప్రసిద్ధుడు. ఈయన ఆదిశేషుని అవతారమని, సర్వజ్ఞుడవడంచేత ఈయనకు అందరూ అంజలి ఘటించి నమస్కరించేవారనీ సంప్రదాయం. **పతన్తి అఞ్జలయః అస్మిన్** అనే విగ్రహంచేత "అందరి దోసిళ్లూ ఈయన మీద పడుతున్నాయి" అని పతంజలి శబ్దానికి అర్థం. ఆ పతంజలి, యోగసూత్రం రచించిన పతంజలీ ఒక్కరే అని కొందరూ, కాదని కొందరూ అభిప్రాయపడుతున్నారు. పతంజలి మహాభాష్యయోగసూత్రాలే కాకుండా ప్రామాణికమైన ఏదో ఒక ఆయుర్వేద గ్రంథం కూడా రచించాడని మరికొందరి అభిప్రాయం. దీనిని బలపరచే

"యోగేన చిత్తస్య పదేన వాచాం మలం శరీరస్య చ వైద్యకేన,
యోపాఽకరోత్తం ప్రవరం మునీనాం పతఞ్జలిం ప్రాఞ్జలిరానతోఽ స్మి"

అనే శ్లోకం ప్రచారంలో ఉంది. "యోగశాస్త్రగ్రంథం వ్రాసి చిత్త మాలిన్యాన్ని, మహాభాష్యం వ్రాసి వాక్కు మాలిన్యాన్ని, వైద్యగ్రంథం వ్రాసి శరీరపు మాలిన్యాన్ని తొలగించిన పతంజలికి నమస్కరిస్తున్నాను" అని చెప్పే ఈ శ్లోకంవంటిదే మరొక శ్లోకం ఉంది. ఇది చరకసంహితకి వ్యాఖ్యానం వ్రాసిన చక్రపాణిదత్తుడనే పండితుడు (క్రీ.శ.11వ శతాబ్దం) రచించినది.

"పాతఞ్జలమహాభాష్యచరకప్రతిసంస్కృతైః,
మనోవాక్కాయదోషాణాం హన్త్రేఽహిపతయే నమః".

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మహాభాష్య-యోగసూత్రాల రచయితలైన పతంజలులిద్దరూ ఒక్కరే అయినా వైద్యశాస్త్రంలో గ్రంథం మరొక పతంజలి వ్రాసి ఉంటారనీ, ఆ పతంజలి పై పతంజలికంటె భిన్నుడనీ చాలమంది విమర్శకుల అభిప్రాయం. **చరకప్రతిసంస్కృతం** అనేది **చరకసంహితను** ఆధారంగా చేసికొని వ్రాసిన గ్రంథం అయి ఉండాలి. **పాతంజలతంత్రం** అనే పేరుతో అలాంటి గ్రంథం ఒకటి ఉండేదని గ్రంథాంతరాలద్వారా తెలుస్తున్నది. చరకుడు కనిష్కుని కాలానికి(క్రీ.శ. మొదటి శతాబ్దం) చెందినవాడవడంచేత ఇది క్రీ.పూ. ద్వితీయ ప్రథమశతాబ్దాలకి చెందిన యోగసూత్రకర్త రచన అవడానికి వీలులేదని వీరి ఆశయం.

భారతదేశంలో అతిప్రాచీనకాలంనుంచీ యోగం ప్రచారంలో ఉన్నది. దానినే ఒక నిశ్చితక్రమంలో ప్రతిపాదించడంకోసం పతంజలి ఈ యోగసూత్రం రచించాడు. ప్రాణం పరమేశ్వరునినుండి జనించిందనీ, అదే దేహాన్ని నిలుపుతూన్నదనీ, అపాన-వ్యానాదులు తమ తమ పనులు ఈ ప్రాణం ద్వారా లభించిన శక్తిచేతనే చేయకలుగుతున్నాయనీ ప్రశ్న-బృహదారణ్యక-ఛాందోగ్యోపనిషత్తులు చెపుతున్నాయి. ఈ విధంగా సకలవ్యవహారాలకీ కారణభూతమైన ఒక శక్తి ఉన్నదనీ అది ప్రాణమనీ ఉపనిషత్తులలో స్పష్టంగా చెప్పబడింది. స్థూలం నుంచి సూక్ష్మం దగ్గరికి ధ్యానం ద్వారా ఎలా చేరుకోవాలో కఠోపనిషత్తులో చెప్పబడింది.

యచ్ఛేద్వాఙ్మనసీ ప్రాజ్ఞస్తద్యచ్ఛేద్ జ్ఞాన ఆత్మని,
జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాన్త ఆత్మని (క.ఉ.1.3.13)

వివేకవంతుడు ఇంద్రియాలను మనస్సులోను, మనస్సును బుద్ధిలోను, బుద్ధిని మహత్తత్వంలోను లీనంచేసి దానిని ఆత్మయందు నిలపాలి అని దీని అర్థం.

యదా పఞ్చావతిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ
బుద్ధిశ్చ న విచేష్టతి తామాహుః పరమాం గతిమ్
తాం యోగమితి మన్యన్తే స్థిరామిన్ద్రియధారణామ్ (క.ఉ. 2.3.10)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్సుతో సహా అయిదు ఇంద్రియాలు ఆత్మయందు స్థిరంగా నిలబడి బుద్ధి కూడా చలించని స్థితియే ఉత్తమగతి. ఇలా స్థిరంగా ఇంద్రియాలను నిలపడమే యోగము అని అంటారు, పై రెండు మంత్రాలలోను ధ్యానప్రక్రియ సూచింపబడి ఉన్నది. ఐతరేయబృహదారణ్యకోపనిషదాదులలో విభిన్నమానసికస్థితులు ప్రతిపాదింపబడ్డాయి. యోగం మోక్షోపాయమని చెపుతూ శ్వేతాశ్వతరోపనిషత్తు ఆసనాలను, ప్రాణాయామాన్నీ, వివేకజ్ఞానానికి పూర్వం కలిగే వివిధమానసికస్థితులను వివరించింది. ధ్యేయవస్తువుమీద మనస్సును నిలపడమే యోగం అని ప్రతిపాదిస్తూ మైత్రాయణోపనిషత్తు ఈ శాస్త్రానికి సంబంధించిన అనేకవిషయాలను విశదీకరించింది. కేవలం యోగాన్నే ప్రతిపాదించే శాండిల్య,యోగతత్త్వ,ధ్యానబిందు,హంస,అమృతానంద,వరాహ, మండల,బ్రాహ్మణ,నాదబిందు,యోగకుండల్యాద్యుపనిషత్తులు ఉన్నాయి. వీటిలో కొన్ని శైవ-శాక్త సిద్ధాంతాలతో ముడిపెట్టి యోగాన్ని ఉపదేశిస్తున్నాయి. అయితే ప్రధానోపనిషత్తులైన కఠ-బృహదారణ్యకాదులలో కాని ఇతర ఉపనిషత్తులలో కాని యోగాన్ని సాంఖ్యంతో ముడిపెట్టడం జరగలేదు. పతంజలి ఆ యా గ్రంథాలలో ఉన్న యోగప్రక్రియలను తీసికొని సాంఖ్య సిద్ధాంతంతో జోడిస్తూ ఒక నిర్ణీతరీతిలో ఈ యోగసూత్రం రచించాడు. సాంఖ్యులు వారి సిద్ధాంతాన్ని మాత్రమే ప్రతిపాదించారు. అయితే సాంఖ్య సిద్ధాంతప్రతిపాదితమైన అంశాలన్నింటినీ యథాతథంగా గ్రహించి వారు స్థాపించిన కైవల్యరూపఫలాన్ని పొందడానికి తగిన ఉపాయాలను యోగ దర్శనం చూపించింది. అందుచేత సాంఖ్యం కేవలం సైద్ధాంతికం theoretical మాత్రమే అయితే ప్రాయోగికవిధాన Practical aspect ప్రతిపాదనం ద్వారా దీనికి పరిపూర్ణత్వాన్ని చేకూర్చింది యోగదర్శనం.

యోగ శబ్దానికి అనేకమైన అర్థాలున్నాయి. అయితే పతంజలి ఈ పదాన్ని పారిభాషికపదంగా ఉపయోగించి "చిత్తవృత్తులను నిరోధించడం యోగం" అని అర్థం చెప్పాడు. యోగం, ఆ యోగాన్ని సాధించే ఉపాయాలు, చిత్తవృత్తిని నిరోధించేటప్పుడు ఆ యా అవస్థలలో లభించే ఫలాలు, చివరికి ప్రధానఫలమైన కైవల్యం మొత్తం 193 సూత్రాలలో, నాలుగు పాదాలలో

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్రతిపాదింపబడ్డాయి. మొదటిది సమాధిపాదం(సూ.50). రెండవది సాధన పాదం(సూ.55). మూడవది విభూతిపాదం (సూ.54). నాల్గవది కైవల్యపాదం (సూ.34). సాంఖ్యులంగీకరించిన 25 తత్త్వాలతోపాటు ఈశ్వరుణ్ణి కూడా 26వ తత్త్వంగా అంగీకరించడంవల్ల యోగదర్శనానికి సేశ్వరసాంఖ్యం అనే పేరు వచ్చింది. (పంచవింశతితత్త్వాలను గూర్చి మొదటి పాదం 17వ సూత్రం వ్యాఖ్యలో వివరింపబడింది). ఇప్పుడు యోగసూత్రప్రతిపాదితసిద్ధాంతాన్ని సంక్షిప్తంగా పరిశీలించుదాం.

పంచేంద్రియాలలో ఏ ఇంద్రియం ద్వారా ఐనా ఒక విషయం గ్రహించేటప్పుడు చిత్తం ఆ విషయానికి ఏ ఆకారం ఉన్నదో ఆ ఆకారంలో పరిణమిస్తుంది. (మారుతుంది). ఆ విధంగా చిత్రానికి కలిగిన పరిణామానికి 'వృత్తి' అని పేరు. అలాంటి వృత్తు లేవీ కలగకుండా లేదా ఒకే వస్తువుకు సంబంధించిన వృత్తి మాత్రమే కలిగేటట్లుగా చేసికోవడానికి యోగం అని పేరు. చిత్రాన్ని ఏకాగ్రం చేయడం ద్వారా ఆ యోగాన్ని సాధించుకోవాలి. సాంఖ్యులు చెప్పిన బుద్ధి, అహంకారము, మనస్సు అనే అంతరింద్రియాలు మూడు కలిసి చిత్తం. చిత్తం అన్నా అంతఃకరణం అన్నా ఒకటే. అహంకార-మనస్సులు దేనిలో అంతర్గతాలో ఆ మహత్తే అనగా బుద్ధే చిత్తం. ప్రకృతినుండి మొట్టమొదట పుట్టినది చిత్తం. ఇది సత్త్వగుణప్రధానం. ఇది స్వతః చైతన్యరహితమే అయినా చాలా సూక్ష్మమూ పరిశుద్ధమూ అవడంచేత తన దగ్గర ఉన్న, చిత్స్వరూపుడైన పురుషుని (జీవుని) ప్రతిబింబాన్ని గ్రహించడం ద్వారా చైతన్యం ఉన్నట్లు కనబడుతుంది. దీనికి ఏదైనా వస్తువులో సంబంధం ఏర్పడినప్పుడు దాని ఆకారాన్ని పొందుతుంది. విషయాకారమైన ఈ చిత్తపరిణామమే **వృత్తి** అని పైన చూచి ఉన్నాం. ఈ వృత్తిని పురుషునిలోనుంచి వచ్చిన తేజస్సు ప్రకాశింపచేస్తుంది. అప్పుడు ఆ వృత్తికి **జ్ఞానం** అని పేరు. నిజానికి పురుషుడు శుద్ధచిత్స్వరూపుడు. ప్రకృతికున్న పరిమితులేవీ పురుషునికి లేవు. అయితే పురుషుడు అజ్ఞానంచేత చిత్తవృత్తులతో సంబంధించినట్లు భావించుకోవడంచేత ఆ పరిణామాలన్నీ తానే పొందు తున్నట్లు కనబడతాడు. నిశ్చితమైన ఆకారం ఏదీ లేని అగ్నికి ఇనుపచక్రం

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మొదలైన వాటితో సంబంధం ఏర్పడినప్పుడు అది అవి ఏ ఆకారంలో ఉంటాయో ఆ ఆకారంలో ఉంటుంది. నిజానికి చల్లగా ఉండవలసిన ఇనుపచక్రం వేడిగా ఉంటుంది. అదేవిధంగా చిత్తసంబంధంచేత పురుషుడు కూడా మార్పు చెందుతున్నట్లు కనబడతాడు. చిత్తం చైతన్యం ఉన్నట్లుగా కనబడుతుంది. జలంలో ప్రతిబింబిచిన చంద్రుడు కదలుచున్నట్లు జలం కాంతిమంతంగా ఉన్నట్లు కనబడతాయి. అదేవిధంగా పురుషుడు చిత్తం సన్నిధిలో ఉండడంచేత పరిణామాలు చెందుతున్నట్లు చిత్తం చైతన్యవంతం అయినట్లు కనబడతాయి. పురుషుడు తాను పరిశుద్ధుడైనట్లు ప్రకృతితో తన కేమీ సంబంధం లేనట్లు గ్రహించినప్పుడు చిత్తవృత్తిలోని ప్రతిబింబం తానే అనే భ్రాంతి తొలగిపోతుంది. అప్పుడు చిత్తవృత్తులు తొలగిపోతాయి. ఈ విధంగా ధ్యానం ద్వారా చిత్తవృత్తులు ఆగిపోవడమే యోగం. అప్పుడు పురుషుడు తన యథార్థస్థితిని పొందినాడని అర్థం. అదే కైవల్యం; ప్రకృతితో, ప్రకృతి కార్యాలైన చిత్తాదులతో ఏ సంబంధమూ లేకుండా ఒంటరిగా ఉండడం. (చిత్తవృత్తుల సంఖ్యాస్వరూపాదులు ప్రథమపాదం 5-11 సూత్రాలలో వివరింపబడ్డాయి).

వాస్తవంలో పురుషుడు నిత్యసత్యచిత్స్వరూపుడు. పురుషుని ప్రతిబింబంతో కూడిన చిత్తం లేదా చిత్తంలో ప్రతిబింబించిన పురుషుడే లోకంలో జీవుడనే పేరుతో చెప్పబడేవాడు. జన్మమరణాలు, వివిధలోకగమనా గమనాలు, సుఖదుఃఖాలు, పంచవిధక్లేశాలు ఈ జీవునికే చెందుతాయి. (క్లేశాలను గూర్చి చూ. రెండవపాదం సూ.3-9) సత్వరజస్తమోగుణాల బలాబలాలను పట్టి చిత్తానికి ఐదు అవస్థలు కలుగుతూ ఉంటాయి (చూ.1-2 వ్యా). అంతరాయాలను అధిగమించి (చూ.1-30) చిత్రానికి నిరుద్ధావస్థను సంపాదించాలి. అప్పుడు ఆత్మస్వరూపస్థితిరూపమైన కైవల్యానికి ఉపయోగించే నిర్బీజసమాధి (అసంప్రజ్ఞాతసమాధి) లభిస్తుంది.

శరీరాన్ని, ఇంద్రియాలను, మనస్సును వశంలో ఉంచుకొన్నవానికే చిత్తైకాగ్రత లభిస్తుంది. ఇవి వశం చేసుకోవడానికి యమనియమాదులు ఏడు విధించబడ్డాయి (చూ. II 29-54; III 1,2,3). ఈ ఏడింటిని సాధించిన వానికి ఎనిమిదవదైన **సమాధి** లభిస్తుంది. **సంప్రజ్ఞాతసమాధి, అసంప్రజ్ఞాత**

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సమాధి అని సమాధి రెండు విధాలు. ధ్యానం చేసేవానికి తనకంటె భిన్నంగా ధ్యేయమైన వస్తువు గోచరిస్తూ ఉంటే అది సంప్రజ్ఞతసమాధి. ఇది సవితర్క్యము, సవిచారము, సానందము, సాస్మిత అని నాలుగు విధాలు. నాసికాగ్రము, భ్రూమధ్యభాగము, దేవతావిగ్రహము మొదలైన స్థూలవస్తువుల మీద చిత్రాన్ని నిలిపితే అది **సవితర్క్య సంప్రజ్ఞాతసమాధి**. తన్మాత్రలు మొదలైన సూక్ష్మవస్తువులమీద నిలిపితే **సవిచార సంప్రజ్ఞాతసమాధి**. వాటికంటే కూడా సూక్ష్మాలైన ఇంద్రియాలమీద నిలిపితే అప్పుడు ఆనందం కలుగుతుంది; అది **సానందసంప్రజ్ఞాతసమాధి**. ఆత్మగాభావింపబడే అహంకారమీద చిత్రాన్ని నిలిపితే అది **సాస్మితాసంప్రజ్ఞాతసమాధి**. అప్పుడు లోకోత్తరమైన ఆనందం కలుగుతుంది. అయినా సాధకుడు తన వ్యక్తిత్వాన్ని కోల్పోవడం ఉండదు. ధ్యానం చేసేవాడు, ధ్యేయమైనవస్తువు పూర్తిగా ఒకటైపోయి నేను దీనిని గూర్చి ధ్యానం చేస్తున్నాను అనే భావం ఏ మాత్రం ఉండని స్థితి **అసంప్రజ్ఞాతసమాధి**. ఈ స్థితిలో కొత్త చిత్తవృత్తులేవీ కలగడానికి అవకాశం లేదు. అవి నిరుద్ధము లైపోతాయి. వాటి సంస్కారాలు మాత్రం అణగి ఉండవచ్చు. ఏదైనా ఒక కట్టకి నిప్పు అంటించినప్పుడు ఆ నిప్పు ఆ కట్టని మాత్రమే కాలుస్తుంది. దానిని కాల్చడం పూర్తి అయిన తరువాత దానంతట అదే శాంతిస్తుంది. అదే విధంగా ప్రయత్నపూర్వకంగా చిత్రాన్ని ఒక వస్తువునందే ఏకాగ్రం చేసినప్పుడు ఆ వస్తువునకు సంబంధించిన చిత్తవృత్తులు మాత్రమే కలుగుతాయి. కొంత కాలానికి ఆ చిత్తవృత్తిప్రవాహం కూడా నిలిచిపోతుంది. అదే **అసంప్రజ్ఞాత సమాధి**. యోగం అనేది ఒక విధమైన దివ్యోన్మాదం. లోకోత్తరానందఘనం. వర్ణనాతీతం. దీనిని పొందడం ఎంతో కష్టమైనది. పొందినవారు కూడా దీనిని చాలా కాలం నిలుపుకోలేరు. దీనిని పొందిన అచిరకాలానికే దేహాన్ని విడచి కైవల్యం పొందుతారు.

యోగాభ్యాసంవల్ల కొన్ని అలౌకికశక్తులు లభిస్తూ ఉంటాయి. వాటిని లెక్కచేయక, వాటితోనే తృప్తి చెందక ప్రధానలక్ష్యమైన కైవల్యంమీదనే దృష్టిని స్థిరంగా నిలుపుకోవాలని ఏతచ్ఛాస్త్రజ్ఞుల ఉపదేశం.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సాంఖ్యులు ప్రధానము పురుషుడు అనే రెండే తత్త్వాలను అంగీకరిస్తారు. యోగదర్శనం ఈశ్వరుణ్ణి కూడా అంగీకరిస్తుంది. క్లేశకర్మాదులకు అతీతుడై నిత్యముక్తుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తుడు అయిన ఒకానొక పురుషుడు ఈశ్వరుడు. అతడు శుద్ధచిత్స్వరూపుడు. ఋషులకు గురువు. వేదాలను అంద జేసినవాడు. ఓమ్ అనేది ఆ పరమేశ్వరునికి ప్రతీక. ఆ ఈశ్వరునియందు భక్తి కలవారికి చిత్తైకాగ్రత లభించడంలో ఏ మాత్రమూ సందేహం లేదు.

అయితే యోగులు అంగీకరించిన ఈ ఈశ్వరుడు సృష్టి-స్థితి-లయ కర్త కాడు, ఆతడొక విశిష్టపురుషుడు మాత్రమే. పురుషుల నిగ్రహానుగ్రహాలు చేసేవాడు కాడు. ప్రకృతి, అసంఖ్యాకులైన పురుషులూ కూడా నిత్యులే అవడంచేత ఈశ్వరునికి కొంత పరిమితి ఉన్నది. ఇతడు మోక్షం ఇవ్వజాలడు. సాధకుడు మోక్షం పొందడానికి మధ్య తగిలే విఘ్నాలను తొలగిస్తాడు. పురుషుల బంధమోక్షాలతో ఈశ్వరునికేమీ సంబంధం లేదు. అజ్ఞానంవల్ల బంధం ఏర్పడుతుంది. "ప్రకృతితో నాకేమీ సంబంధం లేదు" అని పురుషునికి వివేకజ్ఞానం కలుగుతే మోక్షం కలుగుతుంది. పురుషుని ప్రధానలక్ష్యం ఈశ్వరునిలో కలిసిపోవడం కాదు, ప్రకృతినుంచి దూరంగా ఉండడమే. నిజానికి ఇలాంటి ఈశ్వరుణ్ణి అంగీకరించినా అంగీకరించకపోయినా ఒకటే. అందుచేతనే ఈ అంశాన్ని ఇతర దార్శనికులెవరూ అంగీకరించలేదు.

యోగదర్శనం మానవునికి సునిశ్చితమైన ఆధ్యాత్మికసమున్నతిని కలిగించే సాధనాలనుపదేశించిన దర్శనం. శ్రీ కృష్ణుడు చెప్పిన "స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్" (ఈ ధర్మాన్ని ఏ కొంచెం ఆచరించినా మహాభయంనుంచి కాపాడుతుంది) అనే విశ్వాససంవర్ధకమైన ఆశ్వాసనవాక్యం దీని విషయంలో ముమ్మాటికీ సత్యం. అందుచేతనే ఈ దర్శనంలో చెప్పిన ప్రధానకారణవాదం, పరిణామవాదం, ఈశ్వరతత్త్వం మొదలైన అంశాలను అంగీకరించకపోయినా, చార్వాకులు తప్ప అందరు దార్శినికులూ కూడ, బౌద్ధ జైనాదులతో సహా, చిత్తైకాగ్రతాసాధనాలైన ఇతర అంశాలన్నీ అంగీకరించారు. జీవన్ముక్తివివేకంలో శ్రీ విద్యారణ్యులు ఇలా అన్నారు. "నాపి లౌకాయతిక వ్యతిరిక్తః సర్వోఽపి తైర్థికః మోక్షమకుర్వన్

In Public domain. Digitization Muthulakshmi Research Academy
యోగిచరితేఽపి విసంవదితు మర్హతి; అర్హత బౌద్ధవైశేషికనైయాయికశైవవైష్ణవశాస్త్రసాంఖ్యయోగాది మోక్ష శాస్త్రేషు ప్రతిపాద్యప్రమేయస్య నానావిధత్వేఽపి మోక్ష సాధనస్య యమ నియమాద్యష్టాఙ్గయోగస్యైకవిధత్వాత్" (జీవన్ముక్తివివేకం పేజి144).

బ్రహ్మసూత్రంలో బాదరాయణులు "సాంఖ్యం వలెనే యోగం కూడా పరిగ్రాహ్యం కాదు" అని నిరాకరించినా (ఏతేన యోగః ప్రత్యుక్తః 2-1-3) యోగశాస్త్రంలో చెప్పిన ధ్యానపద్ధతిని ఆసీనాధికరణంలో అంగీకరించాడు. (4.1.7-10) దీనిని పట్టి, పైన విద్యారణ్యులు చెప్పినట్లు, ప్రకృతికారణత్వ-పురుషనానాత్వాదులు అంగీకార్యములు కాకపోయినా, ఇతరవిషయాలు అంగీకార్యాలే అని సూచితం అవుతున్నది. అందుచేతనే శంకరభగవత్పాదులు పై సూత్రానికి వ్యాఖ్యానం వ్రాస్తూ ఇతర సిద్ధాంతాంశాలు అంగీకరించక పోయినా సాంఖ్యులు చెప్పిన పురుషుని చిత్స్వరూపత్వనిర్లిప్తత్వాదులు, యోగులు చెప్పిన వైరాగ్యసంన్యాసాదిసాధనాలు అంగీకరించడంలో అభ్యంతరం లేదని అన్నారు. "యేనత్వంశేన న విరుధ్యేతే తేనేష్టమేవ సాంఖ్యయోగస్మృత్యోః సావకాశత్వమ్ తద్యథా అసఙ్గోఽహ్యాయం పురుషః ఇత్యేవమాది శ్రుతిప్రసిద్ధమేవ పురుషస్య విశుద్ధత్వం నిర్గుణపురుషనిరూపణేన సాంఖ్యైరభ్యుపగమ్యతే. తథా చ యోగైరపి "అథ పరివ్రాడ్వివర్ణవాసా ముణ్డోఽ పరిగ్రహః" ఇత్యేవమాదిశ్రుతిప్రసిద్ధమేవ నివృత్తి నిష్ఠత్వం ప్రవ్రజ్యాద్యుపదేశేనా నుగమ్యతే" (బ్ర.సూ.భా.2.1.3). ఈ విషయాన్నే భామతిలో వాచస్పతిమిశ్రులు ఇంకా స్పష్టంగా చెప్పారు. "నానేన యోగశాస్త్రస్య హైరణ్యగర్భపాతఞ్జలాదేః సర్వథా ప్రమాణ్యం నిరాక్రియతే, కిం తు జగదుపాదాన స్వతన్త్రప్రధాన తద్వికారమహదహంకారపఞ్చతన్మాత్రగోచరం ప్రామాణ్యం నాస్తీత్యుచ్యతే. న చైతావతైషామప్రామాణ్యం భవితుమర్హతి. యత్పరాణి హి తాని తత్రాప్రామా ణ్యే ప్రామాణ్యమశ్నువీరన్. న చైతాని ప్రధానాదిసద్భావపరాణి, కిం తు యోగస్వరూపతత్సాధనతదవాన్తరఫల-విభూతితత్పరమఫలకైవల్యవ్యుత్పాదన పరాణి". వేదాంతులు అంగీకరించిన నిత్యానిత్యవస్తువివేకవైరాగ్యశమదమాది సంపదాదులు, మననిదిధ్యాస-

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నాదులు యోగోక్తవిషయాలతో చాల దగ్గర సంబంధం కలవై ఉండడం సర్వవిదితం.

అయితే రామానుజాచార్యులు. ఈ యోగదర్శనం సర్వథా అపరిగ్రాహ్యం అని కొట్టివేశారు. "వీరు అంగీకరించిన ప్రధానం స్వతంత్రం, భగవంతుని శేషం కాదు. జీవులు స్వతంత్రులు, చిత్స్వరూపులు, నిర్గుణులు. మోక్షం కూడా భగవత్సన్నిధి ప్రాప్తి కాదు. వీరు అంగీకరించిన ఈశ్వరుడు కూడా అంతంతమాత్రం వాడే. అందుచేత హిరణ్యగర్భాదులు రచించినదే అయినా ఇది ప్రమాణం కాదు. హిరణ్యగర్భుడు కూడా ఒక జీవుడే అవడంచేత అతనికి రజస్తమోగుణాల ఆవరణం కలుగుతూంటుంది; ఆ సమయంలో చెప్పి ఉంటాడు; అందుచేత హిరణ్యగర్భరచితాలే అయిన తామసపురాణాలు ఏ విధంగా ప్రమాణం కావో ఇదీ అంతే అన్నారు"(2.1.3) అయితే విద్యారణ్యులు చెప్పినట్లు భగవద్భక్తిసంపాదనవిషయంలో యోగదర్శనంలో చెప్పిన యమ నియమాదుల అవసరం ఉండదనడానికి వీలు లేదు. అవన్నీ మేమే చెప్పుకుంటాం, అక్కడి నుండి గ్రహించడం ఎందుకు అని సమాధానం చెపితే అది వేరే విషయం.

జైనబౌద్ధమతాలు వేదప్రామాణ్యం అంగీకరించకపోవడంచేత నాస్తిక దర్శనాలు. వాటిలో యోగానికి ఉన్న ప్రాధాన్యం సుప్రసిద్ధం. జైనమతం బౌద్ధం కంటె ప్రాచీనమైనదే అయినా దానిలో యోగానికి సంబంధించిన ప్రాచీనగ్రంథా లేవీ లభ్యం అవడంలేదు. లభ్యం అయ్యేవన్నీ బౌద్ధగ్రంథాల తరువాత వచ్చినవే. ఇంక బుద్ధుని విషయం : ఆయన అన్ని ప్రక్రియలు అనుష్ఠించి, కొంతకాలం హఠయోగం కూడా అవలంబించి, చివరికి ధ్యానం ద్వారా తత్త్వాన్ని కనుగొన్నాడు. అందుచేత ఆయన ఉపదేశాలలో ధ్యానానికి ఉన్న ప్రాధాన్యం అసామాన్యం. బుద్ధుడు బోధించిన సమ్మాదిట్టి (సమ్యగ్దృష్టి) మొదలైన ఆరియఅట్ఠంగిక మగ్గం(ఆర్యఅష్టాంగమార్గం) పతంజలి చెప్పిన అష్టాంగ యోగం సంనిహితంగా ఉంటాయి. అదే విధంగా బౌద్ధగ్రంథాలలో ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడిన మైత్రీకరుణాముదితోపేక్షలను వైదికయోగగ్రంథాలేమీ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అంతగా ప్రముఖస్థానం ఇచ్చి పేర్కొనలేదు.[1] పతంజలి వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. ఇలాంటి కారణాలచేత బౌద్ధయోగప్రభావం పాతంజల యోగసూత్రంమీద ఎక్కువగా పడినదని కొందరు పండితుల అభిప్రాయం. బౌద్ధుల సమ్మాసమాధి(సమ్యక్సమాధి)కే ఝానం(ధ్యానం) అని నామాంతరం. దీనిలో చెప్పిన వితక్కవిచారం (వితర్కవిచారం), పీతి (ప్రీతి), సుఖం, ఉపేక్ఖా (ఉపేక్షా) అనేవి మనం పైన చూచిన సంప్రజ్ఞాతసమాధిభేదాలవంటివి. ఈ ఝానమే 'జెన్' అనే పేరుతో చైనా జపానుదేశాలలో వ్యాపించింది.

బౌద్ధగ్రంథాలలో యోగానికి సంబంధించిన విషయాలు ఉన్నాయి. అయితే పతంజలిసూత్రంలో యోగానికి సంబంధించిన విషయాలన్నీ ఒక క్రమబద్ధమైన రీతిలో చక్కగా ప్రతిపాదింపబడి ఉన్నాయి. ఇలాంటి నిశ్చితమైన పద్ధతి ఆ గ్రంథాలలో లేదు అని కారెల్ వెర్నర్ చెప్పినాడు.[2] It is possible to

---

[1] బౌద్ధమతంలో మైత్రాదులకున్న ప్రాధాన్యాన్ని గూర్చి క్రిస్టమస్ హంఫ్రేస్ అనే ఆయన "జెన్" అనే గ్రంథంలో వివరించాడు

[2] The four Brahmaviharas, for example, or God - like states of mind, can be usefully exercised at any time and place, from the office to the restaurant, from a dentist's waiting room to a bus. These four virtues, though powers of mind is a better term, are Metta, loving kindness or good will, Karuna, compassion, Mudita, Joy and Upekkha, equanimity or serenity of mind. In a famous quotation from a Buddhist Sutta. "He lets his mind pervade one quarter of the world with thoughts of loving kindness, with thoughts of compassion, with thoughts of sympathetic joy and with thoughts of equanimity; and so the second quarter and so the third and the fourth. And thus the whole wide world, above, below, around and everywhere does he continue to pervade with heart of love, compassion, pity and equanimity, far-reaching, great beyond measure, free from the least trace of anger or ill-will. "This practice is itself a subject of meditation, and as thoughts are things, and powerful things, and thought-force steadily directed is potentially an immense force for good, the practice of these ancient modes of blessing is a far better way of passing the idle moment of waiting, or a journey, than the useless

In Public domain. Digitization Muthulakshmi Research Academy

say that upon the whole it (Patanjali's work) is more elaborate and summarizes the actual technique of yoga procedures, more exactly than the Buddhist exposition. (**Yoga and Indian Philosophy** P.131)

యోగసూత్రాలను పరిశీలించగా వాటిలో అతి ప్రాచీనకాలంనుంచీ ప్రచారంలో ఉన్న విషయాలు, (ఉపనిషదాదులలోను, బౌద్ధగ్రంథాలలోను ఉన్నవి) బౌద్ధగ్రంథాలలో లేనివీ కూడా చెప్పబడి ఉన్నాయి అని అంటాడు వెర్నర్.

What is beyond doubt, however, is that the material, the every sutras contain dates back before this period (300 B.C. and 300A.D.) and some of it even before the time of the Buddha. (P.132)

అందుచేత పతంజలి బౌద్ధగ్రంథాలనుండి విషయం సేకరించాడని చెప్పడానికి ఎంత అవకాశం ఉన్నదో, పతంజలీ, బౌద్ధులూ కూడా సంప్రదాయ సిద్ధంగా అతిప్రాచీనకాలంనుంచీ ప్రచారంలో ఉన్న విషయాలను స్వతంత్రంగా తీసికొన్నారని చెప్పడానికి కూడా అంత అవకాశం ఉంది. బౌద్ధజైనమతాలు ఎక్కడినుంచో హఠాత్తుగా వచ్చాయన్నట్లు, వీటికి ఈనాడు హిందూమతం అని చెప్పే కొంతమంది ప్రబుద్ధులు **బ్రాహ్మణిజం** అని పేరు పెట్టిన, వైదిక మతంతో ఏమీ సంబంధం లేనట్లు మాటలాడడం ఒక ఫేషన్ అయిపోయింది. నిజానికి ఈ మతాలన్నీ ఈ భారతదేశం గడ్డమీద పుట్టినవే. ఒకదానిలో ఒకటి ఎన్నో పోలికలున్నవే. అందుచేత ఒక సిద్ధాంతం దానిలోనుండి దీనికిలోనికి వచ్చిందా, దీనిలోనుంచి దానిలోనికి వెళ్ళిందా అంటూ చేసే మీమాంస హాస్యాస్పదం; నిష్ఫలం.

---

and often harmful thoughts which otherwise occupy the mind" (pp. 48-49).

ఈ మైత్ర్యాదులకు "బ్రహ్మవిహారములు" అని పేరు ఉండడం గమనార్హం. ఇవి భారతీయ సర్వదర్శనసాధారణా లనే విషయాన్ని సూచిస్తుంది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పాతంజలయోగానికి **రాజయోగం** అని పేరు. యోగతత్త్వోపనిషత్తు – మంత్రయోగం, లయయోగం, హఠయోగం అనే మరి మూడు యోగాలను కూడా పేర్కొన్నది. ఇవి కాక కుండలినీయోగం మొదలైనవి ఇంకా కొన్ని ఉన్నాయి. ఏ యోగమైనా మనస్సును ఏకాగ్రం చేయడం ద్వారా కొన్ని సిద్ధులనో లేదా పరమలక్ష్యమైన మోక్షాన్నో సాధించడమే ప్రయోజనం. ఏమైనా రాజయోగం రాజయోగమే. ఎంత ప్రయత్నం చేస్తే అంత ఫలం. అంతేనే కాని క్రింద పడిపోవడం అనే ప్రమాదం లేదు ఈ యోగసాధనంలో.

ఈ యోగసూత్రానికి వ్రాసిన కొన్ని వ్యాఖ్యానాలు, ఈ సూత్రాన్ని ఆధారంగా చేసికొని వ్రాసిన విస్తృతరచనలూ చదువుతున్నప్పుడూ లేదా కొందరు చేసే ఉపన్యాసాలు వింటున్నప్పుడు యోగం అంటే ఇదేదో రోజుకు ఒక అరగంట కళ్లు మూసుకొని కూర్చుంటే సాధించడానికి శక్యమైన విషయమని అనిపిస్తుంది. **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః** వంటి వాక్యాలు విని. **అహం బ్రహ్మాస్మి** అని వల్లించుకొంటూ కూర్చున్నవాడు ఎంత ఆత్మజ్ఞాని ఔతాడో ఇలాంటి సాధనం చేసేవాడు కూడా అలాంటి యోగే అవుతాడు. సాధనచతుష్టయసంపత్తి ఉన్న సంన్యాసులే కాని మరెవరూ **అహం బ్రహ్మాస్మి** వంటి వాక్యాల జోలికి కూడా వెళ్ళకూడదు అని సంప్రదాయం. విషయం తెలుసుకోవడం కోసం ఆ గ్రంథాలు చదవడం అనేది వేరే విషయం. ఆ గ్రంథాలు చదివిన వాళ్లందరూ వేదాంతులు ఏ విధంగా కాజాలరో వీళ్లూ అంతే. అందుచే యమనియమాదులను కూడా అలవరచుకొని తరువాత ధ్యానం చేయడం ప్రారంభిస్తే లాభం పొందవచ్చు. యోగాసనాలు వెయ్యడం మాత్రమే యోగిత్వాన్ని సంపాదించి పెడుతుందనే భ్రాంతి చాలా మందికి ఉంది. మిడిమిడిజ్ఞానంతో తృప్తిపకడక, పండితత్వాభిమానాన్ని విడిచి సంప్రదాయసిద్ధమైన శాస్త్రజ్ఞానం సంపాదించాలి. అలా సంప్రదాయానుగుణంగా తెలుగులో పాతంజలయోగసూత్రానికి వ్రాసిన వ్యాఖ్యలు ఏవీ లేవని చెప్పజాలను. ఈ విశాలదేశంలో ఎందరో మహాపురుషులున్నారు. ఎవరైనా వ్రాసి ఉండవచ్చు. అయితే అవి నా కంట బడలేదు. అందుచేత వ్యాసభాష్యాదులను సంప్రదించి ఒక వ్యాఖ్య వ్రాయాలనే అభిప్రాయం కలిగి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఐదారు సంవత్సరాల క్రితమే ప్రారంభించాను. రెండవ అధ్యాయం 12వ సూత్రం దగ్గర ఆగిపోయింది. ఏదో ప్రసంగంలో న్యాయమూర్తి శ్రీ కోదండరామయ్య గారితో ఈ విషయం చెప్పినప్పుడు - "పూర్తిచెయ్యండి, ఆర్షవిజ్ఞానట్రస్టుద్వారా ప్రకటిద్దాం" అని వారన్నారు. వారి అభిలాష ప్రకారం పూర్తి చేయడం జరిగింది. దీని సంపూర్తికి, ప్రచురణకు కారణభూతులైన శ్రీకోదండరామయ్యగారికి నా కృతజ్ఞతలు. -

ఆచార్య కే. సచ్చిదానందమూర్తి గారు విశ్వవిఖ్యాత తత్త్వశాస్త్ర పండితులు. ప్రాచ్యపాశ్చాత్యతత్త్వశాస్త్రాలలో సమానమైన ఉత్తమాధికారం గలవారు. చాలా మంది తత్త్వశాస్త్రాచార్యులవలె వేదాంతగ్రంథాలన్నీ ఆంగ్ల భాషానువాదాలలో కాక సంస్కృతభాషలో చదువుకున్నవారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగాను, యు.జి.సి. వైస్ ఛైర్మన్ గాను అనేక కార్యనిర్వాహక విద్యాసంబద్ధసంఘాలలో అధ్యక్షులుగాను, సభ్యులుగాను సంస్కృతభాషా తత్త్వశాస్త్రాలకు ఎనలేని సేవ చేసినవారు; ఇంకా అనేకవిధాల చేస్తున్నవారు. పద్మభూషణులు. సర్వేపల్లి రాధాకృష్ణపండితుడువలె ఉన్నత స్థానాలంకరణార్హత గలవారు. వారి అమోదముద్ర ఈ గ్రంథానికి లభించి నందుకు చాలా సంతోషించుచున్నాను. వారిచేత పరిచయం వ్రాయించిన శ్రీకోదండరామయ్యగారికి, వారికీ కూడ కృతజ్ఞతలు తెలుపుచున్నాను.

ఈ **బాలానందినీ** వ్యాఖ్య వ్రాయడానికి వ్యాసభాష్యము, దానికి వాచస్పతిమిశ్రులు రచించిన **తత్త్వవైశారది** అనే వ్యాఖ్య, భావాగణేశ-నాగేశ-భోజనరేంద్రులు వ్రాసిన వ్యాఖ్యలు, ఒకటి రెండు చోట్ల విజ్ఞానభిక్షువు రచించిన వార్తికము సంప్రదించడం జరిగింది. ఆ ఉద్గ్రంథాలను అర్థం చేసుకోవడంలో ఏదైనా లోపం ఉండడంచేత, దానికంటే ప్రధానంగా యోగాభ్యాసాదులలో ఈషన్మాత్రం కూడా పరిచయం లేకపోవడంచేత వ్యాఖ్యానంలో ఏవైనా దోషాలు ఉంటే వాటిని సహృదయులైన విద్వద్వరేణ్యులు మన్నించగలరని విశ్వసించుచున్నాను.

18-6-1992 పుల్లెల శ్రీరామచంద్రుడు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విషయానుక్రమణికా

క్ర.సం	విషయము	పేజీ నం
1.	ఉపోద్ఘాతము-ఆచార్య కే నీలకంఠం	I
2.	కృతిసమర్పణము	vii
3.	ప్రస్తావన (రెండవ ముద్రణ) – ఆచార్య పి శ్రీరామచంద్రుడు	ix
4.	స్వామి రంగనాథానంద సందేశము	xi
5.	పరిచయము – ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి	xii
6.	ముందుమాట – జస్టిస్ పి కోదండరామయ్య	xviii
7.	ప్రస్తావన – ఆచార్య పి శ్రీరామచంద్రుడు	xxi
8.	ప్రథమాధ్యాయః – సమాధిపాదః	1
9.	ద్వితీయాధ్యాయః – సాధనపాదః	63
10.	తృతీయాధ్యాయః – విభూతిపాదః	118
11.	చతుర్థాధ్యాయః – కైవల్యపాదః	153
12.	యోగసూత్రముల అకారాదిక్రమసూచిక	185
13.	యోగసూత్రముల అనుక్రమణిక	194
14.	బాలానందినీ ఉదాహరణ శ్లోకానుక్రమణిక	202

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రీః
శ్రీ మహాగణాధిపతయే నమః
శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

పాతఞ్జలయోగసూత్రమ్
సమాధిపాదః
బాలానందినీ వ్యాఖ్యానము

నత్వా శ్రీతాతపాదాదీన్ మస్త్రశాస్త్రాదిసద్గురూన్,
క్రియతే యోగసూత్రాణామ్యాం వ్యాఖ్యా యథామతి.

అవతారిక. ముముక్షువులు యోగాభ్యాసమును చేయుటకై యోగశాస్త్రాధ్యయనము చేయవలెనని –

"మృత్యుప్రోక్తాం నచికేతోఽథ లబ్ధ్వా
విద్యామేతాం యోగవిధిం చ కృత్స్నమ్
బ్రహ్మ ప్రాప్తో విరజోఽభూద్విమృత్యు
రన్యోఽప్యేవం యో విదధ్యాత్మమేవ" (క.ఉ.2.3.18)

(పిమ్మట ఆ నచికేతుడు యముడు బోధించిన ఈ విద్యను, సమస్త యోగవిధానమును కూడ గ్రహించి, విశుద్ధుడై, అవిద్య తొలగి బ్రహ్మ సాక్షాత్కారము పొందెను. ఆత్మస్వరూపము తెలిసికొనిన ఇతరులు కూడ ఇట్లే బ్రహ్మసాక్షాత్కారము పొందగలరు) అని శ్రుతివాక్యములు సూచించుచున్నవి. అందుచే భగవంతుడగు పతంజలిమహర్షి యోగవిధానమును ఉపదేశింపబూని ఈ సూత్రములో "శాస్త్రారంభము చేయబడుచున్నది"అని చెప్పుచున్నాడు: –

సూ. అథ యోగానుశాసనమ్. 1

ప్రతిపదార్థం. యోగానుశాసనమ్=యోగశాస్త్రము, అథ=ఉపక్రమింపబడు చున్నది.

వ్యాఖ్యానం. అథ అను పదమునకు, 'అటుపిమ్మట' అని ప్రసిద్ధమైన అర్థము. కాని ఇచట 'దేని పిమ్మట' అను ఆశంకకు సమాధానము లేదు గాన ప్రారంభము అను అర్థమును గ్రహించవలెను.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"ఓంకారశ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా,

కణ్ఠం భిత్త్వా వినిర్యాతౌ తస్మాన్మాఙ్గలికావుభౌ".

(పూర్వము **ఓంకారము**, **అథ** శబ్దము అనె రెండు బ్రహ్మదేవుని కంఠము నుండి అప్రయత్నముగా వెలువడినవి. అందుచే ఇవి మంగళ ప్రదములు) అను శాస్త్రోక్తిననుసరించి **అథ** అనునది విన్నంతమాత్రముననే మంగళమును కూర్చును.

"హిరణ్యగర్భో యోగస్య వక్తా నాన్యః పురాతనః"

(యోగమును బోధించిన అతిపురాణపురుషుడు హిరణ్యగర్భుడే) అని యాజ్ఞవల్క్యస్మృతిలో చెప్పినట్లు యోగశాస్త్రమును బోధించినవాడు హిరణ్యగర్భుడు కదా; మఱి పతంజలిమహర్షి బోధించినాడనుట ఎట్లు కుదురును అని ఆశంక కలుగవచ్చును. అందుకే **యోగశాసనమ్** అని కాక **యోగానుశాసనమ్** అని పతంజలి ప్రయోగించినాడు. అనగా యోగశాసనము చేసినది హిరణ్యగర్భుడే; దానినే (అను) అనుసరించి నేను వ్రాయుచున్నాను గాని ఇదంపూర్వముగా నేను చెప్పుటలేదు అని అర్థము. **యోగము** అనగా యుక్తి = సమాధానము. అనగా చిత్తమును స్థిరముగా నిలుపుట. **యుజ్ సమాధౌ** అను ధాతువునుండి నిష్పన్నమైనది. ఏది యోగలక్షణమును, దాని భేదములను, ఉపాయములను, ఫలమును విశదీకరించునో అది యోగానుశాసనము **(భోజవృత్తి)**. శాస్త్రప్రారంభములో **అనుబంధ చతుష్టయమును** సూచించుట సంప్రదాయము. విషయము, సంబంధము, ప్రయోజనము (ఫలము), అధికారి అనేవి అనుబంధచతుష్టయము. ఈ శాస్త్రములో ప్రతిపాద్యవిషయము యోగము. ఈ శాస్త్రమునకు యోగమునకు ఉన్న సంబంధము ప్రతిపాద్యప్రతిపాదకభావసంబంధము. అనగా శాస్త్రము ప్రతిపాదకము (బోధించునది), యోగము ప్రతిపాద్యము (బోధింపదగినది). కైవల్యము ఫలము. యోగమునకు ఫలమునకు సంబంధము సాధ్యసాధన భావసంబంధము. ఆ కైవల్యమును కోరువాడు అధికారి.

అవ. యోగమనగా ఏమి? లక్షణము చెప్పుచున్నాడు.

సూ. యోగశ్చిత్తవృత్తినిరోధః. 2

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ. చిత్తవృత్తినిరోధః=చిత్తవృత్తులను నిరోధించుట, యోగః= యోగము.

వ్యా. సుషుప్తి తప్ప మిగిలిన అవస్థలలో ఎల్లప్పుడును చిత్తమునందు ఏదో ఒక విషయమునకు సంబంధించిన జ్ఞానము కలుగుచునే ఉండును. దీనికే చిత్తవృత్తి అని పేరు. ఇది మున్ముందు విశదము కాగలదు. ఏ అవస్థలో ప్రయత్నవిశేషముచే చిత్తవృత్తులు నిరోధింపబడునో ఆ అవస్థకే యోగమని పేరు.

ఇచట వృత్తినిరోధమని చెప్పబడినది గాని సకలవృత్తినిరోధమని చెప్ప బడలేదు. అందుచేత ఈ లక్షణము సంప్రజ్ఞాతసమాధికిని అసంప్రజ్ఞాత సమాధికిని కూడ సమన్వయించును. ఏ వృత్తులును లేని అవస్థ అసంప్రజ్ఞాతసమాధి అనే యోగము. సంప్రజ్ఞాతసమాధి అనే యోగములో ధ్యేయవిషయమునకు సంబంధించిన వృత్తి మాత్రమే ఉండును. ఇతరవృత్తులుండవు.

చిత్తము సర్వవ్యాప్తము(విభువు). అందుచే అన్ని విషయములను గ్రహించు శక్తి దానికి సహజము. కాని తమస్సుచే ఆవృతమగుటచే ఇది అన్ని కాలములందును, అన్ని వస్తువులను గ్రహింపజాలకున్నది. తమస్సును పెంచు విషయాంతరవాసనలు, పాపములు క్షీణించినచో చిత్తము ధ్యేయవస్తువును ఇతర సహాయమేమియు లేకుండగనే సాక్షాత్కరింపచేసికొనగలుగును అని యోగ సిద్ధాంతము (నాగేశవ్యాఖ్య)

చిత్తమునకు క్షిప్తము, మూఢము, విక్షిప్తము, ఏకాగ్రము, నిరుద్ధము అని ఐదు అవస్థావిశేషములుండును. క్షిప్తావస్థలో రజోగుణము ఉద్రిక్తమైయుండును. అందుచే చిత్తము అస్థిరమై, శబ్దాదులందు అనురాగము కలిగి యుండును. ఉదా దైత్యదానవాదులు చిత్తము. మూఢావస్థలో తమఃసముద్రేకముచే కృత్యాకృత్యవిచారము లేక క్రోధాదులతో నిండి యుండును. నిద్రాదులు, అధర్మాచరణము నందు ఆసక్తియు ఉండును. ఉదా. రక్షఃపిశాచాదుల చిత్తము. విక్షిప్తావస్థలో సత్త్వము ఉద్రిక్తమై ఉండును. అందుచే దుఃఖహేతువులను పరిత్యజించి సుఖ సాధనములను

In Public domain. Digitization Muthulakshmi Research Academy
సమకూర్చుకొనుటకై ప్రయత్నించుచుండును. ఉదా. దేవాదుల చిత్తము. రజోగుణప్రాబల్యముచే చిత్తము ప్రవృత్తిశీలమై ఉండును. తమఃప్రాబల్యముచే పరాపకారనిరతమై ఉండును. సత్త్వప్రాబల్యముచే సుఖమయమగును. ఈ మూడు అవస్థలలోను ఏ కొంచెమో చిత్తవృత్తినిరోధముండిన ఉండవచ్చును. కాని అది యోగము కాజాలదు. యోగమునకు అడ్డుగా నిలచు విక్షేపములు అప్పుడు కూడా ఉత్కటముగా ఉండును కదా? ఏకాగ్రావస్థలో ధ్యేయవృత్తిభిన్నములగు ఇతరవృత్తులన్నియు నిరుద్ధములగును. ఈ అవస్థ కలిగినపుడు, హృదయప్రదేశమునందలి అంతఃకరణములో కూటస్థనిత్యమగు చిత్స్వరూపము సాక్షాత్కరించును. ఆ చిత్స్వరూపసాక్షాత్కారము కలిగినపుడు అవిద్య తొలగిపోవును. దానితో అవిద్యవలన కలిగిన క్లేశములన్నియు క్షీణించును. ఈ అవస్థలో సంప్రజ్ఞాతయోగము కలుగును. దీనిలో రజస్తమోమయవృత్తులు పూర్తిగా నిరుద్ధములగును. సాత్త్వికవృత్తి మాత్రము ఉండి అందు ఆత్మ గోచరించుచుండును. ధ్యేయవస్తువగు పురుషతత్త్వమును సాక్షాత్కరింపచేసి, క్లేశాదులను నశింపచేయుటచే ఈ అవస్థ మోక్షహేతువు. అన్ని వృత్తులును నిరుద్ధములై వాటి సంస్కారము మాత్రము శేషించు అవస్థ నిరుద్ధావస్థ. దీనిలో అన్ని వృత్తులును నిరుద్ధము లైనచో ఇది అసంప్రజ్ఞాత యోగము. సకలవృత్తుల సంస్కారములను కూడ దహించి వేయును గాన ఈ అసంప్రజ్ఞాతము ప్రారబ్ధమును కూడ అతిక్రమించి మోక్షమును కలిగించును. ఈ విషయమే – –

"ఏకాగ్రతా చేద్గ్రాహ్యేథా నిరోధశ్చేచ్చిదాత్మని,
క్షిప్తాదిత్రిభువస్త్యాగాత్మస్య మోక్షోఽత్ర దూరతః".

(గ్రహింపదగిన విషయములందు చిత్తమునకు ఏకాగ్రత కలిగి, పిమ్మట అది చిదాత్మయందే నిలిచినట్లైతే, క్షిప్తాదులగు మూడు అవస్థలును తొలగి పోవుటచే మోక్షము సమీపమున నుండును అని చెప్పబడినది. (నాగే).

(1) చిత్తము త్రిగుణాత్మకమే అయినను దానిలో ప్రధానమైనది సత్త్వగుణము. తమస్సు రజోగుణమును జయించి ప్రధానమైన సత్త్వగుణమును అణగద్రొక్కినపుడు చిత్తము రజస్తమోగుణములను

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తొలగింప అసమర్థమై, తమస్సుచే ఆవృతమగును. అట్టి చిత్తము అధర్మము, రాగము మొదలైనవాటి విషయమున ప్రవర్తించును. అనైశ్వర్యమును పొందును. ఏ కోరికయు సఫలము కాకపోవుటయే అనైశ్వర్యము. నిద్రారూపమగు అజ్ఞానమును పొందును. ఇట్టి చిత్తమునకు **మూఢము** అని పేరు. (2) సమబలములైన రజస్తమోగుణములు సత్త్వగుణముకంటె తక్కువగానున్నచో అపుడు చిత్తము **క్షిప్తము**. ఈ క్షిప్త చిత్తమునకు అణిమాద్యైశ్వర్యములు, శబ్దాదివిషయములును ప్రియములగును. (3) తమస్సు క్షీణమై, రజోగుణము దానికంటె బలీయమై ఉండును. అట్టి రజోగుణము, దానికంటే ఎక్కువబలముగల సత్త్వమూ ఉన్న చిత్తము **విక్షిప్తము**. ఇట్టి చిత్తమునకు ధర్మ-జ్ఞాన-వైరాగ్య-ఐశ్వర్యాదులందు ఆసక్తి ఉండును. (4) చిత్తమునందలి రజస్తమోరూపములగు మలములు పూర్తిగ తొలగిపోయి పరిశుద్ధసత్త్వము మాత్రము మిగిలి ఉండును. అపుడు ఆ చిత్తము బాహ్యపదార్థములన్నియు సంసారహేతువులను విషయమును గ్రహించి, వైరాగ్యమును పొందును. అపుడు బాహ్యావృత్తులేవియు ఉండవు. సహజమగు నిర్మలత్వము లభించును. ఆత్మస్వరూపమునందే స్థిరముగ నిలచి, బుద్ధ్యాదులు వేరు, ఆత్మ వేరు అను వివేకఖ్యాతిని (వివేక జ్ఞానమును) పొందుటచే తాదృశజ్ఞాన మొక్కటియే ఉండును. అది **ఏకాగ్రము**. దీని అత్యున్నతస్థితికి "ధర్మమేఘ సమాధి" అని పేరు. ఈ స్థితిలో చిత్తమునకు ధ్యానము తప్ప మరేదియు రుచింపదు. (5) కొంతకాలమునకు - వివేకఖ్యాతి గూడ సత్త్వగుణాత్మకమే గాన చిచ్ఛక్తిదృష్ట్యా అది అధమమే అను జ్ఞానము కలుగును. పురుషుడను నామాంతరము గల చిచ్ఛక్తికి పరిణామమనునది లేదు. బుద్ధికి వలె దీనికి క్రియ లేదు. అందుచేత విషయముల దగ్గరకు వెళ్లుట అనెడు 'ప్రతిసంక్రమము' లేదు. విషయసంగము లేదు. బుద్ధి తన వృత్తులద్వారా దీనికి విషయములను ప్రదర్శించుచుండును. బుద్ధ్యాదులకు సుఖ-దుఃఖ దుఃఖ-మోహాత్మకత్వమగు అశుద్ధి ఉండును. గాని దానికి అట్టి అశుద్ధి లేదు. ఇది అనంతము; అనగా నాశరహితము. కాని వివేకఖ్యాతి సత్త్వగుణజనితమే అయినను పరిణామము గలది. దీపశిఖవలె విషయములపై

In Public domain. Digitization Muthulakshmi Research Academy
ప్రసరించును గాన ఇది ప్రతిసంక్రమము కలది. జడము. దీనిలో కూడ సుఖదుఃఖాద్యశుద్ధులుండును. ఇది పరిచ్ఛిన్నము గాన అంతము గలది. వివేకవంతునకు దుఃఖము ఎట్లు హేయమో సుఖముకూడ అట్లే హేయము. ఇట్టి జ్ఞానము కలుగుటచే చిత్తమునకు ఆ వివేకఖ్యాతి విషయమునందు గూడ వైరాగ్యము కలుగును. అపుడు సకలవృత్తులును నిరుద్ధములగును. అట్టి చిత్తము నిరుద్ధము. (నాగే)

అవ. ఇక్కడ ఒక ఆశంకకు అవకాశమున్నది : "చిత్తవృత్తి నిరోధము యోగము" అని చెప్పినచో వ్యుత్థానకాలములో (సమాధిస్థితి లేని కాలములో) గూడ ఏవో కొన్ని వృత్తుల నిరోధముండును గాన అట్టి నిరోధమునందు ఈ లక్షణమునకు అతివ్యాప్తి వచ్చును; అనగా అది కూడ యోగము కావలసి వచ్చును. మరొక విషయమేమనగా – కట్టెలపై మండు అగ్నివలె, వృత్తులతో సంబంధించిన జ్ఞానమే పురుషుడు అని కదా సాంఖ్యయోగమతసిద్ధాంతము? వృత్తులన్నియు విలీనమై పోయినపుడు, కట్టె పూర్తిగా కాలిపోయిన పిమ్మట అగ్ని కూడ శాంతించినట్లు, పురుషుడు కూడ నశించవలెను కదా? అపుడు యోగకాలములో పురుషార్థమేమి ఉన్నది? ఈ ప్రశ్నలకు సమాధానముగ చెప్పుచున్నాడు. (భా.గ.) (నాగే) :

సూ. తదా ద్రష్టుః స్వరూపేవస్థానమ్. 3

ప్ర.అ. తదా=అప్పుడు, అనగా సకలవృత్తినిరోధరూపమైన అసంప్రజ్ఞాత సమాధియందు, ద్రష్టుః=జ్ఞానస్వరూపుడైన పురుషునకు, స్వరూపే విషయములు లేని చిన్మాత్రరూపమునందు, అవస్థానమ్=స్థితి (కలుగును).

వ్యా. సంప్రజ్ఞాతసమాధిలో విషయస్పర్శ ఉండును గాన 'తదా' అను పదమునకు "ఏ మాత్రము విషయస్పర్శ లేని అసంప్రజ్ఞాతసమాధియందు"అని అర్థము చెప్పబడినది.

స్ఫటికము ప్రక్కన జపాపుష్పమునుంచినచో దాని ప్రతిబింబము స్ఫటికములో పడును. ఆ పుష్పమును తొలగించగనే ఆ స్ఫటికము సహజ మగు విశుద్ధరూపముతో భాసించును. అట్లే వృత్తులు ఉన్నపుడు అవి చైతన్యముపై సంక్రమించి చైతన్యము వృత్తిసహితమైనట్లుండును. ఆ వృత్తులు తొలగిపోయినచో శుద్ధచైతన్యమే మిగిలి పోవును. శుద్ధజ్ఞానమే పురుషుని

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సహజస్వరూపము కాని బుద్ధివృత్తిరూపమగు జ్ఞానము కాదు. అది కేవలము ఔపాధికము. జపాపుష్పమను ఉపాధిని (బాహ్యావస్తువును బట్టి స్ఫటికమున ఎరుపు కలిగినట్లు బుద్ధిరూపమగు ఉపాధిని పట్టి ఏర్పడినది. ఉపాధి పోయినను ఉపహితము పోదు కదా? అందుచేత కాష్ఠము దగ్ధమైన పిమ్మట అగ్ని నశించి నట్లు, పురుషుడు నశించు ప్రసక్తి లేదు.

దీనిని బట్టి, యోగమనగా ద్రష్ట (పురుషుడు) స్వస్వరూపమునందు అత్యంతికమగు (స్థిరమైన స్థితిని పొందుటకు ఉపకరించు సకలచిత్తవృత్తినిరోధమే అని తేలినది. సంప్రజ్ఞాతయోగము అసంప్రజ్ఞాతయోగమునకు మార్గము గాన, తద్వారా స్వరూపావస్థితిని కలిగించునదగుటచే దానికి కూడ యోగమను పేరు ప్రసిద్ధము, వ్యుత్థానకాలమునందు కలుగు ఏవో కొన్ని చిత్తవృత్తుల నిరోధము ఈ విధమగు స్వస్వరూపస్థితికి హేతువు కాదు గాన అది యోగము కాదు.

ప్రళయమునందును, సుషుప్తియందును కూడ వృత్తినిరోధముండును. కాని అది అత్యంతికస్వరూపస్థితికి హేతువు కాదు. మరల ప్రళయసుషుప్తుల తరువాత వృత్తులు ఆవిర్భవించును కదా? అందుచేత అది యోగము కాదు.

ఈ విధముగ అసంప్రజ్ఞాతసమాధిలో చిచ్ఛక్తి పరిశుద్ధముగ, బుద్ధికృత వృత్తి సంబంధ మేదియు లేకుండ ఉండును గాన, ఆ వృత్తులను బట్టి కలుగు దుఃఖాదిభోగము కూడ ఉండదు. ఇదియే పురుషార్థము.

అవ. చిచ్ఛక్తి సహజముగ పరిశుద్ధమైనను దానికి వృత్తులతో సంబంధ మున్నంతవరకును దుఃఖాదిభోగరూపమగు అనర్థము కలుగునని చెప్పు చున్నాడు :

సూ. వృత్తిసారూప్యమితరత్ర. 4

ప్ర.అ. ఇతరత్ర=యోగము లేనపుడు, వృత్తిసారూప్యమ్= (పురుషునకు) చిత్తవృత్తితో సమానరూపత్వము.

వ్యా. ఘటాదివిషయములు సుఖదుఃఖమోహాత్మకములు. చిత్తమునకు ఆ ఘటాదులతో సంబంధమేర్పడినపుడు ఘటాద్యాకారవృత్తులు ఏర్పడును. చిత్తము (బుద్ధి) పురుషునకు సన్నిహితముగ ఉండుటచే దాని

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వృత్తులు (చిత్తవృత్తులు) పురుషునిలో (చైతన్యములో) ప్రతిబింబించును. జపాపుష్పము ప్రతిబింబించుటచే స్ఫటికము ఎట్లుగా కనబడినట్లుగా చిత్తవృత్తులు ప్రతిబింబించు ద్రష్టయగు పురుషుడు కూడ ఆ చిత్తవృత్తులతో తాదాత్మ్యమును చెందును. ఈ విధముగ విషయోపరక్తములగు, అనగా ఘటాదివిషయములతో సంబంధించిన చిత్తవృత్తులతో సంబంధించి యుండుటయే వృత్తిసారూప్యము. ఈ వృత్తిసారూప్య మున్నంతవరకును పురుషునకు సుఖదుఃఖభోగరూపమగు అనర్ధము కలుగును. ఈ విధముగ వృత్తికాలమునందు మాత్రమే పురుషునకు సుఖదుఃఖ భోగరూపమగు సంసారము కలుగును. ఆ వృత్తులు తొలగిపోయినచో కైవల్యము లభించును. అందుచేత వృత్తులను నిరోధింపవలెను అని భావము. –

మనకు విషయము అర్థమగుటకై జపాకుసుమస్ఫటికదృష్టాంతము చూపబడినది. దానినిబట్టి చిత్తవృత్తులు చైతన్యములో ప్రతిబింబించునని భావింప గూడదు. ఇక్కడ ప్రతిబింబమనగా అభిమానమని అర్థము. బుద్ధి పురుషునకు సన్నిహితముగ నుండుటచే పురుషుడు తనకును బుద్ధికిని ఉన్న భేదమును గ్రహింపజాలక (అభేదభ్రాంతిచే) చిత్తవృత్తులు తనవనుకొనుచున్నాడు. తాను కర్త కాకపోయినను కర్తననియు, భోక్త కాకపోయినను భోక్తననియు, దుఃఖాదులు కలవాడననియు, అనుకొనుచున్నాడు. బుద్ధి భోగ్యము, పురుషుడు భోక్త. దీనిని పట్టి బుద్ధిపురుషుల మధ్య స్వస్వామిభావసంబంధము ఏర్పడినది. స్వమ్ అనగా సొత్తు. స్వామి అనగా సొత్తు కలవాడు. ఈ సంబంధము అనాదియగు అవిద్యచే (అజ్ఞానముచే) కల్పితము. ఈ స్వస్వామిభావసంబంధము ప్రతినియతులగు బుద్ధిపురుషుల మధ్యనే ఉండును. అనగా ఒకానొక బుద్ధి ఒకానొక పురుషునకు స్వము; ఆ పురుషుడు ఆ బుద్ధికిమాత్రమే స్వామి. అందుచే ఒకరిబుద్ధి తన వృత్తులద్వారా మరొక పురుషునకు సుఖదుఃఖాదులను ఇవ్వజాలదు. ఉదాహరణకు – ఒకనివద్ద ఒక అయస్కాంతము ఉన్నది. అది ఆతని శరీరములో గ్రుచ్చుకొనిన ఇనుపశల్యమును పైకి లాగి ఆతనికి ఉపకరించుచున్నది. అందుచే అది ఆతనికి మాత్రమే భోగ్యము. అట్లే బుద్ధి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అయఃశల్యముల వంటి విషయములను గ్రహించి పురుషునకు సమర్పించి ఉపకరించుచున్నది. పురుషునకు తాను వేరు, బుద్ధి (చిత్తము) వేరు అను వివేకము కలిగినపుడు చిత్తవృత్తిసారూప్యము తొలగిపోవును. దుఃఖాదిభోగము అంతరించును. అదియే మోక్షము. (ఇది భావాగణేశ - నాగేశుల వ్యాఖ్యలలోని సారాంశము).

అవ. ఇపుడు వృత్తులెన్ని విధములు; వాటి స్వరూపమేమి? అను విషయమును చెప్పుచున్నాడు.

సూ. వృత్తయః పఞ్చతయ్యః క్లిష్టాక్లిష్టాః. 5

ప్ర.అ. వృత్తయః=వృత్తులు, పఞ్చతయ్యః=ఐదు అవయవములు కలవి. అనగా ఐదు విధములైనవి. క్లిష్టాక్లిష్టాః=అవి క్లిష్టములుగా గాని అక్లిష్టములుగా గాని ఉండును.

వ్యా. ఆ వృత్తులు రాబోవు సూత్రములో చెప్పనున్న విధమున ఐదు విధములు. అవి క్లిష్టములు కావచ్చును, అక్లిష్టములు కావచ్చును. తామసిక వృత్తులు క్లిష్టములు, సాత్వికరాజసికవృత్తులు అక్లిష్టములు అని భా.గ. వృత్తి.

ధర్మాధర్మవృద్ధిరూపమగు క్లేశమునకు హేతువులైనవి క్లిష్టములు. సత్త్వము(బుద్ధి)వేరు, పురుషుడు వేరు అను వివేకజ్ఞానము కలుగు సాధనములను గూర్చిన వృత్తులు అక్లిష్టములు. వీటికి "ఖ్యాతి" అని కూడ పేరు. క్లిష్టవృత్తులను అక్లిష్టవృత్తులు నిరోధించును. అక్లిష్టవృత్తులను పరవైరాగ్యము నిరోధించును. క్లిష్టాక్లిష్టములు రెండును కలిసి "క్లిష్టాక్లిష్టవృత్తులు" అను మూడవ భేదము కూడ ఉండునా అని ప్రశ్న. క్లిష్టవృత్తులమధ్య అక్లిష్టవృత్తులుత్పన మైనపుడు అవి క్లిష్టవృత్తులచే అభిభూతములు (అణచివేయబడినవి) కాక స్వసంస్కారపరిణామక్రమముచే అవియే క్లిష్టములను అభిభవించును. అందుచే చివరికి అక్లిష్టములే అగును. అందుచే మూడవ భేదము లేదు. (నాగే).

ఈ విధముగ వృత్తులచే సంస్కారములు జనించుచుండును. సంస్కారములచే వృత్తులు జనించుచుండును. ఈ వృత్తిసంస్కారచక్రము సకలవృత్తినిరోధయోగము లభించువరకును తిరుగుచునే ఉండును. చిత్తము

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నిరోధావస్థను చెందగనే అఖిలసంస్కారములును దగ్గములై చిత్తము కూడ ప్రలయము పొందును. (నాగే)

చిత్తము జీవించి ఉండుటకు ఈ వృత్తులే ఆధారము గాన, ఈ వృత్తులు నశించినచో చిత్తము కూడ నశించును గాన, వీటికి వృత్తులు (జీవనాధారములు) అను పేరు పెట్టబడినది. (నాగే).

అవ. ఆ పంచవిధవృత్తులేవియో చెప్పుచున్నాడు :

సూ. ప్రమాణవిపర్యయవికల్పనిద్రాస్మృతయః. 6

ప్ర.అ.ప్రమాణవిపర్యయవికల్పనిద్రాస్మృతయః=ప్రమాణము,విపర్యయము, వికల్పము, నిద్ర, స్మృతి అని ఆ ఐదు వృత్తుల పేర్లు.

అవ.ఇపుడు ప్రమాణాదిపంచవృత్తుల లక్షణములను రాబోయే ఐదు సూత్రములలో చెప్పుచున్నాడు :

సూ. ప్రత్యక్షానుమానాగమాః ప్రమాణాని. 7

ప్ర.అ. ప్రత్యక్షానుమానాగమాః=ప్రత్యక్షము, అనుమానము, ఆగమము అనునవి ప్రమాణాని=ప్రమాణములు.

వ్యా. అంతవరకును తెలియని విషయములు తెలియుటకు "ప్రమ" అని పేరు. అట్టి ప్రమకు సాధనమైనది "ప్రమాణము" అని పై మూడు ప్రమాణములకును సమన్వయించు సామాన్యలక్షణము. చక్షురాదీంద్రియములు విషయములతో సంబంధించినపుడు మనస్సు కూడ ఆ ఇంద్రియములతో కలిసి వెళ్ళి విషయముల కెట్టి ఆకారమున్నదో అట్టి ఆకారమును పొందును. చిన్న బోదెల ద్వారా ప్రవహించు జలము మొక్కల కుదుళ్ళలోనికి వెళ్లి అవి ఏ ఆకారములో నున్నవో ఆ ఆకారమును పొందినట్లు మనస్సు ఆ యా విషయముల ఆకారమును పొందును. ఈ విధముగ ఇంద్రియముల ద్వారా గాని తనంత తానుగా గాని మనస్సు విషయములతో సంబంధించినపుడు ఆ యా విషయముల విశేషరూపము నిశ్చితముగ తెలియును. ఇట్టి నిశ్చితజ్ఞానము నకు కరణమైన వృత్తి (మనః పరిణామము) ప్రత్యక్షము. ఈ చిత్తవృత్తి తన దగ్గరనే ఉన్న చిదాత్మలో

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్రతిబింబించుటచే కలిగిన ఫలము ఈ ప్రత్యక్షజ్ఞానము. అందుచే ఈ జ్ఞానము చిదాత్మకు (పురుషునకు) కలుగుచున్నదని చెప్పబడుచున్నది. పురుషుడు నిత్యశుద్ధజ్ఞానస్వరూపుడే అయినను ఈ చిత్తవృత్తిసంబంధము ద్వారా విషయసంబంధము పొందుచున్నాడు.

ధూమాదిలింగముల దర్శనముచే వహ్నిజ్ఞానమునకు కరణమగు ఒక చిత్తవృత్తి కలుగుచున్నది. అది అనుమానము. యథార్థవక్తయగు ఆప్తుడు చెప్పిన వాక్యమును వినగనే ఆ యా విషయముల జ్ఞానమునకు హేతువగు చిత్తవృత్తి కలుగు చున్నది. అది శబ్దప్రమాణము.

ప్రత్యక్షప్రమాణమువలన కలుగు జ్ఞానము విశేషరూపమున ఉండును. ఉదా. కంటితో ఘటాదివస్తువులను చూచినపుడు వాటి రంగు, ప్రమాణము అది ఉన్న ప్రదేశము మొదలగు విశేషము లన్నియు స్పష్టముగా తెలియును. కాని అనుమానశబ్దప్రమాణములవలన ఆ యా పదార్థముల జ్ఞానము సామాన్య రూపమున మాత్రమే కలుగును. ఉదా – ధూమము చూచినపుడు వహ్ని ఉన్నట్లు జ్ఞానము కలుగును గాని అది ఎట్లున్నది, పొడవుగా ఉన్నదా, వంకరగా ఉన్నదా, ఏ రంగులో ఉన్నది ఇత్యాది విశేషములు తెలియవు. ఇట్లే "నద్యాస్తీరే ఫలాని సన్తి" (నదీతీరమున పండ్లున్నవి) అను ఆప్తవాక్యమును వినగానే పండ్లు ఉన్నవి అని మాత్రమే సామాన్యముగ తెలియును. అవి ఏ కొమ్మలమీద ఉన్నవి. ఎట్లున్నవి; ఏ ప్రమాణములో ఉన్నవి అను విశేషములు తెలియవు.

ప్రమాతృప్రమాణాదుల స్వరూపము ఈ క్రిందికారికలలో స్పష్టీకరింప బడినది.

"ప్రమాతా చేతనః శుద్ధః ప్రమాణం వృత్తిరేవ చ,
ప్రమార్థాకారవృత్తీనాం చేతనప్రతిబిమ్బనమ్.
ప్రతిబిమ్బితవృత్తీనాం విషయో మేయ ఉచ్యతే,
వృత్తయః సాక్షిభాస్యాః స్యుః కరణస్యానపేక్షణాత్.
సాక్షాద్దర్శనరూపం చ సాక్షిత్వం సాంఖ్యసూత్రితమ్,
అవికారేణ ద్రష్టృత్వం సాక్షిత్వం చాపరే జగుః".

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శుద్ధచైతన్యము ప్రమాత(తెలుసుకొనునది). వృత్తి ప్రమాణము (భ్రమకు సాధనము) ఆ యా విషయముల రూపములలో చిత్తము పరిణమించగా ఏర్పడిన (చిత్త)వృత్తులు చైతన్యమునందు ప్రతిబింబించుటయే ప్రమ (యథార్థ జ్ఞానము). ఈ విధముగ ప్రతిబింబించిన వృత్తులకు విషయములుగా ఉన్న పదార్థములు మేయములు (తెలియదగినవి) పదార్థములను చిత్తవృత్తులు భాసింపచేయ, ఆ చిత్తవృత్తులను ఆత్మచైతన్యమే భాసింపచేయును. మరొక్క సాధనమేదియును మధ్య ఉండదు. అందుచే వృత్తులు సాక్షిభాస్యములు. సాంఖ్యులు ఆత్మ సాక్షియని చెప్పుదురు. దీని అర్థమేమనగా ఇతరసాధనాపేక్ష ఏమియు లేకుండ సాక్షాత్తుగా చూడగల్గుటయే. ఎట్టి వికారమును లేకుండ చూడగల్గుటయే సాక్షిత్వమని మరికొందరు అనిరి అని ఈ కారికల భావము.

ఈ విధముగ రూపాదివిషయములతో కూడిన వృత్తులు, సుఖాదిమతు లగు భార్యాదులవలె, పురుషునకు భోగ్యములు అని చెప్పుదురు.

సూ. విపర్యయో మిథ్యాజ్ఞానమతద్రూపప్రతిష్ఠమ్. 8

ప్ర.అ. అతద్రూపప్రతిష్ఠమ్=ఏది భాసించుచున్నదో దాని రూపము లేనిది ఆధారముగా గల, మిథ్యాజ్ఞానమ్=మిథ్యాజ్ఞానము, విపర్యయః= విపర్యయము.

వ్యా. విపర్యయము అను దానికి **మిథ్యాజ్ఞానమ్** అనునది లక్షణము. **మిథ్యా** అను పదమునకు వివరణము "అతద్రూపప్రతిష్ఠమ్" అనునది. ఘటమును చూచినపుడు "ఇది ఘటము" అను జ్ఞానము కలిగినచో అచట ఆ జ్ఞానము తనలో ఏ వస్తువు (ఘటము) భాసించుచున్నదో దానినే ఆధారముగ చేసికొని పుట్టినది. అందుచే అది మిథ్యాజ్ఞానము(భ్రమ)కాదు. తాడును చూచి- నపుడు ఇది సర్పము అను జ్ఞానము కలిగినచో, ఆ జ్ఞానము తనలో భాసించు చున్న సర్పమునకు ఏ రూపమున్నదో దానికంటే భిన్నమైన రూపము గల త్రాడుపై ఆధారపడియున్నది గాన అది అతద్రూపప్రతిష్ఠము; మిథ్యా జ్ఞానము.

ఈ విధములగు భ్రమస్థలములలో జ్ఞానాకారము అనగా చిత్తవృత్తి, ఎదుటనున్న పదార్థముపై ఆరోపింపబడుచున్నది. సర్పము అను చిత్తవృత్తి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

త్రాడుపై ఆరోపింపబడుచున్నది. అందుచే యోగమతమున భ్రమాది స్థలములలో అన్యథాఖ్యాతియే కాని సాంభ్యోక్తమగు అవివేకమాత్రము కాదు.

"విప్ర పృథ్వ్యాది చితస్థం న బహిష్ఠం కదాచన,
స్వప్నభ్రమమదాద్యేషు సర్వైరేవానుభూయతే".

అను స్మృతివాక్యము కూడ ఈ విషయమునే చెప్పుచున్నది. "ఓ బ్రాహ్మణుడా; స్వప్నము, భ్రమ, మదము మొదలగు అవస్థలలో అందరును తమ చిత్తము నందు మాత్రమే ఉన్న పృథివ్యాదికమును చూచుచున్నారు గాని బైటనున్నదాని నెన్నడును చూచుట లేదు" అని దీని భావము.

వైశేషికాదులు అంగీకరించిన అన్యథాఖ్యాతికిని ఈ అన్యథాఖ్యాతికిని కొంచెము భేదమున్నది. వారి సిద్ధాంతములో ముత్యపుచిప్పను చూచి ఇది వెండి అని భ్రాంతి కలిగినపుడు ఎచటనో ఆపణాదులలో ఉన్న వెండిని ఎదుట నున్న ముత్యపుచిప్పపై ఆరోపించుట జరుగుచున్నది. కాని ఈ సిద్ధాంతము ప్రకారము చిత్తములోనున్న వెండియే ఎదుట నున్న వస్తువుపై ఆరోపింపబడుచున్నది.

సూ. శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్పః 9

ప్ర.అ. శబ్దజ్ఞానానుపాతీ=శబ్దము జ్ఞానము అనునవి అనుసరించునవిగా గలదియు, అనగా దేనిని అనుసరించి శబ్దము, జ్ఞానము కలుగునో అట్టిదియు, వస్తుశూన్యః=వస్తుశూన్యమైనదియు అగు వృత్తివిశేషము, వికల్పః=వికల్పము.

వ్యా. "శబ్దం చ జ్ఞానం చ= శబ్దజ్ఞానే; శబ్దజ్ఞానే అనుపాతినీ యస్య సః శబ్దజ్ఞానానుపాతీ" అని విగ్రహము. వస్తువు లేకపోయినను కలుగు వృత్తివిశేషము వికల్పము. ఈ వృత్తిని అనుసరించి శబ్దప్రయోగము, పదార్థజ్ఞానము కలుగును అని అర్థము. ఇది భావాగణేశవృత్తిననుసరించిన వ్యాఖ్యానము. నాగేశుడు వ్యాసభాష్యమును, దాని వ్యాఖ్యయగు తత్త్వవైశారదిని అనుసరించి "శబ్దజ్ఞానాను పాతీ" అనుదానికి "శబ్దజ్ఞానమును అనుసరించి, దానివలన పుట్టినది" అని అర్థము వ్రాసినాడు. "శబ్దస్య జ్ఞానం శబ్దజ్ఞానమ్; శబ్దజ్ఞానమ్ అనుపతతీతి శబ్దజ్ఞానానుపాతీ" అని విగ్రహము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"వన్ధ్యాసుతః, ఖపుష్పమ్" ఇత్యాదిపదములను ప్రయోగించినపుడు గొడ్రాలికి కుమారుడు, ఆకాశమునందు పూచిన పువ్వు అను వస్తువులు లేకున్నను ఆ పదములను వినగానే అట్టి అత్యంతాసద్రూపములగు పదార్థముల జ్ఞానము కలుగుచున్నది. ఇట్టి జ్ఞానమునకు హేతువగు చిత్తవృత్తి వికల్పము.

"అత్యన్తాసత్యపిహ్యర్థే జ్ఞానం శబ్దః కరోతి హి"

అని వాక్యపదీయమున చెప్పబడినది. "అత్యంతము లేని పదార్థము జ్ఞానమును కూడ శబ్దము కలిగించును" అని దీని భావము. నాగేశుని వ్యాఖ్య దీనికి అనుగుణముగనున్నది.

ఇట్టి శబ్దములతో కూర్చిన ఈ క్రింది శ్లోకము ప్రసిద్ధము.

ఏష వన్ధ్యాసుతో యాతి ఖపుష్పకృతశేఖరః,
మృగతృష్ణామ్భసి స్నాతః శశశృఙ్గధనుర్ధరః.

వైశేషికాదులు ఈ వికల్పమును ఆహార్యజ్ఞానమందురు. పదార్థము లేక పోయినను కావలెనని తెచ్చి పెట్టుకొనిన జ్ఞానము ఆహార్యజ్ఞానము. **దేవదత్తస్య కమ్బలః** అన్నట్లు **పురుషస్య చైతన్యమ్** అనుచుందుము. కాని దేవదత్తుడు వేరు, కంబళము వేరు అన్నట్లు పురుషునికంటె చైతన్యము వేరు కాదు. లేని భేదమును ఆరోపించి చేయు ఇట్టి ప్రయోగములు వికల్పమునకు ఉదాహరణము. (భో.వృ.).

సూ. అభావప్రత్యయాలమ్బనా వృత్తిర్నిద్రా. 10

ప్ర.అ. అభావప్రత్యయాలమ్బనా=వృత్తుల అభావమునకు అనగా వృత్తులు కలుగకుండుటకు కారణమైన తమస్సు విషయముగా గల, వృత్తిః= వృత్తి, నిద్రా=నిద్ర. నిద్రలో బాహ్యవస్తువిషయకములగు వృత్తులేవియు కలుగవు. అట్లు కలుగకుండుటకు కారణము తమస్సు. తమస్సు బుద్ధిని ఆవరించి ఉండుటచే వృత్తులు కలుగుట లేదు. అట్టి తమస్సుచే ఆవృతమగు చిత్తము (చిత్తమును ఆవరించు తమస్సు) విషయముగా గల వృత్తి నిద్ర.

జాగ్రత్స్వప్నములకు సంబంధించిన వృత్తులన్నియు ఉపరతమైనపుడు చిత్తమునందు స్వగతసుఖాదులకు సంబంధించిన నిద్ర అను వృత్తి కలుగును. అందుచేత చిత్తమునందు బాహ్యవృత్తులు లేకపోయినను

In Public domain. Digitization Muthulakshmi Research Academy

స్వగతసుఖాదివిషయక వృత్తి ఉండును. అది సాత్వికమైనచో సుఖానుభవము (సుషుప్తిలో) కలుగునని ఊహించుటకు వీలున్నది. అందుచేతనే "సుఖమహమస్వాప్సం, ప్రసన్నం మే మనః" అనియు, "దుఃఖమహమస్వాప్సమ్, అకర్మణ్యం మే మనః, యతో భ్రమత్యనవస్థితమ్" అనియు, "మూఢోఽహమస్వాప్సమ్; గురూణి మే గాత్రాణి, అలసమివ మే చిత్తమ్" అనియు నిద్రించి మేల్కొన్నవానికి స్మృతి కలుగు చున్నది. అనుభవము లేనిచో స్మృతి ఉండదు కదా? కావున నిద్రను కూడ వృత్తి అని అంగీకరించవలెను. కొందరు చెప్పినట్లు నిద్ర వృత్తి కాదని అనరాదు అని సూచించుటకై ఈ సూత్రములో మరల 'వృత్తిః' అనుపదము ప్రయోగింపబడినది.

సూ. అనుభూతవిషయాసంప్రమోషః స్మృతిః. 11

ప్ర.అ. అనుభూతవిషయాసంప్రమోషః = అనుభవింపబడిన విషయముల అపహారము లేని వృత్తి విశేషము, స్మృతిః=స్మృతి.

వ్యా. పూర్వమొకప్పుడు ఘటమును చూచినపుడు (చక్షురింద్రియఘట ముల సంబంధముచే) ఘటాకారమగు వృత్తి కలిగి "ఇది ఘటము" అను జ్ఞానము కలిగినది. కొంతకాలము తరువాత "ఆ ఘటము" (ఆనాడు ఆ ఘటమును చూచితిని కదా) అను చిత్తవృత్తి కలుగుచున్నది. పూర్వము "ఇది ఘటము" అను జ్ఞానము కలిగినపుడు ఏ చిత్తవృత్తి, దానిలో విషయమైన ఘటరూపపదార్థమును ఉండెనో ఆ రెండును ఈనాడు కలిగిన "ఆ ఘటము" అను జ్ఞానములో భాసించుచున్నవి గాన, తొలగిపోకుండ ఉన్నవి గాన, ఇది ("ఆ ఘటము"అనునది) స్మృతి. "అనుభూతౌ చ తౌ విషయౌ చ అనుభూతవిషయౌ" అనగా పూర్వము ఘటదర్శనసమయమున అనుభవింపబడిన చిత్తవృత్తి, దానిలో విషయమైన పదార్థము అని అర్థము. "అనుభూతవిషయయోః అసంప్రమోషః అనుభూత విషయాసంప్రమోషః". ఆ రెండింటిలో ఏ ఒక్కటి యు అపహరింప బడకుండుట అని అర్థము. పూర్వము దేని జ్ఞానము కలిగినదో ఆ పదార్థమే మరల బుద్ధి గోచరమైనచో స్మృతి అని అర్థము. ఇది భా.గ. వ్యాఖ్య.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వాచస్పతిమిశ్రానుసారముగా నాగేశుడు దీనిని మరొక విధముగ వ్యాఖ్యానించినాడు. సంప్రమోషమనగా స్తేయము; అనగా అధికముగ కూడ బెట్టుట. అనుభవింపబడిన విషయముకంటె అధికముగ పరిగ్రహింపని వృత్తి స్మృతి అని సూత్రమునకు అర్థము. అనగా అనుభవములో ఏ విషయమున్నదో అదియే స్మృతిలో విషయముగా ఉండును. దానికంటె తక్కువగా ఉండవచ్చును గాని అధికముగా మాత్రముండదు అని భావము. భా.గ. వ్యాఖ్యానమే సూత్రాక్షరానుగుణముగ నున్నట్లు కనబడుచున్నది.

ఈ వృత్తులన్నియు సుఖదుఃఖమోహాత్మకములు గాన క్లేశరూపములే. అందుచే వాటిని అన్నింటిని నిరోధించవలెను.

అవ. ఇపుడు వృత్తులను నిరోధించుటకు ఉపాయమును చెప్పుచున్నాడు:

సూ. అభ్యాసవైరాగ్యాభ్యాం తన్నిరోధః. 12

వ్యా. అభ్యాసవైరాగ్యములనగా ఏమో రాబోవు సూత్రములలో స్పష్టము కాగలదు. చిత్తమనెడు నదికి సంబంధించిన వృత్తులనెడు నిరంతరప్రవాహము విషయముల వైపు పోవుచుండగా వైరాగ్యము దానిని అడ్డుకొనును. వివేకదర్శన మునకై చేయు అభ్యాసముచే వివేకమార్గము వైపు ప్రవహించు వృత్తిప్రవాహము జనించును. అపుడు ఏ వస్తువు ధ్యానింపబడుచున్నదో తదాకారవృత్తుల ప్రవాహము బలీయమై, దృఢమగును. ఈ విధముగ బాహ్యవిషయములనుండి మరల్చబడిన చిత్తవృత్తులు అంతర్ముఖములగుటచే ఆ వృత్తులు చిత్తములో సంస్కారమాత్రశేషములుగ ఉండును. అపుడు చిత్తనది నిరోధరూపమగు కైవల్య సముద్రములో విలీనమగును.

చిత్తమును స్థిరము చేసికొనుటకు ఉపాయము అభ్యాసవైరాగ్యములే అను విషయము : అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్
అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే (భ.గీ.6.35)
అని భగవద్గీతలో కూడ చెప్పబడినది.

అవ. అభ్యాసమనగా ఏమి? లక్షణము చెప్పుచున్నాడు :

సూ. తత్ర స్థితౌ యత్నోఽభ్యాసః. 13

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ. తత్ర=వాటిలో, స్థితౌ=చిత్తస్థైర్యమునందు, యత్నః= ప్రయత్నము, అభ్యాసః=అభ్యాసము.

వ్యా. వివేకము కలుగునంతవరకును చిత్తస్థైర్యమును సాధించుటకై అందుకు ఉపకరించు శ్రద్ధావీర్యస్మృతిప్రజ్ఞారూపసాధనములను నిరంతరము అనుష్ఠించుట అభ్యాసము అని అర్థము.

అవ. అభ్యానము ఎట్లు దృఢముగ ఉండునో చెప్పుచున్నాడు –

సూ. స తు దీర్ఘకాలనైరన్తర్యసత్కారాసేవితో దృఢభూమిః. 14

ప్ర.అ. సః తు=ఆ అభ్యాసమైతే, దీర్ఘకాలనైరన్తర్యసత్కార ఆసేవితః= దీర్ఘకాలముచేతను, నిరంతరత్వముచేతను, సత్కారములచేతను సేవింప బడినచో, దృఢభూమిః=దృఢమైన భూమి (స్థితి) కలది అగును.

వ్యా. ఈ అభ్యాసము దృఢము కావలెనన్నచో దానిని చాలకాలమువఱకు నిరంతరము చేయవలెను. తపస్సు, బ్రహ్మచర్యము, శ్రద్ధ మొదలగు సత్కారములతో చేయవలెను. అపుడే వ్యుత్థానసంస్కారము (చిత్తములో దాగి యున్న బాహ్యవిషయముల వైపు ప్రసరించు ప్రవృత్తి) దానిని బాధింపజాలదు. సత్కారమనగా ఆదరము అని భోజవృత్తి.

అవ : యోగమునకు హేతువులగు రెండు విధములైన వైరాగ్యములలో అపరవైరాగ్యమును గూర్చి మొదట చెప్పుచున్నాడు :

సూ. దృష్టానుశ్రవికవిషయవితృష్ణస్య వశీకారసంజ్ఞా వైరాగ్యమ్. 15

ప్ర.అ. దృష్ట–ఆనుశ్రవిక–విషయ–వితృష్ణస్య=ఇహలోకములో చూడబడినవియు, వేదాదుల ద్వారా వినబడినవియు అగు భోగ్యవిషయము లందు ఆసక్తి లేని చిత్తమునకు కలుగు, వశీకారసంజ్ఞా=వశీకారసంజ్ఞ, వైరాగ్యమ్= యోగమునకు హేతేవైన అపరవైరాగ్యము.

వ్యా. అపరవైరాగ్యము, పరవైరాగ్యము అని వైరాగ్యము మొదట రెండు విధములు. అందు, అపరవైరాగ్యము **యతమానసంజ్ఞ, వ్యతిరేకసంజ్ఞ, ఏకేన్ద్రియసంజ్ఞ, వశీకారసంజ్ఞ** అని నాలుగు విధములు. ధనమునకు సంబంధించిన–సంపాదించుట, రక్షించుట, వినాశము మొదలైన కష్టములను గ్రహించుట, హింసాదిదోషములను తెలిసికొనుట మొదలగునవి వైరాగ్య

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సాధనములు. వాటిని జ్ఞానపూర్వకముగ అనుష్ఠించుట "యతమానసంజ్ఞా" అను వైరాగ్యము. ఈ ఇంద్రియములను జయించినాను, ఇక ఈ ఇంద్రియములను జయింపవలసి ఉన్నది అను వ్యతిరేకావధారణము "వ్యతిరేకసంజ్ఞా" అను వైరాగ్యము. బాహ్యములైన ఇంద్రియవిషయములపై రాగద్వేషములు తొలగి పోయిన పిమ్మట ఇక మిగిలిన ఒక ఇంద్రియమైన మనస్సులో ఉండెడు, మానాపమానాదులను గూర్చిన రాగద్వేషములను గూడ తొలగించుకొనుట "ఏకేంద్రియసంజ్ఞా" అను వైరాగ్యము. ఈ మూడు వైరాగ్యములను అభ్యసించిన వానికి విషయములు (భోగ్యవస్తువులు) సన్నిహితములైనను వాటి విషయమున దోషదర్శనము నిర్విఘ్నముగ కలుగును. ఇవే నాకు వశ్యములు కాని నేను వీటికి వశ్యుడను కాను అను బుద్ధి కలుగును. అదియే "వశీకారసంజ్ఞా" అను వైరాగ్యము.

రాగము లేనంతమాత్రమున అది వైరాగ్యము కాజాలదు. విషయములు దగ్గర లేనపుడు వాటిపై రాగముండదు గాన అట్టివాడు కూడ విరక్తుడని చెప్పవలసి వచ్చును. అట్లే మొదటి మూడు వైరాగ్యములున్నవానికి కూడ విషయసాంనిధ్యమునందు యోగభ్రంశము కలుగును. అందుచేత నాల్గవ వైరాగ్యమే యోగహేతువు.

అవ : పరవైరాగ్యమునకు లక్షణము చెప్పుచున్నాడు:-

సూ. తత్పరం పురుషఖ్యాతేర్గుణవైతృష్ణమ్. 16

ప్ర.అ. పురుషఖ్యాతేః=గుణములకంటె భిన్నుడైన పురుషుని జ్ఞానము వలన కలుగు, గుణవైతృష్ణ్యమ్=ఆత్మోపకరణములైన సమస్తగుణములందును, గుణరూపమైన సత్త్వపురుషభేదజ్ఞానమునందును కూడ ఆసక్తి లేకపోవుట, పరమ్=పరమైన, తత్=ఆ వైరాగ్యము.

వ్యా. అపరవైరాగ్యవంతునకు, "గుణములు వేరు పురుషుడు వేరు" అను దృఢమైన వివేకజ్ఞానము కలుగును. ఇట్టి వివేకజ్ఞానమునకు "ధర్మమేఘ సమాధి" అని పేరు. ఇది కలిగినవానికి ఇంతవరకును ఉపకరణములుగా ఉన్న సకలగుణములవిషయమునందును వైరాగ్యము కలుగును. అంతే కాక గుణరూప మైన సత్త్వపురుషాన్యతాఖ్యాతియందు (చిత్తాదికము వేరు,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పురుషుడు వేరు అను జ్ఞానమునందు) కూడ వైరాగ్యము కలుగును. దృఢమైన వివేకము కలిగినవానికి దృష్టానుశ్రవికవిషయములందే కాక వివేకఖ్యాతియందు కూడ అలంబుద్ధి (చాలును అను బుద్ధి) కలిగి-"పొందతగినదానిని పొందితిని. క్షీణింపచేయదగిన క్లేశములను క్షీణింపచేసికొంటిని. ఇక ఈ వివేకఖ్యాతికూడ నాకు అవసరము లేదు" అను బుద్ధి కలుగును. అనగా జ్ఞానముయొక్క అత్యున్నతస్థితియే ఈ పరవైరాగ్యము.

దృష్టానుశ్రవికవిషయములు అన్నియు నశించు స్వభావము కలవి అను జ్ఞానము కలుగుటచే అపరవైరాగ్యము కలుగును. కాని పురుషసాక్షాత్కారము కలుగుటకు ఉపకరించు సాధనములందును జ్ఞానమునందును ఆసక్తి ఉండును. పిమ్మట జ్ఞానముచే అవిద్య నివర్తించగా ఆత్మసాక్షాత్కారము చెంది ఆత్మతృప్తుడైన వానికి జ్ఞానతత్సాధనములందు కూడ వైరాగ్యము కలుగును. ఇది పరవైరాగ్యము. ఈ పరవైరాగ్యము కలిగిన పిమ్మటనే అసంప్రజ్ఞాతసమాధియు, కైవల్యమును లభించును.

ఈ సూత్రములోని "పురుషఖ్యాతే!" అనుదానికి భా.గ. వృత్తిలో "ఆత్మద్వయాన్యతరసాక్షాత్కారాద్ధేతో" అని అర్థము చెప్పబడినది. దీనికి- "రెండు ఆత్మలలో ఒకదాని సాక్షాత్కారము కలుగుటవలన" అని అర్థము. రెండు ఆత్మలనగా జీవాత్మపరమాత్మలని అర్థమై ఉండును. కాని ఈ పదమునకు నాగేశుడు "దృఢతరగుణపురుషవివేకజ్ఞానాత్" అని అర్థము వ్రాసెను. "గుణములు వేరు పురుషుడు వేరు అను దృఢమైన జ్ఞానము కలుగుటవలన" అని దాని అర్థము. భోజవృత్తిలోకూడ ఈ అర్థమే ఉన్నది. మొదటిది అక్షరార్థము, రెండవది భావార్థము. వ్యాసభాష్యములో మాత్రము "పురుషదర్శనాభ్యాసాత్" అను అర్థము వ్రాయబడినది. "నిరంతరపురుషసాక్షాత్కారమువలన" అని దాని అర్థము. గుణపురుషవివేకమువలననే పురుషదర్శనము కలుగునన్నట్లు ఆ భాష్యములో తరువాత సూచింపబడినది. భా.గ. 'ఆత్మద్వయ' అనుటకు ఆధార మేదియో తెలియదు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ : ఇంతవరకును యోగమునకు కావలసిన ప్రకృష్టసాధనములను చెప్పి ఇప్పుడు కొన్ని సూత్రములలో యోగభేదములను వివరించుచున్నాడు :

సూ. వితర్కవిచారానన్దాస్మితానుగమాత్సంప్రజ్ఞాతః. 17

ప్ర.అ.వితర్క–విచార–ఆనన్ద–అస్మితా అనుగమాత్=వితర్కము, విచారము, ఆనందము, అస్మిత అనెడు సాక్షాత్కారభేదములతో ఉపధానము వలన, అనగా వాటి సంబంధమువలన, సంప్రజ్ఞాతః=సంప్రజ్ఞాతసమాధి నాలుగు విధములు.

వ్యా. సమ్యక్=సంశయ విపర్యయములు లేకుండుగ, యేన=దేనిచేత, ప్రజ్ఞాయతే=భావించబడుచున్న దాని స్వరూపము చక్కగా తెలియబడుచున్నదో, అది "సంప్రజ్ఞాతము" అని విగ్రహము. (సమ్యక్ ప్రజ్ఞాయతే యేన సః సంప్రజ్ఞాతః). సంప్రజ్ఞాతమనునది ఒక భావనావిశేషము. విషయాంతరములేవియు అడ్డు తగలకుండ చూచుకొనుచు ఒక భావ్యమును భావింపబడు పదార్థమును మాటి మాటికిని మనస్సునందు నిలుపుట భావన. ఈ భావనావిశేషరూపమైన సంప్రజ్ఞాతసమాధి "సవితర్కము", "సవిచారము", "సానందము", "సాస్మిత" అని నాలుగు విధములని అర్థము.

ఒక ఎత్తైన భూమికపై ఎక్కుటకు మెట్లు ఏ విధముగ ఉపయోగించునో ఈ వితర్కాదులు నిరోధమును సాధించుటకు క్రమరూపముగ ఉపయోగించును. అందుచే సంప్రజ్ఞాతసమాధిని సాధించుటకు ఈ వితర్కాదులను ఆ క్రమమునందే అనుసరింపవలెను. ఎవ్వడైన మహాపురుషుడు ఈశ్వరప్రసాదాదులచే మొట్ట మొదటనే ఆ ఉత్తమభూమికను అందుకొనగలిగినచో ఆతనికి ఈ క్రింది భూమి కలతో (అంతస్తులతో–మెట్లతో) పని లేదు.

సాంఖ్యయోగాదిసిద్ధాంతముల ప్రకారము ఈ ప్రపంచమంతయు పంచ వింశతి (25) తత్త్వాత్మకము. ప్రకృతి, పురుషుడు అనునవి నిత్యమైన తత్త్వములు. ప్రకృతి సర్వజగన్మూలకారణము. ఇది పురుషుని (జీవుని) భోగమునకై జగత్సృష్ట్యాదికము చేయుచుండును. ప్రకృతినుండి మహత్తత్త్వము

In Public domain. Digitization Muthulakshmi Research Academy

(బుద్ధి), దాని నుండి అహంకారము జనించును. ప్రకృతి సత్త్వరజస్తమో-గుణాత్మకము. అందుచేత దానినుండి పుట్టిన బుద్ధ్యాహంకారాదులు కూడ త్రిగుణాత్మకములే. సత్త్వగుణప్రధానమై "సాత్త్వికము" లేదా "వైకారికము" అను పేరు గల అహంకారము నుండి ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, మనసు జనించును. తమః ప్రధానమైన అహంకారమునకు 'తామసము' లేదా 'భూతాది' అని పేరు. దీనినుండి పంచసూక్ష్మభూతములు, (వీటికే భూతతన్మాత్ర అని పేరు) జనించును. రజోగుణప్రధానమై రాజసము లేదా 'తైజసము' అని చెప్పబడు అహంకారము సాత్త్వికతామసములకు తమ కార్యములను సృజింజగల శక్తిని ఇచ్చుచుండును. ఇది సాంఖ్యకారికలో చెప్పిన వాచస్పత్యాదులు అంగీకరించిన సృష్టివిధానము. కాని విజ్ఞానభిక్షువు సాత్త్వికాహంకారమునుండి మనసు మాత్రమే ఆవిర్భవించినదనియు, రాజసాహంకారమునుండి దశేంద్రియములును, తామసాహంకారము నుండి పంచతన్మాత్రలును జనించెననియు చెప్పును. ఐదు సూక్ష్మభూతములనుండి ఐదు స్థూలభూతములు జనించినవి. ఈ విధముగ తత్త్వములు ఇరువదియైదు.



In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఈ ఇరవై నాలుగు తత్త్వములును జడములే, పురుషుడు (జీవుడు 25వ తత్త్వము) మాత్రము చైతన్యస్వరూపుడు. ఈశ్వరుడు ఇరువది ఆరవ తత్త్వము. ప్రాచీనసాంఖ్యులు ఈశ్వరుని అంగీకరించకపోయినను, తరువాతి సాంఖ్యులును, యోగులును ఈశ్వరుని అంగీకరించినారు. ఈ ఇరువదియారు తత్త్వముల సంఘాతమే జగత్తు.

సాధకుడు చతుర్భుజాదులశరీరమును గాని, సర్వజగద్రూపమైన విరాట్ శరీరమును గాని, పురుషేశ్వరసహితమగు తన శరీరమునే గాని ఆలంబనముగా చేసికొని చిత్తము నిలపవలెను. అట్లు చేయగా చేయగా కొంత కాలమునకు ఆ ఆలంబనమునందలి స్థూలమహాభూతేంద్రియములలో ఉన్న అశేషవిశేషముల సాక్షాత్కారము కలుగును. భూతభవద్భవిష్యత్కాలములకు సంబంధించినవి, వ్యవహితములు, సుదూరములు అయిన విశేషములన్నియు తెలియును. ఎన్నడును చూడని, వినని గుణదోషముల జ్ఞానము కలుగును. ఇట్లు స్థూల భూతేంద్రియములకు సంబంధించిన అశేషవిశేష సాక్షాత్కారమునకు వితర్కమని పేరు. ఇదియే ఇంతవరకును చేసిన చిత్తవృత్తినిరోధమునకు ఫలము. ఇట్టి ఫలముతో కూడిన చిత్తవృత్తినిరోధమునకు వితర్కానుగత (లేదా సవితర్క) సంప్రజ్ఞాతమని పేరు. ఇది మొదటి భూమిక. ప్రారంభములో వినినవాటిని చూచినవాటిని గూర్చి భావన చేయగా చేయగా ఆ యోగబలముచే క్రమ క్రమముగ వినని చూడనివి కూడ సాక్షాత్కరించును. జపాదులు చేయుటచే ఆ యా దేవతల సాక్షాత్కారము కలుగును. ధ్రువాదులకు చతుర్భుజాది సాక్షా త్కారము కలిగినట్లు పురాణప్రసిద్ధము. ఆ సాక్షాత్కారమునకు, ఇక్కడ చెప్పిన ఈ యోగిసాక్షాత్కారమునకు భేదమున్నది. అచట తపోజపాదులచే సంతోషించిన పరమేశ్వరుడు స్వయముగ శరీరము దాల్చి, వారి ఎదుట ప్రత్యక్షమై సంభాషణాదికము చేయును. యోగులు తమ యోగబలముచే వైకుంఠశ్వేత ద్వీపాదులలో ఉన్న చతుర్భుజాది శరీరమును తామున్నచోటనుండియే చూడగల్గుదురు. ఆ శరీరమునందలి బాహ్యాభ్యంతర-అతీతానాగత గుణదోషాదికమును కూడ చూడగల్గుదురు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఇట్లు స్థూలముపై మనస్సు నిల్పి సవితర్కసంప్రజ్ఞాతమును సాధించిన సాధకుడు అందలి దోషములను గుర్తించినవాడగుటచే మనస్సును స్థూలము నుండి సూక్ష్మము వైపు మరల్చును. తాను గ్రహించిన ఆలంబనమునందలి భూతేంద్రియములకు కారణములై వాటితో సంబంధించిన తన్మాత్ర-అహంకార- ప్రకృతిరూపసూక్ష్మపదార్థములపై క్రమముగ చిత్తమును నిలుపును. అపుడు ఆతనికి సూక్ష్మతత్త్వములకు సంబంధించిన అశేషవిశేషములును సాక్షాత్క రించును. ఈ సాక్షాత్కారమునకు "విచారము" (అనగా విశేషించి సూక్ష్మము వైపు చరించుట) అని పేరు. ఏతదుపహితమైన సమాధి **సవిచారసంప్రజ్ఞాతము.**

ఈ సూక్ష్మవిషయములలోనున్న దోషములను చూచుటచే ఆ సూక్ష్మవిష యములను కూడ విడచి, ఇంకను లోతునకు వెళ్ళి చతుర్వింశతి తత్త్వములతో అనుగతమై ఉన్న సుఖరూపపురుషార్థముపై చిత్తమును నిలుపగా, వెనుకటివలెనే దానికి సంబంధించిన అశేషవిశేషముల సాక్షాత్కారము కలుగును. దానికి ఆనందమని పేరు. తదుపహితమైన సమాధి **సానందసమాధి** (అనందానుగత సంప్రజ్ఞాతసమాధి).

పిమ్మట దానిలోని దోషములు కూడ తెలియుటచే, దానిని కూడ విడచి ఆ ఆలంబనమునందే ఉన్న జీవేశ్వరులను పురుషద్వయమునందు చిత్తము నిలుపగా ఒకరికి సంబంధించిన అశేషవిశేషములు సాక్షాత్కారము కలుగును. చతుర్వింశతి తత్త్వములును జడములు, కూటస్థచిన్మాత్ర స్వరూపమైన ఆత్మ తద్భిన్నము అను అనుభూతి కలుగును. ఈ సాక్షాత్కారమునకు 'అస్మిత' అని పేరు. ఏతదుపహితమైన సమాధి "అస్మితానుగతసమాధి"; "సాస్మితాసంప్రజ్ఞాత సమాధి". దీనికి మించిన జ్ఞాతవ్య వస్తువేదియు లేదు గాన ఇది చరమభూమి.

అవ. అసంప్రజ్ఞాతసమాధిస్వరూపమును చెప్పుచున్నాడు :

సూ. విరామప్రత్యయాభ్యాసపూర్వః సంస్కారశేషోఽన్యః. 18

ప్ర.అ. విరామప్రత్యయాభ్యాసపూర్వః - విరామ=సర్వవృత్తుల విరామమునకు, ప్రత్యయ=కారణమైనదానియొక్క (పరవైరాగ్యముయొక్క),

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అభ్యాస= మాటిమాటికి అనుష్ఠించుట అనునది, పూర్వః పూర్వమునందు కలది, అనగా అట్టి అభ్యాసముచే సిద్ధించునది, సంస్కారశేషః=వృత్తుల సంస్కారము మాత్రమే శేషముగా గలది; అన్యః=మరియొక సమాధి; అనగా అసంప్రజ్ఞాతసమాధి (ఇది వాచస్పతిసూచితవ్యాఖ్య).

వ్యా. విరామప్రత్యయమనగా ఇతరవృత్తులే కాక తత్త్వజ్ఞానలక్షణమగు వృత్తి కూడా విరమించు గాక అనెడు ప్రత్యయము; జ్ఞానము విషయమున కూడ "ఇక చాలునులే" అను బుద్ధి; అదియే పరవైరాగ్యము. అట్టి వైరాగ్యమును మాటిమాటికి, నిరంతరము అలవరచుకొనుటచే కలుగు, వృత్తులు ఏవియు లేక వాటి సంస్కారములు మాత్రమే మిగిలిన సమాధి అసంప్రజ్ఞాతసమాధి. (భా.గ. నాగేశుల వ్యాఖ్య). ద్వివిధవ్యాఖ్యలందును తాత్పర్యము సమానమే.

విరామమనగా వితర్కాదుల త్యాగము. ఆ త్యాగమనే ఏ ప్రత్యయము అనగా జ్ఞానమున్నదో దాని అభ్యాసము పూర్వమునందున్నది అసంప్రజ్ఞతము. అనగా ఏ వృత్తి కలిగినను "ఇది కాదు" "ఇది కాదు" అని దానిని విడిచిపెట్టుచు చేసే సమాధి అని అర్థము. అసంప్రజ్ఞాతసమాధికే **నిర్బీజసమాధి** అని కూడ పేరు. దీనిలో వ్యుత్థానము, సమాధిప్రారంభము, ఏకాగ్రత, నిరోధము అని నాల్గు విధములైన చిత్తపరిణామముండును. క్షిప్తము, మూఢము అను చిత్తావస్థలకు వ్యుత్థానమని పేరు. సత్త్వగుణప్రాబల్యముచేత కలిగే విక్షిప్తావస్థ సమాధి ప్రారంభావస్థ. ఏకాగ్రతా-నిరోధరూపములైన అవస్థలు చివరి అవస్థలు. చిత్తము నందు కలిగే అన్ని పరిణామములందు సంస్కారములేర్పడును. వ్యుత్థానము వలన కలిగిన సంస్కారములను సమాధిప్రారంభజనిత సంస్కారములు అణగద్రొక్కును. వాటిని ఏకాగ్రతాజనితసంస్కారములు అణచివేయును. వాటిని నిరోధజన్యసంస్కారములు అణచివేసి తాము కూడ అణగిపోవును. (భోజవృత్తి)

అసంప్రజ్ఞాతసమాధిలో వృత్తుల సంస్కారములు ఉండును. అందుచేతనే వ్యుత్థానము (సమాధినుండి బైటకు వచ్చుట) కలుగుచుండును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మోక్షకాలీననిరోధములో సంస్కారములు కూడ ఉండవు. అసంప్రజ్ఞాత సమాధికిని మోక్షమునకును ఇదియే భేదము.

అవ. అసంప్రజ్ఞాతసమాధి కూడ భవప్రత్యయము, ఉపాయప్రత్యయము అని రెండు విధములు. ఆ భేదములను సూత్రద్వయముచే చెప్పుచున్నాడు.

సూ. భవప్రత్యయో విదేహప్రకృతిలయానామ్. 19

ప్ర.అ. విదేహప్రకృతిలయానామ్=విదేహులకును ప్రకృతిలయులకును కలుగు అసంప్రజ్ఞాతసమాధి, భవప్రత్యయః=భవప్రత్యయమని చెప్పబడును.

వ్యా. కొందరు సాధకులు మహాభూతములను కాని ఇంద్రియములను కాని ఆత్మగా భావించి, వాటిని ఉపాసన చేసి, ఆ ఉపాసనచే వాసితమైన అంతః కరణము కలవారై, దేహపాతానంతరము భూతములలో గాని, ఇంద్రియములలో గాని విలీనులగుదురు. వారి మనస్సులలో సంస్కారము మాత్రము శేషించును. స్థూలదేహముండదు. చిత్తవృత్తులు కూడ ఉండవు. అందుచే కైవల్యమును పొందినట్లుందురు. అవధిని పొంది, అనగా అట్లుండవలసిన కాలము పూర్తి అయిన తరువాత, మరల సంసారములో ప్రవేశింతురు. వర్షాకాలము తరువాత మట్టిలో కలిసిపోయిన కప్పలు మరల వర్షములు కురియగానే తమ దేహములు ధరించినట్లు వీరు నిర్ణీతకాలము పూర్తి కాగానే దేహములు ధరింతురు. ఈ దేహముతో మరల సంసారములో పడుదురు. వీరు "విదేహులు".

మరి కొందరు తన్మాత్ర-అహంకార-మహత్-ప్రకృతులను ఆత్మగా భావించి, ఉపాసన చేసి, మరణానంతరము వాటితో ఐక్యమును పొందుదురు. స్థూలదేహముండదు. సంస్కారములు గల చిత్తములు మాత్రముండును. సుదీర్ఘకాలమట్లుండి మరల స్థూలదేహములను పొంది సంసారములోనికి వచ్చుచుందురు. వీరు "ప్రకృతిలయులు".

భూతేంద్రియోపాసకులు విదేహులనియు, తన్మాత్రాహంకారమహత్ ప్రకృత్యుపాసకులు ప్రకృతిలయులనియు వాచస్పతిమిశ్రులు ప్రతిపాదింపగా భూత-ఇంద్రియ-తన్మాత్ర-అహంకార-మహత్తుల ఉపాసన చేసినవారు

In Public domain. Digitization Muthulakshmi Research Academy
విదేహులనియు, ప్రకృతిని ఉపాసించినవారు ప్రకృతిలయులనియు నాగేశభట్టు ప్రతిపాదించెను. –

దశ మన్వన్తరాణీహ తిష్ఠన్తీన్ద్రియచిన్తకాః,
భౌతికాశ్చ శతం పూర్ణం సహస్రం త్వాభిమానికాః.
బౌద్ధా దశసహస్రాణి తిష్ఠన్తి విగతజ్వరాః,
పూర్ణం శతసహస్రం తు తిష్ఠన్త్యవ్యక్తచిన్తకాః,
పురుషం నిర్గుణం ప్రాప్య కాలసంఖ్యా న విద్యతే(వాయుపురాణము)

"ఇంద్రియోపాసకులు ఇంద్రియములలో విలీనులై పదిమన్వంతరములుండి పోవుదురు. మహాభూతోపాసకులు నూరు మన్వంతరములు, అహంకారోపాసకులు వేయి మన్వంతరములు, మహత్తత్త్వోపాసకులు పదివేల మన్వంతరములు, ప్రకృత్యుపాసకులు లక్ష మన్వంతరములు దుఃఖరహితులై, ఆ యా భూతాదులలో విలీనులై ఉండిపోవుదురు. ఇక నిర్గుణాత్మస్వరూప సాక్షాత్కారము పొందినవారికి కాలసంఖ్యపరిమితి లేదు" అని అర్థము. పై వ్యాఖ్యాతలిరువురును ఈ శ్లోకములనే ప్రమాణముగా ఉదాహరించినారు. వాచస్పతిమిశ్రుడు "దశమన్వన్తరాణీహ.... పూర్ణమ్" అను మూడు పాదములను గ్రహించి అవి విదేహులను చెప్పుచున్నవనియు, "సహస్రం.... అవ్యక్తచిన్తకాః" అనునవి ప్రకృతిలయులకు సంబంధించినవనియు వ్యాఖ్యానించెను. నాగేశుడు – "పూర్ణం శతసహస్రం తు తిష్ఠన్త్యవ్యక్తచిన్తకాః" అను శ్లోకార్థము ప్రకృతిలయులను చెప్పుచున్నదనియు ప్రకృతిభిన్నోపాసకులను చెప్పు మిగిలిన శ్లోకములు విదేహులకు సంబంధించినవనియు వ్యాఖ్యానించెను. భూతేంద్రియములు స్థూలములగుటచే తదుపాసకులు ఒక తెగకు చెందినవారనియు, అహంకారాదులు సూక్ష్మములగుటచే తదుపాసకులు మరొక తెగకు చెందినవారనియు భావించి వాచస్పతిమిశ్రుడు అట్లు వ్యాఖ్యానించి ఉండును. మహత్తు, అహంకారము, పంచతన్మాత్రలు వీటి నుండి ఆ యా కార్యములు పుట్టుటచే వాటికి ప్రకృతులని కూడ పేరు ఉన్నది. **మహదాద్యాః ప్రకృతివికృతయః సప్త** (మహత్తు మొదలైన ఏడును ప్రకృతులు,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వికృతులు అని కూడ చెప్పబడును) అని సాంఖ్యకారికలో చెప్పబడినది. అందుచే తదుపాసకులకు ప్రకృతిలయులను పేరు యుక్తమగును.

"భవప్రత్యయః" అను పదమునకు "భవః ఏవ (జన్మయే) ప్రత్యయః (కారణము) యస్య సః" అను విగ్రహముచే తత్తదుపాసనలు చేసినవారు దేహ పాతానంతరము ఆ విధముగ తత్తదుపాస్యవిలీనులై పుట్టుటయే ఈ అసంప్రజ్ఞాత సమాధికి కారణము గాన దీనికాపేరు వచ్చినదని భా.గ. నాగేశులు విశదీకరించినారు.

వాచస్పతిమిశ్రులు ఈ పదమునకు మరొకవిధముగ అర్థము చెప్పిరి. "భవన్తి జాయన్తే అస్యాం జన్తవః ఇతి భవః" – (ప్రాణులు దేనియందు జన్మింతురో అది భవము) అనగా అవిద్య. వికారములైన భూతములు కాని, ఇంద్రియములు కాని, ప్రకృతులైన అవ్యక్తమహదహంకారపంచతన్మాత్రలు కాని ఆత్మ కాకపోయినను వాటిని ఆత్మగా భావించుట అను ఈ అవిద్య దీనికి కారణముగాన (భవః ప్రత్యయః యస్య సః భవప్రత్యయః) ఈ అసంప్రజ్ఞాతసమాధికి భవప్రత్యయమని పేరు.

ఈ భవప్రత్యయసమాధిని పొందగలిగినవారు కూడ పైన చూపిన విధముగ మరల సంసారమునకు రావలసి యుండుటచే ఇది కూడ హేయమే అని భావము. కావుననే **భవప్రత్యయ** పదమునకు **భవస్య ప్రత్యయః భవ ప్రత్యయః** అని కూడ విగ్రహము చెప్పుటచే "సంసారమునకు కారణమగు సమాధి" అను అర్థము వచ్చునని నాగేశభట్టు వ్రాసినాడు. భోజుని వృత్తి కూడ ఈ అర్థమే చెప్పుచున్నది.

అవ. ఇపుడు ఉపాయప్రత్యయమును చెప్పుచున్నాడు :

సూ. శ్రద్ధావీర్యస్మృతిసమాధిప్రజ్ఞాపూర్వక ఇతరేషామ్. 20

ప్ర.అ. ఇతరేషామ్=భూతలయాది ప్రకృతిలయాంతులకంటె ఇతరులైన వారి అసంప్రజ్ఞాతసమాధి, శ్రద్ధావీర్యస్మృతిసమాధిప్రజ్ఞా పూర్వకః= శ్రద్ధాదిపూర్వక మైనది, అనగా శ్రద్ధాదులచే కలుగును.

వ్యా. ఆస్తిక్యబుద్ధితో, వివేకఖ్యాతిరూపమగు యోగమును సాధించుటకై కలిగే ఉత్కంఠకు శ్రద్ధ అని పేరు. ఆ శ్రద్ధ సమర్థురాలగు తల్లి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వలె, వేలకొలదిగ వచ్చుచుండు ప్రతిబంధములను తొలగించి సాధకునకు భోగాసక్తి కలుగకుండ చేయును. శ్రద్ధవలన వీర్యము, అనగా వివేకమును గూర్చిన ధారణ, (ఉత్సాహము అని భో.వృ.) కలుగును. వీర్యమువలన స్మృతి, అనగా ధ్యానము, కలుగును. (స్మృతి అనగా వెనుకటి అవస్థల స్మరణము అని భో.వృ.) ధ్యానము వలన సమాధి (నిలకడ) కలిగి దానివలన ధ్యేయవస్తు సాక్షాత్కారము కలుగును. ఇదియే ప్రజ్ఞ. ఇదియే సంప్రజ్ఞాతసమాధి. ఈ తత్త్వసాక్షాత్కారము 'ధర్మమేఘసమాధి' అను పరాకాష్ఠను చెంది, రజస్తమో గుణములు తొలగిపోవుటచే వృద్ధి పొందుచు, విషయములలోని దోషములను చూపుచు, సమస్తవిషయములపై వైరాగ్యమును పెంచి అసంప్రజ్ఞాతసమాధికి దారితీయును. ఈ విధముగా శ్రద్ధా-వీర్య-స్మృతి-సమాధి-ప్రజ్ఞా(సంప్రజ్ఞాత) ములవలన కలుగు అసంప్రజ్ఞాతసమాధిలో యోగికి స్వస్వరూపస్థితి కలుగును. శ్రద్ధాద్యుపాయములచే లభ్యమగుటచే ఉపాయప్రత్యయమను పేరు గల ఈ అసంప్రజ్ఞాతసమాధి స్వరూపప్రతిష్టా రూపము గాన భూతాదిలయరూపమగు భవప్రత్యయముకంటె ఉత్తమమైనది. ఇదియే ముఖ్యమైన అసంప్రజ్ఞాతము.

అవ. పై సూత్రములో చెప్పిన ఉపాయములను అవలంబించు యోగులు మృదూపాయులు. మధ్యోపాయులు, అధిమాత్రోపాయులు అని మూడు విధములనుందురు. ఉపాయమృదుత్వాదులకు కారణము పూర్వజన్మకు సంబంధించిన అదృష్టమే. పై మూడు విధాల యోగులలో ఒక్కొక్కరు మృదుసంవేగులు, మధ్యసంవేగులు, తీవ్రసంవేగులు అని మూడేసి విధములనుందురు. ఉపాయములను అనుష్ఠించుటలో శీఘ్రత్వమునకు సంవేగమని పేరు. ఈ విధముగ యోగులలో తొమ్మిది భేదములుండును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

యోగులు	మృదూపాయాలు	మృదు సంవేగులు
		మధ్య సంవేగులు
		తీవ్ర సంవేగులు
	మధ్యోపాయాలు	మృదు సంవేగులు
		మధ్య సంవేగులు
		తీవ్ర సంవేగులు
	అధిమాత్రోపాయాలు	మృదు సంవేగులు
		మధ్య సంవేగులు
		తీవ్ర సంవేగులు

అవ. వీరిలో తీవ్రసంవేగులైన అధిమాత్రోపాయులను గూర్చి చెప్పుచున్నాడు. –

సూ. అధిమాత్రోపాయానాం తీవ్రసంవేగానామాసన్నః. 21

ప్ర.అ.తీవ్రసంవేగానామ్=తీవ్రసంవేగము గల అధిమాత్రోపాయానామ్ =అతిశయితమైన ఉపాయములు కలవారికి, ఆసన్నః= సంప్రజ్ఞాతసమాధియు, తత్ఫలమును అనగా సంప్రజ్ఞాతసమాధికి ఫలమైన అసంప్రజ్ఞాతసమాధియు చాల దగ్గరనున్నది.

వ్యా. వ్యాసభాష్యానుసారముగా (భోజానుసారముగా కూడ) "తీవ్ర సంవే గానామాసన్నః" అని మాత్రమే సూత్రము. "అధిమాత్రోపాయానామ్" అనునది వ్యాఖ్యానమున చేర్చబడినది. భా.గ. ప్రకారము ఈ పదము కూడ సూత్రములో ఉన్నది. నాగేశుడు వ్యాసభాష్యసంమతపాఠమును గ్రహించి సూత్రప్రారంభమునందు "అధిమాత్రోపాయానామ్" అను పదమును చివర "సమాధిలాభస్తత్ఫలలాభశ్చ" అను పదములను చేర్చి అర్థము చెప్పుకొనవలెనని వ్రాసినాడు. అనగా "అధిమాత్రోపాయానాం తీవ్రసంవేగానాం సమాధిలాభః, తత్ఫలలాభశ్చ ఆసన్నః" అని చెప్పినట్లగును. సంవేగమనగా వైరాగ్యమని వాచస్పతిమిశ్రుని వ్యాఖ్య.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. ఆసన్నత్వములో కూడ విశేషమును చెప్పుచున్నాడు:

సూ. మృదుమధ్యాధిమాత్రత్వాత్తతోఽపి విశేషః. 22

ప్ర.అ. మృదుమధ్యాధిమాత్రత్వాత్=సంవేగముయొక్క మృదుత్వ-మధ్యత్వ-అధిమాత్రత్వములవలన, తతోఽపి = ఆ ఆసన్నత్వముకంటె కూడ, విశేషః = ఆసన్నతర-ఆసన్నతమములనే తరతమభావముండును.

వ్యా. తీవ్రసంవేగములో కూడ మృదుత్వము, మధ్యత్వము, అధిమాత్రత్వముండును. ఈ భేదములనుపట్టి సంప్రజ్ఞాతసమాధి తత్ఫలములు ఆసన్నమగుటలో కూడ భేదములుండునని అర్థము. మృదు(అల్ప) తీవ్ర సంవేగమునకు ఆసన్నము, మధ్యతీవ్రసంవేగమునకు ఆసన్నతరము, అధిమాత్ర (అత్యధిక) తీవ్రసంవేగమునకు ఆసన్నతమము అగు యోగము కలుగును.

ఉపాయములలో మృదువు, మధ్యము, అధిమాత్రము అని మూడు భేదములుండును. వీటినిపట్టి సంవేగము మృదుసంవేగము, మధ్యసంవేగము, తీవ్రసంవేగము అని మూడువిధములు. ఈ భేదములచే తొమ్మిదివిధముల యోగులు మృదూపాయమును అవలంబించు మృదుసంవేగుడు, మధ్య సంవేగుడు, తీవ్రసంవేగుడు. మధ్యోపాయమును అవలంబించు మృదుసంవేగుడు, మధ్యసంవేగుడు, తీవ్రసంవేగుడు. అధిమాత్రోపాయమును అవలంబించు మృదుసంవేగుడు, మధ్యసంవేగుడు, తీవ్రసంవేగుడు అధిమాత్రోపాయముతో తీవ్రసంవేగమును సంపాదించుటకు చాల ప్రయత్నము చేయవలెనని ఈ భేదములు చెప్పబడినవి. ఇది భోజమహారాజు వ్యాఖ్య. కాని సూత్రములో ఉపాయముల ప్రసక్తి లేదు గాన పూర్వోక్త వ్యాఖ్యానమే యుక్తమని తోచును.

అవ. ఆసన్నతమసమాధిలాభమునకు ఇది ఒక్కటియే ఉపాయమా మరేదైన కూడ ఉన్నదా అని ప్రశ్నించుకొని మరొకటికూడ ఉన్నదని చెప్పు చున్నాడు.

సూ. ఈశ్వరప్రణిధానాద్వా. 23

ప్ర.అ. ఈశ్వరప్రణిధానాద్వా=ఈశ్వరుని ధ్యానమువలననైనను, ఆసన్నతమయోగము కలుగును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. "పరబ్రహ్మ" మొదలగు శబ్దములచే చెప్పబడువాడును, మాయారూపమగు, ఉపాధిచే ఏర్పడిన ఐశ్వర్యము కలవాడును, చిన్మాత్ర స్వరూపుడును అగు ఒకానొక పురుషుడే ఈశ్వరుడు. రాబోవు మూడు సూత్రములలో కూడ ఈశ్వరస్వరూపము చెప్పబడనున్నది. అట్టి ఈశ్వరుని మనోవాక్కాయములచే సేవించుచు అతనిపై చిత్తమును నిలుపుట ద్వారా కూడ యోగసిద్ధి ఆసన్నతమమగునని భావము. **ప్రణిధానాత్** అను పదమునకు భాష్యములో "భక్తివిశేషాత్" అని అర్థము చెప్పబడినది. దానినిబట్టి వాచస్పతిమిశ్రుడు వాచికభక్తివల్ల గాని, కాయికభక్తివల్ల గాని, మానసికభక్తివల్ల గాని యోగము ఆసన్నతమమగును అని వివరించినాడు.

ఈశ్వరప్రణిధానమనగా ఏమో "తజ్జపస్తదర్థభావనమ్"అను సూత్రము (27)న చెప్పనున్నాడు. అది కూడ ఈశ్వరవిషయకమగు ధారణా-ధ్యాన-సమాధులతో తుల్యమే. అందుచే దానివలన కూడ ఈశ్వరానుగ్రహము ద్వారా యోగము కలుగునని భావము. ఈ సూత్రమునందు ఈశ్వరుని ప్రసక్తి తీసికొని వచ్చుటచే పూర్వసూత్రములో చెప్పిన ఆసన్నతమయోగసాధనము జీవాత్మ యోగికి, అనగా జీవాత్మస్వరూపమును ధ్యానించు యోగికి సంబంధించినదని తెలియవలెను. (భా.గ.)

తజ్జపస్తదర్థభావనమ్ అను సూత్రములో చెప్పనున్న ఈశ్వరప్రణిధానమును, అనగా ఈశ్వరవిషయకమగు ధారణా-ధ్యానసమాధిత్రయమును, అల్పముగా చేసినను ఆసన్నతమములగు యోగ-తత్ఫలములు లభించును (నాగేశుడు).

ఈశ్వరప్రణిధానము కూడ ధారణాదిరూపమే గాన తత్తుల్యమని చెప్పుటకంటె నాగేశవ్యాఖ్యయే యుక్తమని తోచుచున్నది.

పూర్వోక్తమైన సంప్రజ్ఞాతము జీవాత్మకు సంబంధించినది. దానివలన అసంప్రజ్ఞాతము ఆసన్నతమముగ సిద్ధించవలెనన్నచో పూర్వోక్తమగు అధిమాత్ర సంవేగము తప్పక ఉండవలెను. ఈ సూత్రములో చెప్పిన పరమాత్మ-సంప్రజ్ఞాతము లభించినచో అధిమాత్రసంవేగము లేకపోయినను అసంప్రజ్ఞాతము లభించును. అందుచేతనే శ్రుత్యాదులలో సాధారణముగా పరబ్రహ్మజ్ఞానమే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మోక్షహేతువని చెప్పబడుచున్నది. అందుచే ఇది ముఖ్యమైన మార్గము (నాగేశుడు).

ఈ విధముగా ఆరాధింపబడిన ఈశ్వరుడు అనుగ్రహించి ఈతనికి ఈప్సితార్థసిద్ధి కలుగుగాక అని అనుకొనును. ఇట్లు అనుకొనుటకు **అభిధ్యాన**మని పేరు. ఈ అభిధ్యానముచే అనాయాసముగ మోక్షసిద్ధి కలుగును (వ్యా. భా. నాగే. భా.గ.).

అవ. ఈశ్వరుడనగా ఎవ్వడు? చెప్పుచున్నాడు –

సూ. క్లేశకర్మవిపాకాశయైరపరామృష్టః పురుషవిశేష ఈశ్వరః. 24

ప్ర.అ. క్లేశకర్మవిపాకాశయైః=క్లేశాదులచేత, అపరామృష్టః= స్పృశింపబడని, పురుషవిశేషః=ఒకానొక పురుషుడు, ఈశ్వరః=ఈశ్వరుడు.

వ్యా. అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అనునవి క్లేశములు. కర్మ అనగా ధర్మాధర్మములు. కర్మల ఫలములైన జన్మ, ఆయుర్దాయము, భోగము అనునవి విపాకములు. వీటికి అనుగుణములైన వాసనలు (సంస్కారములు) ఆశయము. కాలత్రయమునందు కూడ ఈ క్లేశాదులు లేని ఒకానొక పురుషుడే ఈశ్వరుడు. జీవన్ముక్తులకు పూర్వము (భూతకాలమునందు) క్లేశాదులుండెడివి. కాన వారు ఈశ్వరులు కారు. ప్రకృతిలయాదులకు కాలాంతరమున (భవిష్యత్తులో) క్లేశాదులు కలుగును కావున వారు కూడ ఈశ్వరులు కారు. భూతభవద్భవిష్యత్కాలములలో ఏ కాలమునందును క్లేశాదులు లేనివాడే ఈశ్వరుడు.

వాస్తవమున క్లేశాదులు అంతఃకరణధర్మములు గాన జీవులు కూడ క్లేశాదిరహితులే అయినను క్లేశాదులు గల అంతఃకరణమునకు వారు స్వాములు గాన క్లేశాదులు వారికే చెందినట్లు చెప్పబడుచున్నది. యోగ సిద్ధాంతము ప్రకారము జీవులకు కర్తృత్వము లేకున్నను క్లేశాదిజన్య సుఖదుఃఖములను అనుభవింతురు గాన వారికి భోక్తృత్వమున్నది. కావున యోధులకు కలిగిన జయపరాజయములను స్వామియగు రాజుకు ఆరోపించినట్లు ఇచట గూడ అంతఃకరణధర్మములగు క్లేశాదులు జీవునికి ఆరోపింపబడుచున్నవి.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఇచ్ఛామాత్రముచే సకలజగమును ఉద్ధరింప సామర్థ్యము కలవాడే ఈశ్వరుడు. జ్ఞానశక్తి, క్రియాశక్తి ఉన్ననే కాని ఈ సామర్థ్యము లభింపదు. రజస్తమోగుణములు తొలగిన విశుద్ధసత్త్వమైన ప్రధానమును స్వీకరించిననేగాని ఈ జ్ఞానక్రియాశక్తులు లభించవు. అందుచే ఈశ్వరుడు స్వయముగనే, సత్త్వమయమైన ప్రధానమును స్వీకరించును. అనగా దాని సాహాయ్యమును తీసికొనును. స్వేచ్ఛానుసారముగా ప్రధానోపాదానము చేసినవాడగుటచే ఈశ్వరుడు అస్మదాదుల వలె దానికి వశంవదుడు కాడు; అజ్ఞానవంతుడు కాడు. నటుడు తనపై రామత్వాధికమును ఆరోపించుకొని, ఆ చేష్టలను చేసినను ఆతనికి మాత్రము నేనే రాముడను అను భ్రాంతి కలుగదు కదా? అట్లే ఈశ్వరునకు ప్రధానముతోనున్న సంబంధము కావలెనని తెచ్చుకొన్న సంబంధము. ఇట్లు స్వపాదానము చేసి, సర్వాతిశాయిజ్ఞానక్రియాశక్తిమంతుడై ఈశ్వరుడు జగత్సృష్టి రక్షాదులు చేయును.

జగన్నిర్మాణాదీచ్ఛచేత సత్త్వోపాదానము జరుగుచున్నది, సత్త్వోపా-దానము చేత జగన్నిర్మాణాదీచ్ఛ కలుగచున్నది అని చెప్పినచో అన్యోన్యాశ్రయ దోషము రాదా అను శంకకు అవకాశము లేదు. ఇది అంతయు అనాది గాన సర్వదా ఈ చక్రము తిరుగుచునే ఉండును. "పూర్వకల్పమును సంహరించ వలసిన సమయము వచ్చినది. దీనిని సంహరించెదను. ఈ సంహారకాలము గడచిన పిమ్మట మరల సత్త్వోపాదానము చేసి సృష్టి చేసెదను" అని అనుకొని ఈశ్వరుడు పూర్వకల్పసంహారము చేయును. ఆ సంహారప్రారంభమున చేసిన సంకల్పబలముచే సంహారకాలానంతరం ఈశ్వరుడు మరల సత్త్వోపాదానము చేసి సృష్ట్యాదికము చేయును. ఒక వ్యక్తి "నేను రేపు తెల్లవారుజాముననే లేచి ఆ ఊరు వెళ్ళెదను" అని సంకల్పించి నిద్రించి, ఆ సంకల్పబలముచే తెల్లవారు జాముననే మేల్కొనుచున్నాడు కదా? అట్లే ఇదియును.

సృష్టిశక్తి, లయశక్తి అను రెండు శక్తులు ప్రకృతిలో సహజముగా ఉన్నవి. ఈశ్వరుడు సత్త్వమును పరిగ్రహించినపుడు సృష్టిశక్తి ఉద్బుద్ధమగును; తమస్సును పరిగ్రహించినపుడు లయశక్తి ఉద్బుద్ధమగును. తమఃపరిగ్రహము నందే యోగనిద్ర అని చెప్పబడును. ఈ విధముగ ఈశ్వరుడు ఆ యా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

గుణముల పరిగ్రహమును జీవుల కర్మవాసనలను బట్టి చేయుచుండును. ఇది అనాదియైన సృష్టిలయచక్రము గాన అన్యోన్యాశ్రయదోషము లేదు.

ఇట్టి ఈశ్వరుడనువాడొకడున్నాడని చెప్పుటకు ప్రమాణమేమి? వేదాదిశాస్త్రము ప్రమాణము. అది ప్రమాణమని ఎట్లు అంగీకరించవలెను? ఈశ్వరుడు రచించిన కొన్ని మంత్రములును, ఆయుర్వేదాదులును ప్రత్యక్ష ఫలమునిచ్చుచుండుటచే అవి ఎట్లు ప్రమాణములని అంగీకరించుచున్నామో ఇట్లే ఇతర వేదభాగాదులను కూడ ప్రమాణములని అంగీకరించవలెను. ఇట్టి ప్రామాణ్యము గల మంత్రాయుర్వేదాదులను రచించిన ఈశ్వరుడు శుద్ధసత్త్వుడు కావలెను. రజస్తమఃసంబంధమున్నచో భ్రాంతివంచనాదులకు అవకాశముండును కదా? అట్టి శుద్ధసత్త్వుడగు ఈశ్వరుడు నిర్మించిన, అభ్యుదయనిఃశ్రేయసోపదేశకమైన వేదరాశి కూడ అతని సత్త్వప్రకర్షవలననే రచింపబడినదని చెప్పవలెను. అట్టి వేదాదులు ఈశ్వరుడు సర్వదా ఈశ్వరత్వము కలవాడనియు, సర్వదా ముక్తుడనియు చెప్పుచున్నవి గాన ఆ విషయమును అట్లే అంగీకరింపవలెను.

ఈశ్వరుని ఐశ్వర్యముతో (ఈశ్వరత్వముతో) సమానమైనది గాని, దాని కంటె ఉత్కృష్ట మైనది కాని మరొక ఐశ్వర్యము లేదు. "ఈ ఐశ్వర్యము ఈశ్వరుని ఐశ్వర్యమును మించియున్నది అని దేనిని చూపింతువో" అదే ఈశ్వరైశ్వర్యము. అనగా దేనిని మించినది మరొకటి లేదో అదే ఈశ్వరుని ఐశ్వర్యము. అట్లే ఈశ్వరుని ఐశ్వర్యముతో తుల్యమగు మరొక ఐశ్వర్యము ఉండుటకు కూడ వీలు లేదు. అట్లైనచో ఇద్దరు లేదా అధికసంఖ్యాకులగు ఈశ్వరులుండవలసి వచ్చును. అపుడు ఒకడు ఇది చేయవలెనన్నచో మరొకడు ఇది చేయవలదనును. ఇంకను ఇట్టి విరోధములెన్నియో వచ్చును. అందుచే ఎవని ఐశ్వర్యముతో సమానము కాని, అతిశయితము గాని అయిన మరొక ఐశ్వర్యముండదో అట్టి ఈశ్వరుడు ఒక్కడే. అనేకేశ్వరులుండ వీలు లేదు (వ్యాసభాష్య) వాచస్పతిమిశ్రులు, తదనుసారియగు నాగేశభట్టు, ఈశ్వరుని గూర్చిన ఈ చర్చ చేసినారు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. ఈశ్వరుడు సర్వజ్ఞుడనుటకు అనుమానప్రమాణమును చూపుచున్నాడు-

సూ. తత్ర నిరతిశయం సర్వజ్ఞబీజమ్. 25

ప్ర. అ. సర్వజ్ఞబీజమ్=సర్వజ్ఞత్వానుమానము చేయుటకు కారణము, తత్ర=ఆ ఈశ్వరునియందు, నిరతిశయమ్=అతిశయము లేనిది. దేనిని మించినది మరొకటి ఉండదో అది నిరతిశయము.

వ్యా. జ్ఞానము సాతిశయము. అనగా లోకములో ఒకని జ్ఞానముకంటె మరొకనికి అధికజ్ఞానమున్నది. వాని జ్ఞానముకంటె మరొక మూడవవాని జ్ఞానము అధికముగ ఉన్నది. ఈ విధముగ ఒకని జ్ఞానమును మించి మరొకని జ్ఞానముండుటచే, జ్ఞానములో అతిశయమున్నదని తెలియుచున్నది. అందుచే ఈ విధముగ వెళ్ళగా వెళ్ళగా ఎవ్వడో ఒక వ్యక్తికి ఉన్న జ్ఞానము నిరతిశయ మనియు, అతని జ్ఞానమును మించిన జ్ఞానముండుటకు అవకాశము లేదనియు ఊహించవచ్చును. దీనికి - "జ్ఞానం క్వచిత్ప్రాప్తకాష్ఠమ్, సాతిశయత్వాత్, పరిమాణవత్" అను అనుమానమును ప్రమాణముగ చూపవచ్చును. జ్ఞానము సాతిశయము గాన దీనికి ఎక్కడనో ఒక చోట కాష్ట (అత్యధికస్థితి) ఉండవలెను. సాతిశయములగు పరిమాణాదులలో ఇట్లే ఉన్నది గదా? అనగా మహత్త్వమను పరిమాణమున్నది. అది బదరామలకబిల్వాదులలో సాతిశయముగ కనబడుచున్నది. మహత్వము బదరఫలముకంటె ఆమలకమునందును దానికంటే బిల్వమునందును ఎక్కువగా కనబడుచున్నది. ఇట్లు పోగా పోగా ఈ మహత్త్వమునకు ఆత్మయందు నిరతిశయత్వమును చూచుచున్నాము. అట్లే జ్ఞానము విషయములో కూడ అని ఈ అనుమానమునకు అర్థము. జ్ఞానమునకు గల ఈ నిరతిశయస్థితియే సర్వజ్ఞత్వము. అది ఈశ్వరునిలో ఉన్నది. అనగా ఈశ్వరుడు సర్వజ్ఞుడు అని ఈ సూత్రమునకర్థము.

ఇచట **సర్వజ్ఞ** అను పదమును భావప్రధాననిర్దేశముగ గ్రహించి, **సర్వజ్ఞత్వము** అని అర్థము చెప్పబడినది. నాగేశుని ప్రకారము "తత్ర నిరతిశయం సార్వజ్ఞ్యబీజమ్" అనియే సూత్రము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యాసవాచస్పతుల వ్యాఖ్యానము ఈ విధముగ ఉన్నది. "సర్వజ్ఞబీజమ్" అనియే పాఠము. బుద్ధిసత్త్వమును ఆవరించి ఉన్న తమస్సు తొలగుటలోని తారతమ్యమునుబట్టి, అనగా ఎక్కువ తొలగుట, తక్కువ తొలగుట అను భేదమును బట్టి అతీంద్రియ (ఇంద్రియములచే గ్రహింపశక్యము కాని) విషయములను గ్రహించుటలో కూడ భేదమున్నది. అతీంద్రియపదార్థములు భూతకాలమునకు చెందినవి కావచ్చును, వర్తమానమునకు చెందినవి కావచ్చును, భవిష్యత్తుకు చెందినవి కావచ్చును. ఆవరణము కొద్దిగా తొలగినచో అల్పవిషయగ్రహణముండును. మరి కొంచెము తొలగినచో బహు విషయగ్రహణముండును. బహుతరబహుతమవిషయగ్రహణముండును. ఈ విధముగ గ్రహణ విశేషణములైన 'అల్పమ్' 'బహు' అనునవి సర్వజ్ఞబీజము. సర్వజ్ఞత్వమునకు విత్తనము, కారణము. ఈ బీజము వృద్ధి పొంది పొంది ఎక్కడ ఆగిపోవునో ఆతడే ఈశ్వరుడు. అనగా ఈశ్వరుడు సర్వజ్ఞుడు. గ్రహణము (జ్ఞానము) ఇతనియందు అధికకాష్ఠను చెంది నిరతిశయమైనది. (భోజవృత్తి కూడ పైవిధముగనే ఉన్నది).

ఈ ఈశ్వరుడు శివేశ్వరవిష్ణ్వాదినామములను గ్రహించెననియు, ఈతనికే షడంగములు, దశావ్యయములు ఉన్నవనియు, ఆగమాదులలో చెప్పబడినది.

"సర్వజ్ఞతాతృప్తిరనాదిబోధః స్వతన్త్రతా నిత్యమలుప్తశక్తిః,
అనన్తశక్తిశ్చ విభోర్విధిజ్ఞాః ప్రాహుః షడఙ్గాని మహేశ్వరస్య". (వాయు.12.31)

ఇట్లే శంకరునికి, జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము (సామర్థ్యము), తపస్సు, సత్యము, ఓర్పు, ధైర్యము, సృష్టికర్తృత్వము, ఆత్మజ్ఞానము, అంతకును ఆధారముగా ఉండుట అను ఈ పది అవ్యయములును, నిత్యము ఉండును అని వాయుపురాణములో చెప్పబడినది. ఈ ధర్మములు మార్పు లేకుండ సర్వదా ఈశ్వరునిలో ఉండుటచే వీటికి అవ్యయము అని పేరు.

"జ్ఞానం వైరాగ్యమైశ్వర్యం తపః సత్యం క్షమా ధృతిః
స్రష్టృత్వమాత్మసంబోధో హ్యధిష్ఠాతృత్వమేవ చ,
అవ్యయాని దశైతాని నిత్యం తిష్ఠన్తి శఙ్కరే" (వాయు.10.6)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నిత్యతృప్తుడును, పరమవైరాగ్యవంతుడును అగు ఈశ్వరుడు ఈ జగత్ సృష్ట్యాదికార్యములలో ఎందుకు ప్రవర్తించుచున్నాడు? లోకానుగ్రహము కొరకై చేయుచున్నాడన్నచో అతడు సుఖవంతులనే సృష్టించవలెను. దుఃఖవంతులను ఏల సృష్టించుచున్నాడు? అను ఆశంక కలుగవచ్చును. దానికి సమాధానమేమనగా-ఈశ్వరుడు ప్రాణ్యనుగ్రహము కొరకే ప్రవర్తించు చున్నాడు. జీవులకు వివేకవైరాగ్యాదులను కలిగించుటకై దుఃఖమును కూడ కలిగించుచున్నాడు. అందుచేత ఈశ్వరునకు దయారాహిత్యము కాని, వైషమ్యము (ఒకరిని ఒకవిధముగను ఒకరిని మరొక విధముగను చూచుట) గాని లేవు. (వ్యా. భా;వా. మి;నా.గే.)

అవ. ఈశ్వరుని ఐశ్వర్యము నిత్య మని చెప్పుచున్నాడు -

సూ. స ఏష పూర్వేషామపి గురుః కాలేనానవచ్ఛేదాత్. 26

ప్ర.అ. సః ఏషః=అట్టి ఈ ఈశ్వరుడు, కాలేన=కాలముచేత, అనవచ్ఛేదాత్=అవచ్ఛేదము(కొలత)లేకపోవుటవలన, పూర్వేషామపి=పూర్వ సృష్టిలో జనించిన బ్రహ్మ-విష్ణు-హరాదులకు కూడ (నాగే), హిరణ్య గర్భాదులగు ప్రాచీన గురువులకు కూడ (భా.గ), పూర్వగురువులకు కూడ (వ్యా.భా),గురుః=గురువు.

వ్యా. ఈ ఈశ్వరుడు హిరణ్యగర్భాదులను, (బ్రహ్మ-విష్ణు-శివాదులను) సృజించి, వారికి అంతర్యామిగా ఉండి జ్ఞాననేత్రమును అనుగ్రహించిన వాడు గాన, వారికి కూడ గురువు. ఆ హిరణ్యగర్భాదుల ఆయుఃకాలము నూరు సంవత్సరములు మొదలగు కాలపరిమాణముచే పరిచ్ఛిన్నము. ఈశ్వరునకు ఇంత కాలమే అను పరిచ్ఛేదము లేదు.

సూ. తస్య వాచకః ప్రణవః. 27

ప్ర.అ. ప్రణవః=ఓంకారము, తస్య=ఆ ఈశ్వరునకు, వాచకః= వాచకము.

వ్యా. అనగా ఓంకారమునకు అర్థము ఆ ఈశ్వరుడే. అందుచేత ఓంకారము వాచకము (ఈశ్వరుని బోధించునది), ఈశ్వరుడు వాచ్యుడు (ఓంకారముచే బోధింపబడువాడు).

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"అదృష్టవిగ్రహో దేవో భావగ్రాహ్యో మనోమయః
తస్యోఙ్కారః స్మృతో నామ తేనాహూతః ప్రసీదతి".

దేవుని శరీరము కండ్లకు కనబడునది కాదు, ఆతడు మనస్సుచే భావన ద్వారా గ్రహింపదగినవాడు, **ఓమ్** అనునది ఆతని పేరు, ఆ పేరుతో పిలచినచో ప్రసన్నుడగును అని స్మృతివచనము. (భా.గ)

"ప్రకర్షేణ నూయతే అనేన ఇతి ప్రణవః" (దేనిచేత అధికముగా స్తుతింప బడుచున్నాడో అది ప్రణవము) లేదా "ప్రకర్షేణ నౌతి ఇతి ప్రణవః" (అధికముగా స్తుతించునది ప్రణవము) అని ప్రణవశబ్దమునకు వ్యుత్పత్తి. ఓంకారమునకు ఈశ్వరునకు ఉన్న వాచ్యవాచకభావసంబంధము (బోధింపబడేది బోధించేది అను సంబంధము)నిత్యము. తండ్రికి పుత్రునకు మధ్య ఉన్న సంబంధమును ఇతడు తండ్రి, ఇతడు ఆతని కుమారుడు అని చెప్పి మరొకడు ప్రకాశింపచేసినట్లు ఈసంబంధము సంకేతముచేత ప్రకాశింప చేయబడుచున్నది కాని కొత్తగా ఏర్పరుచబడుటలేదు. (భో.వృ.)

అవ. ఈశ్వరవాచకమగు ఓంకారరూపమంత్రమును చెప్పి ఇపుడు ప్రణిధానము చేయు విధానము చెప్పుచున్నాడు.

సూ. తజ్జపస్తదర్థభావనమ్. 28

ప్ర.అ. తజ్జపః=ఆ ప్రణవమును జపించుట, తదర్థభావనమ్=దాని అర్థమైన పరమాత్మను భావన చేయుట అనునవి ధారణాధ్యానసమాధిరూపమగు ప్రణిధానము.

వ్యా. "జపంశ్చ ప్రణవం నిత్యం బ్రహ్మవిష్ణుశివాత్మకమ్,
కోటిసూర్యసమం తేజో ధ్యాయేదాత్మని నిర్మలమ్".

"నిత్యము ప్రణవమును జపించుచు, బ్రహ్మవిష్ణుశివాత్మకమును, కోటి సూర్యులతో సమానమును, నిర్మలమును అగు తేజస్సును మనస్సులో ధ్యానించ వలెను" ఇత్యాదిస్మృతులు ప్రణవజపము ధ్యానప్రారంభదశలో ఆచరించవలసిన అంగము అని చెప్పుచున్నవి. (భా.గ.).

యోగి ప్రణవమును జపించుచు, ప్రణవార్థమును భావించినచో ఆతని చిత్తము ఏకాగ్రమగును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"స్వాధ్యాయాద్యోగమాసీత యోగాత్స్వాధ్యాయమామనేత్,
స్వాధ్యాయయోగసంపత్యా పరమాత్మా ప్రకాశతే".

స్వాధ్యాయము (ప్రణవజపము) చేసి యోగాభ్యాసము (ధ్యానము) చేయవలెను, యోగాభ్యాసము చేసి స్వాధ్యాయము చేయవలెను, ఇట్లు చేసినచో పరమాత్మ సాక్షాత్కారము కలుగును అని చెప్పబడినది (వ్యా. భా)

అవ. ఈశ్వరయోగము సాంఖ్యయోగముకంటె చాల శ్రేష్ఠమైనది అని సూచించుటకై, బ్రహ్మవిష్ణుశివాత్మకమును, బ్రహ్మాదులకు కూడ అంతర్యామియును అగు తేజోరూపచైతన్యము ఉత్కర్షను(గొప్పతనము)ను చెప్పుచున్నాడు. (భా.గ.)

సూ. తతః ప్రత్యక్చేతనాధిగమోఽన్తరాయాభావశ్చ. 29

ప్ర.అ. తతః=ఈశ్వరప్రణిధానమువలన, ప్రత్యక్చేతనాధిగమః=జీవుని సాక్షాత్కారము, అన్తరాయాభావశ్చ=విఘ్నములు లేకపోవుటయు (నివృత్తియు) కలుగును.

వ్యా. ఈశ్వరునివిషయమున ప్రణిధానము చేసినపుడు ఈశ్వరసాక్షాత్కా రము కలుగవలెను గాని జీవసాక్షాత్కారమెట్లు కలుగును అని ఆశంకింపరాదు. ఒక శాస్త్రమును చక్కగా అభ్యసించినవానికి తత్సదృశమగు ఇతర శాస్త్రప్రవేశము అనాయాసముగా ఎట్లు కలుగునో అట్లే ఈశ్వరప్రణిధానము వలన ఈశ్వరుని వలె శుద్ధుడును, ప్రసన్నుడును, కేవలుడును, ఉపసర్గ(దోష)రహితుడును అగు జీవుని సాక్షాత్కారము కలుగవచ్చును. ఈశ్వరునికిని జీవునకును గల భేదము (జీవునకు గల) బుద్ధిసంబంధమాత్రమే. జీవుడు అనగా స్వస్వరూపము. దగ్గరగా ఉండుటచే తత్సాక్షాత్కారము కలుగును.(వ్యా.భా;వా.మి;నాగే.)

అవ. అంతరాయములను విశదీకరించుచున్నాడు.

సూ. వ్యాధిస్త్యానసంశయప్రమాదాలస్యావిరతిభ్రాన్తిదర్శనాలబ్ధ భూమికత్వానవస్థితత్వాని చిత్తవిక్షేపాస్తేఽన్తరాయాః. 30

ప్ర.అ. వ్యాధి...విక్షేపాః=వ్యాధి మొదలగు తొమ్మిదియు, చిత్తవిక్షేపాః= చిత్తవిక్షేపములు, తే=అవియే, అన్తరాయాః = అంతరాయములు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. ఈశ్వర ప్రణిధానమువలన ఈ అంతరాయములు తొలగిపోవును. ధాతు-రస-కరణముల వైషమ్యము (ఎగుడుదిగుడుగా అగుట) వ్యాధి. శరీరములోని వాత-పిత్త-కఫములనెడు ధాతువులును, ఆహార పరిణామరూపములగు రసములను, చక్షురాదికరణములును(ఇంద్రియ ములును) వైషమ్యమును పొందిన తమ స్వభావమునకు విరుద్ధములుగ అగుట **వ్యాధి** అని అర్థము. **స్త్యానము** అనగా అకర్మణ్యత్వము; యోగానుష్ఠానము చేయలేకపోవుట. గురుశాస్త్రాదులుపదేశించిన సాధనముల విషయమున, ఇవి పనిచేయునో చేయవో అను ఉభయకోటికమగు (ఇటు అటు ఊగులాడు) జ్ఞానము **సంశయము**. సమాధి-సాధనములను భావింపకుండుట, అనగా వాటిని సమకూర్చుకొనుటలో ఏమరుపాటు **ప్రమాదము**. చిత్తము శరీరము బరువెక్కుటచే ప్రవృత్తి లేక పడియుండుట **ఆలస్యము**. చిత్తమునకు విషయాసక్తి **అవిరతి**. గురుశాస్త్రాదులుపదేశించిన విషయమును విపరీతముగా గ్రహించుట **భ్రాంతిదర్శనము**. సాధనములను అనుష్ఠించినను (మున్ముందు చెప్పబోవు) యోగభూమికలను చేరలేకపోవుట **అలబ్ధభూమికత్వము**. యోగభూమిక లభించినను దానిపై స్థిరముగ నిలువజాలకుండుట **అనవస్థితత్వము**.

అవ. పై అంతరాయములతోపాటు కలుగు మరి కొన్ని అంతరాయములను కూడ చెప్పుచున్నాడు.

సూ. దుఃఖదౌర్మనస్యాఙ్గమేజయత్వశ్వాసప్రశ్వాసా విక్షేపసహభువః. 31

ప్ర.అ. దుఃఖ....ప్రశ్వాసాః=దుఃఖము మొదలగు ఐదు, విక్షేప సహభువః= పైన చెప్పిన వ్యాధ్యాదిచిత్తవిక్షేపములను అనుసరించి పుట్టునవి.

వ్యా. దుఃఖము ఎవ్వరునూ కోరనిది. దౌర్మనస్యమనగా చిత్త చాంచల్యము. అఙ్గమేజయత్వము అనగా అవయవముల కంపము. దేహములోనికి ఎక్కువ వాయువు ప్రవేశించుట శ్వాసము. దేహమునుండి వాయువు ఎక్కువగ బైటకు పోవుట ప్రశ్వాసము. ఏ నిమిత్తముచేతనైన విక్షేపములు కలిగినప్పుడు ఈ దుః ఖాదులు కలుగును. (భో.వృ.)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విక్షేపసహభువః అను పదమునకు చిత్తచాంచల్యరూపమగు విక్షేపముతో పాటు జనించునవి అని కూడ అర్థము చెప్పవచ్చును. (భా.గ; నాగే). కాని దౌర్మనస్యమ్ అనుదానికి చిత్తచాంచల్యము అని అర్థము చెప్పుటచే "చిత్తచాంచల్యము చిత్తచాంచల్యముతో పాటు కలుగును" అను అర్థము వచ్చునుగాన మొదటి అర్థమే యుక్తము. 31

అవ. ఈశ్వరప్రణిధానము చేయువారికి ఈ అంతరాయములు స్వతః సిద్ధముగనే ఉండవని చెప్పబడినది. అందుచే అంతరాయములు కలుగకుండుటకు అది ముఖ్యోపాయము. ఈశ్వరప్రణిధానము చేయజాలనివారు ఏదైన ఒకదానియందు మనస్సును బలాత్కారముచే నిలిపి ఈ అంతరాయములను తొలగించుకొనవచ్చునని చెప్పుచున్నాడు –

సూ. తత్ప్రతిషేధార్థమేకతత్త్వాభ్యాసః. 32

ప్ర.అ. తత్ప్రతిషేధార్థమ్=ఆ ఆంతరాయములను తొలగించుకొనుటకు, ఏకతత్త్వాభ్యాసః=ఏదైన ఒక తత్త్వమునందు చిత్తమును నిలుపుటకు అభ్యాసము చేయదగినది. ఇది భా.గ. నాగేశులు వ్యాఖ్యానము.

వ్యా. కాని వ్యాసభాష్యమున దీని వ్యాఖ్య వేరుగా చేయబడినది. పైన చెప్పిన విక్షేపములు సమాధికి ప్రతిబంధకములు గాన వాటిని అభ్యాస వైరాగ్యములచే తొలగించుకొనవలెను. అభ్యాసవిషయమును ముగించుచు ఈ సూత్రము చెప్పబడుచున్నది. ఇచట ఏకతత్త్వమనగా, ప్రకృతము గాన ఈశ్వరుడని అర్థము. అందుచే "విక్షేపములు తొలగుటకు ఈశ్వరప్రణిధానాభ్యాసము చేయవలెను" అని సూత్రార్థము.

అవ. అసూయాదిమంతుడై సంస్కృతచిత్తము లేనివానికి సమాధి తదుపాయసంపద లభింపదు. అందుచే అసూయాదులకు విరోధులగు చిత్త ప్రసాదోపాయములను చెప్పుచున్నాడు. (వీటిచే చిత్తమును సంస్కరించుకొనుటకు "పరికర్మ" అని పేరు) (వ్యా.భా.) ఇంతవరకును యోగసాధనములను గూర్చిన విశేషమును చెప్పి, ఇప్పుడు కొన్ని సూత్రములచే చిత్తము నిలకడగా నుండుటకు సాధన మైన శ్రద్ధావీర్యాదుపాయాభ్యాసమునందు, వశీకారము ద్వారా అప్రతిబంధమునకు హేతువులగు ఉపాయములను చెప్పుచున్నాడు (భా. గ. నాగే.)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సూ. మైత్రీకరుణాముదితోపేక్షాణాం సుఖదుఃఖపుణ్యాపుణ్య విషయాణాం భావనాతశ్చిత్తప్రసాదనమ్. 33

ప్ర.అ. సుఖదుఃఖపుణ్యాపుణ్యవిషయాణామ్=ఇతరుల సుఖదుఃఖ-ములు పుణ్యపాపములు-వీటికి సంబంధించిన, మైత్రీకరుణా ముదితోపేక్షాణామ్ = మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్షలయొక్క భావనాతః= భావనవలన, చిత్తప్రసాదనమ్= కలిగిన చిత్తప్రసాదనము, (34వ సూత్రములోని స్థితినిబన్దనా' అను పదమును నపుంసకలింగముగా మార్చి అన్వయించు కొనవలెను. స్థితినిబన్ధనమ్=స్థితికి= చిత్తము నిలుచుటకు, కారణము. భా.గ. నాగేశులు.)

వ్యా. **సుఖదుఃఖపుణ్యాపుణ్య** అను పదములకు సుఖితులు, దుఃఖితులు, పుణ్యవంతులు, అపుణ్యవంతులు అని యర్థము. సుఖపడుచున్న వారిని చూచి స్నేహభావమును భావించవలెను. అప్పుడు చిత్తమునందలి ఈర్ష్య తొలగి పోవును. దుఃఖితులను చూచినపుడు కరుణను అనగా తనకు దుఃఖము కలిగి నపుడు దానిని తొలగించుకొనవలెనని ఎట్లు ఇచ్ఛ కలుగునో అట్టి ఇచ్ఛను భావన చేయవలెను. అపుడు చిత్తములోనున్న పరాపకారేచ్ఛారూపమగు కాలుష్యము తొలగిపోవును. పుణ్యశీలులను చూచినపుడు ముదితను, అనగా సంతోషమును భావన చేయవలెను. అపుడు చిత్తమునందలి అసూయారూప కాలుష్యము తొలగి పోవును. అపుణ్యశీలులను చూచినపుడు ఉపేక్షాభావమును(దానిని గూర్చి పట్టించుకొనకపోవుట) భావించవలెను. అప్పుడు చిత్తమునందలి అమర్షరూపమగు కాలుష్యము తొలగిపోవును. ఇట్లు భావన చేయగా చేయగా రజస్తమోధర్మములు నివర్తించి శుక్లధర్మము కలుగును. సత్త్వోత్కర్షము కలవాడు వృత్తినిరోధము చేయ సమర్థుడగును. వాని చిత్తము ప్రసన్నమగును. ప్రసన్నమైన చిత్తము, చెప్పబోవు ఉపాయములను అనుష్ఠించినచో ఏకాగ్రమగును. మైత్ర్యాదిభావన లేని పక్షమున ఏ ఉపాయములును చిత్తమునకు స్థిరత్వమును కూర్పజాలవు. (తత్త్వవైశారది)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వాచస్పతిమిశ్రుని అభిప్రాయము ప్రకారము మైత్రాదులు చిత్తప్రసాదమునకు కారణము. చిత్తప్రసాదము లభించిన పిమ్మట రాబోవు సూత్రములలో చెప్పనున్న ఉపాయములను అనుసరించుటచే చిత్తస్థైర్యము లభించును. భా.గ నాగేశులు మైత్ర్యాదులు కూడా స్థితినిబంధనములే(స్థితికి కారణములే)అని వ్యాఖ్యానించినారు.

ముఖ్యముగా చిత్తవిక్షేపమును కలిగించేవి రాగద్వేషములే గాన (మైత్ర్యాదులచే) వాటిని మొదటితో పెరికివేయగా చిత్తము ప్రసన్నమై ఏకాగ్రతను పొందును. (భో.వృ.)

అవ. ఇపుడు చిత్తస్థితికి ఉపాయములను చెప్పుచున్నాడు. (వా.మి.) ఇపుడు ప్రసాదమునకు మరొక సాధనమును చెప్పుచున్నాడు (భా.గ; నాగే.) -

సూ. ప్రచ్ఛర్దనవిధారణాభ్యాం వా ప్రాణస్య. 34

ప్ర.అ. (35వ సూత్రములోని "స్థితినిబన్ధనీ" అను పదమునుండి స్థితి' అనుదానిని గ్రహించి ఈ సూత్రమును వ్యాఖ్యానించవలెను), ప్రాణస్య=ప్రాణ వాయువు యొక్క ప్రచ్ఛర్ధనవిధారణాభ్యాం వా = ప్రచ్ఛర్ధనవిధారణములచేత నైనను, చిత్తమునకు స్థితిని సంపాదింపవలెను.

వ్యా. ప్రచ్ఛర్ధనమనగా మనము, ప్రాణవాయువును బైటకు వదలుట. దీనికే రేచకమని పేరు. విధారణమనగా ఆ విధముగా విడువబడిన ప్రాణ వాయువును వెంటనే లోనికి తీసికొనక కొంతసేపు బైటనే ఉంచుట. ఈ రెండింటి చేతను కూడా చిత్తమునకు స్థితిని సంపాదించవచ్చును. వా అనుటచే వికల్పము అని సూచితమైనది. వికల్పమనగా అది గాని ఇది గాని అని అర్థము. ఈ వికల్పము 35వ సూత్రములో చెప్పనున్నదానితోడనే కాని పూర్వసూత్రమున చెప్పిన మైత్ర్యాదిభావనలతో కాదు. అవి అవశ్యాచరణీ యములు. వాటికి వైకల్పికత్వము లేదు. (వ్యా.భా.వా.మి.)

దీనికి భా.గ. నాగేశుల వ్యాఖ్యానము మరొక విధము ఉన్నది. ప్రచ్ఛర్దన మనగా రేచకము. విధారణ మనగా కుంభకము. పీల్చిన ప్రాణవాయువును కొంతకాలము పైకి పోకుండ నిరోధించుట. ఇచట రేచక కుంభములను పేర్కొనుటచే పూరకము (ప్రాణవాయువును లోనికి గ్రహించుట) అనునది

In Public domain. Digitization Muthulakshmi Research Academy

లేనిచో కుంభకము కుదరదు గాన దానిని కూడ చెప్పినట్లే. ఈ విధముగా రేచకపూరక కుంభకములను చేయుటచేత గూడ చిత్తప్రసాదము కలుగును.

ఇన్ద్రియాణాం బలం ప్రాణాస్తేషాం యత్నేన నిగ్రహాత్,
విక్షేపహేతవోఽక్షాణాం దహ్యన్తే దోషరాశయః.

ఇంద్రియములకు బలమునిచ్చునది ప్రాణవాయువు. ఆ ప్రాణ వాయువును ప్రయత్నపూర్వకముగ నిగ్రహించుటవలన ఇంద్రియములను ఇటునటు పరుగులెత్తించు దోషరాశులు భస్మమై పోవును అని స్మృతి వాక్యము.

లేదా ప్రచ్ఛర్దనమనగా రేచకము. విధారణమనగా పూరకము. తావన్మాత్రప్రాణాయామము కూడ నాడీశుద్ధి కలిగించును అని వసిష్ఠ సంహితాదులలో చెప్పబడినది. కావున రేచక-పూరకరూప-ప్రాణాయామము చేత కూడ చిత్త ప్రసాదము కలుగునని సూత్రార్థము. (భా.గ.నాగే.)

అవ. మరి యొక స్థితినిబంధనమును హేతువును చెప్పుచున్నాడు. (వా.మి.నాగే.) (పై రెండు సూత్రములలో చెప్పిన) ప్రసాదనమే కాక మరికొన్ని స్థితినిబంధనములను కూడ చెప్పుచున్నాడు (భా.గ.)

సూ. విషయవతీ వా ప్రవృత్తిరుత్పన్నా మనసః స్థితి నిబన్ధనా.
('స్థితినిబన్ధనీ' వ్యా. భా. పాఠము). 35

ప్ర.అ. విషయవతీ=దివ్యగంధాదిపంచవిషయములు గల, ప్రవృత్తిః= ప్రకృష్టమైన వృత్తి, సాక్షాత్కారము, ఉత్పన్నా=పుట్టినదై, మనసః= మనస్సు యొక్క స్థితినిబన్ధనా=స్థితికి కారణమగును. నాసికాగ్రముపై యోగ శాస్త్రోక్త రీతిని చిత్తమును నిలిపినచో అల్పకాలమునందే దివ్యగంధజ్ఞానము కలుగును. దీనికి గంధసంవిత్ అని పేరు. ఇది ప్రవృత్తి. ఇట్లే జిహ్వాగ్రమున రససంవిత్, తాలుప్రదేశమున రూపసంవిత్, జిహ్వామధ్యమున స్పర్శసంవిత్, జిహ్వామూల మున శబ్దసంవిత్ కలుగును. ఇట్టి దివ్యగంధాదిసాక్షాత్కారములు కలుగుటచే శాస్త్రోక్తసాధనముల విషయమున సంశయములు తొలగి, విశ్వాసమేర్పడును. చిత్తమునకు స్థైర్యము చేకూరును. ఈ వృత్తులలో గంధాదులు విషయములు గాన ఈ వృత్తులు విషయవత్తులు. అట్లే చంద్ర-సూర్య-గ్రహ-మణి-దీప

కాంతులపై గూడ చిత్తము నిలుపగా కొన్ని దివ్యానుభూతులు కలుగును. ఆ వృత్తులు కూడ విషయవత్తులే ఈ విషయవచ్చిత్తవృత్తులు చిత్తస్థైర్యము ద్వారా సమాధిప్రజ్ఞను పొందుటకు ఉపకరించును.

దివ్యగంధాదివిషయకచిత్తవృత్తులు సమాధిప్రజ్ఞకు ఎట్లుపకరించును అను ప్రశ్నకు సమాధానము వ్యాసభాష్యములో చెప్పబడినది. ఆ యా శాస్త్రములును, ఆచార్యులును ఉపదేశించిన విషయములు యథార్థములే అయినను ఆ విషయములలో కొన్నియైనను ప్రత్యక్షముగ తెలియనిచో పూర్తి విశ్వాసము కలుగదు. అల్పకాలమునందే ఇట్టి దివ్యగంధాదివిషయవృత్తులు కలిగినచో అపవర్గమువరకును ఉన్న అతిసూక్ష్మవిషయములందు కూడ పూర్తి విశ్వాసం కలిగి శ్రద్ధా-వీర్య-స్మృతి-సమాధులు ఎట్టి ప్రతిబంధకములు లేకుండ సిద్ధించును. ఈ విధమున విషయవతియగు ప్రవృత్తి చిత్తస్థైర్యహేతువు.

అవ. మరి యొక స్థితినిబంధనమును చెప్పుచున్నాడు -

సూ. **విశోకా వా జ్యోతిష్మతీ. 36**

ప్ర.అ. విశోకా=శోకరహితమైన, జ్యోతిష్మతీ వా=జ్యోతిష్మతియను వృత్తి యైనను చిత్తస్థితిహేతువగును.

వ్యా. యోగాభ్యాసముచే పురుషసాక్షాత్కారము గాని అంతఃకరణ సాక్షాత్కారము గాని కలుగును. ఆ సాక్షాత్కారరూపమగు వృత్తి ప్రకాశరూపమగుటచే దానికి "జ్యోతిష్మతి" అని పేరు. అది కలిగిన తోడనే శోకములన్నియు నశించును గాన అది "విశోక". చాంచల్యమునకు హేతువైన శోకము తొలగిపోవుటచే చిత్తమునకు స్థితి కలుగును. పురుష(ఆత్మ)సాక్షాత్కారము కలిగిన పిమ్మట చిత్తస్థితివలన ప్రయోజనమేమి? అని సందేహము కలుగవచ్చును. ఇది అసంప్రజ్ఞాతసమాధికి హేతువగు పరవైరాగ్యము కలుగుటకు ఉపయోగించును. అట్లే సాక్షాత్కారాభ్యాసము చేసిన గాని మిథ్యాజ్ఞానవాసన పూర్తిగ ఉన్మూలితము కాదు. దీనిని ఉన్మూలింపచేయుటకు పరమాత్మయందు చిత్తమును నిలుపుటకును గూడ ఇది ఉపయోగించును. (భా.గ. నాగే.)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వాచస్పతిమిశ్రులు వ్యాసభాష్యానుసారముగా మరి కొన్ని విషయములు చెప్పినారు. హృదయ-వక్షః స్థలముల మధ్య అష్టదలపద్మము అధోముఖముగా ఉండును. దానిని రేచక ప్రాణాయామముచేత ఊర్ధ్వముఖ మును చేసి దానియందు చిత్తమును నిలుపవలెను. ఆ అష్టదలకమల మధ్యమున సూర్యమండలరూపమగు అకారమున్నది. అది జాగరితస్థానము. దానిపైన చంద్రమండలరూపమగు ఉకారమున్నది. అది స్వప్నస్థానము. దానిపైన వహ్ని మండలస్వరూపమగు మకారమున్నది. అది సుషుప్తిస్థానము. దాని పైన పరమ వ్యోమస్వరూపమగు అర్ధమాత్రమున్నది. అది బ్రహ్మనాదము. అది తురీయ స్థానము. కమలకర్ణికలో ఊర్ధ్వముఖమై సూర్యాదిమండల మధ్యముగుండా పోవు బ్రహ్మనాడి ఉన్నది. దానికంటే కూడా పైన సుషుమ్నానాడి ఊర్ధ్వముఖముగ నున్నది. ఈ సుషుమ్నా నాడి బాహ్యములైన సూర్యమండలాదుల వరకును చొచ్చుకొని పోవుచుండును. అది చిత్తమునకు స్థానము. ఆ చిత్తమునందు మనస్సు నిలుపు యోగికి చిత్తసంవిత్ కలుగును. చిత్తము ప్రకాశస్వభావము. ఆకాశమువలె సర్వవ్యాప్తము. చిత్తసంవిద్రూపమైన ఈ ప్రవృత్తి సూర్యచంద్రమణ్యాదిప్రభాకారములతో వివిధరూపములు చెందును. మనస్సును మనస్సుపై కాక అస్మితపై (అహంకారసంవలితాత్మ చైతన్యముపై) నిలిపినచో అది (మనస్సు) అస్మితతో చేరినదై, తరంగములులేని మహోదధివలె శాంతముగను, అనంతముగను, అస్మితామాత్రరూపముగను ఉండును. పై వ్యాఖ్యలలో చెప్పినట్లు చిత్తమును చిత్తముపై నిలపగా చిత్తవిషయవతియగు ప్రవృత్తి కలుగును. అస్మితపై (అహంకారసంవలితాత్మ పై) నిలుపగా అస్మితామాత్రరూపప్రవృత్తి కలుగును. ఈ రెండు విధములగు ప్రవృత్తికిని జ్యోతిష్మతి అని పేరు. మొదటి దానిలో సూర్యచంద్రాదిప్రభారూపములుండుటచే అది జ్యోతిష్మతి. రెండవదానిలో రజస్తమోగుణములు పూర్తిగా తొలగిపోయిన అస్మితయే సత్త్వమయమైన జ్యోతిస్సుగా ఉండుటచే అది జ్యోతిష్మతి. ఈ జ్యోతిష్మతీనామకప్రవృత్తి యోగి చిత్తమునకు స్థిరత్వమును సమకూర్చును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. మరి యొక స్థితినిబంధనమును చెప్పుచున్నాడు.

సూ. వీతరాగవిషయం వా చిత్తమ్. 37

ప్ర.అ. వీతరాగవిషయం వా= రాగరహితులైన సనకాదుల చిత్తము విషయముగా గలదైనను, చిత్తమ్=చిత్తము, స్థిరనిబన్ధనమ్=స్థితికి హేతువు అనగా స్థితి కలదగును.

వ్యా. పరమవైరాగ్యవంతులగు సనకాదులు చిత్తముపై చిత్తము నిలిపినచో గూడ అనగా వారి చిత్తమును ధ్యానించిన యెడల చిత్తమునకు స్థితి లభించును.

అవ. మరొక స్థితినిబంధనమును చెప్పుచున్నాడు –

సూ. స్వప్ననిద్రాజ్ఞానాలమ్బనం వా. 38

ప్ర. అ. స్వప్ననిద్రాజ్ఞానాలమ్బనం వా=స్వప్నజ్ఞానము, నిద్రాజ్ఞానము ఆలంబనము కలదైనను, అనగా స్వప్ననిద్రలను గూర్చి ధ్యానము చేసిన యెడలను కూడ చిత్తము స్థిరమగును.

వ్యా. జాగ్రదవస్థలో ప్రపంచజ్ఞానము కలుగుచున్నది. ఇది అంతయు స్వప్నజ్ఞానమే అని భావించవలెను. సంసారులందరును ఆత్మస్వరూపజ్ఞానము లేనివారై సుషుప్తిలో ఉన్నారు అని భావించవలెను. ఈ విధముగ స్వప్నసుషుప్తి భావన చేయుటచేత గూడ చిత్తము స్థిరమగును. కావుననే –

"దీర్ఘస్వప్నమిమం విద్ధి దీర్ఘం వా చిత్తవిభ్రమమ్,
దీర్ఘం వాపి మనోరాజ్యం సంసారం రఘునన్దన"

రామా! ఈ సంసారము దీర్ఘమైన స్వప్నమని కాని, దీర్ఘమైన చిత్తవిభ్రమ మని కాని, దీర్ఘమైన మనోరాజ్యమనిగాని(ఊహానిర్మితరాజ్యమని గాని తెలుసుకొనుము అనియు,

బ్రహ్మాద్యం స్థావరాన్తం చ ప్రసుప్తం యస్య మాయయా
తస్య విష్ణోః ప్రసాదేన యది కశ్చిత్ ప్రముచ్యతే

ఏ విష్ణువు మాయచేత బ్రహ్మాదిస్థావరాంతజగత్తు గాఢనిద్రలో ఉన్నదో అట్టి విష్ణువు అనుగ్రహముచేతనే ఏ ఒక్కడైనను ముక్తి పొందవచ్చునేమో అనియు చెప్పబడినది. ఇది భావాగణేశనాగేశానుసారి వ్యాఖ్యానము, వ్యాస

In Public domain. Digitization Muthulakshmi Research Academy
వాచస్పతుల వ్యాఖ్య దీనికి చాల భిన్నముగ ఉన్నది. ఈ సాధకుడు ఎప్పుడైన స్వారాధ్యదేవతామూర్తిని పూజించుచున్నట్లు స్వప్నము వచ్చి మెలకువ వచ్చినచో అపుడాతడు ప్రసన్నచిత్తుడై స్వప్నజ్ఞానవిషయమైన ఆ మూర్తియందే మనస్సు నిలిపి ధ్యానము చేసినచో చిత్తమునకు స్థితి లభించును. అనగా దేవతోపాసన చేయు సాధకునకు అట్లు చేయగా చేయగా ఏదో ఒక దివసమున తద్దేవతానుగ్రహముచే స్వప్నమున, తత్సాక్షాత్కారము కలుగును. ఆ స్వప్నమును అట్లే మరచిపోక దానిపై మనస్సును నిలువవలెనని దీని భావము, లేదా ప్రతి ఒకనికిని గాఢనిద్రావస్థ కలుగుచునే ఉండును. దేనినుండి మేల్కొన్న పిదప **నేను సుఖముగా నిద్రించాను** అను జ్ఞానము (ప్రత్యవమర్శ) కలుగునో అట్టి సాత్వికనిద్రావస్థను గూర్చి భావన చేసినను మనస్సునకు స్థైర్యము లభించును.

అవ. మరొక ఉపాయము చెప్పుచున్నాడు :

సూ. యథాభిమతధ్యానాద్వా. 39

ప్ర.అ. యథాభిమతధ్యానాద్వా=తనకు ఏ హరిహరమూర్త్యాదికము ఇష్టమో దానిని ధ్యానించినను చిత్తమునకు స్థితి లభించును.

వ్యా. ఇచట వ్యాసభాష్యములో "యదేవ అభిమతం తదేవ ధ్యాయేత్" అనగా తనకు ఏది ఇష్టమో దానిని గూర్చియే ధ్యానము చేయవలెను అని చెప్పబడినది. **దేవతామూర్త్యాదికమ్** అను మాట వ్యాఖ్యాతలు చేర్చినారు. అందుచేత దేవతామూర్తి పైననే కాక మరి ఏ విషయమునందైనను కూడ చిత్తము నిలువవచ్చును అని తెలియుచున్నది.

ప్రసాదనము మొదలు ఇంతవరకును చెప్పిన స్థితినిబంధనములకు **పరికర్మ** అని పేరు. ఇవి చిత్తసంస్కారరూపములగుటచే వీటికా పేరు. వీటిని సాధకుడు తన ఇచ్ఛానుసారముగా అనుష్ఠించవచ్చును.

అవ. చిత్తస్థైర్యకరమగు ఈ పరికర్మ సిద్ధించుటవలన కలుగు ఫలమును చెప్పుచున్నాడు (భా.గ.నాగే.). ఈ పరికర్మానుష్ఠానముచే చిత్తస్థితి లభించినదని ఎట్లు తెలియును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు (వా.మి.) –

సూ. పరమాణుపరమహత్త్వాన్తోఽస్య వశీకారః. 40

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ. అస్య=పరికర్మసంస్కృతమైన ఈ చిత్తమునకు, పరమాణుపరమహత్త్వాన్తః=పరమాణువు మొదలు పరమమహత్త్వము పర్యంతమును, వశీకారః=వశీకారము కలుగును. పైవిధముల పరికర్మితమైన చిత్తమును సూక్ష్మ వస్తువులపై నిలుప యత్నించినచో అతిసూక్ష్మములగు పరమాణువులవరకును ఇది స్థితిని పొందును. మహత్పరిమాణము కలవాటిపై నిలుప యత్నించినచో పరమమహత్పరిమాణము గల విషయముల వరకును ఇది స్థితిని పొందును. ఈ విధముగ అతిసూక్ష్మముల వైపు వెళ్ళినను, అతిమహత్పరిమాణముల వైపు వెళ్ళినను చిత్తమునకు ఎట్టి వ్యాఘాతము ఉండదు. ఇట్టి వ్యాఘాతమేదియు లేకుండ రెండు కోటుల వైపునకు చిత్తమునకు శక్తి కలుగుటయే వశీకారము. ఇట్టి వశీకారముచే పరిపూర్ణమైన చిత్తమునకు ఇక పరికర్మాభ్యాసముతో పని ఉండదు.

పరమమహత్త్వశబ్దమునకు భావాగణేశుడు **పరమం మహత్త్వం యేషాం తే పరమమహతా** అను విగ్రహముచే పరమమహత్పరిమాణముగల పురుషులు అని అర్థము చెప్పినాడు.

నాగేశుడు **వశీకారః** అను పదమునకు వశీకారము, వైరాగ్యము అను అర్థము చెప్పినాడు. అది ఇచ్చట అసంగతము. సాధారణముగా ఆ వైరాగ్యమును వశీకారః అని కాక **వశీకారసంజ్ఞా** అని నిర్దేశించుట ఈ శాస్త్రసంప్రదాయము.

అవ. ఇంతవరకును చిత్తస్థితికి ఉపాయములను చెప్పి, స్థితి లభించిన చిత్తమునకు వశీకారము కూడ చూపబడినది. ఇట్టి చిత్తమునకు ఏ విషయము గల ఏ స్వరూపము గల సంప్రజ్ఞాతము కలుగునో చెప్పుచున్నాడు.

సూ. క్షీణవృత్తేరభిజాతస్యేవ మణేర్గ్రహీతృగ్రహణగ్రాహ్యేషు
తత్-స్థతదఞ్జనతాసమాపత్తిః. 41

ప్ర.అ. క్షీణవృత్తేః=క్షీణమైన రాజసతామసవృత్తులు గల చిత్తమునకు, అభిజాతస్య=శ్రేష్ఠమైన, మణేరివ=స్ఫటికాదిమణికి వలె, గ్రహీతృగ్రహణగ్రాహ్యేషు=తెలిసికొను పురుషుడు, తెలిసికొనుటకు సాధనమగు ఇంద్రియములు, గ్రహింపదగిన పదార్థములు-వీటియందు తత్స్థతదనతా=

In Public domain. Digitization Muthulakshmi Research Academy

దానియందు నిలచినది తదాకారముగా అగుట అనెడు, సమాపత్తిః=సమాపత్తి కలుగును ఇదియే సంప్రజ్ఞాతసమాధి (వా.మి.)

భావాగణేశనాగేశుల వ్యాఖ్యప్రకారము క్షీణవృత్తేః=ధ్యేయముకంటె భిన్న మైన వృత్తులేవియు లేని అనగా సంప్రజ్ఞాతయోగము లభించిన, చిత్తమునకు... సమాపత్తిః=సాక్షాత్కారము కలుగును అని అర్థము.

వ్యా. గ్రహీతృగ్రహణగ్రాహ్యములందు చిత్తమును నిలిపినపుడు అట్టి చిత్తము పూర్తిగా గ్రహీత్రాద్యాకారమగును. వాటి సర్వవిశేషములును దీనియందు, ప్రక్కనున్న జపాపుష్పాదుల రంగులు శుద్ధమైన స్ఫటికాదులందు సంక్రమించి నట్లు, సంక్రమించును. ఈ విధముగ తత్-స్థమగు, అనగా ఆ గ్రహీత్రాదులపై నిలచిన చిత్తమునకు తదంజనత్వము అనగా తదాకారత్వము కలుగును. అదియే సమాపత్తి. సమాపత్తి అనగా సాక్షాత్కారమనియు, అట్టి సాక్షాత్కారము కలుగుటయే సంప్రజ్ఞాతసమాధిఫలమనియు భా. గ. నాగేశుల అభిప్రాయము. ఇది సంప్రజ్ఞాతసమాధిస్వరూపమని వాచస్పతిమిశ్రుల అభిప్రాయము.

సూత్రములోని **గ్రహీతృగ్రహణగ్రాహ్య** అను క్రమమును మార్చి **గ్రాహ్య గ్రహణగ్రహీతృ** అని గ్రహింపవలెను. స్థూలము, సూక్ష్మము, సూక్ష్మతరము అని గ్రాహ్యము మూడు విధములు. పంచమహాభూతములు స్థూలములు. పంచ తన్మాత్రలు సూక్ష్మములు. ప్రకృతి సూక్ష్మతరము. **గృహ్యతే అనేనేతి గ్రహణమ్** అను వ్యుత్పత్తిచే **గ్రహణం** అనగా త్రయోదశవిధములగు ఇంద్రియములు. గ్రహీత అనగా పురుషుడు. ఇట్లు గ్రాహ్య-గ్రహణ-గ్రహీతలు అనుదానిచే యోగమునకు విషయమైన సకలవస్తువులును సంగ్రహింపబడినవి. ఈ మూడింటిని ఆలంబనముగా గ్రహించిన చిత్తము తన స్వరూపమును కప్పివేసికొని గ్రాహ్యాద్యుపరక్తమై, గ్రాహ్యాదిరూపమును పొంది తద్రూపమున భాసించును.

అవ. పూర్వసూత్రములో సామాన్యరూపముగా సమాపత్తి చెప్పబడినది. ఇది సవితర్క, నిర్వితర్క, సవిచార, నిర్విచార అని నాలుగు విధములు. అందు సవితర్కసమాపత్తిని విశదీకరించుచున్నాడు :

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సూ. తత్ర శబ్దార్థజ్ఞానవికల్పైః సంకీర్ణా సవితర్కా సమాపత్తి. 42

ప్ర.అ. తత్ర=విభిన్నములగు సమాపత్తులలో, శబ్దార్థజ్ఞానవికల్పైః= శబ్దార్థజ్ఞానముల వికల్పములతో, సంకీర్ణా=సంకీర్ణమైన సమాపత్తి సవితర్కా= సవితర్కము.

వ్యా. 44 వ సూత్రములో సూక్ష్మసమాపత్తిని గూర్చి చెప్పనున్నాడు, అందుచే ఈ రెండు సూత్రములలో (42 43) చెప్పినది స్థూలసమాపత్తియని పరిశేష న్యాయముచే తెలియబడుచున్నది.

శబ్దము వేరు, అర్థము వేరు, జ్ఞానము వేరు. శబ్దము ధ్వన్యాత్మకము. అర్థము మూర్తజడస్వభావము, జ్ఞానము ప్రకాశరూపము, మూర్తిరహితము. ఈ విధముగ పరస్పరభిన్నములైన శబ్దార్థజ్ఞానములను ఇతరేతరాధ్యాసచేత అనగా శబ్దమే అర్థము. అర్థమే శబ్దము, శబ్దార్థములే జ్ఞానము ఇత్యాది రూపమున ఒక దానిపై మరొకదానిని ఆరోపించుటచే **గౌరితి శబ్దః** (గౌః అని శబ్దము), **గౌరిత్యర్థః** (గౌః అని అర్థము), **గౌరితి జ్ఞానమ్** (గౌః అని జ్ఞానము) అను వికల్పములు లోకములో కనబడుచున్నవి. **గౌరితి శబ్దః** అనునపుడు **గౌః** అను అర్థజ్ఞానములకు గోశబ్దాభేదవికల్పము. **గౌరిత్యర్థః** అనునపుడు **గౌః** అను శబ్దజ్ఞానములకు అర్థాభేదవికల్పము. **గౌరితి జ్ఞానమ్** అనునపుడు **గౌః** అను శబ్దార్థములకు జ్ఞానాభేదవికల్పము. సమాపత్తిని సాధించిన యోగికి కలిగిన సమాధిలో గోచరమగు గవాదిస్థూలపదార్థములు ఇట్టి శబ్దార్థజ్ఞానవికల్పము లతో అనువిద్ధమై ఉన్నచో అట్టి సంకీర్ణ (వికల్పమిశ్రమగు) సమాపత్తి సవితర్క సమాపత్తి అని అందురు. విపరీతమైన తర్కణమున్నది కనుక ఇది సవితర్కము. ఇదియే సవికల్పము. శబ్దార్థజ్ఞానవికల్పములే కాక మరి ఏ ఇతర వికల్పములు(భ్రాంతికృతములైన ఆరోపణలు) ఉన్నను అది సవికల్పమే (సవితర్కమే). సవితర్కసమాధిలో కలుగు ప్రత్యక్షము అపరప్రత్యక్షము.

అవ. స్థూలసమాపత్తిలో ద్వితీయభేదమైన నిర్వితర్కసమాధిని చెప్పుచున్నాడు

సూ. స్మృతిపరిశుద్ధౌ స్వరూపశూన్యేవార్థమాత్రనిర్భాసా నిర్వితర్కా 43

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.స్మృతిపరిశుద్ధౌ=సంకేతస్మృతి తొలగిపోయినదగుచుండగా, స్వరూప శూన్యేవ=స్వరూపశూన్యమువలెనున్నదియు, అర్థమాత్రనిర్భాసా=కేవలము అర్థముయొక్క భానముమాత్రమే ఉన్న (అర్థమాత్రావగాహియైన) సమాపత్తి, నిర్వితర్కా=నిర్వితర్కము.

వ్యా. ఈ శబ్దమునకు ఇది అర్థము అను ఈశ్వరాదికృత నిర్ణయమునకు సంకేతమని పేరు. ఇది "శబ్దమే అర్థము, అర్థమే శబ్దము" అను అధ్యాసమే; అనగా అభేదాధ్యారోపమే అని యోగశాస్త్రమతము. పూర్వ సూత్రములో చెప్పిన వికల్పమునకు ఈ సంకేతస్మృతియే కారణము. సమాపత్తి శ్రవణమనననిధిధ్యాసనములచే కలుగును కదా? సంకేత స్మరణమున్ననే శ్రవణము జరుగును. కాల్పనికమైన శబ్దార్థాభేదమే సంకేతము గాన సంకేత స్మృతివలన కలుగు శాబ్దబోధలో కూడ ఆ శబ్దార్థముల అభేదము భాసించును. ఇట్లే శ్రవణకార్యమైన మననమునందును. నిదిధ్యాసనము నందును, ప్రాథమికసాక్షాత్కారము (సవితర్కసమాపత్తి)నందును కూడ ఈ అభేదము భాసించును. క్రమముగా ధ్యేయవస్తువుపై అత్యధికమగు ఏకాగ్రత కలుగగా వికల్పరూపమగు ఈ సంకేతస్మృతి పరిశుద్ధమగును, అనగా తొలగిపోవును. అపుడు సమాపత్తి స్వరూపశూన్యమువలె అగును. శబ్ద-జ్ఞానములు స్ఫురింపక పోవుటచే అభేదారోపప్రసక్తి ఉండదు. ధ్యేయమగు అర్థము (విషయము) మాత్రమే భాసించును. ఈ విధముగ వికల్పశూన్యమగు స్థూలసమాపత్తికి నిర్వితర్కసమాపత్తియని పేరు. (భా.గ. నాగేశులు).

వ్యాస వా. మిశ్రుల వ్యాఖ్యానము కొంచెము భిన్నముగా ఉన్నది. ఆగమానుమానములు శబ్దసంకేతస్మరణమును బట్టి ప్రవర్తించును. సంకేతము, గౌః అను శబ్దమే గోవు అను అర్థము, గోవు అను అర్థమే గోశబ్దము, గోశబ్దార్థములే గోజ్ఞానము ఇత్యాదివిధమున శబ్దార్థజ్ఞానముల ఇతరేతరాధ్యాసరూపమైనది. ఈ సంకేతమును బట్టి ఆగమజ్ఞానానుమాన జ్ఞానములు ఏర్పడును గాన తత్పూర్వకమగు అనగా ఆగమజ్ఞాన అనుమాన జ్ఞానములద్వారా కలిగిన, సమాధిప్రజ్ఞ సవితర్కము. చిత్తము అభ్యాసవశముచే ఎపుడు అర్థమాత్రమునందు మాత్రమే లగ్నమగునో అపుడు సంకేతస్మృతియు,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

దానిని పట్టి వచ్చిన శ్రుత (అగమ)జ్ఞాన-అనుమానజ్ఞానముల వికల్పములును తొలగిపోవును. అపుడు వికల్పశూన్యమగు సమాధిప్రజ్ఞలో అర్థము స్వరూపమాత్రముతోడనే భాసించును; వికల్పితరూపముతో భాసించదు. అది నిర్వితర్కసమాపత్తియని అర్థము. అది యోగులకు కలుగు పర ప్రత్యక్షము. ఈ సమాపత్తిలో విషయమగు అర్థము మహత్పరిమాణము కలదియు, "ఇది ఒక పదార్థము" అను బుద్ధికి గోచర మగునదియు, అణుతన్మాత్రాదుల కలయికచే ఏర్పడిన అవయవియు అగు ఘటాదిపదార్థము.

అవ. పై సూత్రములలో స్థూలసమాపత్తికి సంబంధించిన సవితర్క నిర్వితర్కభేదములను విశదీకరించి సూక్ష్మసమాపత్తిలో కూడ ఏతద్భేదద్వయమున్న-దని అతిదేశించుచున్నాడు -

(ఒకదానికి చెప్పిన అంశము మరోదానికి కూడ వర్తించునని చెప్పుటకు అతిదేశమని పేరు)

సూ. ఏతయైవ సవిచారా నిర్విచారా సూక్ష్మవిషయా వ్యాఖ్యాతా. 44

ప్ర.అ. ఏతయైవ=సవితర్కనిర్వితర్కరూపమైన ఈ స్థూలవిషయ సమాపత్తిచేతనే, సవిచారా=సవిచారము నిర్విచారా=నిర్విచారము అను, సూక్ష్మవిషయా=సూక్ష్మవిషయసమాపత్తి, వ్యాఖ్యాతా=వ్యాఖ్యానించబడినది అనగా ఆ సమాపత్తిని గూర్చి చెప్పిన లక్షణము ఈ సమాపత్తిలో కూడ ఉండును గాన దీనిని గురించి వేరుగ చెప్పవలసిన పని లేదని అర్థము.

వ్యా. ఘటాదిధర్మములకు కార్యములకు కారణములగు భూతసూక్ష్మ ములపై చిత్తమును నిలిపినపుడు సూక్ష్మసమాపత్తి సిద్ధించును. చిత్తము స్థూలమునుండి సూక్ష్మమునకు పోవును గాన ప్రారంభమున సూక్ష్మ సమాపత్తిలో స్థూలకార్యముల సంపర్కము, దేశకాలనిమిత్తముల అనుభవము కూడ ఉండును. పైన, క్రింద, పార్శ్వములు మొదలగునవి దేశము, కాలము వర్తమానకాలము, నిమిత్తమనగా కారణము. పార్థివపరమాణువు గంధతన్మా త్రాప్రధానములగు పంచతన్మాత్రలవలన ఉత్పన్నమగును. జలపరమాణువు రసతన్మాత్రాప్రధానములైన, గంధతన్మాత్రాభిన్నములైన నాలుగు తన్మాత్రల వలనను, తైజసపరమాణువు రూపతన్మాత్రాప్రధానములైన, గంధరస

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తన్మాత్రాభిన్నములగు మూడు తన్మాత్రలవలనను, వాయవీయపరమాణువు స్పర్శప్రధానములైన స్పర్శశబ్దతన్మాత్రలవలనను, ఆకాశపరమాణువు శబ్ద తన్మాత్రవలనను ఉత్పన్నమగును. స్థూలసమాపత్తి వికల్పములతో సంకీర్ణమై నట్లు సూక్ష్మసమాపత్తి కార్యదేశకాలనిమిత్తాదులతో సంకీర్ణమైనచో అది సవిచార అని అర్థము. అట్లే స్థూలసమాపత్తి వికల్పసంకీర్ణము కానిచో నిర్వితరసమాపత్తియైనట్లు సూక్ష్మసమాపత్తి కార్యదేశకాలనిమిత్తాదులతో సంకీర్ణముకానిచో నిర్విచారము.

సవితర్క-నిర్వితర్క-స్థూలసమాపత్తులకును సవిచారనిర్విచార సూక్ష్మ సమాపత్తులకును సామ్యమున్నట్లు ఈ సూత్రమునందు చెప్పబడినది. అన్యసంబంధముండుట లేకపోవుట అను అంశమునందు మాత్రమే సామ్యము. సవితర్కస్థూలసమాపత్తిలో వికల్పములతో సంకీర్ణత్వముండును; సవిచార సమాపత్తిలో కార్యదేశకాలాదులతో సంకీర్ణత్వముండును. నిర్వితరస్థూలసమాపత్తిలో వికల్పసంపర్కముండదు; నిర్విచారసూక్ష్మ సమాపత్తిలో కార్యదేశకాలాది సంకీర్ణత్వముండదు. ఇంతవరకే ఈ రెండింటికిని సామ్యము. సాధకుడగు యోగికి మొదట స్థూలసమాపత్తియు, పిదప సూక్ష్మసమాపత్తియు కలుగును. అందును సవితర్కము, నిర్వితర్కము, సవిచారము, నిర్విచారము అని క్రమము. సవిచారసూక్ష్మసమాపత్తి భూమికను చేరుసరికి అంతకుముందు లభించిన నిర్వితర్కభూమికలోనే వికల్పము లన్నియు తొలగిపోయినవి గాన ఈ భూమికలో వికల్పముల ప్రసక్తి లేదు కదా; అని భా.గ. నాగేశులు ప్రతిపాదించినారు. కాని వాచస్పతిమిశ్రుల అభిప్రాయము మరొక విధముగ ఉన్నట్లు కనపబడుచున్నది. స్థూలపదార్థములను ప్రత్యక్షముగ గ్రహించి వాటిపై చిత్తము నిలపగా స్థూలసమాపత్తి కలుగును. కాని సూక్ష్మము లైన పరమాణ్వాదులు ప్రత్యక్షగమ్యములు కావు. కేవలము ఆగమానుమాన గమ్యములు. ఆగమాదులద్వారా సంకేతజ్ఞానము వాటి విషయమున కలుగును. అందుచే సవిచారసమాపత్తి సంకేతస్మృత్యాగమానుమానములతో అనువిద్ధమైయున్నచో అది సవిచారము, అట్లు కానిచో నిర్విచారము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. సూక్ష్మవిషయకసమాపత్తిలో ఎంతవరకు సూక్ష్మమైన పదార్థము గోచర మగును? అనగా భూతసూక్ష్మములు మాత్రమే గోచరమగునా అంతకంటె సూక్ష్మమైనవి కూడ గోచరమగునా? అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

సూ. సూక్ష్మవిషయత్వం చాలిఙ్గపర్యవసానమ్. 45

ప్ర.అ. సూక్ష్మవిషయత్వం చ=సూక్ష్మసమాపత్తికి గల సూక్ష్మవిషయత్వము, అలిఙ్గపర్యవసానమ్=అలింగమైన ప్రధానము వరకును. ప్రధానము వరకును గల సూక్ష్మార్థములు సూక్ష్మసమాపత్తిలో గోచరములగునని అర్థము.

వ్యా. పార్థివాణువుకు సంబంధించిన గంధతన్మాత్రత్వము సమాపత్తిలో సూక్ష్మవిషయము. ఇట్లే ఆప్యపరమాణువునకు సంబంధించిన రసతన్మాత్రత్వము తైజసపరమాణువునకు సంబంధించిన రూపతన్మాత్రత్వము, వాయవీయపరమాణువుకు సంబంధించిన స్పర్శతన్మాత్రత్వము, ఆకాశమునకు సంబంధించిన శబ్దతన్మాతత్వము పంచతన్మాత్రల కారణమైన అహంకారము, అహంకారమునకు కారణమైన బుద్ధి, దానికి కారణమైన ప్రధానము, ఇంతవరకును ఉన్న ఈ సూక్ష్మపదార్థములన్నియు ఈ సమాపత్తిలో విషయములు. లింగము అనగా లయమును పొందునది. తన్మాత్రాదులు వాటివాటి కారణములో లీనములగును. ప్రకృతికి వేరొక కారణ మేదియు లేకపోవుటచే అది అలింగము. లేదా లిఙ్గతి ఇతి లిఙ్గమ్= సూచించునది అని అర్థము. అనగా కార్యమును పట్టి కారణమును ఊహించు చున్నాము. అందుచే లింగమనగా కార్యము. తన్మాత్రాదులన్నీ లింగములే. కాని ప్రధానమునకు కారణమేదీ లేదు గాన అది అలింగము. అందుచే ప్రధానమునందున్న సూక్ష్మత్వము నిరతిశయమైనది. అనగా దీనికంటె సూక్ష్మమైనది లేదు.

సూ. తా ఏవ సబీజః సమాధిః 46

ప్ర.అ. తా ఏవ=సవితర్క-నిర్వితర్క-సవిచారనిర్విచారములనెడు ఆ నాలుగు సమాధులే, సబీజః సమాధిః=సబీజసమాధియని చెప్పబడును. ఈ సమాధిలో బాహ్యావస్తువులు బీజమువలె ఉన్నవి గాన దీనికి సబీజసమాధి అని పేరు. స్థూలార్థముగల సవితర్కనిర్వితర్కములు, సూక్ష్మార్థకములగు సవిచార నిర్విచారసమాధులు, ఈ నాలుగును సబీజసమాధులు. గ్రహీతృ గ్రహణ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విషయకమగు సమాపత్తిలో సబీజత్వము నియతము కాకున్నను (తప్పనిసరిగ ఉండునను మాటలేకపోయినను) సవికల్పత్వ-అవికల్పత్వములుండుటకు అవకాశమున్నది. కావున గ్రాహ్యవిషయకసమాపత్తులు సవితర్క నిర్వితర్క-సవిచార-నిర్విచారభేదములచే నాలుగు విధములు. గ్రహీతృసమాపత్తియు, గ్రహణసమాపత్తియు ఒక్కొక్కటి సవికల్ప-నిర్వికల్పభేదములచే రెండేసి విధములు. ఈ విధముగ సమాపత్తులు ఎనిమిది విధములు. (వ్యా. భా. వా.మి). వీరి అభిప్రాయము ప్రకారము సమాపత్తిశబ్దము సమాధిశబ్దమునకు పర్యాయము.

భావాగణేశ నాగేశవ్యాఖ్యలు మరొక విధముగనున్నవి. వీరి అభిప్రాయము ప్రకారము సమాపత్తి అనగా సాక్షాత్కారము. కావున. తా ఏవ= గ్రహీతృగ్రహణగ్రాహ్యములందు సమాపత్తులే. సబీజః సమాధిః=సంప్రజ్ఞాత యోగము అని సూత్రమునకర్థము. యోగము సమాపత్తిరూపమగు సాక్షాత్కారమునకు హేతువు గాన కార్యకారణములభిన్నములను అభిప్రాయ ముచే సమాధియే సమాపత్తి అని చెప్పబడినది. ఆనందము బుద్ధిధర్మము గాన ఆనందసమాపత్తి గూడ గ్రహణసమాపత్తిలో అంతర్గతము. ఈ సమాపత్తులు దుఃఖనివృత్తికి బీజమైన సంస్కారమునకు హేతువులు గాన సమాపత్తి హేతువగు వృత్తినిరోధరూపయోగము గూడ సబీజమని చెప్పబడుచున్నది. సమాధి యోగాంగమే కాని యోగము కాదు. అయినను అంగమునకును అంగికిని అభేదమును అంగీకరించి సమాధియే యోగమని చెప్పబడినది.

అవ. నిర్విచారకాష్ఠకు గల ఒక విశేషమును చెప్పుచున్నాడు.

సూ. నిర్విచారవైశారద్యేఽధ్యాత్మప్రసాదః. 47

ప్ర.అ. నిర్విచారవైశారద్యే=నిర్విచారసమాపత్తికి వైశారద్యము కలుగగా, అధ్యాత్మప్రసాదః=బుద్ధియందు ప్రసాదము కలుగును.

వ్యా. చిత్తము ధ్యేయగతములగు అశేషవిశేషములను గ్రహింపగలుగు విధమున నిశ్చలమై ఏకాగ్రమగుటకు వైశారద్యమని పేరు. అది కలిగినపుడు బుద్ధియందు నిర్మలత్వము కలుగును. ఇట్టి ప్రసాదము కలిగినచో పురుష

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విషయకయోగము లేకున్నను పురుషాదిసాక్షాత్కారము కలుగును. (భా.గ. నాగేశులు).

రజస్తమోగుణములు వృద్ధిచెందుట అశుద్ధి. అదియే ఆవరణమును కలిగించు మలము. ఆ మలము తొలగిపోగా ప్రకాశాత్మకమగు బుద్ధి స్వచ్ఛమగు స్థితిని నిరంతరము పొందును. ఇట్టి స్థితిప్రవాహము రజస్తమస్సుల చే తిరస్కరింపబడుట అనునది ఉండదు. అదియే వైశారద్యము. నిర్విచార సమాధికి ఇట్టి వైశారద్యమేర్పడినపుడు ఆ యోగికి ఆత్మయందు ప్రసాదము కలుగును. అధ్యాత్మప్రసాదమనగా ఆత్మసాక్షాత్కారజనకమగు ప్రసాదమని అర్థము కాదు. గ్రాహ్యావిషయకసమాపత్తివలన గ్రహీతృవిషయక (ఆత్మ విషయక) ప్రసాదము కలుగదు కదా? అందుచే ఆత్మయందు భూతార్థ విషయకమగు స్పష్టమైన ప్రజ్ఞాలోకము కలుగును. ఇందులో క్రమాపేక్ష ఉండదు. అనగా భూత-భవద్భవిష్యత్కాలికములగు సకలపదార్థముల అశేషవిశేషజ్ఞానము కలుగును.

ప్రజ్ఞాప్రాసాదమారుహ్య అశోచ్యః శోచతో జనాన్
భూమిష్ఠానివ శైలస్థః సర్వాన్ ప్రాజ్ఞోఽనుపశ్యతి.

"ప్రాజ్ఞుడు ప్రజ్ఞాలోకమనెడు ప్రాసాదమునెక్కి, సకలశోకరహితుడై త్రివిధ దుఃఖపీడితులైన జనులనందరిని, పర్వతముపైనున్నవాడు భూమిపై నున్న వారిని చూచినట్లు చూచుచుండును" అని అభియుక్తోక్తి. (వ్యా. భా.వా.మి).

అవ. పూర్వోక్తమగు సబీజయోగమునందు జనించు సమాపత్తి అను ప్రజ్ఞకు తాంత్రికప్రసిద్ధమైన సార్థకనామధేయమును చెప్పుచున్నాడు. (భా.గ.)

సూ. ఋతమ్భరా తత్ర ప్రజ్ఞా. 48

ప్ర.అ.తత్ర=ఆ సబీజయోగమునందు కలుగు, ప్రజ్ఞా=సమాపత్తియను ప్రజ్ఞ, ఋతమ్భరా= ఋతంభర అను పేరు గలది.

వ్యా. ఋతమనగా సత్యము. సత్యమును ధరించుటచే, అనగా సత్యమైనది దీనిలో విషయముగా ఉండుటచే ఇది ఋతంభర. వాస్తవమున నిర్వితర్కము మాత్రమే ఋతంభర అని చెప్పవలెను. కాని ఆ జాతికే చెందిన

In Public domain. Digitization Muthulakshmi Research Academy
దగుటచే సవితర్కమునకు గూడ ఆ పేరు. లేదా తత్ర=అధ్యాత్మప్రసాదము కలుగగనే కలుగు, ప్రజ్ఞా=ప్రజ్ఞ, ఋతమ్భరా=ఋతంభరయను పేరు గలది. ఆధ్యాత్మప్రసాదానంతరము కలుగు ఆత్మసాక్షాత్కారరూప మగు ప్రజ్ఞ ఋతంభర ప్రజ్ఞ అని అర్థము ఇది. భా. గ. నాగేశుల వ్యాఖ్యానము.

వ్యాసవాచస్పతిమిశ్రుల వ్యాఖ్య వేరుగా ఉన్నది, తత్ర=ఆ నిర్విచారము నందు సమాహితమైన చిత్తము కలవానికి కలుగు, ప్రజ్ఞా=ప్రజ్ఞ, ఋతమ్భరా= ఋతంభర. ఇది సత్యమునే భరించును దీనిలో విపర్యాసగంధము కూడ లేదు గాన దీనికి ఋతంభర అని పేరు ఈ విషయమే–

ఆగమేనానుమానేన ధ్యానాభ్యాసరసేన చ,
త్రిధా ప్రకల్పయన్ ప్రజ్ఞాం లభతే యోగముత్తమమ్.

అను శ్లోకమునందు చెప్పబడినది. "ఆగమము, అనుమానము, ధ్యానాభ్యాస నిరతత్వము" అను మూడు విధములచేతను ప్రజ్ఞను సంపాదించుకొనువాడు ఉత్తమమైన యోగమును పొందును. ఆగమమనగా వేదవిహితమగు శ్రవణము. అనుమానమనగా మననము. ధ్యానమనగా చింతనము. ధ్యానాభ్యాసరసమనగా మాటిమాటికిని చింతనము చేయుటయందు ఆసక్తి. ఇదియే నిధిధ్యాసనము.

అవ. అర్థతత్త్వమును గ్రహించుటకు ఆగమానుమానములే ఉపకరించును గదా; ఇంక యోగమెందులకు అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు –

సూ. శ్రుతానుమానప్రజ్ఞాభ్యామన్యవిషయా విశేషార్థత్వాత్. 49

ప్ర.అ. ఈ యోగజప్రజ్ఞ, శ్రుతానుమానప్రజ్ఞాభ్యామ్=ఆగమానుమాన ముల వలన కలుగు ప్రజ్ఞలకంటే, అన్యవిషయా=అన్యమైన విషయము గలది. ఏలననగా, విశేషార్థత్వాత్=ఇది విశేషవిషయములు కలది.

వా. శబ్దానుమానముల ద్వారా ఆ యా పదార్థముల సామాన్య స్వరూపము మాత్రమే తెలియును గాని వాటియందలి విశేషాంశములు తెలియవు. **నదీతీరమున ఫలములున్నవి** అను వాక్యము వినగా అక్కడ ఫలము లున్నవి అను జ్ఞానము మాత్రమే కలుగును. అవి ఏ ఆకారములో ఏ కొమ్మల మీద ఎన్ని ఉన్నవి ఇత్యాది విశేషములు తెలియవు. అట్లే ధూమమును పట్టి అగ్ని ఉన్నట్లు ఊహించవచ్చును గాని అది ఎట్లున్నది, వంకరగా ఉన్నదా,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పొడవుగా ఉన్నదా ఇత్యాదివిశేషములు తెలియవు. యోగజప్రజ్ఞ ద్వారా అతి సూక్ష్మవిషయములకు సంబంధించిన సకలవిశేషములను తెలియవచ్చును గాన ఇది ఆగమానుమానములకంటె అత్యుత్కృష్టము. వర్తమానమున దగ్గరనున్న స్థూలవిషయములను మాత్రమే గ్రహింపదగిన ప్రత్యక్షముకంటె దీని ఉత్కృష్టత్వ మును గూర్చి వేరుగా చెప్పపనియే లేదు.

అవ. సమాధిప్రజ్ఞను పొందిన యోగికి ప్రజ్ఞాబలముచే క్రొత్త క్రొత్త సంస్కారము కలుగునని చెప్పుచున్నాడు-

సూ. తజ్జః సంస్కారోఽన్యసంస్కారప్రతిబన్ధీ. 50

ప్ర.అ. తజ్జః=సమాధిప్రజ్ఞనుండి జనించిన, సంస్కారః=సంస్కారము, అన్యసంస్కారప్రతిబన్ధ=ఇతరసంస్కారములకు ప్రతిబంధకముగ ఉండును.

వ్యా. సమాధిప్రజ్ఞ ఏకాగ్రసాక్షాత్కారధారారూపమైనది. దానివలన చిత్తమునందేర్పడిన సంస్కారము వ్యుత్థానసంస్కారములేవియు పనిచేయ కుండునట్లు చేయును. అందుచే ఇతరప్రత్యయములేవియు కలుగవు. ఈ ప్రత్యయములను అడ్డుకొనుటచే సమాధి కలుగును. సమాధివలన ప్రజ్ఞ కలుగును. ప్రజ్ఞవలన సంస్కారములు కలుగును. ఈ విధముగ క్రొత్త సంస్కారాశయము పుట్టును. దానివలన ప్రజ్ఞ, ప్రజ్ఞవలన సంస్కారములు పుట్టును. ఈ విధముగ తిరుగుచున్న ప్రజ్ఞా- సంస్కారచక్రము, అనాదిగానున్న అతత్త్వసంస్కారబుద్ధుల క్రమమును బాధించును. అయితే ఈ సంస్కారాతి శయం చిత్తమును సాధికారమును, అనగా ప్రవృత్తిశీలమును, చేయదా అని ప్రశ్నించవచ్చును. అట్టి ప్రశ్నకు అవకాశము లేదు. చిత్తము శబ్దాద్యుపభోగము, వివేకఖ్యాతి అను రెండు కార్యములను చేయును. చిత్తము క్లేశకర్మాశయ సహితమైనపుడు శబ్దాద్యుపభోగమునందు ప్రవర్తించును. ప్రజ్ఞచే కలిగిన సంస్కారముచేత చిత్తమునందలి సకలకేశకర్మాశయములును ఉన్మూలితము లైన పిమ్మట దాని అధికారభావము పూర్తిగ నశించినట్లే. అపుడు ఇంక చేయవలసినది వివేకఖ్యాతి అను కార్యమే మిగిలి ఉండును. కావున సమాధి సంస్కారములు చిత్తమునకు భోగాధికారమునకు హేతువులు కాజాలవు. తద్విరుద్ధములు. అందుకు ప్రతిబంధకము లగును. ఈ విధముగ ప్రజ్ఞా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సంస్కారముల ప్రయోజనము చిత్తమునకు గల భోగాధికారమును శాంతింప చేయుటయే అని ఈ సూత్రమునకర్థము.

అవ. ప్రజ్ఞాసంస్కారప్రవాహము అవిచ్ఛిన్నమైన పిదప కలుగు స్థితిని చెప్పుచున్నాడు-

సూ. తస్యాపి నిరోధే సర్వనిరోధాన్నిర్బీజః సమాధిః. 51

ప్ర.అ. తస్యాపి=ఆ సంస్కారముయొక్క కూడ, నిరోధే=నిరోధము కలుగగా, సర్వనిరోధాత్=అన్నింటియొక్క నిరోధము జరుగుటవలన, నిర్బీజః= నిర్జీబమైన, సమాధిః=సమాధి కలుగును.

వ్యా. పరవైరాగ్యముచే జ్ఞానము సుప్రసన్నమగును. అట్టి పరవైరాగ్యము ప్రజ్ఞనే కాక తత్కృతసంస్కారములను కూడ నిరోధించును. అపుడు సర్వసంస్కారములును నిరుద్ధములగుటచే వాటి కార్యములేవియు ఉండవు. అందుచే ఆ సమాధి నిర్బీజసమాధి. వృత్తులు కలుగుటకు బీజములైన సంస్కారములు లేవు గాన అది నిర్బీజము. ఇదియే అసంప్రజ్ఞాతసమాధి.

సంప్రజ్ఞాతసమాధి ద్వారా కొంతకాలము అనేక సంస్కారపరంపరలు జనించును. కాలక్రమమున పరవైరాగ్యముచే అసంప్రజ్ఞాతము సిద్ధింపగా ఉత్తరోత్తరాసంప్రజ్ఞాతములచే పూర్వపూర్వసంప్రజ్ఞాతతత్సంస్కారములు పూర్తిగా అభిభూతములైన పిమ్మట చరమాసంప్రజ్ఞాతము కలుగును. ఇదియే పరాకాష్ఠ. ఈ విధముగ పూర్వపూర్వసంస్కారముల సహకారముతో చరమమగు అసంప్రజ్ఞాతము సంప్రజ్ఞాతమును దాని సంస్కారములను పూర్తిగా దహించి వేయగా, సహకారిసంస్కారాదులన్నియు దగ్ధములగుటచే ప్రారబ్ధకర్మ కూడ తన ఫలమునీయజాలదు. ప్రారబ్ధకర్మ తన ఫలము నీయవలెనన్న పూర్వజన్మకు సంబంధించిన భోగసంస్కారములు ఉండవలెను. సహకారులగు ఆ సంస్కారములు దగ్ధములైపోయినపుడు ప్రారబ్ధము మాత్రము తన ఫలమునెట్లు ఇవ్వగలుగును? ఇపుడు చిత్తము సాధించవలసిన పురుషార్థము సమాప్తమై పోయినది. దాని అధికారము పూర్తియైనది. అందుచే అది (చిత్తము)ప్రారబ్ధకర్మ-నిరోధసంస్కారములతో కలిసి తన కారణము నందు పూర్తిగా విలీనమైపోవును. ఈ విలయమే చిత్తమునకు మహానిద్ర.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పురుషునకు కైవల్యము. దుఃఖాత్మకములగు సకలదృశ్య పదార్థములతో ఎట్టి సంబంధములేని స్థితి. ఈ విషయమే-**మనసోఽభ్యుదయో నాశో మనోనాశో మహోదయః** మనస్సునకు అభ్యుదయమున్నంతకాలము అది పురుషునికి నాశము, బంధహేతువు. మనోనాశము పురుషునకు మహోదయము అని చెప్పబడినది.

కర్మ సంచితము, ప్రారబ్ధము, ఆగామి అని మూడు విధములు. చాలా కాలమునుండి ప్రోగుపడి ఉండి ఇంకను ఫలమిచ్చుటకు ప్రారంభించని కర్మ సంచితము. ఫలమునిచ్చుటకు ప్రారంభించిన కర్మ ప్రారబ్ధము. ఆ కర్మ వలననే ఈ శరీరభోగాలు కలుగుచున్నవి. ఈ శరీరముతో చేయు కర్మ ఆగామి, వేదాంతుల సిద్ధాంతము ప్రకారము ఆత్మజ్ఞానము కలుగగనే సంచితకర్మయు, ఆగామికర్మయు కూడ భస్మమైపోవును. అవి తమ ఫలము నీయజాలవు. ప్రారబ్ధ కర్మ మాత్రము నశించదు. ధనస్సునుండి విడచిన బాణము దాని వేగమున్నంత వరకు ఎట్లు ప్రయాణము చేసి లక్ష్యమును కొట్టునో మధ్యలో దానిని ఉపసంహ రించుటకు శక్యము కాదో అట్లే ప్రారబ్ధకర్మ తానీయ ప్రారంభించిన ఫలమును ఇచ్చియే తీరును. అది తీరునంతవరకు జ్ఞాని శరీరాదిసంబంధవంతుడై జీవన్ముక్తుడుగ నుండి శరీరపాతానంతరము విదేహముక్తి పొందును. ఈ విధముగ ఆత్మజ్ఞానము కలిగిన పిదప ప్రారబ్ధము భోగముచే క్షీణించగా ముక్తి కలుగును కదా ! ఈ యోగమువలన ప్రయోజనమేమి అను ప్రశ్న కలుగ వచ్చును. దీనికి సమాధానముగా కొందరు యోగబలముచే ప్రారబ్ధము కూడ వెంటనే నశించును. అందుచే శీఘ్రముగ కైవల్యము సిద్ధించును. అదియే యోగఫలమని చెప్పుదురు. (భా.గ. నాగేశులు)

నాగేశభట్టు ఈ క్రింది విషయములు కూడ ప్రతిపాదించినాడు. వివేక సాక్షాత్కారము జ్ఞానము. దీనికే సాంఖ్యమని పేరు. సకల చిత్తవృత్తినిరోధరూపమగు అసంప్రజ్ఞాతము, అసకలచిత్తవృత్తినిరోధరూపమగు సంప్రజ్ఞాతము ఈ రెండును యోగములే. అటు ఆ సాంఖ్యము, ఇటు ఈ యోగము కూడా వేరు వేరు పద్ధతులలో స్వతంత్రముగ మోక్షకారణములు. కేవలజ్ఞానమే మోక్షమును కలిగించవలసియున్నపుడు సంప్రజ్ఞాతము మాత్రమున్న చాలును. అది

In Public domain. Digitization Muthulakshmi Research Academy
అభిమానమును తొలగించి ఆత్మసాక్షాత్కారము కలుగుటకు ఉపకరించును. సకలవృత్తినిరోధరూపమగు అసంప్రజ్ఞాతముతో పనిలేదు. జ్ఞానికి ప్రారబ్ధము కూడా భోగముచే నశింపగా సకలవాసనలతో సహా చిత్తము నశించిపోవును కదా? యోగమార్గము ద్వారా మాత్రమే మోక్షమును సంపాదింపగోరువారికి మాత్రము ఈ అసంప్రజ్ఞాతసమాధి కావలెను. భగవద్గీతలో కూడ –

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే

అని చెప్పబడినది. ఇచట **సాంఖ్యైః** అనగా తత్త్వసాక్షాత్కారోపాయములగు శ్రవణమననాదులని అర్థము. వీటిచే ఏ జ్ఞానము పొందబడునో అదియే యోగములచే కూడ పొందబడును అని దీని అర్థము. ఈ విధముగ జ్ఞానమార్గ యోగమార్గములకు విరోధము లేదు.

సమాధిపాదము సమాప్తము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అథ ద్వితీయః సాధనపాదః

అవ. సమాహితచిత్తుడగు ఉత్తమాధికారి క్రియాయోగముతో పని లేకుండగనే అభ్యాసవైరాగ్యముల ద్వారా యోగమును సాధింపగలడు అను విషయము పూర్వపాదములో ప్రతిపాదింపబడినది. బహిర్ముఖుడై వ్యుత్థితచిత్తుడైన సాధకుడు కూడ యోగమును సాధించుటకుపకరించు సాధనములు ఈ పాదములో చెప్పబడుచున్నవి. (భా.గ.) మందులు, మధ్యములు ఉత్తములు అని యోగాధికారులు మూడు విధములవారు. వారికి వరుసగ ఆరురుక్షువులు, యుంజానులు, యోగారూఢులు అని పేర్లు. పూర్వజన్మమున బహిరంగక్రియా యోగసాధన చేయుటచే ఇప్పుడు అవి ఏవియు లేకుండగనే యోగారూఢులైన జడభరతాదులు ఉత్తములు. వారు యోగనిష్పత్తికై అభ్యాసవైరాగ్యములాచరించిన చాలును అని పూర్వపాదమున ప్రతిపాదింపబడినది.

"ఆరూఢయోగవృక్షాణాం జ్ఞానత్యాగౌ పరౌ మతౌ,
శిశుపాలః సిద్ధిమాప స్మరణాభ్యాసగౌరవాత్"

"యోగమనెడు వృక్షమును అధిరోహించినవారికి జ్ఞానత్యాగములు రెండే ఉత్తమోపాయములు. భగవత్స్మరణమును మాటిమాటికిని చేసిన మాహాత్మ్యముచే శిశుపాలుడు సిద్ధిని పొందినాడు" అని గరుడపురాణము చెప్పుచున్నది. ఈ శ్లోకములో చెప్పిన త్యాగము క్రియాయోగరూపములగు బాహ్యకర్మల త్యాగము.

"యదా హి నేన్ద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే,
సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే".

"సర్వసంకల్పములను విడనాడి, ఇంద్రియవిషయములందు కాని కర్మలయందు కాని లగ్నము కానివాడు యోగారూఢుడని చెప్పబడును" అని భగవద్గీతలో యోగారూఢ లక్షణము చెప్పబడినది. అభ్యాసమనగా నిశ్చలైకాగ్రతాధారారూపస్థితిలో నున్న చిత్తము ధ్యేయమునుండి బైటకు పోవుచున్నపుడు మరల మరల దానిని ధ్యేయముపై నిలుపుటకై చేయు

In Public domain. Digitization Muthulakshmi Research Academy
యత్నము ఆ యా భోగ్యవస్తువుల విషయమున అలంబుద్ధి, అనగా ఇక ఇవి చాలును అను బుద్ధి, వైరాగ్యము. ఈ విషయములన్నియు పూర్వపాదములో చెప్పబడినది. ఇపుడు వ్యుత్థితచిత్తులైన వానప్రస్థాదిమధ్యమాధి కారులకుపయోగించు క్రియాయోగరూపమగు సాధనమును చెప్పుచున్నాడు (నాగేశుడు).

సూ. తపఃస్వాధ్యాయేశ్వరప్రణిధానాని క్రియాయోగః. 1

ప్ర. అ. తపః.....ప్రణిధానాని=తపస్సు, స్వాధ్యాయము ఈశ్వరప్రణి ధానము అనునవి, క్రియాయోగః=క్రియాయోగము.

వ్యా. చిత్తప్రసాదమునకు భంగకరము కాని శాస్త్రోక్తోపవాసాద్యను- ష్ఠానము తపస్సు. ప్రణవజపము లేదా మోక్షశాస్త్రాధ్యయనము స్వాధ్యాయము. ప్రణవాదుల జపము స్వాధ్యాయము. ప్రణవాదులనగా ప్రణవము, వైదికములైన పురుషసూక్త-రుద్ర-మండలబ్రాహ్మణాదులు, పౌరాణికములైన బ్రహ్మపారా యణాదులు అని వా.మి. ఈశ్వరప్రణిధానమనగా సర్వకర్మలను, సర్వకర్మ ఫలములను ఈశ్వరునికి సమర్పించుట అని ఇచట అర్థము.

"కామతో కామతో వాఽపి యత్కరోమి శుభాశుభమ్,
తత్సర్వం త్వయి సన్న్యస్తం త్వత్ప్రయుక్తః కరోమ్యహమ్"

"ఇష్టపడి కాని, ఇష్టపడక కాని ఏ శుభాశుభకర్మలను చేయుచున్నానో వాటి నన్నింటిని నీకే సమర్పించుచున్నాను. నేనేమి చేసినను నీ ప్రేరణచేతనే చేయు చున్నాను" అని అన్ని కర్మలను ఈశ్వరునకు సమర్పించవలెను. అట్లే

"నాహం కర్తా సర్వమేతద్బ్రహ్మైవ కురుతే తథా,
ఏతద్బ్రహ్మార్పణం ప్రోక్తమృషిభిస్తత్త్వదర్శిభిః"

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"నేను కర్తను కాను. ఈ చేయునదంతయు పరమేశ్వరుడే అను భావనమే బ్రహ్మార్పణము అని తత్త్వదర్శులైన ఋషులు చెప్పుచున్నారు" అని కూర్మపురాణమునందు చెప్పబడినది.

కర్మ ఫలసంన్యాసమును గూర్చి -

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూర్మాతే సఙ్గోఽస్త్వకర్మణి"

అని భగవద్గీతలో చెప్పబడినది. ఈ తపస్స్వాధ్యాయేశ్వరప్రణిధానములు క్రియా రూపములగు యోగములు గాన ఇవి క్రియాయోగము అని చెప్పబడుచున్నవి.

ముందు చెప్పబోవు యమనియమాదులు కూడ క్రియాయోగములే అయినను వాటినుండి ఈ ప్రకృష్టసాధనత్రయమును వేరుచేసి ఈ మూడింటి నైనను తీవ్రతరముగ ఆచరించినచో యోగము సిద్ధించునని మధ్యమాధికారికి ఉపదేశము చేయబడుచున్నది. మధ్యమాధికారులు అభ్యాసవైరాగ్యములను యథాశక్తిగ ఆచరించవలెను.

అవ. తపస్సు మొదలైనది దేనిద్వారా యోగోత్పాదనమునకు ఉపకరించునో చెప్పుచున్నాడు -

సూ. సమాధిభావనార్థః క్లేశతనూకరణార్థశ్చ. 2

ప్ర.అ. ఈ క్రియాయోగము, సమాధిభావనార్థః = చిత్తమునకు ఏకాగ్రత్వమును కలిగించుట అను ప్రయోజనము కలది. క్లేశతనూకరణార్థశ్చ అవిద్యాదిక్లేశములను తగ్గించుట అను ప్రయోజనము కలది.

వ్యా. ఈ క్రియాయోగము చిత్తమును ఏకాగ్రము చేసి, సత్త్వశుద్ధి ద్వారా అవిద్యాదిక్లేశములు దుర్బలములగునట్లు చేయును. క్లేశములు ఉత్కటముగా ఉన్నంతవరకును అవి వివేకఖ్యాతి కలుగకుండ అడ్డు నిలచును. అవి దుర్బలములైనచో దానిని అడ్డుకొనజాలవు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వివేకఖ్యాతిరూపమగు ప్రసంఖ్యానము ఉదయించగనే ఆ క్లేశములు మాడిపోయిన విత్తనములవలె వ్యర్థములగును. అవి వ్యర్థము కాగానే చేయవలసిన పని లేని (సమాప్రాధికార మగు) చిత్తము విలీనమగును. పిమ్మట కారణము లేకపోవుటతో పునర్జన్మయే ఉండదు.

సూ. అవిద్యాస్మితారాగద్వేషాభినివేశాః క్లేశాః. 3

ప్ర. అ. అవిద్యా.... నివేశాః = అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అనునవి, క్లేశాః = కేశములు.

వ్యా. ఇవి క్లేశమునకు కారణములు గాన క్లేశములు. ఈ అయిదును విపర్యయములే. ఇవి స్పందించి గుణముల అధికారమును (కార్యకరణశక్తిని) దృఢము చేయును. పరిణామమును నడిపించును. అనగా కార్యకారణ ప్రోతస్సు అవిచ్ఛిన్నముగా ఉండునట్లు చేయును. క్లేశములవలన కర్మలు, కర్మలవలన క్లేశములు పుట్టుచుండటచే కర్మవిపాకము జరుగుచుండును.

అవ. స్థూలము లైనను, సూక్ష్మము లైనను, క్లేశము లన్నియు జ్ఞానముచే తొలగింపబడును అని చెప్పుచున్నాడు. అవి జ్ఞాననాశ్యము లనుట అజ్ఞానజన్యము లై నప్పుడే కుదురును. అందుచే క్లేశము లన్నింటికిని అవిద్యయే మూల మని చెప్పుచున్నాడు.

సూ. అవిద్యా క్షేత్రముత్తరేషాం ప్రసుప్తతనువిచ్ఛిన్నోదారాణామ్. 4

ప్ర.అ. ప్రసుప్తతనువిచ్ఛిన్నోదారాణామ్ = ప్రసుప్తములు, తనువులు, విచ్ఛిన్నములు, ఉదారములు అను నాలుగువిధములైన, ఉత్తరేషామ్= తరువాతివగు అస్మితాదులకు, అవిద్యా = అవిద్య, క్షేత్రమ్ = ఉత్పత్తిస్థానము.

వ్యా. వాస్తవమున అస్మితాదిక్లేశములకు ఉత్పత్తిస్థానము అంతఃకరణము. అయినను అవినాభావసంబంధముచే అవిద్య అస్మితాదులతో సంబంధించి ఉండుటచేతను, అవిద్యాసహితమగు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అంతఃకరణమే వీటి ఉత్పత్తి స్థానమగుట చేతను అవిద్యయే వీటికి మూలమని చెప్పబడినది. **నేను నాది** అను అవిద్యకు విషయమైనదానియందే రాగాదులు జనించుచుండును కదా (భా.గ.నాగేశులు).

దీనిని పట్టి అస్మితాదిక్లేశములకు అంతఃకరణమే ఉపాధానకారణ మనియు, అవిద్య నిమిత్తకారణ మనియు ఈ వ్యాఖ్యాతల అభిప్రాయమన్నట్లు స్పష్టమగుచున్నది. కాని వ్యాసభాష్య వా.మి. వ్యాఖ్యలలో ఇవన్నియు అవిద్యా రూపభేదములే అని చెప్పబడినది.

ఈ క్లేశములు జ్ఞానాగ్నిచే దగ్ధములు కాక, పాలలో పెరుగువలె అవ్యక్తావస్థలో ఉండి కార్యోన్ముఖముగా (సమయము రాగానే పైకి వచ్చుటకు సిద్ధముగా) ఉన్న అవస్థ ప్రసుప్తావస్థ. ఇది విదేహప్రకృతిలయుల క్లేశముల అవస్థ. వివేకఖ్యాతిరూపమగు జ్ఞానాగ్నిచే దగ్ధములై పోయినచో అవి ఇక ఎన్నటికిని కార్యోన్ముఖములు కాజాలవు. అది పంచమావస్థ. వివేకఖ్యాతి కలుగకుండ అడ్డు తగులునంతటి ఉత్కటత్వము లేకుండుట తనుత్వము. క్లేశములకు ప్రతిపక్షమైన క్రియాయోగమును అనుష్ఠించుటచే ఈ తనుత్వము వచ్చును. లేదా సమ్యగ్ జ్ఞానము అవిద్యకు ప్రతిపక్షము. భేదదర్శనము అస్మితకు ప్రతిపక్షము. ఔదాసీన్యము రాగద్వేషములకు ప్రతిపక్షము. అనుబంధబుద్ధిని తొలగించుకొనుట, అనగా అవిచ్ఛిన్నముగా అనుసరింపకుండుట, అభినివేశమునకు ప్రతిపక్షము. ఈ ప్రతిపక్షముల అభ్యాసముచే అవిద్యాదులకు తనుత్వమేర్పడును. క్లేశములు పైకి కనబడుటకు అవకాశమున్నను వాటికి ప్రతిబంధకములు కొన్ని ఏర్పడగా అవి మధ్య మధ్య విచ్ఛిన్నములగుచుండును లేదా ఒక క్లేశమున్నపుడు మరొకటి విచ్ఛిన్న మగుచుండును. ఉదాహరణమునకు రాగసమయమున ద్వేషముండదు. ద్వేషసమయమున రాగముండదు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy
క్రోధావిష్టుడు మిష్టాన్నమును కూడ విసర్జించునుకదా? అభివ్యక్తములగుట ఉదారత్వము.

ప్రకృతిలయాదుల క్లేశములు ప్రసుప్తములు. యోగుల క్లేశములు తనువులు. విషయసంగుల క్లేశములు విచ్ఛిన్నోదారరూపములు :

"ప్రసుప్తాతస్తత్త్వలీనానాం తన్వవస్థాశ్చ యోగినామ్,
విచ్ఛిన్నోదారరూపాశ్చ క్లేశా విషయసఙ్గినామ్".

అవ. అవిద్యాలక్షణము చెప్పుచున్నాడు -

సూ. అనిత్యాశుచిదుఃఖానాత్మసు నిత్యశుచిసుఖాత్మఖ్యాతిరవిద్యా. 5

ప్ర.అ. అనిత్యాశుచిదుఃఖాత్మను=అనిత్యము, అశుచి, దుఃఖము, అనాత్మ వీటియందు, నిత్యశుచిసుఖాత్మఖ్యాతిః=క్రమముగ నిత్యము, శుచి, సుఖము, ఆత్మ అను బుద్ధి, అవిద్యా=అవిద్య.

వ్యా. ఇది ఉపలక్షణము. అందుచే నిత్యాదులందు అనిత్యత్వాది బుద్ధి, పాపాదులందు పుణ్యత్వాదిబుద్ధి కూడ అనర్ధహేతువులు గాన అవిద్యయే.

అనిత్యమును నిత్యమనుకొనుట మొదటిది. ఉదా పృథివి స్థిరమైనది. దేవతలు అమృతులు ఇత్యాది బుద్ధి. ఇట్టి బుద్ధిచేతనే పృథివ్యాదిభూత రూపమును అభిలషించుచు వాటి ఉపాసనలు చేయుచుందురు. దేవత్వ మును అభిలషించి సోమపానాదులు చేయుచుందురు. అశుచియై పరమబీభత్సమైనది ఈ శరీరము.

"స్థానాద్బీజాదుపష్టమ్భాన్నిఃస్యన్దాన్నిధనాదపి,
కాయమాధేయశౌచత్వాత్పణ్డితా హ్యశుచిం విదుః".

మాతృదరము స్థానము. మాతాపితరుల శోణితరేతస్సులు బీజము. ఆహార పరిణామములైన రసాదులు ఉపష్టంభములు; అనగా దేహము నిలుపునవి. చెమట మొదలగునవి కారుచుండును. మరణానంతరము

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రోత్రియశరీరము కూడ అస్పృశ్యమే. ఈ విధముగ శరీరము అశుచి యని పండితులు చెప్పుదురు. మృత్తికాశౌచాదులచే దీనికి శుచిత్వమును ప్రయత్నపూర్వకముగ సంపాదించ వలసినదే. ఇట్టి శరీరమును శుచి యైనదని భావించుట రెండవది. దుఃఖబహుళమగు జగత్తు సుఖకర మని అనుకొనుట మూడవది. భోగోపకరణములగు బాహ్యములైన చేతనాచేతనములను గాని, భోగాధిష్ఠాన మైన శరీరమును గాని మనస్సును గాని ఆత్మయని భావించుట నాల్గవది. ఆత్మీయము కాని దానిని ఆత్మీయమని భావించుట కూడా ఇట్టిదే. ఈ విధముగ చతుష్పదముగ నున్న అవిద్య క్లేశసంతానమునకును, విపాకసహిత మగు కర్మాశయమునకును మూలము.

అతస్మింస్తత్ప్రతిభాసః అవిద్యా (అది కానిదానియందు అది భాసించుట–అది కానిది అదిగా భాసించుట). అవిద్య అని అవిద్యాసామాన్య లక్షణము. పైని చెప్పినవి దాని భేదములు (భో.వృ.). ఇది **అతస్మింస్తద్బుద్ధి** అని శంకరులు చెప్పిన అధ్యాసలక్షణమును పోలి ఉన్నది. కేవలము మాటలలో మార్పు.

సూ. దృగ్దర్శనశక్త్యోరేకతేవాస్మితా. 6

ప్ర.అ. దృగ్దర్శనశక్త్యోః=దృగ్దర్శనశక్తులకు, ఏకతేవ = ఏకత్వమున్నట్లు బుద్ధి, అస్మితా = అస్మిత అని చెప్పబడును.

వ్యా. దృక్ అనగా ద్రష్ట యైన పురుషుడు. **దర్శనమ్** అనగా **దృశ్యతే అనేనేతి దర్శనమ్** అను విగ్రహముచే బుద్ధి అని అర్థము. ఈ దృక్శక్తి–దర్శన శక్తులకు, అనగా పురుష–బుద్ధులకు రూపముచేతను, ధర్మముచేతను కూడ అత్యంతభేదమున్నది. భోగ్యశక్తిరూపమగు బుద్ధి అశుద్ధ మైనది. అనుదాసీనము, అనగా ప్రవృత్తిశీలము; జడము. భోక్తృశక్తియైన పురుషుడు సర్వదా శుద్ధుడు; ఉదాసీనుడు; చైతన్యరూపుడు. ఈ రెండును అభిన్నము లను బుద్ధియే అస్మిత. ఈ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

రెండింటికిని గల భేదమును గుర్తించి వాటి నైజస్వరూపమును గ్రహింపగల్గినచో కైవల్యము లభించును.

అవ. అవిద్యాజన్యమగు అస్మితయే రాగాదులకు కారణముగాన అస్మితా లక్షణానంతరము రాగాదిలక్షణములను చెప్పుచున్నాడు -

సూ. సుఖానుశయీ రాగః. 7

ప్ర. అ. సుఖానుశయీ=సుఖమును సుఖసాధనములను గూర్చిన తృష్ణారూపమగు క్లేశము, రాగః=రాగము.

సూ. దుఃఖానుశయీ ద్వేషః. 8

ప్ర.అ. దుఃఖానుశయీ=దుఃఖమును, దుఃఖసాధనములను గూర్చిన క్రోధము, ద్వేషః=ద్వేషము.

సూ. స్వరసవాహీ విదుషోఽపి తథారూఢాభినివేశః. 9

ప్ర.అ. **అభినివేశః** అను పదమును రెండు మార్లు ఆవృత్తి చేసి సూత్రార్థము చెప్పవలెను. విదుషోఽపి=విద్వాంసునకు కూడ, తథా= అవిద్వాంసునకు వలె, స్వరసవాహీ=స్వీయసంస్కారముచే ప్రవర్తించు, రూఢః ప్రసిద్ధమైన, అభినివేశః="నేను మరణింపకుందును గాక"అను ఉత్కంఠ, అభినివేశః=అభినివేశమను పేరు గల క్లేశము.

వ్యా. ప్రతి ఒక్క జీవునకును పూర్వజన్మలలో మరణసమయము నందు, "నేను మరణింపకుందును గాక; జీవించి ఉందును గాక" అను ఇచ్ఛ ఉండును. పూర్వజన్మసంస్కారముచే ఇట్టి మరణభయము క్రిమి మొదలు శ్రుతానుమానములచే సంసారకైవల్యాదుల తత్త్వమును తెలిసికొనిన విద్వాంసుని వరకును, జీవులందరిలోను కనబడుచున్నది. పూర్వపూర్వ జన్మలలో మరణసమయమున దుఃఖమును అనుభవించి ఉండుటచే, దాని సంస్కారమువలన మరల ఈ జన్మలో ఈ అభినివేశము కలుగుచున్నది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సూ. తే ప్రతిప్రసవహేయాః సూక్ష్మాః. 10

వ్యా. భోజుడు, భావాగణేశుడు దీనిని పదవ సూత్రముగా గ్రహించి వ్యాఖ్యానించినారు. కాని వాచస్పతిమిశ్రుడు దీనిని భాష్యకారుని వాక్యముగా గ్రహించి వ్యాఖ్యానించినాడు. నాగేశుడు కూడ వాచస్పతిమిశ్రుని అనుసరించెను.

క్లేశములకు ప్రసుప్త-తను-విచ్ఛిన్న-ఉదారములను నాలుగు అవస్థలు చెప్పబడినవి. పంచమావస్థయైన దగ్ధబీజావస్థ, అనగా కాలిపోయిన బీజములు ఏ విధముగ వంధ్యములో అట్లు వంధ్యములయిన అవస్థ ఉన్నది కదా, దాని నెందుకు చెప్పలేదు అని ఆశంకించుకొని భాష్యకారులు ఈ వాక్యము వ్రాసినారు. పురుషప్రయత్నముచే వేటిని విడనాడవలెనో వాటినే ప్రతిపాదించుట జరిగినది. దగ్ధబీజావస్థలో నున్న క్లేశములు చిత్తము లయము పొందినపుడు దానితోపాటు లయమును పొందును గాన వాటి పంచమావస్థను గూర్చి చెప్పలేదు అని భావము. సూక్ష్మాః=దగ్ధబీజకల్పములై సూక్ష్మముగా ఉన్న, తే=ఆ క్లేశములు, ప్రతిప్రసవహేయాః=చిత్తవిలయము ద్వారా తొలగిపోవునవి అని భాష్యవాక్యమునకు వ్యాఖ్యానము (వా.మి.)

దీనిని స్వతంత్రసూత్రముగ గ్రహించి వ్యాఖ్యానించిన భోజభావాగణేశుల ప్రకారము కూడ అర్థమిదియే.

అవ. క్రియాయోగముచే తనూకృతములైన క్లేశములను తొలగించుకొను ఉపాయములను చెప్పుచున్నాడు –

సూ. ధ్యానహేయాస్తద్వృత్తయః. 11

ప్ర.అ. తద్వృత్తయః=క్రియాయోగముచే తనూకృతములైన ఆ క్లేశ సంబంధిస్థూలవృత్తులు, ధ్యానహేయాః=ధ్యానముచే తొలగించుకొనదగినవి.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. అభివ్యక్తావస్థలో ఉన్న క్లేశసంబంధి స్థూలవృత్తులను ముందు క్రియాయోగముచే తనువులనుగ చేసి పిమ్మట ధ్యానముచే, అనగా ఆత్మసాక్షాత్కారప్రవాహముచే, వాటిని కూడ పూర్తిగా తొలగించుకొనవలెను. కాల్చివేసిన బీజమువలె అభివ్యక్తిరూపమగు ఉత్పత్తి లేనివాటినిగా చేయవలెను. ధాన్యాదులలో ఉన్న రసాదిసహకారికారణములను తొలగించుటతో వాటి బీజశక్తి దగ్ధమైనట్లు క్లేశములకు సహకారికారణములుగా ఉన్న వాసనలను నశింపచేయుటయే వాటి బీజశక్తిదాహము.

ఈ విధముగ క్రియాయోగమును అభ్యసించుటవలన క్లేశములు వివేక ఖ్యాతి కలుగకుండ చేయు సామర్థ్యమును కోల్పోవును. అదియే క్లేశతనూకర ణము. అపుడు నిర్విఘ్నముగ వివేకఖ్యాతిప్రవాహము నిష్పన్నమగుటచే అవిద్యా వాసనలు పూర్తిగ నశించును. అపుడు దగ్ధబీజములతో సమానత్వమును పొందిన క్లేశములు చిత్తముతో కూడ విలీనములగును.

అవ. క్లేశములు దేని ద్వారా దుఃఖకారణములో చెప్పుచున్నాడు –

సూ. క్లేశమూలః కర్మాశయో దృష్టాదృష్టజన్మవేదనీయః. 12

ప్ర.అ. దృష్టాదృష్టజన్మవేదనీయః=వర్తమానజన్మయందును, రాబోవు జన్మయందును అనుభవింపదగిన, కర్మాశయః ధర్మాధర్మరూపమైన కర్మాశయము, క్లేశమూలః=క్లేశములే మూలముగా గలది.

వ్యా. ఇహపరజన్మలలో అనుభవింపదగిన ధర్మాధర్మములకు మూలము క్లేశములే అని అర్థము.

"రాగద్వేషాదయో దోషాః సర్వే భ్రాన్తినిబన్ధనాః,
కార్యో హ్యస్య భవేద్దోషః పుణ్యాపుణ్యమితి శ్రుతేః.
తద్వశాదేవ సర్వేషాం సర్వదేహసముద్భవః".

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అను కూర్మపురాణవాక్యము ఈ అర్థమునే చెప్పుచున్నది. (భా.గ; నాగేశులు)

పుణ్యాపుణ్యరూపమైన కర్మాశయము కామ-లోభ-మోహ-క్రోధముల వలన కలుగును. కామమువలన కామ్యకర్మలనాచరించగా స్వర్గాది హేతువగు ధర్మము కలుగును. లోభమువలన పరద్రవ్యాపహారాదులు చేయగా అధర్మము కలుగును. మోహమువలన, అధర్మమగు హింసాదులందు ధర్మబుద్ధితో ప్రవర్తించువానికి అధర్మమే. అందువలన మోహమువలన ధర్మము కలుగుటకు అవకాశము లేదు. అయితే కోపమువలన ధర్మము కలుగుటకు అవకాశమున్నది. ధ్రువుడు తలిదండ్రులు చేసిన అవమానమునకు కుపితుడై పుణ్యము సంపాదించి, సర్వలోకములకంటె ఉన్నతస్థానమును పొందినాడు కదా? క్రోధమువలన కలిగిన బ్రహ్మహత్యాద్యధర్మము ప్రసిద్ధమే. ఈ విధముగ పుణ్యాపాపకర్మాశయములకు కామాదులు హేతువులు తీవ్రసంవేగముతో మంత్రతపఃసమాధులతో సాధించినను లేదా ఈశ్వర-దేవతా-మహా పురుషులను ఆరాధించి పరిపుష్టి నొందించినను ఆ పుణ్యము వెంటనే ఈ దృష్టజన్మయందే ఫలించును. అట్లే తీవ్రక్లేశముతో, భీతులకు గాని, వ్యాధిపీడితులకు గాని, దీనులకు గాని, నమ్మిన వారికి గాని, మహానుభావులైన తపఃశాలులకు గాని మాటి మాటికిని చేసిన అపకారము పాపకర్మాశయము. అది కూడ వెంటనే ఫలము నిచ్చును. ఉదాహరణకు-శిలాదుని పుత్రుడైన నందీశ్వరుడు పరమేశ్వరుని ఆరాధించి ఎనిమిది సంవత్సరముల వయస్సునందే, మనుష్యశరీరమును విడిచి దేవతాశరీరమును గ్రహించెను. అట్లే దేవేంద్రపదవి పొందిన నహుషుడు ఆ శరీరమును కోల్పోయి తిర్యగంతువాయెను. నారకులకు, అనగా నరకమునకు పోవలసి యున్న వారికి, ఇహజన్మభోగ్యమగు దుఃఖముండదు. వాళ్లు నరకములో పడి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

చిరకాలము అనుభవించవలసి యున్నది కదా? అట్లే క్లేశములు క్షీణించిన వారికి గూడ పరజన్మలో అనుభవించవలసిన కర్మాశయముండదు. (వ్యా. భా; వా.మి).

అవ. క్లేశములు కర్మాశయములకు మాత్రమే కాదు, వాటి ఫలములకు కూడ కారణమని చెప్పుచున్నాడు.

సూ. సతి మూలే తద్విపాకో జాత్యాయుర్భోగాః. 13

ప్ర. అ. మూలే=ధర్మాధర్మములకు మూలమైన క్లేశము, సతి= ఉన్నపుడు మాత్రమే, తద్విపాకః=ఆ ధర్మాధర్మరూపకర్మాశయముయొక్క విపాక ప్రారంభరూపమగు, అనగా కర్మాశయఫలమగు, జాత్యాయుర్భోగాః జన్మ-ఆయుర్దాయ(జీవనకాల)-సుఖదుఃఖాదుల అనుభవము కలుగును.

వ్యా. ఇచట ముఖ్యఫలము భోగము. అందుకు అత్యావశ్యకములు జన్మ జీవనములు.

వాచస్పతిమిశ్రులు దీనికిచ్చిన అవతారిక మరొకవిధముగ ఉన్నది. కర్మాశయమునకు మూలము అవిద్యగాన విద్య కలుగగానే అవిద్య నశించుటచే మరొక కర్మాశయ మేదియు జనింపకపోవచ్చును. కాని అనాదిజన్మపరంపరలో సంచితములై, ఎప్పుడు ఏ ఫలమునిచ్చునో తెలియని అసంఖ్యాకములైన కర్మలను ఫలమనుభవించి నశింపచేసికొనుట అనునది అసంభావ్యము గాన సంసారోచ్ఛేదమునకు అవకాశము లేదు కదా అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు. **సతి మొ :**

దీని భావమిది :- కర్మాశయమునకు ఫలము సుఖదుఃఖములు. జన్మాయుర్దాయములు లేనిచో ఏతత్ఫలభోగము కుదరదు గాన అవి కూడ కర్మాశయముచే కలిగింపబడుచున్నవి. రాగద్వేషములు లేకున్నచో సుఖదుఃఖములుండవు. ఏదైన ఒక వస్తువుపై రాగమున్ననే **తత్ప్రాప్తిద్వారా** సుఖము కలుగును, ద్వేషమున్నచో తత్సంబంధముచే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

దుఃఖము కలుగును కదా? ఈ విధముగ ఆత్మభూమిని క్లేశోదకముచే తడిపినప్పుడు మాత్రమే అది (ఆత్మభూమి) కర్మఫలోత్పత్తిక్షేత్రమగును గాన కర్మాశయము ఫలమును కలిగించవలెనన్న క్లేశసహకారము అత్యావశ్యకము. ఆ క్లేశములు ఉచ్ఛిన్నము లైనపుడు సహకారి లేకపోవుటచే కర్మాశయము ఉన్నను, అనంతమైనను, అనియతవిపాకకాలమైనను దగ్ధబీజమువలె ఫలము నీయజాలదు. (వా.మి.)

కర్మాశయము జాత్యాయుర్భోగరూపమగు విపాకమును (ఫలమును) ఇచ్చుట అను విషయమును గూర్చి వ్యాసభాష్యములో విస్తృతమగు విమర్శ చేయబడినది. ఒక కర్మ 1. ఒకే జన్మనిచ్చునా 2. అనేక జన్మలనిచ్చునా అని ఒక ప్రశ్న. అట్లే అనేకకర్మలు కలిసి 3. అనేక జన్మలనిచ్చునా లేక 4. ఒక్క జన్మ నిచ్చునా అని రెండవ ప్రశ్న. ఒక కర్మ ఒకే జన్మకు కారణము అని చెప్పుట కుదరదు. అట్లు అంగీకరించిన పక్షాన అనాదిజన్మపరంపరాసంచితములైన అసంఖ్యాకములైన కర్మలును, ఈ జన్మలోనే చేసిన కర్మలును ఎప్పుడు, ఏ విధమైన ఫలములిచ్చునో చెప్పుటకు శక్యము కాదు గాన కర్మలవిషయమై అవిశ్వాసమేర్పడును. వాటి పర్యాయము (వంతు) ఎప్పుడు వచ్చునో, అసలు వచ్చునో రాదో అను సందేహము కలుగును. ఒక కర్మ అనేకజన్మలకు కారణ మను పక్షములో గూడ మిగిలిన కర్మలు ఫలమిచ్చు అవకాశమే ఉండదు. అనేకకర్మలు అనేకజన్మలకు కారణము అని చెప్పు పక్షములో గూడ ఆ కర్మలు ఏదో ఒక క్రమములో జన్మలనీయవలసి యున్నది గాన, ఆ క్రమనిర్ణయము చేయు ప్రమాణమేదియు లేదు గాన, ప్రథమపక్షోక్తమగు దోషమే సంభవించును. ఈ విధముగ పైన వికల్పించిన నాలుగుపక్షములలో మూడు పక్షములు వీగి పోయినవి. ఇక అనేకకర్మలు ఒక జన్మకు కారణము అను నాల్గవ పక్షము మిగిలినది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

జన్మమరణముల మధ్య చేయబడిన పుణ్యాపుణ్యకర్మాశయ ప్రచయము విచిత్రరూపమై ఉండును. ఆ కర్మలలో కొన్ని ప్రధానములుగను, మరి కొన్ని అప్రధానములుగను ఉండును. ఈ కర్మాశయప్రచయమంతయు మరణసమయమున ఒక్కుమ్మడిగ అభివ్యక్తమై, అనగా స్వఫలప్రదానాభి ముఖముగ చేయబడినదై, జన్మాదిరూపమగు ఫలమును కలిగించుటకై ఏకలోలీభావమును పొంది (లోలీభావమనగా కార్యోన్ముఖమగుట– becoming active) ఒక జన్మను ఇచ్చును. ఆ కర్మాశయప్రచయమే ఆ జన్మకు సంబంధించిన ఆయుస్సును, భోగమును కూడ ఇచ్చును. ఈ విధముగ ఈ కర్మాశయము జన్మను, ఆయుస్సును, ఫలమును కూడ ఇచ్చునదగుటచేత త్రిపాకమని చెప్పబడును. కావున కర్మాశయము "ఏకభవికము" (ఒకే జన్మకు సంబంధించినది)అని చెప్పబడుచున్నది.

అయితే – దృష్టజన్మవేదనీయమగు (అనగా చేసిన జన్మయందే ఫలమునిచ్చు) తీవ్రకర్మ ఏకవిపాకారంభకము కావచ్చును. ద్వివిపాకారంభ కము కావచ్చును. అనగా ఆయుర్దాయమును మాత్రము కాని, ఆయుర్భోగములను రెండింటిని ఇచ్చునదిగాని కావచ్చును. ఉదాహరణకు– నందీశ్వరునకు దేవశరీరమునిచ్చిన కర్మ దీర్ఘాయుర్దాయభోగములకు హేతువు గాన ద్వివిపాకారంభము. నహుషునకు తిర్యక్చరీరమునిచ్చిన కర్మ పాపఫలభోగ మాత్రహేతువగుటచే ఏకవిపాకారంభకము. ఇంద్రపదవి ఇచ్చిన కర్మయే ఆయుర్దాయము కూడ ఇచ్చి యున్నది.

పైన చెప్పినట్లు కర్మాశయము ఏకభవికమైనను, క్లేశవాసనలును భోగానుకూలములైన కర్మవిపాకానుభవవాసనలును ఏకభవికములు కాదు. అవి అనాదికాలమునుండి ఏర్పడినవి. చేపలు పట్టు వల రంధ్రములతో నిండి యున్నట్లు చిత్తము ఈ వాసనలతో

నిండియుండును. అందుచేతనే తిర్యగ్యోని లో పుట్టిన మానవుడు ఆ ప్రాచీనవాసనలచే తిర్యగ్జంతుసహజమైన ప్రవృత్తిని పొందగలుగును. వాసనలనగా స్మృతి హేతువులగు సంస్కారములే.

కర్మాశయము ఏకభవికమను విషయమునకు కొన్నిచోట్ల అపవాద ములుండవచ్చును. ఏకభవికకర్మాశయము నియతవిపాకము, అనియతవిపా కము అని రెండు విధములు. తప్పక ఫలము నిచ్చునది నియతవిపాకము, తద్భిన్నమైనది అనియతవిపాకము. దృష్టజన్మవేదనీయమైన నియతవిపాక కర్మాశయవిషయముననే ఈ ఏకభవికత్వనియమము. అదృష్టజన్మవేదనీయ మగు అనియతవిపాకకర్మాశయము విషయమున ఈ నియమము వర్తించదు. అట్టి కర్మాశయము విషయమున మూడు గతులు (alternatives) ఉండవచ్చును. ఒకటి-చేసిన కర్మపక్వము కాక నశించి పోవుట; రెండు -ప్రధానమైన కర్మలో కలిసిపోవుట; మూడు -తప్పక ఫలము నివ్వవలసియున్న కర్మ అణచివేయగా చాలకాలము ఫలమీయకుండగా ఉండిపోవుట.

కర్మ-శుక్లము, కృష్ణము, శుక్లకృష్ణము అని మూడు విధములు. పరపీడారహితతపఃస్వాధ్యాయాదికము శుక్లకర్మ. అది ఉదయించగనే కృష్ణకర్మను కృష్ణ శుక్లకర్మను కూడ నశింపచేయును.

"ద్వే ద్వే హ వై కర్మణీ వేదితవ్యే పాపకస్యైకో రాశిః పుణ్యకృతోఽపహన్తి, తదిచ్ఛస్వ కర్మాణి సుకృతాని కర్తుమిహైవ తే కర్మ కవయే వేదయన్తి".

అని శ్రుతి చెప్పుచున్నది. అనగా పాపస్వభావుడైన పురుషుడు చేసిన పుణ్యముల రాశి ఒక్కటే (శుక్లకర్మాశయమొక్కటే) కృష్ణము, కృష్ణశుక్లము అను రెండు విధములగు కర్మలను నశింపచేయును. అందుచే శుక్లకర్మాశయ మును పెంపొందించుకొనుము అని దీని

In Public domain. Digitization Muthulakshmi Research Academy

భావము. (యజ్ఞాంతర్గతపశు హింసాదిపాపము కృష్ణకర్మ, ఏతాదృశపాపసహితయజ్ఞాదికము కృష్ణ- శుక్లకర్మ) ఇది మొదటి గతి.

ప్రధానకర్మయగు జ్యోతిష్టోమాదికమునందు, తదంగమైన పశు హింసాదికము ఆవాపమును చెందుట (కలిసిపోవుట) రెండవగతి. దీని భావమిది. హింసాదులు ప్రధానకర్మాంగములగుటచే వాటికి ఉపకారములుగా ఉండుట అను ఒక కార్యమును, "న హింస్యాత్సర్వభూతాని" అని నిషేధింప బడుటచే అనర్థజననమను మరొక కార్యమును చేయును. ఈ హింసాదులను ప్రధానాంగముగ మాత్రమే చేసినపుడు ఇవి అప్రధానము లగుటచే ప్రధానకర్మ నిరపేక్షముగ వెంటనే ఫలమునీయజాలవు; ప్రధానకర్మ తన ఫలమునీయ నారంభించినపుడు ఇవి దానికి సాహాయ్యమును చేయుచుండును. ఈ విధముగ ప్రధానకర్మకు సాహాయ్యము చేయుచు తన కార్యము విషయమున కేవలబీజరూపమున ఉండుటకే ప్రధానకర్మలో ఆవాపము చెందుట అని పేరు. ఈ విషయమునే పంచశిఖాచార్యులు - "స్యాత్స్వల్పః సంకరః సపరిహారః సప్రత్యవమర్షః కుశలస్య నాపకర్షియాలమ్. కస్మాత్? కుశలం హి మే బహ్వన్యదస్తి యత్రాయమావాపం గతః. స్వర్గే ఽప్యపకర్షమల్పం కరిష్యతి" అని చెప్పారు. "జ్యోతిష్టోమాదులవలన కలిగిన ప్రధానాపూర్వమునకు పశుహింసాది జనితమైన అనర్థహేతువగు అపూర్వముతో స్వల్పసాంకర్యమున్నను దానిని ప్రాయశ్చిత్తాదులచే అనాయాసముగ తొలగించుకొనవచ్చును. లేదా అట్లు ప్రాయశ్చిత్తాదులు చేసికొనక పోయినను జ్యోతిష్టోమాదులవలన కలుగు మహాసుఖములో హింసాదులవలన కలుగు దుఃఖము పూర్తిగా అణగిపోవును; దాని ముందు దీని కేమియు లెక్కయే ఉండదు" అని దీని అర్థము. ఇది రెండవ గతి.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఒకప్పుడు నియతవిపాకమైన (తప్పనిసరిగ ఫలము నీయ ఉద్యుక్త మైన కర్మ బలవత్తరమై తన ఫలము నీయ ప్రారంభించినపుడు, అనియతవిపాక మగు కర్మ నశించనైన నశించిపోవును, ఆవాపమునైన పొందును లేదా అనియతవిపాకకర్మచే అభిభూతమై తనకు తగిన దేశకాలాదులు వచ్చు వరకును చిరకాలము అటులనే బీజావస్థలో ఉండిపోవును. ఇది మూడవ గతి. ఈ విధముగ కర్మగతి విచిత్రమైనది, తెలియ శక్యము కానిది. (వ్యా. భా; వా.మి.).

అవ. కర్మతద్విపాకముల ద్వారా క్లేశములు కలిగించు ముఖ్య ఫలమైన అనర్థమును గూర్చి చెప్పుచున్నాడు. (భా.గ.) –

క్లేశములు కర్మలకు మూల మనియు, కర్మలు విపాకములకు మూల మనియు చెప్పబడినది. ఇపుడు విపాకములు దేనికి మూలమో చెప్పు చున్నాడు – (వా.మి).

సూ. తే హ్లాదపరితాపఫలాః పుణ్యాపుణ్యహేతుత్వాత్. 14

ప్ర.అ. తే=జన్మాయుర్భోగములు, పుణ్యాపుణ్యహేతుత్వాత్=పుణ్య పాపములు హేతువులుగా కలవగుటచే (పుణ్యాపుణ్యములవలన కలుగుటచే), హ్లాదపరితాపఫలాః=సుఖదుఃఖములు ఫలములుగా గలవి. పుణ్యమువలన కలిగిన జన్మాయుర్భోగములు సుఖము నిచ్చును. పాపమువలన కలిగినవి దుఃఖమునిచ్చును అని భావము.

అవ. దుఃఖహేతువులగు క్లేశకర్మవిపాకాదులు హేయములు కావచ్చును. కాని సుఖహేతువులైనవి హేయములెట్లగును అని ఆశంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు –

సూ. పరిణామతాపసంస్కారదుఃఖైర్గుణవృత్త్యవిరోధాచ్చ
దుఃఖమేవ సర్వం వివేకినః. 15

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ. పరిణామతాపసంస్కారదుఃఖైః=పరిణామము, తాపము, సంస్కారము వీటివలన కలుగు దుఃఖములతో సంబంధముండుటవలనను,
గుణవృత్త్యవిరోధాచ్చ=సత్త్వరజస్తమోగుణముల వృత్తులైన సుఖదుఃఖ మోహములు ఒకే కాలమున ఉండకూడదు అను విరోధము లేకపోవుట వలనను, అనగా సుఖానుభూతి సమయమునందు కూడ దుఃఖమోహము- లుండుటకువకాశముండుటవలనను,
వివేకినః=సుఖదుఃఖతత్త్వసాక్షాత్కారము గల వివేకవంతునకు,
సర్వమ్=సమస్తము, దుఃఖమేవ= దుఃఖమే.

వ్యా. సుఖరాగముకంటె కూడ దుఃఖద్వేషము బలవత్తరమైనది. సుఖముకంటె దుఃఖము అత్యధికముగా ఉండును. అందుచే సుఖము కూడ దుఃఖముతో సంబంధించియే ఉండును గాన ఆ సుఖము కూడ పరిత్యాజ్యమే అని భావము. పరిణామదుఃఖమెట్లనగా- సుఖభోగసమయమున సుఖమునందు రాగము, సుఖమునకు విఘ్నము కలిగించువాటియందు ద్వేషము ఉండును. ప్రాణివధ లేకుండ సుఖభోగము కూడ ఉండదు. ఈ రాగద్వేషములు అదృష్టాదుల ద్వారా ఉత్తరకాలమునందు దుఃఖహేతువులగుచుండును. ఇది పరిణామ దుఃఖము. దుఃఖకాలమునందు కూడ పశ్చాత్తాపాదులచే మరొక దుఃఖము కలుగుచుండును. ఇది తాపదుఃఖము (భా.గ.) సుఖకాలమునందు కూడ ఇతరులనుభవించుచున్న అధికసుఖమును చూచి దుఃఖము కలుగుచుండును. సుఖసాధనములు కావలెనని కోరుచు అందుల కుపకరించు వారిని అనుగ్రహించును, ప్రతికూలముగానున్నవారిని పీడించును. ఇది యంతయు తాపదుఃఖము (నాగేశుడు).

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సుఖమనుభవించినవానికి దాని సంస్కారము ఉండుటచే దాని స్మరణ కలిగి తత్సాధనములందు రాగము. తదుపఘాతకములపై ద్వేషము కలుగును. ఇది సంస్కారదుఃఖము.

వ్యాసభాష్య వా.మి. వ్యాఖ్యలు ఈ విధముగా ఉన్నవి :- "పరిణామ తాపసంస్కారదుఃఖైః" అనగా పరిణామతాపసంస్కారరూపములగు దుఃఖములచేత అని అర్థము. ప్రతి ఒక్కని సుఖానుభవము కూడ చేతనములు అచేతనములు అయిన సాధనములపై ఆధారపడి ఉన్నది. ఆసక్తి లేనివాడు సుఖమనుభవించుట అనునది అసంభావ్యము గాన సుఖానుభవములో రాగము తప్పక కలిసి ఉండును. అందుచే దీనిలో రాగజకర్మాశయమున్నది. ఇతడు దుఃఖసాధనములను ద్వేషించుచుండును. వాటిని పరిహరింపజాలక మోహము చెందుచుండును అందుచే సుఖానుభవమునందు ద్వేషమోహాకృత మగు కర్మాశయము కూడ ఉండును. రాగద్వేషమోహములు మానసికములు. అవి కలిగిన పిమ్మట అవి మాటలలో వ్యక్తమయి తీరును. ఈ విధముగ సుఖానుభవసమయమున వాఙ్మనసముల ప్రవృత్తివలన పుణ్యాపుణ్యములు కలుగుచుండును అని తేలినది. భూతహింస లేనిదే భోగానుభవమనునది సాధ్యము కాదు గాన హింసాకృతమగు శారీరకకర్మాశయము కూడ ఉండును. కావుననే విషయసుఖము అవిద్యారూపమని పెద్దలు చెప్పుదురు.s

(ఆశంక) విషయములపై ఇంద్రియములకు గల ఆసక్తి తద్భోగము ద్వారా శాంతించును; అదియే సుఖము. ఆ ఆసక్తి తొలగకపోవుటయే దుఃఖము. అందుచే భోగానుభవముచే ఆ ఆసక్తి తొలగిపోవును కదా? వితృష్ణత్వము కలుగును కదా? అందుచే సుఖము దుఃఖహేతువెట్లగును. అని ఆశంకింపరాదు. తృష్ణాక్షయము సుఖహేతువు, అది దోషరహితము అను మాట వాస్తవమే. కాని

In Public domain. Digitization Muthulakshmi Research Academy

భోగానుభవము తృష్ణాక్షయమునకు హేతువు కాజాలదు. భోగానుభవము చేసిన కొలది తృష్ణ పెరుగుచునే ఉండును. కావుననే -

"న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి,

హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే".

(కామములను అనుభవించుట ద్వారా కామము శమింపదు. ఆజ్యముచే అగ్ని వృద్ధిపొందినట్లు కామములననుభవించినకొలది కామము పెరుగుచునే ఉండును) అని మహాభారతమున చెప్పబడినది. ఇదియే పరిణామదుఃఖము. ఇది సుఖావస్థలో కూడ యోగికి క్లేశమునే కలిగించును. ఇక తాపదుఃఖము: ప్రతి ఒక్కనికిని చేతనాచేతనసాధనముల ద్వారా తాపము కలుగుచుండును. అది ద్వేషమిశ్రితమై యుండును. అందుచే దానిలో ద్వేషజకర్మాశయమున్నది. సుఖసాధనములను కోరుచు మనోవాక్కాయములచే వ్యవహరించుచు కొందరిని అనుగ్రహించి మరికొందరిని పీడించి తద్వారా ధర్మాధర్మములను పెంచుకొనుచుండును. ఈ కర్మాశయము లోభమోహములవలన కలుగుచుండును గాన దీనికి తాపదుఃఖమని పేరు.

సుఖానుభవమువలన సుఖసంస్కారాశయము దుఃఖానుభవము వలన దుఃఖసంస్కారాశయము కలుగును. ఇది సంస్కారదుఃఖము. ఈ విధముగ అనాదిగా ప్రవహించుచు వచ్చిన దుఃఖస్రోతస్సు యోగికి మాత్రమే క్లేశమును కలిగించుచుండును. యోగి అక్షిపాత్ర (కంటి మధ్యభాగము) వంటివాడు. చాల సూక్ష్మముగానున్న సాలిపురుగు దారము దేహముపై ఎచ్చట సంపర్కము కలిగినను బాధ కలిగింపదు. కాని కంటిలో దాని సంపర్కము కలిగినపుడు బాధ కలుగును. అట్లే సామాన్యజనులు సుఖానుభవాదులలో ఉన్న దుఃఖసం స్పర్శను గుర్తింపజాలకున్నను విద్వాంసుడు గుర్తించకలుగును. ఈ విధముగ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అందరును కోరుకొను సుఖమునందు కూడ దుఃఖమును గుర్తించకలిగిన యోగి సర్వదుఃఖక్షయహేతువగు సమ్యగ్దర్శనమునే శరణుజొచ్చును.

ఈ వ్యాఖ్యాతల ప్రకారము "గుణవృత్తివిరోధాత్" అని పాఠము. బుద్ధి రూపమున పరిణమించిన సత్వరజస్తమోగుణములు పరస్పరానుగ్రాహకములు గాన ఆ బుద్ధివలన కలుగు ప్రత్యయములు గూడ శాంత-ఘోర-మూఢ స్వభావములై యుండును. ఈ శాంతత్వాదులు విరుద్ధములే. విరుద్ధములైనవి ఒకే సమయమున ఎట్లు కలుగును అని ఆశంక కలుగవచ్చును. ఆ మూడును సమప్రాధాన్యము కలిగియున్నపుడే విరోధము. వాటిలో ఒకటి ప్రధానమై మిగిలిన రెండును అప్రధానములైనపుడు విరోధము లేదు. అందుచే సుఖప్రత్యయసమయమునందు కూడ స్వల్పముగ ఘోరత్వమూఢత్వముల సంపర్కముచే దుఃఖప్రత్యయము కూడ ఉండవచ్చును. వివేకవంతుడు ఆ దుఃఖమును కూడ చూడగలుగును గాన ఆతని దృష్టిలో సుఖము కూడ దుఃఖసంమిశ్రమే అని భావము.

ఈ మహాదుఃఖసముదాయమునకు బీజము అవిద్య. ఆ అవిద్య పోవలెనన్న సమ్యగ్దర్శనము కావలెను. చికిత్సాశాస్త్రములో రోగము, రోగహేతువు, ఆరోగ్యము, చికిత్స అను నాలుగు వ్యూహములున్నట్లు ఈ శాస్త్రములో కూడ సంసారము, సంసారహేతువు, మోక్షము, మోక్షోపాయము అను నాలగు వ్యూహములున్నవి. దుఃఖబహులమగు సంసారము హేయము. ప్రకృతిపురుషుల సంయోగమే హేయమైన ఈ సంసారమునకు హేతువు. ఈ సంయోగము పూర్తిగా తొలగిపోవుట హానము (మోక్షము). దానికి ఉపాయము సమ్యగ్దర్శనము. హాత (సంసారమును విడచువాని) స్వరూపము హేయమూ కాదు, ఉపాదేయమూ కాదు. అది హేయమని చెప్పినచో హాత (పురుషుడు) నశించువాడు అని చెప్పవలసివచ్చును. ఉపాదేయము అన్నచో, అనగా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పురుషుడు అంతకు పూర్వము లేని ఏదియో ఒక విశేషమును (విశుద్ధజ్ఞానము మొదలగుదానిని) పొందునన్నచో, అందుకు ఏదియో హేతు వుండునని చెప్పవలసి యుండును. ఏదో ఒక హేతువును బట్టి లభించినది నశ్వరమే అగును గాన అట్లు చెప్పుట కూడ కుదరదు. అందుచే పురుషుడు స్వస్వరూపములో నుండుటయే మోక్షము. ఇదియే సమ్యగ్దర్శనము.

అవ. ఈ శాస్త్రము చతుర్వ్యూహము అను విషయమును ప్రతిపాదించుటకై మొదట హేయమును గూర్చి చెప్పుచున్నాడు.

సూ. హేయం దుఃఖమనాగతమ్. 16

ప్ర.అ. అనాగతమ్=రానున్న, దుఃఖమ్=దుఃఖము, హేయమ్= యోగముచే తొలగించుకొనదగినది.

వ్యా. గడచిపోయిన దుఃఖము గడచియే పోయినది. ఇంక అది హేయ పక్షములో చేరదు. వర్తమానదుఃఖము కూడ మరుసటి క్షణములో నశింపనున్నది గాన అది కూడ హేయపక్షములో చేరదు. ఇక రానున్న దుఃఖమే హేయము. దానినే యోగాదిసాధనములచే తొలగించుకొనుటకు ప్రయత్నించ వలెను.

అవ. హేయము చెప్పబడినది. ఇపుడు దాని నిదానమును (మూల కారణమును) చెప్పుచున్నాడు.

సూ. ద్రష్టృదృశ్యయోః సంయోగో హేయహేతుః . 17

ప్ర.అ. ద్రష్టృదృశ్యయోః=పురుషబుద్ధుల, సంయోగః=సంయోగము హేయహేతుః=హేయ మైన దుఃఖమునకు (సంసారమునకు) హేతువు.

వ్యా. ద్రష్ట అనగా బుద్ధిప్రతిసంవేదియైన పురుషుడు. తనకు దగ్గరగా ఉన్న బుద్ధిలో చైతన్యస్వరూపుడైన పురుషుడు ప్రతిబింబించుటయే బుద్ధిప్రతి సంవేదిత్వము. ఆ విధముగ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

బుద్ధిసమీపమున ఉన్నప్పుడే పురుషుడు ద్రష్ట, అనగా 'చూచేవాడు' అని చెప్పబడుచున్నాడు. వాస్తవమున శుద్ధచైతన్యరూపు డైన పురుషునకు ద్రష్టృత్వము లేదు. ఈ బుద్ధి ద్వారా పురుషునకు బాహ్యాము లైన శబ్దాదివిషయాలతో సంబంధము ఏర్పడుచున్నది. అప్పుడు అవి కూడ దృశ్యములగుచున్నవి. అనగా పురుషునకు సంనిహితముగా ఉన్న బుద్ధి దృశ్యము, తద్వారా శబ్దాదివిషయములు కూడ దృశ్యములగుచున్నవి. ఈ దృశ్యములు అయస్కాంతము వంటివి. సన్నిధిమాత్రముచేతనే పురుషునకు ఉపకారకములై (సుఖదుఃఖాదిహేతువులై) దృక్శక్తిరూపుడైన పురుషునకు 'స్వం' (సొత్తు) అగుచున్నవి.

బుద్ధి అతిస్వచ్ఛమైనది. దానికి స్వతః చైతన్యము లేదు; జడము. అయినను చిత్ప్రతిబింబమును గ్రహించుటచే చిచ్ఛక్తికలది వలె అయి, శబ్దాదులను అనుభవించుచున్నది. శుద్ధచిత్స్వరూపుడైన పురుషునికి ఈ బుద్ధి కూడా దృశ్యమే అగుటచే ఆతనికి 'స్వం' అగుచున్నది. ఈ విధముగ శుద్ధచైతన్యస్వరూపుడగుటచేత 'దృక్శక్తి' (చూచే శక్తి) అయిన పురుషునకూ, చూచుటకు సాధనమగుట చేత 'దర్శనశక్తి' అయిన బుద్ధికీ అనాదిగా వచ్చుచున్న సంయోగమే దుఃఖమునకు కారణము. ఇక్కడ సంయోగమనగా బుద్ధినే చైతన్యమునుగా భావించి చైతన్యరూపు డైన పురుషునకూ, బుద్ధికీ ఉన్న భేదమును తెలుసుకొనకపోవుట అని అర్థము. ఈ సంయోగానికి అవిద్య కారణము. ఈ సంయోగము అనాది కాలమునుండి అట్లే ఉండుటకు పురుషార్థము (పురుషునకు సుఖదుఃఖాదులను కలిగించవలసి ఉండుట) కారణము. ఈ సంయోగమునకు కారణమైన అవిద్యను తొలగించుకొన్నచో దుఃఖము పూర్తిగా తొలగిపోవును. వ్యాసభాష్యంలో ఒక ఉదాహరణం చూపబడినది. ముల్లు గ్రుచ్చుకొనును (భేదకర్త) గ్రుచ్చుకొనబడేది పాదము (భేద్యము). దీనిని పరిహరించవలెననగా పాదమును

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

ముల్లుమీద వేయకుండా నైనా ఉండవలెను లేదా పాదమునకు చెప్పు తొడిగి ముల్లు త్రొక్కవలెను. (ఇది పరిహారము). ఈ మూడు తెలిసినవాడు ప్రతీకారము ప్రారంభించుకొని ముల్లు గ్రుచ్చుకొనుటవలన కలిగే దుఃఖమును పొందడు. ఎందుచేత ననగా ఈ మూడింటి జ్ఞానము వానికి కలిగినది. ఇక్కడ తాపకము (తపింపచేసేది) రజోగుణము. తప్యము (తపింపబడేది) సత్వగుణము. తాపము సత్త్వగుణమునకే గాని పరిణామరహితుడు, నిష్క్రియుడు అయిన పురుషునకు కాదు. సత్త్వము తపింపబడినప్పుడు ఆ సత్త్వాకారమును చెందిన పురుషుడు కూడ తపించుచున్నట్లు కనబడుచుండును గాని వాస్తవమున పురుషునకు తాపము లేదు.

అవ. దృశ్యస్వరూపము చెప్పుచున్నాడు –

సూ. ప్రకాశక్రియాస్థితిశీలం భూతేన్ద్రియాత్మకం భోగాపవర్గార్థం దృశ్యమ్. 18

ప్ర.అ. దృశ్యమ్=దృశ్యము, ప్రకాశక్రియాస్థితిశీలమ్=ప్రకాశ-స్వభావము కలది, క్రియాస్వభావము కలది, స్థితి (నిశ్చలత్వము లేదా ప్రకాశక్రియాప్రతి బంధము) స్వభావము గలది, భూతేన్ద్రియాత్మకమ్= భూతముల స్వరూపము, ఇంద్రియముల స్వరూపము గలది, భోగాపవర్గార్థమ్=పురుషునకు భోగమోక్ష ములు కలిగించుటయే ప్రయోజనముగా కలది.

సత్త్వరజస్తమోగుణాలలో సత్త్వగుణస్వభావము ప్రకాశము; రజోగుణ స్వభావము క్రియ; తమోగుణస్వభావము స్థితి అనగా నిశ్చలత్వము లేదా ప్రకాశ క్రియాప్రతిబంధము. ఈ మూడు గుణముల ధర్మములు పరస్పరము కలియు చుండును. ఉదాహరణమునకు సత్త్వగుణభాగమైన ప్రకాశమును తమోగుణ భాగమైన దైన్యాదికము గాని, రజోగుణభాగమైన దుఃఖాదులు గాని ఆవరించు చుండును. ఇట్లే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

రజస్తమోగుణముల విషయమునందు కూడ గ్రహించవలెను. పరిణామమును చెందే స్వభావము గల ఈ గుణములు పురుషునితో సంయోగము పొందుచుండును; పిదప వినియోగమును పొందుచుండును. ఒకదాని నొకటి ఆశ్రయించుకొని నపుడు పృథివ్యాదిరూపములను పొందుచుండును. వీటిలో ఒక గుణము ప్రధానమైనప్పుడు ఇతర గుణములు రెండూ కూడ సంనిహితములై ఉండును. ఉదాహరణకు – దివ్యశరీరమును పుట్టించవలసి ఉన్నప్పుడు సత్త్వగుణము ప్రధానము, రజస్తమోగుణములు అంగములుగా సంనిహితములై ఉండును. మనుష్యశరీరమును పుట్టించవలసి నప్పుడు రజోగుణము ప్రధానము; సత్త్వతమోగుణములు అంగములు. తిర్యగ్జంతువుల శరీరమును పుట్టించవలసి నప్పుడు తమోగుణము ప్రధానము. సత్త్వరజోగుణములు అంగములు. ఇవి పురుషార్థములైన భోగమోక్షములను సాధించుటకు మాత్రమే ఆ యా కార్యములను సృజించుచు, ఆ పురుషార్థసాధనము పూర్తియైనవెంటనే కార్యము నుండి విరమించుచుండును. పురుషుని సంనిధిని మాత్రమే పురస్కరించుకొని అవి పనిచేయుచుండును. పురుషునియందు ఏ మాత్రము కర్తృత్వము లేదు. అతడు అయస్కాంతము వంటివాడు. అయస్కాంతము సన్నిహితముగా ఉన్నంతమాత్రముననే ఇనుము కార్యము ఎట్లు చేయుచుండునో ఇక్కడ కూడ అట్లే. ఒక గుణము ప్రధానముగా ఉన్నప్పుడు మిగిలిన రెండు గుణములు ధర్మాధర్మాదుల అపేక్ష ఏ మాత్రమూ లేకుండగనే, వాటంతట అవి వ్యాపృతములై ఉండును (పనులు చేయుచుండును. ఇట్టి గుణత్రయమునకు "దృశ్యము" అని పేరు.

ఈ గుణత్రయము పరిణామము చెంది పృథివ్యాదిసూక్ష్మస్థూల భూతములు గాను, శ్రోత్రాదిసూక్ష్మస్థూలేంద్రియములుగాను

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఆవిర్భవించును. పురుషుని భోగమోక్షములను ప్రయోజనముల నుద్దేశించియే ఈ భూతేంద్రియ రూపపరిణామము ఏర్పడుచుండును. సుఖదుఃఖరూపమైనది బుద్ధి. ఆ బుద్ధికిని పురుషునకును ఉన్న భేదమును తెలుసుకొనకపోవుట భోగము. అనగా బుద్ధిధర్మములైన సుఖదుఃఖములను పురుషునియందు ఆరోపించు కొనుట భోగము. పురుషుడు తన యథార్థస్వరూపమును గుర్తించి, సుఖదుఃఖములు తనకు చెందినవి కావు అని గ్రహించుట మోక్షము. యోధులకు కలిగిన జయపరాజయములను రాజుకు సంబంధించినట్లు చెప్పిన విధముగ వాస్తవమున బంధమోక్షములు రెండూ బుద్ధికే సంబంధించిన వైనను తత్ఫలభోక్తయైన పురుషునిపై ఆరోపింపబడుచున్నవి.

అవ. దృశ్యములైన గుణముల స్వరూపభేదమును నిర్ణయించుటకై చెప్పు చున్నాడు.

సూ. విశేషావిశేషలిఙ్గమాత్రాలిఙ్గాని గుణపర్వాణి. 19

ప్ర.అ. విశేషావిశేషలిఙ్గమాత్రాలిఙ్గాని=విశేషములు, అవిశేషములు, లింగమాత్రము, అలింగము అనేవి, గుణపర్వాణి= గుణముల పర్వములు.

వ్యా. సాంఖ్యదర్శనములో చెప్పిన సృష్టిక్రమమునే యోగదర్శనము అంగీకరించును అని వెనుక చూచి ఉన్నాము. సత్త్వరజస్తమోగుణముల సామ్యావస్థకు (హెచ్చుతగ్గులు లేని స్థితికి) **ప్రధానము** అని **ప్రకృతి** అని పేర్లు. మహదాదులు ఈ మూలప్రకృతినుండి జనించి దీనియందే లీనమైపోవు- చుండును. ప్రకృతికి మరొక కారణమేదీ లేదు. అందుచేత అది దేనిలోనూ లయము చెందదు కావున ఇది **అలింగము** అని చెప్పబడుచున్నది.

జీవులు (పురుషులు)తాము చేసిన పుణ్యపాపాదుల ఫలమును అనుభవించవలసి ఉన్నది. అందుచే (పురుషుల అదృష్టముచేత)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అంతవరకు సామ్యావస్థలో ఉన్న గుణములలో వైషమ్యము ఏర్పడి సృష్టి ప్రారంభమగును. గుణసామ్యావస్థారూపమైన ప్రధానము (ప్రకృతి) నుండి మొట్టమొదట మహత్తత్త్వము (బుద్ధి) ఆవిర్భవించును. మహత్తత్త్వమునుండి అహంకారము ఆవిర్భవించును. అహంకారములోని సాత్త్వికాంశమునుండి పంచజ్ఞానేంద్రియ ములు, పంచకర్మేంద్రియములు, మనస్సు అను ఏకాదశేంద్రియగణము, తామసాంశమునుండి సూక్ష్మభూతములు(భూతతన్మాత్రలు)ఆవిర్భవిం చును. భూతతన్మాత్రలనుండి పంచమహాభూతములు ఆవిర్భవించును. ఇదే సాంఖ్యులు చెప్పిన సృష్టిక్రమము.

పంచమహాభూతములు, ఏకాదశేంద్రియములనే ఈ పదహారింటిలో శాంత–ఘోర–మూఢములనే విశేషములుండుటచేత అవి "విశేషములు". ఇవి లేని పంచభూతతన్మాత్రలు, అహంకారము అనే ఆరూ అవిశేషములు. ఈ విశేషములు (షోడశవర్గము), అవిశేషములు (అహంకార తన్మాత్రలు) బుద్ధి తత్త్వములో లీనమగుటచేతను, ఈ బుద్ధితత్త్వమే పురుషునకు భోగాపవర్గ ములకు హేతువగుటచేతను దానికి లింగమాత్రమని పేరు. ఒక వెదురుకఱ్ఱకు వేరు వేరు పర్వములు (కణుపులు) ఉన్నట్లు ఈ విశేషములు, అవిశేషములు, లింగమాత్రము, అలింగమూ కూడ గుణముల పర్వములే, పరిణామస్థితి విశేషములే.

సాంఖ్యులు సత్కార్యవాదులు. కారణములో లీనమై అవ్యక్తముగా ఉన్న కార్యమే ఆవిర్భవించును కాని కారణములో అసలే లేని కార్యము క్రొత్తగా పుట్టజాలదు. పాలలో ఉన్న వెన్నయే ఉపాయవిశేషముచేత పైకి తీయబడుచున్నది. అట్లు కానిచో నీళ్లనుండి కూడ వెన్న రావలెను కదా? ఇదే సత్కార్యవాదము. త్రిగుణసామ్యావస్థారూపమైన ప్రధానమునకు అవ్యక్తమని పేరు. అనగా మహదాదికార్యములు దానిలో లీనములై, వ్యక్తములు కాక ఉన్నవి. ఇట్టి

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్రధానము పురుషునకు భోగాపవర్గములను ఇవ్వజాలదు; అందుచే అది 'సత్' కాదు. అట్లని అది గగనకుసుమము వలె తుచ్ఛముకాదు. మహదాది కార్యములన్నీ దానిలో లీనములై ఉన్నవి కదా. అందుచేత అది 'అసత్' కూడ కాదు. మహత్తు పురుషార్థమును సంపాదింప శక్తము. అందుచే అది 'సత్తామాత్రము'. దీని పరిణామములే విశేషావిశేషములు. వీటిలో అవిశేషము లైన అహంకార-పంచతన్మాత్రలకు, ఇంద్రియభూతాదిరూపమున పరిణామ మున్నది. కాని విశేషములైన ఇంద్రియమనఃస్థూలభూతాలకు మరొక రూపమున పరిణామము లేదు.

గుణములకు ఈ విశేష - అవిశేష - లింగమాత్రావస్థలు ఏర్పడుటకు పురుషార్థము కారణము. అందుచే అవి అనిత్యములు. అలింగావస్థకు (ప్రధానా వస్థకు) పురుషార్థము కారణము కాదు. అందుచే అది నిత్యము. గుణముల కేర్పడిన అవస్థలు అనిత్యములైనను గుణములకు మాత్రము ఉత్పత్తి వినాశములు లేవు. వాటి అవస్థల ఉత్పత్తివినాశములే వాటిపై ఆరోపింప బడుచున్నవి. దేవదత్తుడు దరిద్రుడైనాడు. ఎందుచేత? వాని గోవులు మరణించుటచేత. స్వతః దేవదత్తునిలో మార్పు లేదు. అట్లే ఇది కూడ (వ్యాసభాష్యం). ఈ విధముగ వివిధావస్థలు చెందిన గుణములే "దృశ్యము"అని ఈ సూత్రానికి భావము.

అవ. ద్రష్ట స్వరూపమేమో చెప్పుచున్నాడు.

సూ. ద్రష్టా దృశిమాత్రః శుద్ధోఽపి ప్రత్యయానుపశ్యః.

20

ప్ర.అ. ద్రష్టా=ద్రష్ట, చూచే పురుషుడు, దృశిమాత్రః=దృక్ఛక్తిమాత్ర స్వరూపుడు అనగా జ్ఞానమాత్రస్వరూపుడు. శుద్ధోఽపి=శుద్ధుడైనను; వికారము లేవీ లేనివా డైనను,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్రత్యయానుపశ్యః=బుద్ధివృత్తులను అనుకరించి (దృశ్యములను) చూచువాడు.

వ్యా. పురుషుడు జ్ఞానస్వరూపుడు. అంతే కాని కొందరు చెప్పుచున్నట్లు జ్ఞానము పురుషుని ధర్మము కాదు. జ్ఞానమే పురుషుడు. ఈ పురుషుడు శుద్ధుడు. వికారము లేవీ లేనివాడు. బుద్ధి ఆ యా విషయములపై ప్రసరించినపుడు ఆయా విషయముల ఆకారణమును పొందుచుండును. ఆ ఆకారములకే వృత్తులని పేరు. ఆ బుద్ధికి సంనిహితుడుగా ఉండుటచే పురుషుడు ఆ బుద్ధివృత్తులలో ప్రతిబింబించుచున్నాడు. వాస్తవమున చంద్రునకు జలముతో సంబంధము లేదు. కాని చంద్రబింబము జలములో ప్రతిబింబించుటచేత చంద్రునకు జలసంబంధమున్నట్లు కనబడుచున్నది. అట్లే నిర్వికారుడు, జ్ఞానస్వరూపుడు అయిన పురుషుడు ప్రతిబింబించి తద్వారా భోగ్యసమీపమునందున్న బుద్ధిలో (బుద్ధివృత్తులలో విషయములను చూచుచున్నట్లు కనబడుచున్నాడు వాస్తవమున వాటితో సాక్షాత్సంబంధము కలది బుద్ధియే. పురుషుడు ప్రతిబింబించి బుద్ధిని అనుకరించుచున్నాడు.

అవ. దృశ్యము ద్రష్టకొరకే ఉద్దిష్ట మైన దనీ, ఈ రెండింటికి మధ్య నున్న సంబంధము స్వస్వామిసంబంధము (సొత్తు దాని అధిపతి అనే సంబంధము) అనీ చెప్పుచున్నాడు.

సూ. తదర్థ ఏవ దృశ్యస్యాత్మా. 21

ప్ర.అ. తదర్థ ఏవ=ఆ పురుషుని ప్రయోజనమును సంపాదించు టయే, దృశ్యస్య=దృశ్యముయొక్క ఆత్మా=స్వరూపము.

వ్యా. కార్యకారణాత్మకమైన గుణత్రయమే దృశ్యమని చెప్పబడినది. ఈ దృశ్యము తనకొరకు కాదు. తనను తానే

అనుభవించుట కుదరదు కదా? ద్రష్టకు ఉపయోగించుటయే దృశ్యము స్వభావము. అదే దాని ప్రయోజనము.

అవ. దృశ్యమంతా పురుషునికొరకే అయినచో పురుషుడు ముక్తి పొందిన వెంటనే ఈ దృశ్యము నశించవలెను కదా అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

సూ. కృతార్థం ప్రతి నష్టమప్యనష్టం తదన్యసాధారణత్వాత్. 22

ప్ర.అ. కృతార్థం ప్రతి కృతార్థుడైనవానిని గూర్చి, అనగా ముక్తి పొందినవాని విషయమునందు, నష్టమపి=(మహదాదిదృశ్యము) నశించినను, తదన్యసాధారణత్వాత్=ఆతనికి, ఇతరులకూ కూడా సాధారణమైనదగుట వలన, అనష్టమ్=నశించనిదే.

వ్యా. ముక్తుని విషయములో మహదాదిదృశ్యము చేయవలసిన దేమీలేదు. అందుచేత ఆతనికి సంబంధించినంతవరకు అది అదృశ్యమై పోయినది. అయినను పూర్తిగా నశించదు. ఎందుచేతననగా ముక్తులు కాని పురుషులు ఇంకా ఎందరో ఉన్నారు కదా. వారికందరికి ఇది ఇంకా దృశ్యముగానే ఉండును. ఈ విషయమునే ఈ క్రింది శ్రుతివాక్యము స్పష్టీకరించుచున్నది.

"అజామేకాం లోహితశుక్లకృష్ణాం బహ్వీః ప్రజాః సృజమానాం సరూపాః,
అజో హ్యేకో జుషమాణోఽనుశేతే జహాత్యేనాం భుక్తభోగామజోఽన్యః.

తై.ఆ.6.10.

ఎఱ్ఱగాను, తెల్లగాను నల్లగాను ఉన్న, అనగా రజః-సత్త్వ-తమోరూపమైన పుట్టుక లేని ఒకటి (ప్రకృతి) ఉన్నది. అది తనతో సమానరూపము గల అనేక ప్రజలను సృష్టించుచుండును. ఒక పుట్టుక లేనివాడు (పురుషుడు) దానిని అనుభవించుచు దానినే అనుసరించి ఉండును. మరొక అజుడు దాని భోగము పూర్తి చేసికొని దానిని వదలివేయును అని దీని భావము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. 17వ సూత్రములో చెప్పిన పురుషదృశ్యముల సంయోగ మనగా ఏమో చెప్పుచున్నాడు.

సూ. స్వస్వామిశక్త్యోః స్వరూపోపలబ్ధిహేతుః సంయోగః. 23

ప్ర.అ. స్వస్వామిశక్త్యోః=స్వశక్తిస్వామిశక్తులయొక్క సంయోగః సంయోగము, స్వరూపోపలబ్ధిహేతుః=స్వరూపముల జ్ఞానమునకు హేతువు.

వ్యా. దృశ్యము స్వము; అనగా సొత్తు. పురుషుడు స్వామి; దృశ్యమునకు అధిపతి. స్వామియైన పురుషుడు దర్శనము కొరకు, స్వముతో సంయోగమును పొందుచున్నాడు. ఇట్టి సంయోగమువలన కలుగు దృశ్యజ్ఞానమే భోగము. ద్రష్ట తన వాస్తవరూపమును తెలిసికొనుట అపవర్గము (మోక్షము). ద్రష్టయైన పురుషుడు తన స్వరూపమును తెలిసికొనుటతో సంయోగము అంతమొందును. అట్టి జ్ఞానము (దర్శనము) కలగనంతవరకు సంయోగముండును. ఈ దర్శనము మోక్షమునకు సాక్షాత్తు హేతువు కాదు. ఎందుచేతననగా బంధము అదర్శనము వలన(దర్శనములేకపోవుటవలన, అనగా అజ్ఞానమువలన) ఏర్పడినది కదా. దర్శనము ఆ అదర్శనమును తొలగించుట ద్వారా మోక్ష హేతువగుచున్నది.

స్వస్వాముల సంయోగము అని కాక **స్వస్వామిశక్తుల సంయోగము** అని చెప్పబడినది. వాస్తవమున స్వ-స్వాములకు సంయోగము లేదు. అవి దగ్గరగా ఉండుటచే సంయోగావకాశము మాత్రమే ఉన్నది. ఈ సంయోగము కూడ బుద్ధి ద్వారా మాత్రమే జరుగును. అందుచే స్వ-స్వాముల సంయోగము సంభావ్యము మాత్రమే కాని సత్యము కాదు అని సూచించుటకై ఇట్లు చెప్పబడినదని వాచస్పతిమిశ్రుల అభిప్రాయము. ప్రళయకాలములో ద్రష్టదృశ్యముల సంయోగముండదు గాన అక్కడ సంస్కారరూపమున (శక్తిరూపమున)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఉన్న సంయోగమును కూడ గ్రహించుటకు వీలుగా "స్వస్వామిశక్త్యోః" అని చెప్పబడినదని భావాగణేశనాగేశాదుల అభిప్రాయము.

స్వ-స్వాముల సంయోగమును సామాన్యరూపములో కాక విశేష రూపములో గ్రహించవలెను. సామాన్యరూపమైన సంయోగము, దగ్గరగా ఉండుట అనునది, ఎల్లప్పుడూ ఉండునదే గాన ఈ సంయోగము తొలగుటకు అవకాశమే ఉండదు. ఒక్కొక్క పురుషునకు ఒక్కొక్క బుద్ధితో కలుగు సంయోగమును ఇక్కడ గ్రహించవలెను. ఇదే విశేషసంయోగము. దీనిని పట్టి పురుషుని విషయమున "పుట్టినాడు" ఇత్యాది భావాలు కలుగుచున్నవి. జన్మాదికారణము, జన్మాదిరూపము అయిన ఆ సంయోగము తొలగినచో మోక్షము.

ఈ సంయోగము ఉండుటవలననే స్వస్వాములకు స్వరూపప్రాప్తి కలుగుచున్నది. అనగా ఈ సంయోగము శుద్ధచైతన్యరూపుడైన పురుషునకు ద్రష్టృత్వమును, భోక్తృత్వమును (చూచుట, అనుభవించుట మొదలైనవాటిని కల్పింపగా ఆ పురుషునిచే చూడబడు విషయములు దృశ్యములైనవి. ద్రష్ట అనేవాడే లేనిచో విషయములకు దృశ్యత్వమెట్లు ఉండును? ఈ విధముగ ఈ సంయోగము దృశ్యమునకు దృశ్యత్వము అను స్వరూపము ఏర్పడుటకు కారణ మగుచున్నది. అట్లే ఈ సంయోగము లేనిచో పురుషునకు అంతవరకూ కప్పబడి ఉన్న తన వాస్తవస్వరూపమును గ్రహించే ప్రసక్తి ఉండదు. అందుచే పురుషుని స్వరూపోపలబ్ధికి కూడ సంయోగమే కారణము.

అవ. ఈ సంయోగవిశేషమునకు హేతువును చెప్పుచున్నాడు.

సూ. తస్య హేతురవిద్యా. 24

ప్ర.అ. తస్య=ఆ సంయోగముయొక్క, హేతుః=హేతువు, అవిద్యా అవిద్య.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. ఆత్మ కానిదానిని ఆత్మగా భావించుట అనే మిథ్యాజ్ఞానము అవిద్య. ఈ అవిద్య పురుషదృశ్యసంయోగరూపమైన జన్మకు, భోగాదులకు కారణము. ప్రలయకాలములో అవిద్య లేకపోయినను దాని వాసన (సంస్కారము) ఉండును. పునః సృష్టి జరిగినపుడు ఆ సంస్కారము ఉద్బుద్ధమై ఈ సంయోగమును కలిగించును. అందుచేత 'అవిద్యా' శబ్దానికి ఇక్కడ అవిద్యాసంస్కారము అని అర్థము చెప్పుకొనవలెను. ఆ సంస్కారము కూడ వివేకజ్ఞానముచేత నశించినప్పుడు సంయోగహేతువు లేకపోవుటచే మోక్షము లభించును.

అవ. ప్రథమవ్యూహ మైన హేయమును (దుఃఖమును), ద్వితీయ వ్యూహమూ హేయమునకు కారణమూ అయిన సంయోగమును, దానికి హేతువును చెప్పి ఇప్పుడు తృతీయవ్యూహమైన హేయదుఃఖహానమును (విడుదలను) చెప్పుచున్నాడు

సూ. తదభావాత్సంయోగాభావో హానం తద్దృశేః కైవల్యమ్. 25

ప్ర.అ. తదభావాత్=ఆ అవిద్య లేకపోవుటవలన, సంయోగాభావః= పురుషబుద్ధుల సంయోగముయొక్క పూర్తి అభావమే, హానమ్=హానము, దుఃఖనివారణము. తత్=అది, దృశః=దృక్స్వరూపుడైన పురుషునియొక్క కైవల్యమ్=కైవల్యము (మోక్షము).

వ్యా. ఆ అవిద్య తొలగిపోయినచో పురుషబుద్ధిసంయోగము పూర్తిగా, సంస్కారము కూడ ఉండకుండగా తొలగిపోవును. అదియే హానము, అనగా దుఃఖముల వినాశము. అప్పుడు పురుషుడు గుణములతో సంబంధము లేక కేవలుడై (ఒంటరిగా) ఉండిపోవును. అట్టి స్థితియే కైవల్యము.

భోజుడు – "హానమ్=సంయోగముయొక్క హానము"అని అర్థము చెప్పినాడు. ఈ సంయోగహానమనేది కలిసి ఉన్న రెండు మూర్తద్రవ్యములు (రెండు ఘటములు, ఘటపటములు మొదలైనవి)

In Public domain. Digitization Muthulakshmi Research Academy
విడిపోవుటవంటిది కాదు. వివేకఖ్యాతి కలిగిన తరువాత అవివేకముచే ఏర్పడిన సంయోగము (అభేదభ్రాంతి) దానంతటఅదే పోవును. ఆ సంయోగము పోవుటయే పురుషునకు కైవల్యము. (భో.వృ.)

అవ. చతుర్ధవ్యూహమైన హానోపాయమును చెప్పుచున్నాడు.

సూ. వివేకఖ్యాతిరవిప్లవా హానోపాయః. 26

ప్ర.అ. అవిప్లవా=విప్లవము లేని, వివేకఖ్యాతిః=బుద్ధి వేరు, పురుషుడు వేరు అను జ్ఞానము, హానోపాయః=దుఃఖహానమునకు (దుఃఖము తొలగుటకు) ఉపాయము

వ్యా. శాస్త్రముచేతను, యుక్తులచేతను "పురుషుడు వేరు, బుద్ధి వేరు" అనే జ్ఞానము కలిగినను మిథ్యాజ్ఞానము తొలగకపోవుటచే కైవల్యము లభించదు. అందుచేత శాస్త్ర-యుక్త్యాదులచే వివేకమును (సత్త్వపురుషాన్యతా జ్ఞానమును) సంపాదించుకొని దీర్ఘకాలము నిరంతరభావన చేయుటచేత ఆ వివేకజ్ఞానము స్థిరముగా నిలచును. దానికి విప్లవము, అనగా మిథ్యాజ్ఞానముచే విఘాతము కలగదు. మిథ్యాజ్ఞానము సంస్కారరహితముగా నశించుటచే అది వివేకజ్ఞానమునకు విప్లవమును, (ఉపద్రవమును) కలిగింపజాలదు. అట్టి వివేకఖ్యాతి (జ్ఞానము) కలిగిన వెంటనే హేయమైన దుఃఖమునకు హానము (దృశ్యపరిత్యాగము. భో.వృ.) కలుగును.

అవ. వివేకఖ్యాతిఫలమును చెప్పుచున్నాడు.

సూ. తస్య సప్తధా ప్రాన్తభూమిః ప్రజ్ఞా. 27

ప్ర.అ. తస్య=వివేకఖ్యాతిరూప మైన ఆ హానోపాయముయొక్క ప్రాన్త భూమిః=చివరిభూమికయైన, ప్రజ్ఞా=ప్రజ్ఞ, సప్తధా=ఏడువిధములు (ఇది భావాగణేశాదుల ప్రకారము అర్థము), తస్య=ఆ వివేకఖ్యాతి కల యోగికి, ప్రాన్తభూమిః=ఉత్కృష్టమైన అంతములు (ఉన్నతులు) గల,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

భూమికలు గల, ప్రజ్ఞా=ప్రజ్ఞ, సప్తధా=ఏడువిధములుగా ఉండును (ఇది వాచస్పతిమిశ్రుని ప్రకారము).

వివేకఖ్యాతి కలవానికి కలిగే జ్ఞానములో ఉన్నతస్థాయికి చెందిన ఏడు భూమికలు ఉండును. "హేయమైన దుఃఖమును గూర్చి నేను పూర్తిగా తెలిసి కొన్నాను. ఇంక తెలిసికొనవలసినది లేదు" అనేది మొదటి భూమిక. "వివేక ఖ్యాతిరూపమైన హానోపాయమును సమకూర్చుకొన్నాను; ఇక సమకూర్చుకొన వలసినది లేదు" అనేది రెండవది. "హేయమునకు హేతువులైన అవిద్యాకామ కర్మాదులు పూర్తిగా క్షీణించినవి; ఇంక క్షీణింపచేయవలసినవి లేవు" అనేది మూడవ భూమిక; "దుఃఖహానరూపమైన మోక్షమనే ఫలమును అసంప్రజ్ఞాత యోగము ద్వారా సాక్షాత్కరింపచేసికొన్నాను. ఇక తెలియదగిన పురుషార్థ మేదీ లేదు" అనేది చతుర్థభూమిక. ఈ విధముగ ఈ నాలుగు భూమికలలో యోగి తాను చేయవలసిన కృత్యములు పూర్తియైనవి అనే అనుభవమును పొందును. ఇవి ప్రయత్నసాధ్యములు. అందుచేత ఈ భూమికలకు **కార్యవిముక్తి** అని పేరు. మిగిలిన భూమికాత్రయములో విదేహకైవల్యావస్థను గూర్చిన అనుభవము ఉండును. వీటికి **చిత్తవిముక్తి** అని పేరు. ఎట్లనగా – "నా బుద్ధి భోగాపవర్గములను సాధించుట అనే పనిని పూర్తిచేయనున్నది" అనేది మొదటిది. (ఐదవది). "బుద్ధిరూపమున పరిణమించిన సత్త్వాది గుణములు తమ కారణమునందు లీనములు కానున్నవి" అనేది రెండవది (ఆరవది). "అవి లీనములైనపిమ్మట మరల వాటికి బుద్ధిరూపపరిణామము కలుగదు" అనేది మూడవది (ఏడవది), ఇట్లు ఏడు విధముల అనుభవముగలవనానికి, ఈ జ్ఞాననిష్ఠ సద్యోముక్తిని ఇచ్చును.

అవ. వివేకఖ్యాతి హానమునకు ఉపాయము అని చెప్పబడినది. ఆ వివేకఖ్యాతికి సాధనములను చెప్పుచున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సూ. యోగాఙ్గానుష్ఠానాదశుద్ధిక్షయే జ్ఞానదీప్తిరావివేకఖ్యాతేః. 28

ప్ర.అ. యోగాఙ్గానుష్ఠానాత్=యోగాంగములయొక్క అనుష్ఠానము వలన, అశుద్ధిక్షయే=అశుద్ధికి క్షయముకలుగగా, ఆవివేకఖ్యాతేః=వివేకఖ్యాతి వరకు, జ్ఞానదీప్తిః=జ్ఞానముయొక్క వృద్ధి కలుగును.

అశుద్ధిక్షయే అనుదానికి **విపర్యయము క్షీణించగా** అని భాష్యములో అర్థము చెప్పబడినది. ఉపలక్షణచేత (చెప్పవలసినదానిలో కొంతమాత్రమే చెప్పగా దానిని పట్టి ఇతరములను గ్రహించుట ఉపలక్షణము) పుణ్యపాపములను కూడా గ్రహించవలెనని వాచస్పతిమిశ్రుడు. విపర్యయ జ్ఞానము, దానివలన కలిగిన పుణ్యాపాపములు క్షీణించగా అని అర్థము.

యోగసాధనములనుష్ఠించగా అశుద్ధి తగ్గుచుండును. అశుద్ధి తగ్గు చున్నప్పుడు జ్ఞానదీప్తి వృద్ధిపొందుచుండును. ఇది వృద్ధిపొందినపుడు గుణ-పురుషస్వరూపవిజ్ఞానరూపమైన వివేకఖ్యాతి కలుగును. ఇట్లు గండ్రగొడ్డలి కొమ్మను చెట్టునుండి విడదీసినట్లు, యోగాంగానుష్ఠానము అశుద్ధిని పురుషుని నుండి వేరుచేయును. ధర్మము సుఖమునిచ్చినట్లు వివేకఖ్యాతినిచ్చును.

అవ, యోగాంగములను సంఖ్యానిర్ధారణ పూర్వకముగా చెప్పుచున్నాడు.

సూ. యమనియమాసనప్రాణాయామప్రత్యాహారధారణా ధ్యానసమాధయోఽష్టావఙ్గాని. 29

ప్ర. అ. యమ.... సమాధాయః=యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి అనేవి, అష్ట ఎనిమిది, అఙ్గాని=యోగాంగములు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. ఇవి జ్ఞానమునకు ఎట్లు సాధనములో యోగానికి కూడా అట్లే సాధనములగుటచేత వీటికి యోగాంగములని పేరు.

సూ. తత్రాహింసాసత్యాస్తేయబ్రహ్మచర్యాపరిగ్రహా యమాః 30

ప్ర.అ. తత్ర=వాటిలో, అహింసా.... అపరిగ్రహాః=అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అనేవి, యమాః=యమములు,

వ్యా. ఏ ప్రాణులకూ ద్రోహము చేయకుండుట **అహింస**. అహింస అన్నింటికంటే ప్రధానమైనది. అహింసను శుద్ధము చేసి, బలపరచుటకే సత్యాదులు చెప్పబడినవి (వ్యా.భా.) దేనిని ఎట్లు చూచునో ఎట్లు ఊహించునో దానినట్లే ప్రకటించుట **సత్యము**. తన అభిప్రాయమును ఇతరులకు తెలుపుటకు కదా వాక్కును ఉపయోగించునది. అట్టి వాక్కులో మోసము కాని, భ్రాంతిజనకత్వము కాని, అర్థముకాకుండుట గాని ఉండ కూడదు. ఇదే **సత్యము**. సత్యము కూడ సర్వభూతముల ఉపకారముకొరకై ఉపయుక్తముగా ఉండవలెను. అపకారకరమైనచో పాపహేతువే అగును. అందుచేత సత్యమును కూడ బాగుగా పరీక్షించియే పలకవలెను. ఇతరుల వస్తువులను తీసికొనక పోవుట, వాటియందు ఆసక్తియే లేకపోవుట **అస్తేయము**,

"స్మరణం కీర్తనం కేలిః ప్రేక్షణం గుహ్యభాషణమ్
సంకల్పోఽధ్యవసాయశ్చ క్రియానిర్వృత్తిరేవ చ,
ఏతన్మైథునమష్టాఙ్గం ప్రవదన్తి మనీషిణః",

(ప్రేమపాత్రులను గూర్చి స్మరించుట, వారి మాటలు చెప్పుకొనుట, వారితో విహరించుట, చూచుట, రహస్యముగా మాటలాడుకొనుట, కలవవలెనని సంకల్పించుట, నిశ్చయించుట, కలియుట అని మైథునమునకు ఎనిమిది అంగములు) అని చెప్పిన అష్టాంగమైథునము

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పూర్తిగా త్యజించుట బ్రహ్మచర్యము. విషయములను సంపాదించుట, రక్షించుట, సంపాదించినవి క్షీణించుట, వాటియందు అత్యాసక్తి, హింస మొదలైన ఎన్నో దోషములు ఉన్నవని తెలుసుకొని అట్టి విషయములను (భోగ్యపదార్థములను సేకరించకుండా ఉండుట **అపరిగ్రహము**. అనగా కావలసినదానికి మించి కూడబెట్టకపోవుట అపరిగ్రహము. ఈ ఐదూ యమములు.

అవ. యమముల వైశిష్ట్యమును చెప్పుచున్నాడు.

సూ. జాతిదేశకాలసమయానవచ్ఛిన్నాః సార్వభౌమా మహావ్రతమ్. 31

ప్ర.అ. జాతి..... అనవచ్ఛిన్నాః=జాతిచేత కాని, దేశముచేత గాని, కాలముచేత గాని, సమయముచేత గాని పరిమితములు కానివి, సార్వభౌమాః జాత్యాదులైన సకలభూములకు (విషయములకు) సంబంధించిన ఈ అహింసాదియమములు, మహావ్రతమ్=మహావ్రతమని చెప్పబడును.

వ్యా. జాతి అనగా మనుష్యత్వాదిజాతి. దేశ మనగా పవిత్రతీర్థాదులు. కాలమనగా చతుర్దశ్యాదులు. సమయమనగా యుద్ధాదిసమయము. వీటిచే అవచ్ఛిన్నములు, అనగా నియమితములు కాని అహింసాదులకు మహావ్రతమని పేరు. అహింసాదులు "మనుష్యులను చంపను, పుణ్యక్షేత్రములలో చంపను, చతుర్దశినాడు చంపను, యుద్ధమునందు తప్ప మరొక సమయమునందు చంపను"- ఇట్టి విశేషములచేత నియమితములు కాకూడదు. ఈ అహింసాదు లను అన్ని జాతుల విషయమునందూ, అన్ని దేశములలో, అన్ని కాలములలో, అన్ని సమయములలో పాటించవలెను. అందుచే ఇవి సార్వభౌమములు, అనగా సర్వజాత్యాదిసాధారణములు. అందుచే ఇవి పాటించుట మహావ్రతమును పాటించుట, అహింసయందువలె సత్యాదుల

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విషయములో కూడ జాత్యాద్యన -వచ్ఛిన్నత్వమునకు ఉదాహరణలు చూచుకొనవలెను.

అవ. యమముల తరువాత నియమములు చెప్పుచున్నాడు.

సూ. **శౌచసంతోషతపఃస్వాధ్యాయేశ్వరప్రణిధానాని నియమాః.** 32

ప్ర.అ. శౌచ..... ప్రణిధానాని=శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము అను ఐదూ, నియమాః=నియమములు.

వ్యా. మట్టి, జలము మొదలైనవాటితో చేసికొనే బాహ్యశుద్ధి, పంచగవ్యాధి భక్షణముచేత చేయు ఆభ్యంతరశుద్ధి **శౌచము**. ఇది శారీరము. రాగము, ద్వేషము మొదలైన మలములను క్షాళన చేసికొనుట **మానసశౌచము**. ఉన్నవాటికంటె అధికము కావలెననే కోరిక లేకుండుట **సంతోషము**. (ఉన్నదానితో తృప్తిపడుట) చాంద్రాయణాదివ్రతములను పాటించుచు ఆకలి, దప్పిక, శీతము, ఉష్ణము, స్థాన (నిలబడుట) ఆసనములు (కూర్చుండుట) కాష్ఠమౌన (చేష్టలచేత కూడ స్వాభిప్రాయమును తెలుపకుండుట) ఆకార మౌనములు (మాటలాడక పోవుట) మొదలైన ద్వంద్వములను సహించుట **తపస్సు**. మోక్షశాస్త్రముల అధ్యయనము లేదా ఓంకారజపము (వ్యా. భా.) **స్వాధ్యాయము**. సర్వకర్మలను పరమేశ్వరునికి సమర్పించుట, పరమేశ్వరునికి అర్చించుట **ఈశ్వరప్రణిధానము**. వ్యాసభాష్యములో ఈ క్రింది శ్లోకము ఉదాహరించబడినది. –

"శయ్యాసనస్థోఽథ పథి వ్రజన్వా స్వస్థః పరిక్షీణవితర్కజాలః
సంసారబీజక్షయమీక్షమాణః
స్యాన్నిత్యయుక్తోఽమృతభోగభాగీ".

In Public domain. Digitization Muthulakshmi Research Academy

(శయ్యపైన ఉన్నా ఆసనముమీద కూర్చున్నా, మార్గములో నడచుచున్నా, స్వస్థుడుగా ఉన్నా, జవసత్తువులు ఉడిగినవాడై ఉన్నా, సంసారబీజమైన అజ్ఞానము పోవలెనని కోరువాడు సర్వదా పరమేశ్వరుని యందు మనస్సు లగ్నము చేయవలెను. అప్పుడు అతడు అమృతత్వమును మోక్షమును పొందును.)

అవ. యమనియమాది సేవనములో విఘ్నములు కలిగినప్పుడు వాటి నివారణోపాయము చెప్పుచున్నాడు.

సూ. వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్. 33

ప్ర.అ. వితర్కబాధనే=వితర్కములచేత బాధింపబడినప్పుడు, ప్రతిపక్ష భావనమ్= వితర్కములకు ప్రతిపక్షములైన విషయముల భావన చేయవలెను.

వ్యా. అహింసాదియమములను శౌచాదినియమములను పాటించుట కై ప్రయత్నించువానికి ఎప్పుడైన మనస్సులో హింసాది వితర్కములు కలిగి – "నాకు అపకారము చేసిన వీనిని చంపివేసెదను. అసత్యము కూడ పలికెదను. వీని ద్రవ్యమును తీసికొందును. వీని భార్యను అనుభవించెదను. వీని సొత్తుకు యజమాని అగుదును" ఇత్యాదిదుర్బుద్ధులచే అహింసాదులకు బాధ కలుగును. అట్టి వితర్కములను మనస్సులోనుండి తొలగించుకొనుటకు వాటికి విరుద్ధమైన "ఈ సంసారాంగారములలో (ఎఱ్ఱని నిప్పులు) వేగిపోవుచున్న సర్వభూతములకు అభయము నొసగి యోగమార్గమును శరణుజొచ్చినాను కదా. ఇపుడు దానిని విడచి వితర్కముల వైపు నా మనస్సు పోవుచున్నదే. నా ప్రవృత్తి వాంతిని తినే కుక్క ప్రవృత్తి వలె ఉన్నదే!" అని భావన చేసినచో ఆ వితర్కములు తొలగి పోవును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. ప్రతిపక్ష భావనాస్వరూపమును చెప్పుటకై వితర్కముల స్వరూపము, ప్రకారములు, మఱియు కారణములను, ధర్మఫలభేదాదులను చెప్పుచున్నాడు. -

సూ. వితర్కా హింసాదయః కృతకారితానుమోదితా లోభక్రోధమోహ

పూర్వకా మృదుమధ్యాధిమాత్రా దుఃఖా జ్ఞానానన్తఫలా ఇతి ప్రతిపక్షభావనమ్. 34

ప్ర.అ. హింసాదయః=హింస మొదలైన, వితర్కాః=వితర్కములు, కృతకారితానుమోదితాః కృతములు, కారితములు, అనుమోదితములు. లోభక్రోధమోహపూర్వకాః=లోభము, క్రోధము, మోహము పూర్వమునందు గలవి. మృదుమధ్యాధిమాత్రాః=మృదుప్రమాణము, మధ్యప్రమాణము అధిక ప్రమాణము గలవి. దుఃఖాజ్ఞానానన్తఫలాః=దుఃఖము, అజ్ఞానము అనే అనంత మైన ఫలము గలవి, ఇతి=ఇట్లు భావించుట, ప్రతిపక్షభావనమ్=ప్రతిపక్ష భావనము.

వ్యా. యమనియమాలకు విపరీతములైన హింస - అసత్య- స్తేయ - అబ్రహ్మచర్య-ప్రతిగ్రహ-అశౌచ-అసంతోష-అతపః- అనధ్యాయ-అనీశ్వర ప్రణిధానములకు ఈ శాస్త్రములో వితర్కములు అని పేరు. అవి స్వయముగ చేయబడినవిగాని, ఇతరులచేత చేయించబడినవి గాని, బాగు బాగు అని అనుమోదింపబడినవి గాని కావచ్చును. అట్లే అవి లోభముచేత గాని, క్రోధముచేత గాని, మోహముచేత గాని చేయబడవచ్చును. వీటిలో కొన్ని అల్పప్రమాణములును కొన్ని మధ్యప్రమాణములును, కొన్ని అధికప్రమాణము లును ఉండవచ్చును. వీటి స్వరూపస్వభావాదులెట్లున్నను వీటివలన కలిగే ఫలము మాత్రము

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

అనంతమైన దుఃఖము, అనంతమైన అజ్ఞానమే. ఇట్టి భావనయే ప్రతిపక్షభావన. వితర్కములు కలిగినప్పుడల్లా ఈ విధమైన ప్రతిపక్ష భావన చేయుచు ఉన్నచో అవి అణగిపోవును.

అవ. రాబోవు సూత్రములలో యమనియమాదులవలన సత్ఫలము కలుగుచున్నదని తెలిసికొనుటకై ఉపయోగించు మఱియు వాటివలన కలుగు సిద్ధులను చెప్పుచున్నాడు.

సూ. అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః. 35

ప్ర.అ. అహింసాప్రతిష్ఠాయామ్ అహింసకు స్థైర్యమేర్పడినప్పుడు, తత్సంనిధౌ=అహింసా స్థైర్యము గల యోగి సంనిధియందు, వైరత్యాగః= మార్జాల మూషకాదులు కూడ తమ సహజవైరమును విడచుట జరుగును.

సూ. సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వమ్. 36

ప్ర.అ. సత్యప్రతిష్ఠాయామ్=సత్యమునకు స్థైర్యము కలుగగా, క్రియాఫలాశ్రయత్వమ్=ఆ యా ధర్మాధర్మాదికర్మల ఫలమునకు ఆశ్రయ మగుట లభించును.

వ్యా. సత్యస్థైర్యము గలవాడు "ధార్మికుడవు అగుము" అని ఎవనినైన ఆశీర్వదించినచో అతడు ధార్మికుడగును. స్వర్గం ప్రాప్నుహి (స్వర్గమును పొందెదవు గాక) అన్నచో యాగాదికము చేయకపోయినను స్వర్గమును పొందును. ఈ విధముగ సత్యప్రతిష్ఠ కలవాని వాక్కు అమోఘమగును.

సూ. అస్తేయప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానమ్. 37

ప్ర.అ. అస్తేయప్రతిష్ఠాయామ్=అస్తేయమునకు స్థైర్యము కలిగి నప్పుడు, సర్వరత్నోపస్థానమ్=సకలరత్నముల ప్రాప్తి కలుగును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. అస్తేయప్రతిష్ఠితుడు కోరకపోయినను అన్ని వైపులనుండి అన్ని రత్నాలు వచ్చి అతనిని చేరును.

సూ. బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః. 38

ప్ర.అ. బ్రహ్మచర్యప్రతిష్ఠాయామ్=బ్రహ్మచర్యముయొక్క స్థైర్యము కలిగినప్పుడు, వీర్యలాభః=సామర్థ్యముయొక్క లాభము కలుగును.

వ్యా. బ్రహ్మచర్యస్థైర్యము గల యోగి సామర్థ్యముచే అడ్డు లేని అణిమాది గుణములను పెంపొందించుకొనగలడు. లేదా జ్ఞానక్రియాశక్తులను పెంపొందించుకొనగలడు. తాను జ్ఞానవంతుడై శిష్యులకు జ్ఞానమును ప్రసాదించు సామర్థ్యమును పొందును.(వ్యా.భా.) బ్రహ్మచర్యమనగా వీర్య నిరోధము గాన దాని ప్రకర్షచేత శరీరేంద్రియమనస్సులలో వీర్యము వృద్ధిపొందును. (భో. వృ.)

సూ. అపరిగ్రహస్థైర్యే జన్మకథన్తాసంబోధః. 39

ప్ర.అ. అపరిగ్రహస్థైర్యే=అపరిగ్రహమునందు స్థైర్యమేర్పడినపుడు, జన్మకథన్తాసంబోధః=జన్మ ఎట్లు వచ్చినది అను జ్ఞానము కలుగును.

వ్యా. అపరిగ్రహమునందు స్థైర్యమును సంపాదించుకొనిన యోగి తన పూర్వాపరజన్మాదులను గూర్చి, ఇతరుల పూర్వాపరజన్మాదులను గూర్చి ఆ యా వస్తువుల స్వరూపస్వభావభవిష్యతిత్యాదులను గూర్చి తెలిసికొనును (వ్యా.భా.)

పరిగ్రహమనగా భోగసాధనములను కూడబెట్టుకొనుట మాత్రమే కాదు, శరీరపరిగ్రహము కూడ పరిగ్రహమే. శరీరముకూడ భోగసాధనమే కదా? శరీరపరిగ్రహమున్నంత కాలము రాగము అనువర్తించుచునే ఉండును గాన తాత్త్వికజ్ఞానము కలుగదు. అందుచే శరీరము విషయమున ఔదాసీన్యమును అవలంబించినచో, అంతగా శ్రద్ధ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

చూపనిచో, రాగము తొలగి సమ్యక్ జ్ఞానమునకు హేతువైన పూర్వాపరజ్ఞానము కలుగును. (భో.వృ.)

అవ. యమములవలన కలుగు సిద్ధులను చెప్పి నియమసిద్ధులను చెప్పు చున్నాడు.

సూ. శౌచాత్స్వాఙ్గజుగుప్సా పరైరసంసర్గః. 40

ప్ర.అ. శౌచాత్=శౌచమువలన, స్వాఙ్గజుగుప్సా=తన శరీరమునందు జుగుప్స(అసహ్యము), పరైః=ఇతరులతో, అసంసర్గః=సంబంధము లేకపోవుట కలుగును.

వ్యా. ఇంత మృజ్జలాదిశుద్ధి చేయుచున్నను తన శరీరము ఇంకా అశుచిగానే ఉండుట చూచిన యోగికి తన శరీరముమీదనే జుగుప్స కలుగును. అట్టివాడు ఇతరులతో సంబంధము పెట్టుకొనునా?

అవ. బాహ్యశౌచసిద్ధికి ఫలము చెప్పి అంతఃశౌచసిద్ధి ఫలమును చెప్పు చున్నాడు –

సూ. సత్త్వశుద్ధిసౌమనస్యైకాగ్ర్యేన్ద్రియజయాత్మదర్శన యోగ్యత్వాని చ. 41

ప్ర.అ. సత్త్వ.....చ=చిత్తశుద్ధి, సౌమనస్యము, ఏకాగ్రత, ఇంద్రియ జయము, ఆత్మను చూచుటకు యోగ్యత్వము కూడ కలుగును.

వ్యా. అంతఃశౌచసిద్ధివలన ముందు చిత్తసత్త్వము శుద్ధమగును. పిమ్మట మనస్సు స్వచ్ఛమగును, భేదము ఉండదుగాన మనస్సునకు ప్రీతి కలుగును.(భో,వృ) పిమ్మట ఏకాగ్రత లభించును. పిమ్మట ఇంద్రియములను జయించు శక్తి, పిమ్మట ఆత్మసాక్షాత్కారము చేసికొనే యోగ్యత్వము లభించును.

సూ, సంతోషాదనుత్తమః సుఖలాభః. 42

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ. సంతోషాత్=సంతోషమువలన, అనుత్తమః=చాల ఉత్తమమైన (దేనికంటె ఉత్తమమైనది మరొకటి లేదో అట్టి), సుఖలాభః= సుఖము యొక్క లాభము కలుగును.

వ్యా. యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్
తృష్ణాక్షయసుఖస్యైతే నార్హతః షోడశీం కలామ్".

లోకములో ఆ యా కామములను అనుభవించుటవలన కలుగు ఏ సుఖమున్నదో అది, స్వర్గలోకములో లభించే ఏ గొప్ప సుఖమున్నదో అదీ, తృష్ణ (ఆశ) నశించుటచేత కలిగే సుఖములో పదహారవ వంతుకు కూడ పోలవు అని చెప్పినట్లు తృప్తివలన కలిగే సుఖమునకు మించిన సుఖము లేదు.

సూ. కాయేన్ద్రియసిద్ధిరశుద్ధిక్షయాత్తపసః. 43

ప్ర.అ. తపసః=తపస్సువలన, అశుద్ధిక్షయాత్=మలముల క్షయము వలన, కాయేన్ద్రియసిద్ధిః=కాయసిద్ధి, ఇంద్రియసిద్ధి కలుగును.

వ్యా. కాయసిద్ధి అనగా అణిమాదుల సిద్ధి. ఇంద్రియసిద్ధి అనగా దూరముగ ఉన్నవస్తువును చూచే శక్తి దూరముగా ఉన్న శబ్దమును వినగల శక్తి మొదలైనవి.

సూ. స్వాధ్యాయాదిష్టదేవతాసంప్రయోగః. 44

ప్ర.అ. స్వాధ్యాయాత్=స్వాధ్యాయమువలన, ఇష్టదేవతాసంప్రయోగః= ఇష్టదేవతతో సంబంధము కలుగును.

వ్యా. స్వాధ్యాయశీలునకు దేవతలు, ఋషులు, సిద్ధులు మొదలైనవారు దర్శన మిచ్చి అతని పనులు సఫలము చేయుదురు (వ్యా.భా.).

సూ. సమాధిసిద్ధిరీశ్వరప్రణిధానాత్. 45

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర. అ. ఈశ్వరప్రణిధానాత్= ఈశ్వరప్రణిధానమువలన, సమాధిసిద్ధిః =సమాధియొక్క సిద్ధి కలుగును.

వ్యా. సర్వభావములను ఈశ్వరునిపై అర్పించినవానికి సమాధిసిద్ధి కలిగి అతడు, దేశాంతరమునకు గాని, దేహాంతరమునకు గాని, కాలాంతరమునకు గాని సంబంధించిన, కావలసిన విషయములను యథాతథముగా తెలిసికొనగలడు (వ్యా. భా.).

అవ. యమనియమములను, వాటివలన కలుగు సిద్ధులను చెప్పి ఇప్పుడు ఆసనాదులను చెప్పుచున్నాడు.

సూ. స్థిరసుఖమాసనమ్. 46

ప్ర.అ. స్థిరసుఖమ్=స్థిరముగాను, సుఖముగాను ఉండు, ఆసనమ్= ఆసనము, పద్మాసన-భద్రాసన-స్వస్తికాదికము, గ్రహింపదగినది. ఆసనాలకు సంబంధించిన విశేషములు హఠయోగగ్రంథాలలో లభించును.

అవ. ఆసనస్థైర్యమునకు ఉపాయము చెప్పుచున్నాడు –

సూ. ప్రయత్నశైథిల్యానన్తసమాపత్తిభ్యామ్. 47

ప్ర.అ. ప్రయత్నశైథిల్యానన్తసమాపత్తిభ్యామ్ = ప్రయత్నముయొక్క శైథిల్యము చేతను, అనంతునియందు మనస్సు నిలుపుటచేతను ఆసనస్థైర్యము లభించును.

వ్యా. తాను ఏ ఆసనమునందు కూర్చుండవలెనని కోరునో ఆ ఆసనమునందు ఆయాసపడుచు, బిగపెట్టి కూర్చున్నట్లు కూర్చొనకూడదు. శరీరమును బలవంతము చేయక అప్రయత్నముగా, అలసట లేకుండునట్లు పద్మాసనాద్యాసనములలో కూర్చుండవలెను. అప్పుడు స్థిరత్వమేర్పడును. కదలకుండ నిలచి ఈ భూమిని తన ఫణాసహస్రముమీద మోయుచున్న ఆదిశేషునిమీద మనస్సు నిలిపినను ఆసనస్థైర్యము లభించును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"ప్రయత్నశైథిల్యానన్త్యసమాపత్తిభ్యామ్" అని భోజవృత్తిప్రకారము పాఠము. "ఆసనమును బంధించెదను"అని ఇచ్ఛ కలిగినప్పుడెల్ల ప్రయత్నము శిథిలమైనను క్లేశము లేకుండగనే ఆసనము సంపన్నమగును. ఆకాశాదులందున్న ఆనంత్యము మీద (అవధిలేని మహావిస్తారముమీద) చిత్తమును నిలిపి, ఆ ఆనంత్యముతో చిత్తమునకు తాదాత్మ్యమును ఏర్పరచినచో అప్పుడు దేహాహంకారము ఉండదు గాన ఆసనము దుఃఖజనకము కాదు. (భో.వృ.)

సూ. తతో ద్వన్ద్వానభిఘాతః. 48

ప్ర.అ. తతః = ఆసనజయమువలన, ద్వన్ద్వానభిఘాతః = శీతోష్ణాది ద్వంద్వములవలన అభిఘాతము ఉండదు.

అవ. ఆసనస్థైర్యము లభించిన తరువాత అభ్యసింపవలసిన ప్రాణాయామము లక్షణము చెప్పుచున్నాడు.

సూ. తస్మిన్ సతి శ్వాసప్రశ్వాసయోర్గతివిచ్ఛేదః ప్రాణాయామః. 49

ప్ర.అ. తస్మిన్=ఆసనస్థైర్యము (జయము), సతి=ఉండగా, శ్వాసప్రశ్వాసయోః=శ్వాసప్రశ్వాసలయొక్క, గతివిచ్ఛేదః=గతివిచ్ఛేదరూపమైన, ప్రాణాయామః=ప్రాణాయామము, అభ్యసింపదగినది.

వ్యా. బైటనున్న గాలిని లోనికి పీల్చుట శ్వాస; పీల్చినదానిని పైకి వదలుట ప్రశ్వాస, ఈ శ్వాసప్రశ్వాసలు మామూలుగా జరగకుండా వాటి గతికి విచ్ఛేదమును కలిగించుట ప్రాణాయామము.

అవ. ప్రాణాయామమునకు సంబంధించిన అవాంతరభేదములను చెప్పు చున్నాడు..

సూ. బాహ్యాభ్యన్తరస్తమ్భవృత్తిర్దేశకాలసంఖ్యాభిః పరిదృష్టో దీర్ఘసూక్ష్మః. 50

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ. బాహ్యాభ్యన్తరస్తమ్భవృత్తిః=బాహ్యావృత్తి, అభ్యన్తరవృత్తి, స్తంభ వృత్తి గల ఆ ప్రాణాయామము, దేశకాలసంఖ్యాభిః=దేశముచేతను, కాలము చేతను, సంఖ్యచేతను, పరిదృష్టః=కొలవబడినది. దీర్ఘసూక్ష్మః=దీర్ఘము సూక్ష్మము అయినది.

ప్రాణాయామము బాహ్యావృత్తి, (శరీరము బైట ఉన్నది), ఆభ్యంతరవృత్తి (శరీరములోపల ఉన్నది), స్తంభవృత్తి (నిశ్చలముగా ఉన్నది) అని మూడు విధములు. వీటికే వరుసగా రేచకము, పూరకము, కుంభకము అని పేర్లు. ప్రాణుల కుడి నాడికి **పింగళ** అని పేరు. ఇది సూర్యదేవత్యము; పితృయోని. ఎడమ నాడి పేరు **ఇడ**. ఇది చంద్రదేవత్యము; దేవయోని. వాటి నడుమ ఉన్న నాడి **సుషుమ్న**. బ్రహ్మదేవత్యము. వామ (ఎడమ నాసారంధ్రముతో లోపల నున్న వాయువును బైటకు విడచుటకు **రేచక**మని పేరు. దక్షిణ (కుడి) నాసాపుటముతో బైట నున్న వాయువును లోనికి పీల్చుట **పూరకము**. పూరించిన వాయువును విడవకుండా లోపల నిలుపుట **కుంభకము**. కుంభములో జలము కదలకుండా ఉన్నట్లు వాయువు కదలకుండా ఉండును గాన దీనికా పేరు. **పూరకము, కుంభకము రేచకము** అని యాజ్ఞవల్క్యుడు వీటి క్రమమును చెప్పినాడు. మూడు విధములైన ఈ ప్రాణాయామమును దేశ-కాల-సంఖ్యలచేత నిర్ణయించవలెను. అభ్యాసవశము చేత దీనికే దీర్ఘము, సూక్ష్మము అను సంజ్ఞలు ఏర్పడును. రేచకమునకు ముక్కునుండి పన్నెండు అంగుళముల దూరము లేదా రెండు జానల దూరము ఇత్యాది విధమున దేశమును నిర్ణయించవలెను. అనగా విడచిన గాలి' అంతదూరము వెళ్లవలెను. ఎంత దూరము వెళ్ళినదో తెలిసికొనుటకు సన్నని గడ్డిపోచ లేదా దూది మొదలైనవాటిని ఉంచి వాటి కదలికను బట్టి నిర్ణయించుకొనవలెను. శరీరములోపల పాదములు మొదలు మస్తకమువరకు ఉన్న ప్రదేశము పూరకమునకు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

దేశము. ఆ దేశమునంతను వాయువు వ్యాపించినదా లేదా అనువిషయమును చీమ పాకుతున్నట్లు శరీరములో కలిగే ఒక విధమైన స్పర్శను పట్టి నిర్ణయించుకొనవలెను. పూరకదేశమే కుంభకానికి కూడా దేశము.

రెప్పపాటుకూ రెప్పపాటుకూ మధ్య ఉన్న కాలములో నాల్గవ భాగము **క్షణము**. ఇంత సేపు (ఇన్ని క్షణములు) రేచకము, ఇంత సేపు పూరకము, ఇంత సేపు కుంభకము అని కాలమును నిర్ణయించుకొని చేసిన ప్రాణాయామము కాలావధృతము.

మూడింటికి కూడ పన్నెండేసి మాత్రల కాలము అని మార్కండేయుడు చెప్పినాడు. కంటి రెప్ప మూసి తెరచి నంత కాలము 'మాత్ర' అని కొందరు. మణిచి ఉన్న మోకాలి మండలం (చిప్ప) చుట్టూ మూడు మాట్లు చెయ్యి తిప్పి చిటిక వేయుటకు ఎంత కాలము పట్టునో అది 'మాత్ర' అని కొందరు. పైన చెప్పిన విధముగా చిటిక వేసిన కాలములో ఒక శ్వాస. ఒక ప్రశ్వాస జరుగును.

పూరకమునకు పదహారు మాత్రలు, కుంభకమునకు అరవైనాలుగు మాత్రలు. రేచకమునకు ముప్పైరెండు మాత్రలు అని వసిష్ఠుడు చెప్పగా, మూడూ పన్నెండుమాత్రల కాలమునందు జరిగినచో అది అధమమని, ఇరవై నాలుగు మాత్రల కాలమైనచో మధ్యమమని, ముప్పైఆరు మాత్రల కాలమైనచో ఉత్తమమనీ యాజ్ఞవల్క్యుడు చెప్పినాడు. ఇది **సంఖ్యావధృతము**.

మాత్రాసంఖ్యను పట్టి కాలమును నిర్ణయించి చేసినది కూడ కాలావధృతమే అగును కదా; కాలావధృత సంఖ్యావధృతాలకు భేదము లేదు కదా అని ఆశంకకు సమాధానముగా వాచస్పతిమిశ్రుడు ఆ కాలమునే క్షణాది రూపమున నిర్ణయించుకొనుట మాత్రాసంఖ్యలను పట్టి నిర్ణయించుకొనుట అను రెండు పద్ధతులు ఉన్నవి గాన రెండు పేర్లు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

చెప్పబడినవని ఏదో విధముగా సరిపెట్టుకొనవలెనని సూచించినాడు. "క్షణానామియత్తా కాలో వివక్షితః శ్వాస ప్రశ్వాసేయత్తా సంఖ్యేతి కథంచిద్భేదః". (తత్త్వవైశారది) భావాగణేశ నాగేశుల వృత్తులలోను విజ్ఞానభిక్షువు రచించిన యోగవార్తికములోను కూడ **సంఖ్యావరి దృష్టః ప్రాణాయామః** అనగా మాత్రాసంఖ్యలను పట్టి కాలము కొలిచిన ప్రాణాయామమనియే అర్థము చెప్పినారు. కాని – "సంఖ్యాభిః పరిదృష్టః ఏతావృద్భిః శ్వాసప్రశ్వాసైః ప్రథమ ఉద్ఘాతః; తద్వన్నిగృహీత స్యైతావద్భిర్ద్వితీయ ఉద్ఘాతః; ఏవం తృతీయః, ఏవం మృదురేవం మధ్య ఏవం తీవ్ర ఇతి సంఖ్యా పరిదృష్టః" అను వ్యాసభాష్యపంక్తులను జాగర్తగా పరిశీలించినచో "ఇన్ని శ్వాస ప్రశ్వాసలున్నచో అది మొదటి ఉద్ఘాతము. ఇంకా అధికముగా ఉన్నచో రెండవది; ఇంకా అధికముగా ఉన్నచో మూడవది; వీటికే మృదువు, మధ్యము, తీవ్రము అని పేర్లు" అని అర్థమగుచున్నది. అనగా మాత్రాసంఖ్యను పట్టి చేసిన విభాగము అని కాక ఒక్కమారు ప్రాణాయామము చేయుటకై కూర్చున్నవాడు "ఇప్పుడు ఇన్ని శ్వాసప్రశ్వాసలు (శ్వాసప్రశ్వాసలున్నప్పుడు శ్వాసస్తంభము కూడ ఉండును గాన ఇన్ని శ్వాసప్రశ్వాస స్తంభములు) చేసెదను" అని నిశ్చయించుకొని అట్లు చేసినపుడు అది సంఖ్యావధృతమని అర్థము అని చెప్పిన బాగుండునని తోచుచున్నది. ఈ సంఖ్యల అల్పత్వాధిక్యములను పట్టి ప్రాణాయామమునకు మృదుత్వ మధ్యత్వ తీవ్రత్వములు చెప్పబడినవి. నాభినుండి బయలుదేరిన వాయువు శిరస్సును తాకుట **ఉద్ఘాతము**.

ఈ విధముగ దేశకాలసంఖ్యాపరిచ్ఛేదములతో అభ్యసింపబడిన ప్రాణా యామమును దీర్ఘకాలము అభ్యసించవలెను. అందుచే ఇది దీర్ఘము. ఎంతో నేర్పుతో చేయవలెను గాన సూక్ష్మము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

జపధ్యానాదులు లేకుండ చేయు ప్రాణాయామము "అగర్భ ప్రాణాయామము", జపాదులతో చేయునది "సగర్భప్రాణాయామము", వ్యాహృతులతో, ప్రణవముతో కూడిన గాయత్రిని జపించవలెనని కొన్నిచోట్ల చెప్పబడినది. ప్రణవమును జపించవలెనని కొన్ని చోట్ల చెప్పబడినది. పూరక - కుంభక- రేచకములలో వరుసగా నాభి-హృదయ-లలాటములందు బ్రహ్మ- విష్ణు-శివులను ధ్యానించవలెనని కొన్ని గ్రంథములందు, పరబ్రహ్మను ధ్యానించవలెనని మరి కొన్ని గ్రంథములందు చెప్పబడినది.

అవ. ప్రాణాయామములో కేవలకుంభకరూపమైన నాల్గవ భేదమును చెప్పుచున్నాడు.

సూ. బాహ్యాభ్యన్తరవిషయాక్షేపీ చతుర్థః. 51

ప్ర.అ. బాహ్యాభ్యన్తరవిషయాక్షేపీ = బాహ్యావిషయమును అభ్యంతర విషయమును అతిక్రమించునది, చతుర్దః = నాల్గవది.

వ్యా. బాహ్యావిషయకము రేచకము, అభ్యన్తరవిషయకము పూరకము. ఈ రెండింటిని దాటి స్వయముగనే ఏర్పడే ప్రాణాయామము పూర్వసూత్రములో చెప్పిన రేచక-పూరక-కుంభకములకంటే భిన్నమైన, వాటికంటే ఉత్తమమైన నాల్గవ ప్రాణాయామము. దీని పేరు కూడ కుంభకమే. వెనుక చూచినట్లు పై సూత్రములో చెప్పిన కుంభకము పూరకరేచకముల కాలమును పట్టి (ఇన్ని మాత్రల కాలము పూరకము, ఇన్ని మాత్రల కాలము రేచకము ఉన్నచో ఇన్ని మాత్రల కాలము కుంభకము ఉండవలెను అను రీతిలో) ఉండును. కాని ఈ కుంభకములో పూరకరేచకముల కాలపరిమితితో సంబంధముండదు అని అర్థము. ఈ సూత్రవ్యాఖ్యానములో భావాగణేశుడు వాసిష్ఠసంహితనుండి కొన్ని శ్లోకములు ఉదాహరించినాడు -

"ప్రస్వేదం జనయేద్యస్తు ప్రాణాయామో హి సో ధమః,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మధ్యమః కమ్పనాత్ప్రోక్త ఉత్థానే చోత్తమో భవేత్.
పూర్వపూర్వం ప్రకుర్వీత యావదుత్తమసంభవః".

చెమటను పట్టించే ప్రాణాయామము అధమము, కంపనమును పుట్టించేది మధ్యమము ఉత్థానమును కలిగించునది ఉత్తమము. ఉత్తమము సిద్ధించే వరకు వెనుకటివాటిని అభ్యసించవలెను.

"నిఃశ్వాసోచ్ఛ్వాసకౌ దేహే స్వాభావికగుణావుభౌ,
తథాపి నశ్యతస్తేన ప్రాణాయామోత్తమేన హి".

దేహములో ఉచ్ఛ్వాసనిశ్వాసము అనేవి స్వాభావికములు. అయితే, ఉత్తమ ప్రాణాయామమము సిద్ధించిన పిమ్మట ఆ ఉచ్ఛ్వాసనిఃశ్వాసములు కూడ నశించును.

"తయోర్నాశసమర్థః స్యాత్కర్తుం కేవలకుమ్భకమ్,
రేచకం పూరకం త్యక్త్వా సుఖం యద్వాయుధారణమ్,
ప్రాణాయామోऽయమిత్యుక్తః స వై కేవలకుమ్భకః",

ఉచ్ఛ్వాసనిఃశ్వాసములను నశింపచేయు సామర్థ్యము కలవాడు కేవలకుంభ కమును చేయ సమర్థుడగును. రేచకపూరకములను విడచి సుఖముగా వాయువును నిలుపుటకు కేవలకుంభకప్రాణాయామమని పేరు.

"సహితం కేవలం వాపి కుమ్భకం నిత్యమభ్యసేత్
యావత్కేవలసిద్ధిః స్యాత్ తావత్సహితమభ్యసేత్".

రేచకపూరకసహిత మైన కుంభకమును గాని, కేవలకుంభకమును గాని నిత్యము అభ్యసించవలెను. కేవలకుంభకము సిద్ధించే వరకు సహిత కుంభకమును అభ్యసించవలెను.

కేవలే కుమ్భకే సిద్ధే రేచకపూరకవర్జితే
న తస్య దుర్లభం కించిత్త్రిషు లోకేషు విద్యతే.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

రేచక పూరకములు లేని కేవలకుంభకము సిద్ధించినవానికి ఈ మూడు లోకాలలో దుర్లభమైనది ఏదీ లేదు.

అవ. ప్రాణాయామమునకు అవాంతరప్రయోజనమును చెప్పుచున్నాడు.

సూ, తతః క్షీయతే ప్రకాశావరణమ్. 52

ప్ర.అ. తతః=ప్రాణాయామమువలన, ప్రకాశావరణమ్=వివేకజ్ఞాన మును ఆవరించిన (కప్పివేసిన) కర్మ, క్షీయతే=క్షీణించును.

వ్యా. ఇక్కడ కర్మశబ్దమునకు కర్మవలన కలిగిన పాపము, తజ్జన్యమైన క్లేశము అని అర్థము. సంసారమూలమైన ఈ కర్మ ప్రాణాయామాభ్యాసముచే దుర్బలమై, ప్రతిక్షణము క్షీణించును. అది పూర్తిగా పోవలెనంటే మాత్రము తపస్సు కావలెను (తత్త్వవై.)

సూ. ధారణాసు చ యోగ్యతా మనసః. 53

ప్ర.అ. మనసః=మనస్సునకు, ధారణాసు=ధారణలయందు, యోగ్యతా= యోగ్యత్వము లభించును.

వ్యా. మనోవ్యాపారము ప్రాణాధీనము. ప్రాణము స్థిరముగా ఉన్నచో మనస్సు స్థిరముగా ఉండును. అందుచేతనే వాసిష్ఠాదులలో మనస్సు క్షుబ్ధముగా (కలత చెంది) ఉన్నప్పుడు ప్రాణము క్షుబ్దమైనట్లే, ప్రాణము క్షుబ్దమైనప్పుడు మనస్సు క్షుబ్దమగునని చెప్పబడినది.

అవ. ఇప్పుడు క్రమప్రాప్తమైన ప్రత్యాహారమును చెప్పుచున్నాడు.

సూ. స్వవిషయాసంప్రయోగే చిత్తస్వరూపానుకార ఇవేన్ద్రియాణాం ప్రత్యాహారః 54

ప్ర.అ. ఇన్ద్రియాణామ్=ఇంద్రియములకు, స్వవిషయాసంప్రయోగే తమ తమ విషయములతో సంబంధము

In Public domain. Digitization Muthulakshmi Research Academy

లేకపోగా, చిత్తస్వరూపానుకార ఇవ= చిత్తస్వరూపమును అనుకరించుటవలె (అనుకరించుచున్నట్లు ఉండుట), ప్రత్యాహారః=ప్రత్యాహారము.

వ్యా. ధ్యానాదిసమయములయందు ఇంద్రియములకు శబ్దాది విషయములతో సంబంధము లేకపోవుటచే అప్పుడు అవి చిత్తాకారమునే పొందినట్లు అగును. అనగా ప్రాణాయామాదులచేత స్థిరమైన చిత్తమునకు శబ్దాదివిషయములతో ఎట్లు సంబంధముండదో అట్లే ఇంద్రియాలకు కూడ విషయములతో సంబంధముండదు. ఇంద్రియములు చిత్తమును అనుకరించుట అనగా ఇదే. తత్త్వముపై నిలచుట అనే విషయములో మాత్రము ఇంద్రియములు చిత్తమును అనుకరించ జాలవు. తత్త్వము చిత్తగోచరమే కాని ఇంద్రియాగోచరము కదా. అందుచేతనే **ఇవ** శబ్దమును ప్రయోగించి "అనుకరించుచున్నాయా అన్నట్లుండుట" అని చెప్పబడినది. ఈ విధముగ చిత్తమును ఇంద్రియములను నిరోధించుట ప్రత్యాహారమని తేలినది. జితేంద్రియులు కానివారు ధ్యానాదులు చేయునపుడు కూడ వారి ఇంద్రియములు రూపాదుల వైపు చిత్తమును ఆకర్షించును గాన చిత్తమే ఇంద్రియానుకారి అగును.

అవ. ప్రత్యాహారమునకు ప్రయోజనమును చెప్పుచున్నాడు.

సూ. తతః పరమా వశ్యతేన్ద్రియాణామ్. 55

ప్ర.అ. తతః=ప్రత్యాహారమువలన, ఇన్ద్రియాణామ్=ఇంద్రియములకు, పరమా=గొప్ప, వశ్యతా=వశ్యత్వము (స్వాధీనములో ఉండుట) కలుగును.

వ్యా. ఇంద్రియవశ్యత్వమును గూర్చి మతభేదములున్నవి. శబ్దాది విషయములపై ఆసక్తి లేకపోవుట ఇంద్రియవశ్యత్వమని కొందరు. శాస్త్రనిషిద్ధములు కాని విషయములను అనుభవించుట అని కొందరు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

భోగ్యములైన విషయములకు లొంగిపోకుండగా స్వతంత్రుడుగా ఉండి అనుభవించుట అని కొందరు, రాగద్వేషములు లేకుండా విషయములను అనుభవించినను సుఖదుఃఖములు ఉండవు గాన అదే ఇంద్రియవశ్యత్వమని మరి కొందరు, చిత్తమును ఏకాగ్రము చేసికొనుటచే అసలు విషయములనే ఇంద్రియముల ద్వారా గ్రహించకుండుట ఇంద్రియవశ్యత్వమని పరమర్షుల మతము. కావున అదే పరమమని ఈ సూత్రము చెప్పుచున్నది. ఎంతటి విషవిద్యానిపుణుడైనను పామును పక్కలో పెట్టుకొని పండుకొనడు కదా. అందుచేత ఏ మాత్రము విషయసంబంధమున్నను అది అపాయహేతువు గాన మొదట చెప్పిన నాలుగు విధముల ఇంద్రియవశ్యత్వము నిజమైన వశ్యత్వము కాదని అర్థము. ఈ విధమైన ఇంద్రియజయమును సంపాదించుకొన్న వానికి మరల మరల ఇంద్రియజయము చేసికొనుటకై ప్రయత్నము చేయుట అవసరముండదు. ఒక ఇంద్రియమును జయించినవాడు ఇతరేంద్రియములను జయించుటకు ప్రయత్నించవలసి ఉండును. అట్టి అవసరము కూడ ఇతనికి ఉండదు.

బాలానందిని అను పాతంజలయోగసూత్రవ్యాఖ్యానమునందు
ద్వితీయపాదము సమాప్తము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అథ తృతీయః విభూతి పాదః

అవ. ప్రథమద్వితీయపాదములలో సమాధి, తత్సాధనములు చెప్పబడినవి. సమాధికొరకై సాధకుడు ప్రవర్తించుటకు అనుగుణములై, అతనికి సమాధి విషయమున శ్రద్ధను కలిగించే విభూతులను చెప్పవలసి ఉన్నది. వాటిని సాధించే ఉపాయము సంయమము. ధారణాధ్యానసమాధులకు మూడింటికి కలిసి సంయమమని పేరు. యోగాంగములన్నీ విభూతికి సాధనములే కాని వాటిలో మొదటి ఐదూ(యమ-నియమ-ఆసన-ప్రాణాయామ-ప్రత్యాహారములు)బహిరంగములు ధారణా-ధ్యాన-సమాధులు అంతరంగములు. యమ-నియమములచే యోగము బీజమును పొంది, ఆసనప్రాణాయామములచేత అంకురించి ప్రత్యాహారముచేత పుష్పించును. ఈ విధముగ ఈ ఐదూ బహిరంగసాధనములు. ధారణాదిత్రయముచేత ఫలించును. అందుచేత అవి అంతరంగసాధనములు. ఈ మూడింటికి కార్యకారణభావమున్నది. సమాధికి కారణము ధ్యానము. ధ్యానమునకు కారణము ధారణ. అందుచేత వీటికి నియతమైన పౌర్వాపర్యము (క్రమము) ఉన్నది. అందుచేత ముందుగా ధారణను చెప్పుచున్నాడు. –

సూ. దేశబన్ధశ్చిత్తస్య ధారణా. 1

ప్ర.అ. చిత్తస్య=చిత్తముయొక్క, దేశబద్ధః=ప్రదేశమునందు నిలుపుట, ధారణా=ధారణ.

వ్యా. నాభిచక్రము, హృదయపుండరీకము, శిరస్సు, దేహాంతస్థమైన జ్యోతిస్సు, నాసికాగ్రము, జిహ్వాగ్రము మొదలైన ఆధ్యాత్మిక (శరీరములోని) ప్రదేశములందు గాని, హిరణ్యగర్భుడు, ఇంద్రుడు, ప్రజాపతి మొదలైన బాహ్య ప్రదేశములందు గాని చిత్తమును నిలుపుట **ధారణ**.

అవ. ధారణచేత సాధింపదగిన ధ్యానమును చెప్పుచున్నాడు.

సూ. తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్. 2

ప్ర.అ. తత్ర=ఆ దేశమునందు, ప్రత్యయైకతానతా=జ్ఞానముయొక్క ఏకాగ్రత, ధ్యానమ్=ధ్యానము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. చిత్తము నిలిపిన ఆ దేశములో, ప్రత్యయము, అనగా ఆలంబముగా గ్రహించిన ధ్యేయమును గూర్చిన జ్ఞానము, మధ్య మధ్య ఇతర జ్ఞానములేవీ రాకుండ, అవిచ్ఛిన్నముగా సాగుటకు ధ్యానమని పేరు.

అవ. ధ్యానముచేత సాధింపదగిన సమాధిని చెప్పుచున్నాడు. –

సూ. **తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః.** 3

ప్ర.అ. అర్థమాత్రనిర్భాసమ్=ధ్యేయమైన వస్తువు మాత్రమే ప్రకాశించునది, స్వరూపశూన్యమివ=స్వరూపముతో (జ్ఞానస్వరూపముతో) శూన్యమైనది వలె ఉన్నదీ అయిన, తదేవ=ఆ ధ్యానమే, సమాధిః=సమాధి.

వ్యా. ధ్యానము జ్ఞానవిశేషము. ఈ ధ్యానములో విషయమైన అర్థమే భాసించుచుండగా జ్ఞానము స్వరూపమునే కోల్పోయినట్లుండు స్థితి **సమాధి**. జ్ఞానము పూర్తిగా తొలగకపోయినను తొలగిపోయినట్లయి విషయము మాత్రమే ప్రకాశించును గాన **ఇవ** అను పదము ప్రయోగింపబడినది. ధ్యాన స్వరూపమే కాదు, ఆ స్థితిలో ధ్యాతృస్వరూపము కూడ లేకుండ పోయినట్లగును. ధ్యానవిషయముతో పాటు ధ్యానము కూడ భాసించినచో అది **ధ్యానము**; భాసించకపోయినచో **సమాధి** అని ఈ రెండింటికీ భేదము.

అవ. ధారణాదిత్రయమునకు లాఘవముకొరకై పారిభాషికమైన ఒకే సంజ్ఞను చెప్పుచున్నాడు.

సూ. **తత్త్రయమేకత్ర సంయమః.** 4

ప్ర.అ. ఏకత్ర=ఒకే విషయమునకు సంబంధించిన, తత్=ఆ, త్రయమ్ = ధారణాధ్యానసమాధుల త్రయము, సంయమః=సంయమము.

అవ. సంయమము ఎట్లు యోగాంగ మగునో చెప్పుచున్నాడు.

సూ. **తజ్జయాత్ప్రజ్ఞాలోకః.** 5

ప్ర.అ. తజ్జయాత్=సంయమముయొక్క జయము (స్థైర్యము) వలన, ప్రజ్ఞాలోకః=ప్రజ్ఞయొక్క నిర్మలత్వము కలుగును.

వ్యా. సంయమము స్థిరమైనకొలది ప్రజ్ఞ (జ్ఞానము–సమాధి) ఇతర జ్ఞానములచేత తిరస్కరింపబడకుండగ నిర్మలప్రవాహములో నిలచును; ప్రదీప్త మగును. బాగుగా ప్రసరించును.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. సంయమానుష్ఠానములో విశేషమును చెప్పుచున్నాడు.

సూ. తస్య భూమిషు వినియోగః. 6

ప్ర.అ. తస్య=ఆ సంయమమునకు, భూమిషు=ఆ యా భూముల యందు, వినియోగః=వినియోగము.

వ్యా. సంయమముచేత ఒక భూమిని (అవస్థను జయించిన పిమ్మట దాని తరువాత భూమిని జయించుటకై దానిని వినియోగించవలెను. ఉదాహరణకు సంయమముచేత స్థూలవిషయమైన సవితర్కసమాధిని జయించిన పిమ్మట, అంతవరకు జయింపబడని నిర్వితర్కమును జయించుటకు, దాని తరువాత సవిచారమును జయించుటకు, తరువాత నిర్విచారమును జయించుటకు వినియోగము చేయవలెను. ఆయుధభూషణాదులతో కూడిన చతుర్భుజ మూర్తియందు సమాధి కుదిరిన పిమ్మట ఆయుధములను పరిత్యజించి సమాధి చేయవలెను. అది కుదిరిన పిమ్మట భూషణాదులను త్యజించవలెను. తరువాత **సోఽహమ్** అని ధారణ చేయవలెను. పిదప **అహమ్** అని ధారణ చేయవలెను. ఇట్లు స్థూలమును పరిత్యజించుచు సూక్ష్మము వైపు వెళ్లవలెను అని విష్ణుపురాణాదులలో కూడ చెప్పబడినది.

తతః శఙ్ఖగదాచక్రశార్ఙ్గాదిసహితం బుధః,
చిన్తయేద్భగవద్రూపం ప్రశాన్తం సాక్షసూత్రకమ్.
యదా చ ధారణా తస్మిన్నవస్థానవతీ తతః,
కిరీటకేయూరముఖైర్భూషణై రహితం స్మరేత్.
తదైకావయవం దేవం సోఽహం చేతి పునర్బుధః,
కుర్యాత్తతో హ్యహమితి ప్రణిధానపరో భవేత్".

(వి.పు.6.7.86-88)

అవ. ఈ మూడు యోగాంగముల ప్రాధాన్యమును చెప్పుచున్నాడు.

సూ. త్రయమన్తరఙ్గం పూర్వేభ్యః. 7

ప్ర.అ. పూర్వేభ్యః=వెనుక చెప్పినవాటికంటె, త్రయమ్=ఈ త్రయము, అన్తరఙ్గమ్=అంతరంగము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. పూర్వపాదములో చెప్పిన యమనియమాసనప్రాణాయామ ప్రత్యాహారములకంటె ఈ ధారణాధ్యానసమాధులు సంప్రజ్ఞాతసమాధికి అంత రంగసాధనములు.

సూ. తదపి బహిరఙ్గం నిర్బీజస్య. 8

ప్ర.అ. తదపి=ఆ త్రయము కూడ, నిర్బీజస్య=నిర్బీజసమాధికి, బహిరఙ్గమ్=బహిరంగము.

వ్యా. ధారణాదిత్రయము వివేకఖ్యాతిని, పరవైరాగ్యమును కలిగించి తద్వారా నిర్బీజసమాధికి పరంపరయా హేతువగుచున్నది. జన్మాంతరము నందభ్యసించిన ఈ త్రయమువలన నిర్బీజసమాధి కలగవచ్చును. ఈ త్రయము నిరుద్ధమైన చాలకాలమునకు నిర్బీజసమాధి కలుగును. ఈ కారణముల చేత ఈ త్రయము లేకున్నను నిర్బీజసమాధి కలుగును గాన ఇది నిర్బీజసమాధికి బహిరంగమే.

అవ. పరిణామత్రయసంభవాత్.... ఇత్యాది సూత్రములో (16) చెప్ప నున్న పరిణామత్రయమనగా ఏదో ప్రతిపాదించవలసి ఉన్నది. పైన నిర్బీజసమాధిప్రసంగము వచ్చినది గాన "గుణములు చలస్వభావములు కదా; నిరోధచిత్తక్షణాలలో చిత్తపరిణామము ఏ విధముగా ఉండును?" అని ప్రశ్నించుకొని చెప్పుచున్నాడు.

సూ. వ్యుత్థాననిరోధసంస్కారయోరభిభవప్రాదుర్భావౌ
నిరోధక్షణచిత్తాన్వయో నిరోధపరిణామః. 9

ప్ర.అ. వ్యుత్థాననిరోధసంస్కారయోః=వ్యుత్థానసంస్కారముయొక్క నిరోధసంస్కారముయొక్క అభిభవప్రాదుర్భావౌ=తిరస్కారము, ఆవిర్భావము, నిరోధక్షణచిత్తాన్వయః=నిరోధక్షణము గల చిత్తము అన్వయించుట, నిరోధ పరిణామః=నిరోధపరిణామము.

వ్యా. సంప్రజ్ఞాతసమాధితో సహా వ్యుత్థానావస్థలో అనేకవిధములైన ప్రత్యయములు (జ్ఞానములు=చిత్తవృత్తులు) కలుగుచుండును. వాటివలన కలిగే సంస్కారములు చిత్తధర్మములే కాని జ్ఞానధర్మములు కావు. అందుచేత ప్రత్యయములు నశించినా అవి నశించవు. నిరోధసంస్కారములు కూడ చిత్త ధర్మములే. నిరోధపరిణామమునందు (అనగా చిత్తములో నిరోధరూపపరిణా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మము కలిగినపుడు) వ్యుత్థానసంస్కారములు అణగిపోవుచుండును, నిరోధ సంస్కారములు ఆవిర్భవించుచుండును. నిరోధక్షణరూపమైన చిత్తమే అనుగతముగా, అవిచ్ఛిన్నముగా, ఉండును. అనగా ప్రతిక్షణమునందూ చిత్తములో ఈ సంస్కారముల అన్యథాత్వము, అనగా వ్యుత్థానసంస్కారములు అణగుట, నిరోధసంస్కారములు ఆవిర్భవించుట అనునది, నిరోధ పరిణామము.

అవ. నిరోధసంస్కారము బలీయమై వ్యుత్థానసంస్కారములను పూర్తిగా అణచివేసినప్పుడు చిత్తమునకు ఎట్టి పరిణామము కలుగునో చెప్పుచున్నాడు.

సూ. తస్య ప్రశాన్తవాహితా సంస్కారాత్. 10

ప్ర.అ. తస్య=చిత్తమునకు, సంస్కారాత్=నిరోధసంస్కారమువలన, ప్రశాస్తవాహితా=ప్రశాంతముగానే (అనగా నిరోధముతోనే) నిరంతరము= జరుగును.

వ్యా. నిరోధసంస్కారప్రవాహము బలవత్తరముగా ఉన్నప్పుడే వ్యుత్థాన సంస్కారములను పూర్తిగా అణగద్రొక్కి చిత్తము వ్యుత్థానసంస్కారమలము లేని అవిచ్ఛిన్ననిరోధసంస్కారపరంపరతో నిండి యుండును. నిరోధ సంస్కారము మందమైనచో వ్యుత్థానసంస్కారము దానిని అణచివేయును.

అవ. చిత్తమునకు సంప్రజ్ఞాతసమాధిలో కలుగు పరిణామావస్థను చెప్పుచున్నాడు –

సూ. సర్వార్థతైకాగ్రతయోః క్షయోదయౌ చిత్తస్య సమాధిపరిణామః.11

ప్ర.అ. చిత్తస్య=చిత్తమునకు, సర్వార్థతైకాగ్రతయోః=విక్షిప్తత్వ ఏకాగ్రతలయొక్క క్షయోదయౌ=క్షయోదయములు, సమాధిపరిణామః= సమాధిపరిణామము.

వ్యా. సర్వార్థత అనగా అన్ని విషయములను గ్రహించుచు విక్షిప్తముగా ఉండుట. సమాధ్యవస్థలో చిత్తమునందు విక్షిప్తత క్షీణించి, ఏకాగ్రత ఆవిర్భవించుట సమాధిపరిణామము.

పైన చెప్పిన నిరోధపరిణామమునకు ఈ సమాధి పరిణామమునకు భేదమేమనగా నిరోధపరిణామములో వ్యుత్థానసంస్కారమనే ధర్మము

అణగిపోవుచుండును; నిరోధసంస్కారమనే ధర్మము ఆవిర్భవించుచుండును; అణగిపోకుండా నిలచి ఉండును. ఈ సమాధిపరిణామములో విక్షేపము పూర్తిగా తిరస్కృతమై భూతకాలములో ప్రవేశించును; ఏకాగ్రతారూపమైన ధర్మముద్భవించి వర్తమానములో ఉండును. (భో.వృ.)

సూ. తతః పునః శాన్తోదితౌ తుల్యప్రత్యయౌ చిత్తస్యైకాగ్రతాపరిణామః. 12

ప్ర.అ. తతః=అటుపిమ్మట, తుల్యప్రత్యయౌ=సమానములే అయిన ప్రత్యయములు, పునః=మరల, శాన్తోదితౌ=శాంతించినవై ఉదయించినవై ఉండును. అది, చిత్తస్య=చిత్తముయొక్క, ఏకాగ్రతాపరిణామః=ఏకాగ్రతా పరిణామము.

వ్యా. విక్షిప్తత్వము పూర్తిగా నశించిన పిమ్మట సమాహితమైన చిత్తము నందు ఒకే విధమైన అనేక ప్రత్యయములు ఒకటి శాంతించి మరొకటి ఆవిర్భ వించుట అను విధమున కలుగుచుండును. సమాధినుండి బైటకు వచ్చేవరకు ఇట్లే ఉండును. దీనికి ఏకాగ్రతాపరిణామమని పేరు. భోజవృత్తిప్రకారము సూత్రములో "తతః పునః" అను రెండు పదాలు లేవు.

అవ. అన్ని వస్తువుల విషయమునందు అధికమైన వైరాగ్యము కలుగుటకై, ఇపుడు, చిత్తమువలెనే అన్ని వస్తువులు ప్రతిక్షణమందూ పరిణామము చెందు చుండును అని చెప్పుచున్నాడు.

సూ. ఏతేన భూతేన్ద్రియేషు ధర్మలక్షణావస్థా పరిణామా వ్యాఖ్యాతాః 13

ప్ర.అ. ఏతేన=చిత్తమునకు చెప్పబడిన పరిణామముచేత, భూతేన్ద్రియేషు=భూతములయందు ఇంద్రియములయందు, ధర్మలక్షణావస్థా పరిణామాః = ధర్మపరిణామ – లక్షణపరిణామ – అవస్థాపరిణామములు, వ్యాఖ్యాతాః=వ్యాఖ్యానించబడినవి.

వ్యా. చిత్తమునకు ఎట్టి పరిణామములు కలుగునో అట్టి పరిణామములు భూతములకు, ఇంద్రియములకు కూడ కలుగుచుండును. గుణములు పరిణామశీలములు గాన గుణకార్యమేదీ పరిణామము లేకుండా ఉండజాలదు. క్షణ క్షణము పరిణామము చెందుచునే ఉండును. అవస్థితస్య ద్రవ్యస్య పూర్వధర్మనివృత్తౌ ధర్మాన్తరోత్పత్తిః పరిణామః అని భాష్యమునందు

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

చెప్పబడినది. అనగా స్థిరముగా ఉన్న ఒక ద్రవ్యమునందు ఒక ధర్మము తొలగి మరొక ధర్మము జనించుచుండుట పరిణామము అని అర్థము.

ధర్మపరిణామము, లక్షణపరిణామము, అవస్థాపరిణామము అని పరిణామము మూడు విధములు. ధర్మియైన చిత్తమునందు వ్యుత్థాన-నిరోధములనే ధర్మములు తిరోహితములగుచు, ఆవిర్భవించుచు ఉండుట ధర్మపరిణామము. అనాగత (భావి)-వర్తమాన-అతీతా(భూతా)వస్థలకు లక్షణమని ఈ శాస్త్రములో పేరు. ధర్మము ఆవిర్భవించనంతవరకు అది అనాగతము. ఆ ధర్మము వర్తమానలక్షణమగు స్వరూపాభివ్యక్తిని పొందినపుడు (అనగా ఆ ధర్మము ఆవిర్భవించి ఉన్నప్పుడు) వర్తమానము, అప్పుడు అనాగతలక్షణము (ఇంకా ఆవిర్భవించక పోవుట అనునది) విడువబడినది. అట్లే వర్తమానలక్షణమును విడచినప్పుడు స్వరూపాభిభవరూపమగు (ఆ ధర్మము కనబడక పోవుట అను) అతీతలక్షణము వచ్చును. ఇది లక్షణపరిణామము. ఈ విధముగా నిరోధజాతికిని, వ్యుత్థానజాతికిని మాటిమాటికి లక్షణపరిణామము కలుగుచుండును. వర్తమానలక్షణములైన ధర్మములు బలీయములుగాను, దుర్బలములుగాను ఉండుట అవస్థ. ప్రతిక్షణము ఈ అవస్థయందు తారతమ్యము కలుగుచుండుట అవస్థాపరిణామము. ఉదాహరణమునకు-నిరోధసంస్కారము బలీయమైనపుడు వ్యుత్థానసంస్కారములు దుర్బలములగుచుండును. ప్రతిపదార్థమునందు ఇట్లే ఉండును.

ధర్మియైన మృత్తు(మట్టి)లోని పిండరూపధర్మము అభిభూతమై ఘటరూపధర్మము ఆవిర్భవించుచున్నది. ఇది ధర్మియందు కలుగు ధర్మపరిణామము. ధర్మమైన ఘటమునకు అనాగతలక్షణము తొలగి వర్తమానలక్షణము ఆవిర్భవించుచున్నది. ఇదే ఉత్పత్తి. వర్తమానలక్షణము తొలగి అతీతలక్షణము ఆవిర్భవించినచో అది నాశము. ఇది ధర్మములందు ఏర్పడిన లక్షణపరిణామము. లక్షణములకు అవస్థలచేత పరిణామమునకు ఉదాహరణము-వర్తమానలక్షణ ఘటమునందే ప్రతిక్షణము నవపురాణాది (క్రొత్తది పాతది ఈ మొదలైన) పరిణామము కలుగుచున్నది. అట్లే

ఇంద్రియములకు ఆ యా రత్నాదులను చూచుట మొదలగు క్రియలలో ధర్మపరిణామము, ఆ ధర్మములలో వర్తమానత్వాది లక్షణపరిణామము, వర్తమాణలక్షణమైన రత్నాద్యవలోకనమునందు స్ఫుటత్వాస్ఫుటత్వాద్యవస్థా పరిణామము కలుగుచుండును.

ఈ విధముగ త్రివిధపరిణామములు చెప్పబడినవి. వాస్తవమున ధర్మము ధర్మిస్వరూపమే. ధర్మికి కలిగిన వికారము ధర్మము ద్వారా వివరించబడుచున్నది. అందుచే పరమార్ధమున పరిణామము అంతా ధర్మికి చెందినదే. ధర్మరూప పరిణామము, ధర్మమునందు కలిగిన లక్షణ పరిణామము, లక్షణపరిణామమునకు జరిగిన అవస్థాపరిణామము కూడ ధర్మికే చెందును. ధర్మియందు ఈ త్రివిధపరిణామము కలిగినను ధర్మి ఆకారములో మార్పు కలుగును గాని ధర్మి మాత్రము మార్పు చెందదు. కుండలకటకాద్యాకారములలో మార్పు ఉన్నను ధర్మియైన సువర్ణము సువర్ణముగానే ఉండునుకదా.

ధర్మ-ధర్మలకు గోఅశ్వములకు వలె అత్యంతము భేదము గాని, అత్యంతము అభేదము గాని లేదు. అత్యంతము అభేధమన్నచో ధర్మము, ధర్మి అనే భేదనిర్దేశము కుదరదు. భేదమే ఉన్నచో సంబంధము కుదరదు. ధర్మి పురుషుడు వలె కూటస్థనిత్యము కాదు. ఎందుచేతననగా ఒక పనిని చేయుటకు ఉపయోగించు రూపము కొంత కాలము ఉండి కాలాంతరమునందు నశించుచున్నది. అట్లని గగనకుసుమము వలె తుచ్ఛము కాదు; ఎందుచేతననగా ఒకప్పుడు అది పనిచేయుటకు ఉపయోగించుచున్నది. ఈ విధముగ త్రిగుణాత్మకమైన భూతాదిధర్మిపరిణామమును చెందుచుండుటచే ఇది పరిణామశూన్యు డైన పురుషునికంటె భిన్నము.

మృత్పిండాద్యవస్థలలో (మట్టి, మట్టిముద్ద) మొదలైన అవస్థలలో కూడ అతీతానాగతఘటాదులు ఉన్నను తమ కారణములో లీనములై సూక్ష్మావస్థను పొందుటచే కనబడవు. లేనిది పుట్టుట గాని, ఉన్నది నశించుట గాని జరుగదు.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. ధర్మాదులకంటే భిన్నముగా ధర్మి అనునది లేదు అను బౌద్ధుల ఆశంకను ఖండించుటకై ధర్మముకంటె భిన్నముగా ధర్మి ఉన్నదని చెప్పుచున్నాడు.

సూ. శాన్తోదితావ్యపదేశ్యధర్మానుపాతీ ధర్మీ. 14

ప్ర.అ. శాన్తోదితా......అనుపాతీ=అతీతములు, వర్తమానములు, అనాగతములు అయిన ధర్మములతో సంబంధించినది, ధర్మీ= ధర్మి.

వ్యా. శాంతమనగా ఉదయించి (కొంతకాలము ఉండి) తిరోహితమైనది; భూతము, ఉదితమనగా=ఆవిర్భవించి ఉన్నది; వర్తమానము. అవ్యపదేశ్యము అనగా ఇట్లని చెప్పుటకు శక్యము కానిది; అవ్యక్తము. రాబోవునది. ధర్మములు అతీతములైనను, వర్తమానములైనను, అనాగతము లైనను ధర్మిమాత్రము అనుస్యూతముగా ఉండును అని అభిప్రాయము. ధర్మి యైన మృత్తు(మట్టి)మొదలైనదానిలో చూర్ణము, పిండము, ఘటము మొదలైనవాటిని జనింపచేయు శక్తి ఉన్నది అనగా అవి మృదాదులలో అవ్యక్తముగా ఉన్నవి. ఆ శక్తియే ధర్మములు. అవ్యక్తావస్థలలో ఇవన్నీ ధర్మిరూపములోనే ఉన్నవి గాన వేరు వేరుగా కనబడుటలేదు. వ్యక్తావస్థలో వేరువేరుగా కనబడుచున్నవి. మృత్పిండము (మట్టికి కలిగిన పిండావస్థారూప మైన ధర్మము) వర్తమానమైనప్పుడు అతీతమైన (అంతకు పూర్వమున్న) చూర్ణము కంటెను, అవ్యపదేశ్యమైన (రానున్న) ఘటము కంటెను భిన్నము. అట్లు కానిచో మృత్తు పిండావస్థలో ఉన్నప్పుడు చూర్ణావస్థలో జరిగే కార్యమును, ఘటావస్థలో జరిగే కార్యమును కూడ సాధించ సమర్థము కావలెను. అనాగతావస్థకు అనంతరము (అవ్యవహితముగా ఉన్నది) వర్తమానము; వర్తమానమునకు అనంతరము అతీతము.

ఉపాదానకారణములో కార్యములన్నీ ఉన్నను వాటికి దేశకాలాకారాదులు నిమిత్తములు గాన సర్వకాలములందు సర్వకార్యములు ఆవిర్భవించు ప్రసక్తి లేదు. కుంకుమకేసరములు జనించుటకు కాశ్మీరదేశమే నిమిత్తము. కొన్ని సస్యములకు వర్షాకాలమే నిమిత్తము. మనుష్యునియందే మనుష్యాకారముండును. అందుచేత లేడి మనుష్యాకారమును సృష్టించ జాలదు. ఈ దేశకాలాది నిమిత్తకారణములను పట్టి వ్యవస్థను అంగీకరించనిచో

జలపృథివ్యాద్యుపాదాన కారణములు ఎప్పుడూ ఉండుటచే వాటినుండి అన్నీ, ఎల్లప్పుడూ ఆవిర్భవించ వలెను. ఇట్లే పుణ్యము లేనివాడు సుఖమును అనుభవించుట లేదు. అందుకు కారణము వానియందు పుణ్యరూపనిమిత్తము లేకపోవుటయే.

విశేషములైన ధర్మాలు మారుచున్నను వాటిలో అనున్యూతముగా ఉన్న సామాన్యరూపమైన ధర్మి ఉన్నదని అంగీకరించవలెను. ఆ ధర్మి సామాన్య విశేషాత్మకము.(ధర్మి సామాన్యము, ధర్మములు విశేషము). అనుస్యూతముగా ఒక ధర్మి స్థిరముగా లేకపోయినచో ఒకడు (ఒక విజ్ఞానము) చేసినదాని ఫలమును మరొకడు (మరొక విజ్ఞానము) అనుభవించవలెను. ధర్మములు అనవరతము పరిణామము చెందుచుండుటచే వాటికి స్థైర్యములేదు గాన స్థిరమైన ధర్మిని అంగీకరించనిచో ప్రత్యభిజ్ఞ ఉండదు. అనగా బౌద్ధులు చెప్పినట్లు "స్థిరమైన ఆత్మ అనేది లేదు, విజ్ఞానపరంపరయే ఆత్మ" అని అంగీకరించినచో ఒక కార్యమును చేసిన విజ్ఞానము క్షణాంతరములో లేకపోవుటచేత తరువాతి క్షణమునకు సంబంధించిన విజ్ఞానము "నేను ఈ పని చేసినాను" అని అనుకొనజాలదు. కాని అట్లనుకొనుట అనుభవసిద్ధము. అందుచేత మారిపోవుచుండే ధర్మములకంటె వేరుగా స్థిరమైన ధర్మిని అంగీకరించవలెను అని భావము.

అవ. ఒక ధర్మికి ఒకే పరిణామము కలుగునా లేక అనేక పరిణామములు కలుగునా అని ఆశంకించుకొని అనేకపరిణామములు కలుగునని చెప్పుచున్నాడు.

సూ. క్రమాన్యత్వం పరిణామాన్యత్వే హేతుః. 15

ప్ర.అ. పరిణామాన్యత్వే=వేరు వేరు పరిణామములు అనేకము లుండుటయందు, క్రమాన్యత్వమ్=క్రమమునందు భేదము, హేతుః=లింగము.

వ్యా. పరిణామములు ఒకదాని తరువాత ఒకటిగా ఒక నిర్దిష్టక్రమములో కలుగుచున్నవి గాన అవి (పరిణామములు) అనేకములని ఊహించవలెను. మట్టి అనే ధర్మి ముందుగా చూర్ణభావమును విడచి పిండభావమును పొందుచున్నది; అది ఒక క్రమము. పిదప పిండభావమును విడచి ఘటభావమును పొందుచున్నది; అది మరొక క్రమము. ఘటభావమును

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విడచి కపాల (కుండముక్కలు) భావమును, కపాలభావమును విడచి కణభావమును (చిన్న కణములుగా అయిపోవుట) పొందుచున్నది. ఈ విధముగ అనేక పరిణామక్రమములు ఉండుటచే ఒకే ధర్మి (మృత్తు) అనేక పరిణామములను పొందుచున్నదని తెలియుచున్నది. వేరు వేరు సహకారి కారణములను బట్టి వేరు వేరు పరిణామములు కలుగుచున్నవి గాన ఈ పరిణామములన్నీ ఆకస్మికములు (హటాత్తుగా, తమంట తాముగా కలిగినవి) కావు. ఇట్లే అనాగతవర్తమాన-అతీతత్వరూప లక్షణపరిణామములలోను, బాల్య-యౌవన-వార్ధక్యాద్యవస్థాపరిణామములలోను క్రమం కనబడుచున్నది. అందుచే అవన్నీ వేరు వేరు పరిణామములే.

చిత్తానికి రెండు విధాలైన ధర్మాలుండును. 1. కొన్ని ప్రత్యక్ష రూపములు. ప్రత్యయాత్మకములైన ప్రమాణాదులు, రాగాదులు ప్రత్యక్ష ధర్మాలు. 2. కొన్ని ప్రత్యక్షముగ కనబడక ఆగమముచేతను, అనుమానముచేతను తెలిసికొనదగినవి. ఇవి ఏడు.

"నిరోధధర్మసంస్కారాః పరిణామోఽథ జీవనమ్,
చేష్టా శక్తిశ్చ చిత్తస్య ధర్మా దర్శనవర్జితాః"

1.వృత్తినిరోధము(అసంప్రజ్ఞాతావస్థ)2. ధర్మము (పుణ్యాపాపములు), 3. నిరోధధర్మముల సంస్కారములు, 4. ప్రతిక్షణము కలుగు పరిణామము (చిత్తము గుణాత్మకముగాన ఇట్టి పరిణామము అనుమానగమ్యము), 5. ప్రాణ ధారణము 6. చేష్ట (ఆయా ఇంద్రియాలతో కలియుచుండుట) 7. శక్తి (కార్య ముల సూక్ష్మావస్థ) ఈ ఏడూ దర్శనవర్జితములైన (ప్రత్యక్షము కాని) చిత్తధర్మములు.

అవ. ఇటుపైన పాదాంతమువరకు సంయమసిద్ధిరూపములైన విభూతులు చెప్పబడుచున్నవి.

సూ. పరిణామత్రయసంయమాదతీతానాగతజ్ఞానమ్, 16

ప్ర.అ. పరిణామత్రయసంయమాత్=ధర్మ- లక్షణ - అవస్థారూపము లైన పరిణామములపై సంయమమువలన, అతీతానాగతజ్ఞానమ్= భూతభవిష్య త్తుల జ్ఞానము కలుగును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. ఏదైన ఒక ద్రవ్యమును తీసికొని దానికి సంబంధించిన ధర్మపరిణామ-లక్షణపరిణామ-అవస్థాపరిణామములను సంయమముచేత (ధారణాధ్యానసమాధులచేత) సాక్షాత్కరింపచేసికొనిన యోగి ఇతర ద్రవ్యములకు సంబంధించిన భూతభవిష్యత్తులను కూడ అప్రయత్నముగా, సంకల్పమాత్రము చేతనే తెలిసికొనగలుగును.

ఏ ద్రవ్యముమీద సంయమము చేయబడునో దానికి సంబంధించిన భూతభవిష్యత్తులు సంప్రజ్ఞాతసమాధివలననే తెలియును గాన (చూ.సూ.1-41) ఇక్కడ అన్యద్రవ్యభూతభవిష్యద్ జ్ఞానమని చెప్పబడినది.

సూ. శబ్దార్థప్రత్యయానామితరేతరాధ్యాసాత్సంకరస్తత్ప్రవిభాగసంయమాత్ సర్వభూతరుతజ్ఞానమ్. 17

ప్ర. అ. శబ్దార్థప్రత్యయానామ్-శబ్ద-అర్థ-ప్రత్యయ(జ్ఞాన)ముల యొక్క ఇతరేతరాధ్యాసాత్=పరస్పరాధ్యాసమువలన, సంకరః=సాంకర్యము కలుగుచున్నది. తత్ప్రవిభాగసంయమాత్=వాటి విభాగమునందు సంయమము చేయుటవలన, సర్వభూతరుతజ్ఞానమ్ సకలప్రాణుల ధ్వనుల జ్ఞానము కలుగును.

వ్యా. గౌః అనే శబ్దము వేరు. ఆ శబ్దమునకు అర్థ మైన "గోవు" అనే చతుష్ప్రాజ్జంతువు వేరు. ఆ గోజ్ఞానము వేరు. అయినను వీటిని ఒకదానిపై మరొకదానిని అధ్యసించి, గోశబ్దమే "గోవు", ఇదే గోశబ్దజ్ఞానము అన్నట్లు ప్రవర్తించుచుందుము. ఈ విధముగ సంకరము, అవివేకము కనబడుచున్నది. ఈ మూడు వేరు వేరని సంయమము చేసి వాటి భేదమును సాక్షాత్కరించుకొన్న యోగి సమస్తప్రాణులధ్వనులకు అర్థమును గ్రహించుటకు సమర్థుడగును.

సూ. సంస్కారసాక్షాత్కరణాత్పూర్వజాతిజ్ఞానమ్. 18

ప్ర.అ. సంస్కారసాక్షాత్కరణాత్=సంస్కారములను సాక్షాత్కారింప చేసికొనుటవలన, పూర్వజాతిజ్ఞానమ్ = పూర్వజన్మజ్ఞానము కలుగును.

వ్యా. సంస్కారము రెండు విధములు – జ్ఞానరాగాదివాసనారూపము, ధర్మాధర్మరూపము. పూర్వజన్మలకు సంబంధించిన ఈ రెండు విధముల

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

సంస్కారము ప్రత్యక్షము కాకపోయినను శాస్త్రానుమానాల ద్వారా తెలిసికొని, సంయమముచేత వాటిని సాక్షాత్కరించుకొన్నచో పూర్వజన్మకు సంబంధించిన విషయములను స్మరించ గలుగును. ఇతరుల సంస్కారములను సాక్షాత్కరించుకొన్న వానికి వారి పూర్వజన్మను గూర్చి తెలియును.

ఈ సందర్భమున భాష్యములో ఒక ఆఖ్యానము చెప్పబడినది. జైగీషవ్యుడు సంస్కారసాక్షాత్కరము ద్వారా పది మహాకల్పములకు సంబంధించిన జన్మపరిణామక్రమమును చూడగల్గుటచే అతనికి వివేకజన్య మగు జ్ఞానము కలిగినది. నిర్మాణకాయసంపదను సాధించిన ఆవట్యుడు అతని నిట్లు ప్రశ్నించెను. రజస్తమో మలములను తొలగించుకొనుటచే భవ్యుడవై బుద్ధిసత్త్వము అభిభూతము కాని "నీవు నరకతిర్యగ్జన్మలలోని దుఃఖమును చూచినావు. మాటి మాటికి దేవమనుష్యజన్మలు ఎత్తినావు. నీకు దుఃఖము అధికముగా కనబడినదా, సుఖము అధికముగా కనబడినదా"? నేను అనుభవించినదంతా దుఃఖమే అని జైగీషవ్యుడు బదులు చెప్పెను. ఆవట్యుడు మరల ఇట్లు ప్రశ్నించెను. "ప్రధానవశిత్వమును సంపాదించుకొని ఉన్న నీవు సంతోషసుఖమును కూడ దుఃఖముగానే భావించుచున్నావేమి"? ప్రధానములో విక్షోభమును కలుగజేసి ఎవనికి ఏ విధమైన కాయేంద్రియాదులను ఇవ్వవలెనని కోరునో వానికి అవి ఇచ్చును. తనకు వేలకొలది కాయేంద్రియములను నిర్మించుకొని మూడు లోకములలో సంచరించుటకు సామర్థ్యము గలవాడు ప్రధానవశిత్వమును సంపాదించుకొన్న వాడు. జైగీషవ్యుడిట్లు సమాధానము చెప్పెను- "సంతోషసుఖము విషయసుఖము దృష్ట్యా మాత్రమే శ్రేష్ఠము. కైవల్యసుఖదృష్ట్యా చూచినచో ఇది కూడ దుఃఖమే. ఇది కూడ బుద్ధిసత్త్వానికి సంబంధించిన త్రిగుణములు గల ధర్మమే. త్రిగుణములు గలది హేయపక్షమునకే చెందును కదా? తృష్ణాక్షయము వలన బుద్ధికి ప్రశాంతత కలుగును. అంతమాత్రమే".

సూ. ప్రత్యయస్య పరచిత్తజ్ఞానమ్. 19

ప్ర.అ. ప్రత్యయస్య=తన చిత్తవృత్తియొక్క సాక్షాత్కారమువలన, పరచిత్తజ్ఞానమ్=ఇతరుల చిత్తముయొక్క జ్ఞానము కలుగును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. రాగాదులు గల తన చిత్తవృత్తిమీద సంయమము చేసి దానిని సాక్షాత్కారముచేసికొనిన యోగి సంకల్పమాత్రముచేత పరచిత్తమును కూడ తెలిసికొన గలుగును. ఈ సూత్రమునకు భావగణేశనాగేశులు పై విధముగా వ్యాఖ్యానము చేసినారు. వారి పాఠము ప్రకారము ఈ సూత్రము తరువాత "కాయరూప...అన్తర్ధానమ్" అను సూత్రమున్నది. కాని వ్యాసభాష్యతత్త్వ వైశారదీ వ్యాఖ్యల ప్రకారము ఈ రెండు సూత్రాల మధ్య "న చ.... భూతత్వాత్" అను మరొక సూత్రము కూడ ఉన్నది.

వాచస్పతిమిశ్రుని ప్రకారము. "ప్రత్యయస్య=పరచిత్తముయొక్క సాక్షాత్కారమువలన, పరచిత్తజ్ఞానమ్" అని అర్థము. భోజవృత్తిప్రకారము ముఖ రాగాదులచే తెలిసికొనిన పరచిత్తముపై సంయమము చేయగా దాని జ్ఞానము కలుగును అని అర్ధము.

అవ. పరచిత్తజ్ఞానము కలిగినపుడు ఆ పరచిత్తములో ఏది విషయమై ఉన్నదో అది కూడ తెలియునా అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

సూ. న చ తత్సాలమ్బనం తస్యావిషయీభూతత్వాత్. 20

ప్ర.అ. తత్=ఆ పరచిత్తజ్ఞానము, సాలమ్బనమ్=ఆలంబనముతో కూడినది, న=కాదు. తస్య=ఆలంబనము, అవిషయీభూతత్వాత్= విషయము కాదు కనుక.

వ్యా. పరచిత్తము రాగాదులతో కూడియున్నదా లేదా – అంతవరకే తెలియును గాని దేనిపై రాగమున్నది అను విషయము తెలియదు. ఎందుచేతననగా యోగి పరుని చిత్తమునందు మాత్రమే సంయమము చేసినాడు గాని దాని విషయములందు చేయలేదు అని అర్థము.

ఐతే పరుని చిత్తము రాగాదులతో కూడినది అని గ్రహించిన పిమ్మట యోగి, ఆతనికి దేని మీద రాగాదులు ఉన్నవో వాటిపై కూడ సంయమనము చేసినచో వాటినికూడ గ్రహింపగలడు అని యమ్.యన్.ద్వివేది వ్రాసిన ఆంగ్లానువాదములో ఉన్నది. భోజవృత్తి కూడా ఇందుకు అనుకూలము. ఇది యుక్తమని తోచును. పరుని చిత్తములో రాగమో, ద్వేషమో ఉన్నదని మాత్రమే

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

తెలిసికొన్నచో ప్రయోజనముండదు కదా? అందుచేతనే కొందరు వ్యాఖ్యాతలు ఈ సూత్రమును ప్రక్షిప్తమని భావించి ఉందురు.

సూ. కాయరూపసంయమాత్తద్గ్రాహ్యశక్తిస్తమ్భే చక్షుష్ప్రకాశాసంప్రయోగేఽన్తర్ధానమ్. 21

ప్ర.అ. కాయరూపసంయమాత్=కాయముయొక్క రూపమునందు సంయమమువలన, తద్గ్రాహ్యశక్తిస్తమ్భే=ఆ కాయరూపముయొక్క గ్రాహ్యతా శక్తి స్తంభింపబడగా, చక్షుష్ప్రకాశాసంప్రయోగే=నేత్రకిరణములతోసంబంధము లేకపోగా, అన్తర్ధానమ్=అంతర్ధానము సిద్ధించును.

వ్యా. శరీరరూపముపై సంయమము చేసి దానికి సంబంధించిన అశేషవిశేషసాక్షాత్కారమును పొందినప్పుడు ఇతరులచే గ్రహింపబడుట అనే శక్తి రూపమునకు, రూపము ద్వారా శరీరమునకు స్తంభింపబడును. అపుడు ఆ కాయరూపములతో ఇతరుల నేత్రకిరణములు కలియజాలవు. ఆ విధముగ ఆ యోగికి అంతర్ధానశక్తి లభించును.

ఇదే విధముగ తన కాయమునకు సంబంధించిన శబ్దస్పర్శరస గంధముల గ్రాహ్యతాశక్తిని సంయమము ద్వారా స్తంభింపచేసినచో శ్రోత్ర త్వక్ రసనాఘ్రాణసంయోగము కలగక ఇతరులకు వాటి ప్రత్యక్షము కలుగదు అని గ్రహించవలెను. (వ్యా.భా.)

సూ. సోపక్రమం నిరుపక్రమం చ కర్మ తత్సంయమాదపరాన్త జ్ఞానమరిష్టేభ్యో వా. 22

ప్ర.అ. కర్మ = కర్మ, సోపక్రమమ్=సోపక్రమమని, నిరుపక్రమం చ = నిరుపక్రమమని రెండు విధములు. తత్సంయమాత్=ఆ ద్వివిధకర్మయందు సంయమమువలన గాని, అరిష్టేభ్యో వా=అరిష్టములవలన గాని, అపరాన్త జ్ఞానమ్=మరణజ్ఞానము కలుగును.

వ్యా. ఆయుర్విపాకకర్మ (ఈ ఆయుర్దాయమునకు హేతువైన కర్మ) సోపక్రమము(ఫలమునిచ్చుటకుప్రారంభించినది)నిరుపక్రమము(ఫలమునిచ్చు టకు ప్రారంభించనిది) అని రెండు విధములు. ఈ రెండు విధముల కర్మపై (ధర్మాధర్మములపై) సంయమము చేసి తత్సాక్షాత్కారమును పొందిన యోగి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తనకు మరణము ఎప్పుడు, ఎట్లు కలుగునో తెలిసికొనగలడు. అట్టి యోగి కావలెనన్నచో చాలా కాయములను నిర్మించుకొని ఆ ఫలమును అనుభవించి స్వేచ్ఛానుసారము మరణించును (త.వై.)

లేదా అరిష్టములను పట్టి కూడ యోగి మరణమును గూర్చి తెలిసికొనును. ఆధ్యాత్మికములు, ఆధిభౌతికములు, ఆధిదైవికములు అని అరిష్టములు మూడు విధములు. చెవులు మూసికొన్నప్పుడు శరీరములోని ధ్వని వినబడును. అది వినబడకపోవుట మొదలైనవి ఆధ్యాత్మికారిష్టములు. యమభటులు మఱియు ఎప్పుడో చనిపోయిన పితరులు ఆకస్మాత్తుగా కనబడుట మొదలైనవి ఆధిభౌతికారిష్టములు. ఆకస్మాత్తుగా సిద్ధులను, స్వర్గాదులను చూచుట, మామూలు నగరమును చూచి స్వర్గమని భ్రాంతి పడుట మొదలైనవి ఆధిదైవికారిష్టములు. వీటిని సరిగా అర్థము చేసికొనే శక్తి యోగికి మాత్రమే ఉండును గాన ఇవి ఈ సందర్భములో చెప్పబడినవి.

ఈ సూత్రము తరువాత –

సూ. దినమాససంవత్సరాః. అను సూత్రము నాగేశుని పాఠములో మాత్ర మున్నది. మృత్యుచిహ్నములు దినములు, మాసములు, సంవత్సరములు మొదలైన కాలభేదములను సూచించును. వాటిని పట్టి ఎప్పుడు మరణము వచ్చునో యోగి గ్రహింపగలడు అని దీని అర్థము.

సూ. మైత్ర్యాదిషు బలాని. 23

ప్ర.అ. మైత్ర్యాదిషు=మైత్రి మొదలైన వాటియందు సంయమము చేత, బలాని=బలములు కలుగును.

వ్యా. మైత్రీ ఇత్యాదిసూత్రములో (1–33) చెప్పిన మైత్రీ – కరుణా – ముదితల భావన చేసి సంయమము చేసినచో వాటికి బలము చేకూరును. సుఖితుల విషయమున చేయవలసిన మైత్రీభావనపై సంయమము చేసి తత్సాక్షాత్కారమును దుఃఖితుల విషయమై చేయవలసిన కరుణాభావనపై సంయమము చేసి తత్సాక్షాత్కారమును, పుణ్యశీలుల విషయమున చేయవలసిన ముదితా భావనపై సంయమము చేసి తత్సాక్షాత్కారమును పొందినచో మైత్రీ–కరుణా–ముదితలు బలవత్తరములై అమోఘములగును.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

పాపశీలుల విషయమున ఉపేక్షయే కాని తద్భావన లేదు గాన దాని విషయమున సంయమము చేయుట ఉండదు. (వ్యా.భా.)

సూ. బలేషు హస్తిబలాదీని. 24

ప్ర.అ. బలేషు=బలములయందు సంయమము చేయుటచేత, హస్తి బలాదీని=ఏనుగు బలమువంటి బలము మొదలైనవి కలుగును.

వ్యా. ఏనుగు బలమునందు సంయమము చేసి తత్సాక్షాత్కారము పొందిన యోగికి ఆ ఏనుగు బలమువంటి బలము కలుగును. ఇట్లే గరుడవాయ్వాది బలముల విషయమునందు కూడ గ్రహింపవలెను.

సూ. ప్రవృత్త్యాలోకన్యాసాత్సూక్ష్మవ్యవహితవిప్రకృష్ట జ్ఞానమ్. 25

ప్ర.అ. ప్రవృత్త్యాలోకన్యాసాత్=ప్రవృత్త్యాలోకమును నిలుపుటవలన, సూక్ష్మవ్యవహిత విప్రకృష్ణజ్ఞానమ్=సూక్ష్మ–వ్యవహిత–విప్రకృష్ణద్రవ్యముల జ్ఞానము కలుగును.

వ్యా. బుద్ధిని కాని, పురుషుని కాని సాక్షాత్కరించుకొను మనఃప్రవృత్తి జ్యోతిష్మతి అని ప్రథమాధ్యాయమునందు (సూ.35) చెప్పబడినది. ఆ జ్యోతిష్మతీ ప్రవృత్తిప్రకాశమును సూక్ష్మవస్తువుమీద ప్రసరింపచేసినచో సూక్ష్మవస్తువు, వ్యవహితమైన (గోడలు మొదలైనవి అడ్డమున్న వస్తువుపై ప్రసరింప చేసినచో ఆ వ్యవహితవస్తువు, దూరమునందున్నదానిపై ప్రసరింపచేసినచో ఆ దూరవస్తువు తెలియును. జ్యోతిష్మతిని ఆ యా వస్తువులపై నిలుపుటయే తప్ప ఇక్కడ సంయమము అవసరము లేదు. విప్రకృష్టాదివస్తువులపై ప్రసరింపచేసి వాటిని భావన చేయవలెనని భోజవృత్తి.

సూ. భువనజ్ఞానం సూర్యే సంయమాత్. 26

ప్ర.అ. సూర్యే=సూర్యునియందు, సంయమాత్=సంయమమువలన, భువనజ్ఞానమ్=చతుర్దశభువనముల జ్ఞానము కలుగును.

వ్యా. సూర్యమండలముపై సంయమము చేసి దానికి సంబంధించిన అశేషవిశేషములను సాక్షాత్కరింపచేసికొనినచో పదునాలుగు భువనముల జ్ఞానము కలుగును. దానివలన వైరాగ్యము తీవ్రమగును. పూర్వసూత్రములో

చెప్పబడిన ఆలంబనము సాత్త్వికప్రకాశము; ఈ సూత్రములో భౌతికప్రకాశము అని భో.వృ.

సూ. చన్ద్రే తారావ్యూహజ్ఞానమ్. 27

ప్ర.అ. చన్ద్రే=చంద్రమండలమునందు (సంయమము చేసి తద్విశేష సాక్షాత్కారము పొందుటవలన) తారావ్యూహజ్ఞానమ్=నక్షత్రమండల జ్ఞానము కలుగును.

సూ. ధ్రువే తద్గతిజ్ఞానమ్. 28

ప్ర.అ. ధ్రువే=ధ్రువునియందు సంయమమువలన, తద్గతిజ్ఞానమ్ నక్షత్రముల గతియొక్క జ్ఞానము కలుగును.

వ్యా. ఈ తార, ఈ గ్రహము ఇంతకాలమునకు ఈ రాశికి ఈ నక్షత్రమునకు వెళ్లును అని సర్వమును తెలిసికొనును. దీనికి ఫలము కాలజ్ఞానము (భో.వృ.)

సూ. నాభిచక్రే కాయవ్యూహజ్ఞానమ్. 29

ప్ర.అ.నాభిచక్రే=నాభిచక్రమునందు(శరీరమధ్యమునందున్న పదహారు అరములు గల నాభియందు) సంయమము చేయుటవలన, కాయవ్యూహ జ్ఞానమ్=శరీరములోని వాతపిత్తకఫచర్మరక్తాదుల సముదాయసంనివేశాదుల యొక్క జ్ఞానము కలుగును.

సూ. కణ్ఠకూపే క్షుత్పిపాసానివృత్తిః. 30

ప్ర.అ. కణ్ఠకూపే=హృదయమువరకు ఉన్న కూపాకారమైన కంఠ రంధ్రమునందు సంయమమువలన, క్షుత్పిపాసానివృత్తిః=ఆకలిదప్పికల నివృత్తి కలుగును. కంఠము క్రిందనున్న రంధ్రము జలప్రవాహములో పొరలుచున్నట్లు భావనచేయుటచే ఈ సిద్ధికలుగును. (భో.వృ.)

సూ. కూర్మనాడ్యాం స్థైర్యమ్. 31

ప్ర.అ. కూర్మనాడ్యామ్=కంఠకూపము క్రింద వక్షఃస్థలమునందున్న కూర్మాకారమైన నాడియందు సంయమము చేయుటవలన, స్థైర్యమ్=స్థిరత్వ మేర్పడును. చిత్తమునకు లేదా శరీరమునకు స్థైర్యము కలుగును. (భో.వృ.)

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

సూ. మూర్ధజ్యోతిషి సిద్ధదర్శనమ్. 32

ప్ర.అ. మూర్ధజ్యోతిషి=శిరః కపాలములో నున్న ఛిద్రములోని సుషుమ్నా నాడియందలి భౌతికజ్యోతిస్సునందు సంయమము చేయుటచే, సిద్ధదర్శనమ్=ద్యులోకభూలోకముల మధ్య సంచరించు సిద్ధపురుషుల దర్శనము కలుగును. వారితో సంభాషించవచ్చును కూడ.

సూ. ప్రాతిభాద్వా సర్వమ్. 33

ప్ర.అ. వా=లేక, ప్రాతిభాత్=ప్రతిభవలన కలిగిన జ్ఞానమువలన, సర్వమ్=సమస్తము తెలియును.

వ్యా. ప్రాతిభమనగా వివేకజ్ఞానముకు పూర్వరూపము. సూర్యుడు ఉదయించుటకు ముందు కనబడు కాంతివంటిది. ఇది వివేకజ్ఞానమునకు దగ్గరగా ఉండుటచే సంసారమునుండి తరింపజేయును గాన తారకము. ఆ ప్రాతిభజ్ఞానము కలిగిన యోగికి సంయమాపేక్ష లేకుండగానే అతీతానాగతాది జ్ఞానము మొదలు సిద్ధదర్శనమువరకు (పూర్వము చెప్పిన) అన్ని జ్ఞానములు కలుగును.

సూ. హృదయే చిత్తసంవిత్. 34

ప్ర.అ. హృదయే=హృదయమునందు సంయమమువలన, చిత్తసంవిత్ =చిత్తజ్ఞానము కలుగును.

వ్యా. దహరమనే నామాంతరము గల హృదయాకాశము చిత్తమునకు స్థానము. దానియందు సాక్షాత్కారపర్యంతమైన సంయమము చేసినచో సకల వృత్తులతో కూడిన చిత్తము సాక్షాత్కారము కలుగును. స్వచిత్తములోని సకల వాసనలను, పరచిత్తములలో ఉన్న రాగాదులనుకూడ తెలిసికొనగలుగును. (భో.వృ.)

అవ. చిత్తము తెలిసిన పిమ్మట చిత్తముకంటె భిన్నుడైన పురుషుని సాక్షాత్కారము కలుగునని చెప్పుచున్నాడు –

సూ. సత్త్వపురుషయోరత్యన్తాసంకీర్ణయోః ప్రత్యయావిశేషో
భోగః పరార్థాత్స్వార్థసంయమాత్పురుషజ్ఞానమ్. 35

ప్ర.అ. అత్యన్తాసంకీర్ణయోః=అత్యంతము సంకరశూన్యములైన, పూర్తిగా విరుద్ధధర్మములు గల, సత్త్వపురుషయోః=బుద్ధిసత్త్వపురుషుల యొక్క ప్రత్యయావిశేషః=ప్రత్యయముల (జ్ఞానముల)అవివేకము, భోగః= భోగము. పరార్థాత్=పరార్థమైన బుద్ధిప్రత్యయమునుండి వేరుచేసి, స్వార్థ సంయమాత్ స్వార్థమైన పురుషప్రత్యయమునందు సంయమమువలన, పురుషజ్ఞానమ్ పురుషజ్ఞానము కలుగును.

సత్త్వము స్వప్రకాశరూపమైనది; స్వచ్ఛమైనది. అది తనతో అవినాభావసంబంధము గల (ఎన్నడూ విడిచిపెట్టని) రజస్తమస్సులను కూడ అణగద్రొక్కి వివేకఖ్యాతి (జ్ఞాన)రూపమున పరిణామమును చెందుచున్నది. అలాంటి బుద్ధిసత్త్వముకంటె కూడ పురుషుడు (చైతన్యము) ఎక్కువ పరిశుద్ధుడగుటచే ఆ రెండింటికిని (బుద్ధిసత్త్వ-చైతన్యములకు) చాల భేద మున్నది. ఒకటి పరిణామి; రెండవది పరిణామరహితము. అట్లయినను అనాద్యవిద్యావశముచే బుద్ధిసత్త్వప్రత్యయ-పురుషప్రత్యయముల మధ్య భేదమే లేదన్నట్లు, రెండూ ఒకటే అన్నట్లు భ్రమ ఏర్పడుచున్నది. అదియే (భేదమును గ్రహించకుండుటయే)భోగము. భోగరూపమైన ఈ ప్రత్యయము సత్త్వమునకు సంబంధించినది. అది జడమైనది. పురుషుని గూర్చిన ప్రత్యయము పరిశుద్ధ మైనది. అయితే "పురుషుని గూర్చిన ప్రత్యయము" అని చెప్పినను పురుషుడు మరొక జ్ఞానములో విషయముగా ఉన్నాడని కాదు; పురుషుడే జ్ఞానస్వరూపుడు. చిత్ జ్ఞానాకారమున పరిణమించిన బుద్ధిలో ప్రతిబింబించుటచే ఇది పురుషప్రత్యయమని ఔపచారిక ప్రయోగము. చిచ్ఛక్తి జడమును ప్రకాశింపచేయును గాని, జడము చిత్ ను ప్రకాశింపచేయజాలదు. చిత్ స్వప్రకాశముగాన తనంత తాను ప్రకాశించుచు జడమును ప్రకాశింపచేయును. చిత్‌ను ప్రకాశింపచేసే మరొక జ్ఞానము లేదు. అందుచేతనే 'విజ్ఞాతారమరే కేన విజానీయాః" (బృ, 2-4-14) (అన్నింటినీ తెలుసుకొనే (ప్రకాశింపచేసే) ఆత్మను తెలిసికొనుటకు మరొకటి ఏమున్నది) అని శ్రుతి చెప్పుచున్నది. చైతన్యమాత్రస్వరూపమైన ఆ చిత్రప్రత్యయమును పరార్థమైన, అనగా పురుషునకు భోగమును కూర్చుటకు మాత్రమే ప్రవర్తించు,

In Public domain. Digitization Muthulakshmi Research Academy
బుద్ధిప్రత్యయమునుండి వేరు చేసి ఆ పురుషప్రత్యయమునందు, (అనగా బుద్ధిప్రత్యయమునందు ప్రతిబింబించిన చైతన్యమునందు) సంయమము చేసినచో పురుష(ఆత్మ)సాక్షాత్కారము కలుగును.

భోజవృత్తిప్రకారము ఈ సూత్రము "సత్త్వపురుషయోరత్యన్తాసఙ్కీర్ణయోః ప్రత్యయావిశేషాద్భోగః పరార్థాన్యస్వార్థ సంయమాత్ పురుషజ్ఞానమ్" అని కొంచెము భిన్నముగా ఉన్నది. భావార్థము సమానమే.

అవ. స్వార్థప్రత్యయసంయమము చేసినపుడు ఆత్మసాక్షాత్కారము కలుగుటకు పూర్వము కలుగు సిద్ధులను చెప్పుచున్నాడు.

సూ. తతః ప్రాతిభశ్రావణవేదనాదర్శాస్వాదవార్తా జాయన్తే. 36

ప్ర.అ. తతః=స్వార్థప్రత్యయసంయమమువలన, ప్రాతిభ....వార్తాః= ప్రాతిభ-శ్రావణ-వేదన-ఆదర్శ-ఆస్వాద-వార్తలు, జాయన్తే=పుట్టును.

వ్యా. తెలిసిన కారణమేమీ లేకపోయినను ఆకస్మాత్తుగా వ్యవహితములు, దూరస్థితములు, అతీతములు, అనాగతములు అయిన వస్తువులను, సూక్ష్మవస్తువులను యథార్థముగా గ్రహించు శక్తి ప్రతిభ. ప్రతిభవలన కలిగిన జ్ఞానము **ప్రాతిభము**. ఇది మనఃసిద్ధి. దూరముగా ఉన్న శబ్దములను వినగల శక్తి **శ్రావణము**. శ్రోత్రసిద్ధి. దూరముగా ఉన్నదానిని స్పృశించగల శక్తి **వేదనము**. త్వగింద్రియసిద్ధి. దూరముగా ఉన్న వస్తువులను చూడగల శక్తి **ఆదర్శము**, చాక్షుషశక్తి. దూరముగా ఉన్న వస్తువు రుచి చూడగల శక్తి **ఆస్వాదము**. రసనేంద్రియసిద్ధి దూరముగా ఉన్న గంధమును అఘ్రాణించగల శక్తి **వార్త**. ఘ్రాణేంద్రియసిద్ధి. పురుషప్రత్యయసంయమము వలన ఈ సిద్ధులు కలుగును.

అవ. ఈ సిద్ధులను ఉపేక్షించి అసంప్రజ్ఞాతసమాధిని సంపాదించుటకే ప్రయత్నము చేయవలె నని చెప్పుచున్నాడు –

సూ. తే సమాధావుపసర్గా వ్యుత్థానే సిద్ధయః. 37

ప్ర.అ. తే=ఆ ప్రాతిభాదిసిద్ధులు, సమాధౌ=సమాధియందు, ఉపసర్గాః =విఘ్నములు, వ్యుత్థానే=వ్యుత్థానమునందే, సిద్ధయః=సిద్ధులు.

వ్యా. వ్యుత్థితమైన చిత్తము కలవారి దృష్టిలోనే ఇవి సిద్ధులు కాని అసంప్రజ్ఞాతసమాధికి ఇవి విఘ్నములు గాన ఇవి ఉపేక్షణీయములని భావము.

అవ. ఇపుడు సంయమమువలన కలుగు క్రియారూపసిద్ధులను చెప్పుచున్నాడు.

సూ. బన్ధకారణశైథిల్యాత్ప్రచారసంవేదనాచ్చ చిత్తస్య పరశరీరావేశః. 38

ప్ర.అ. బన్ధకారణశైథిలాత్=బంధకారణముయొక్క శైథిల్యమువలన, ప్రచారసంవేదనాచ్చ=నాడీప్రచారజ్ఞానమువలనను, చిత్తస్య=చిత్తముయొక్క, పరశరీరావేశః=పరశరీరమునందు ప్రవేశము చేయు శక్తి కలుగును.

వ్యా. చిత్తము స్వతః చంచలస్వభావమైనను ధర్మాధర్మాదికర్మవశము వలన శరీరములో బంధింపబడుచున్నది. అట్టి బంధమునకు కారణమైన కర్మ యోగజ ధర్మమువలన (సమాధివలన) శిథిలమగును. అట్లే చిత్తము ఆ యా నాడులలో ఈ విధముగ ప్రవేశించును, ఈ విధముగ సంచరించును అను జ్ఞానము కూడ కలుగును. ఇదే **ప్రచారసంవేదనము**. ఈ బంధకారణమునకు శైథిల్యము వలనను, ప్రచారసంవేదనమువలనను యోగి తన చిత్తమును పరశరీరములో ప్రవేశింపచేయగలుగును. చిత్తము ప్రవేశించగానే దానితో పాటు ఇంద్రియాదులు కూడ చిత్తము వెంట రాజుతేనెటీగను మిగిలిన తేనెటీగలన్నీ అనుసరించినట్లు అనుసరించి వెళ్ళి పరశరీరములో ప్రవేశించును. అనగా లింగశరీరము పరుల శరీరములో ప్రవేశించునని అర్థము.

సూ. ఉదానజయాజ్జలపఙ్కకణ్టకాదిష్వసఙ్గ ఉత్క్రాన్తిశ్చ. 39

ప్ర.అ. ఉదానజయాత్=ఉదానమును జయించుటవలన, జలపఙ్కకణ్టకాదిషు=జలము, పంకము, ముళ్లు మొదలగువాటియందు, అసఙ్గః సంగము లేకపోవుట, ఉత్క్రాన్తిశ్చ=పైకి వెళ్లుట సిద్ధించును.

వ్యా. ప్రాణవాయువులలో ఒకటి **ఉదానము**. శరీరములోని రసాదులను పై భాగమునకు చేర్చుచుండుటవలనను, ఊర్ధ్వగతిని ఇచ్చేదగుట వలనను దీనికీ పేరు. ఇది నాసికాగ్రము మొదలు శిరస్సువరకు ఉండును. సంయమముచేత దీనిని జయించిన యోగి జలాదులందు సంచరించినను అవి ఆతనిని అంటవు. అట్లే ఈ ఉదానముద్వారా బ్రహ్మరంధ్రమును భేదించుకొని

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

అర్చిరాది మార్గములచే బ్రహ్మలోకమునకు లింగదేహమును తీసికొని వెళ్లగలిగిన శక్తిని కూడ యోగి పొందును.

నాసికాగ్రము మొదలు హృదయము వరకు ఉన్నది (సంచరించునది) **ప్రాణము**. మూత్రపురీషగర్భాదులను విడచునట్లు చేయునది **అపానము**. ఇది నాభి మొదలు పాద తలమువరకు ఉండును. రసములను సర్వనాడులయందు సంచరింపచేయునది **సమానము**. దేహమునందంతటా వ్యాపించినది **వ్యానము**.

సూ. సమానజయాత్ప్రజ్వలనమ్. 40

ప్ర.అ. సమానజయాత్=సమానముయొక్క జయమువలన, ప్రజ్వలనమ్ శరీరముయొక్క ప్రజ్వలనము (సతీదేవి దేహమువలె మండి పోవుట)జరుగును. ఆవరణములేని కాంతి ఉద్భూతమగుటచే యోగి తేజస్సుతో ప్రజ్వలించుచున్నట్లుండును. (భో.వృ.)

సూ. శ్రోత్రాకాశయోః సంబన్ధసంయమాద్దివ్యం శ్రోత్రమ్. 41

ప్ర.అ. శ్రోత్రాకాశయోః=శ్రోత్రేంద్రియ-ఆకాశములయొక్క సంబన్ధ సంయమాత్=సంబంధముపై సంయమము చేయుటవలన, దివ్యమ్=దివ్య మైన, శ్రోత్రమ్=శ్రోత్రేంద్రియము సిద్ధించును.

వ్యా. శ్రోత్రేంద్రియము అహంకారమునుండి పుట్టినదే యైనను దానికి చెవిలో ఉన్న ఆకాశము ఆధారము. కర్ణరంధ్రములో ఉన్న ఆకాశమునకు ఉపకారము జరిగినపుడు శ్రోత్రేంద్రియమునకు ఉపకారము, అపకారము జరిగి నప్పుడు శ్రోత్రేంద్రియమునకు అపకారము జరుగుచున్నది గాన ఇట్లు అంగీక రించవలసి ఉన్నది. ఇట్లే అహంకారజన్యములైనను ఘ్రాణ-రసన-త్వక్-చక్షుస్సులకు వరుసగా పృథివీ-జల-వాయు-తేజస్సులు అధిష్ఠానములు. శబ్దమునకు ఆకాశము, గంధమునకు పృథివి, రసమునకు జలము, స్పర్శకు వాయువు, రూపమునకు తేజస్సు అధిష్ఠానము. ఈ విధముగ ఆ యా ఇంద్రియములు ఆ యా గుణములు ఆ యా భూతములలో ఉన్నవి. ఇంద్రియములు తమతో కలిసి భూతములలో ఉన్న గుణముల సహకార ముండుటచేతనే ఆ యా గుణములను గ్రహించుచున్నవి.

అయస్కాంతము ఇనుమునాకర్షించినట్లు శ్రోత్రేంద్రియమును మాటలాడువాని ముఖమునందు జన్మించిన శబ్దము ఆకర్షించగా అది తన వృత్తుల పరంపరచేత మాట్లాడువాని ముఖముదగ్గరకు పోయి ఆ శబ్దమును గ్రహించుచున్నది. అట్లు శ్రోత్రేంద్రియము వృత్తుల ద్వారా ప్రయాణము చేసి శబ్దోత్పత్తి స్థానమునకు వెళ్లుచున్నది కావుననే, 'ఈ శబ్దము ఈ వైపునుండి వచ్చినది' అని గ్రహింపగలుగుచున్నాము.

శ్రోత్రమునకు అధిష్ఠానమగుట, శబ్దమనే గుణము కలిగి ఉండుట, ఆవరణము లేకపోవుట అనేవి ఆకాశమునకు లక్షణములు. అనావరణమనేది లేకపోయినచో మూర్తద్రవ్యములన్నీ ఒక దానితో ఒకటి దగ్గరగా కలిసిపోయి అంతా నిండి పోగా ఎక్కడా అవకాశమే లేకుండపోవును. ఈ ఆకాశము పురుషకృతము కాదు. పురుషునకు పరిణామము లేదు గాన పురుషుని ద్వారా ఆకాశము జన్మించుట కుదరదు కదా? అందుచేత శబ్దతన్మాత్రాపరిణామ విశేషమే ఆకాశము. ఆకాశముకంటె భిన్నముగా దిక్కు అనేది లేదు. తత్తద్గ్రహాదిస్థిత్యవచ్ఛిన్నాకాశమునకే దిక్కు అని పేరు. అనావరణము అంతటా ఉండుటచే ఆకాశము విభువు (సర్వవ్యాపి). ఇట్టి ఆకాశమునకు, శ్రోత్రేంద్రియమునకు ఉన్న సంబంధమునందు సంయమము చేయగా శ్రోత్రేంద్రియము దివ్యత్వమును పొంది వ్యవహితము, దూరము, సూక్ష్మము అయిన శబ్దములను కూడ గ్రహించ సమర్థమగును.

ఇట్లే త్వగింద్రియ-వాయువుల, చక్షుస్తేజస్సుల, రసనా-జలముల, పృథ్వుల సంబంధములందు సంయమముచేత దివ్యములైన త్వక్చక్షూరసనా ఘ్రాణములు సిద్ధించును.

సూ. కాయాకాశయోః సంబన్ధసంయమాల్లఘుతూల
సమాపత్తేశ్చాకాశగమనమ్. 42

ప్ర.అ.కాయాకాశయోః=శరీరాకాశములయొక్క సంబన్ధసంయమాత్ =సంబంధమునందు సంయమమువలనను, లఘుతూలసమాపత్తేశ్చ=చాల తేలికయైన దూదిపింజెవంటి వానియందు సంయమమువలన సాక్షాత్కారము పొందినపుడును, ఆకాశగమనమ్=ఆకాశగమనశక్తి లభించును.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. దేహమున్నచోట ఆకాశము తప్పక ఉండును గాన ఆ దేహాకాశముల సంబంధమునందు సాక్షాత్కారపర్యంతసంయమము చేసినచో ఆకాశగమన సామర్థ్యము లభించును. అట్లే దూదిపింజె మొదలు పరమాణువు వరకు ఉన్న తేలికయైన పదార్థములందు సంయమము చేసి తత్సాక్షాత్కారము పొందగలిగినను ఆకాశమునందు ఎగిరే శక్తి లభించును. అట్టి సిద్ధి లభించినవాడు నీటిపై నడవగలడు. సాలెపురుగు దారముపై నిలవగలడు. సూర్యకిరణములను పట్టుకొని పైకి ఎగ్రబ్రాకగలడు.

సూ. బహిరకల్పితా వృత్తిర్మహావిదేహా తతః ప్రకాశావరణక్షయః. 43

ప్ర.అ. బహిః=వెలుపల, అకల్పితా=అకల్పితమైన, మహావిదేహా=మహావిదేహమను వృత్తి కలుగును. తతః=దానివలన, ప్రకాశావరణక్షయః=ప్రకాశముయొక్క ఆవరణమునకు క్షయము కలుగును.

వ్యా. శరీరము వెలుపల మనస్సు వృత్తిని పొందుటకు **విదేహధారణ** అని పేరు. శరీరములో ఉన్న మనస్సు ఇంద్రియాదుల ద్వారా బైటకు వెళ్ళి అక్కడ వృత్తి పొందినప్పుడు అది **కల్పితవృత్తి**. శరీరాపేక్ష లేకుండగానే మనస్సుకు బైట వృత్తి కలిగినచో అది **అకల్పితవృత్తి**. దానికే **మహావిదేహ** అని కూడ పేరు. దీనిని కల్పితవృత్తిచే సాధింపవలెను. శరీరసంబంధాపేక్ష లేని అట్టి మహావిదేహచే యోగులు పరుల శరీరములను ప్రవేశింపగలరు. బుద్ధిసత్త్వమునకు ఆవరణముగా ఉన్న రజస్తమోమూలకమైన క్లేశకర్మవిపాకత్రయము ఈ మహావిదేహచేత క్షీణించును.

సూ. స్థూలస్వరూపసూక్ష్మాన్వయార్థవత్త్వ సంయమాద్భూతజయః. 44

ప్ర.అ. స్థూల.....సంయమాత్=స్థూలమునందు, స్వరూపమునందు, సూక్ష్మమునందు, అన్వయమునందు, అర్థవత్వమునందు సంయమమువలన భూతజయః=పంచమహాభూతముల జయము సిద్ధించును.

వ్యా. స్థూలము, స్వరూపము, సూక్ష్మము, అన్వయము, అర్థవత్త్వము అనే ఐదూ ఐదు భూతములలో అనుగతములుగా ఉండుటచే ఇవి వాటి స్వరూపములు. శబ్దాదులతోను ఆకారాదిధర్మములతోను కూడిన అవయవికి (అవయవములు గల పదార్థమునకు) స్థూలమని పేరు. షడ్జగాంధారాదులు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శబ్దములు. శీతోష్ణాదులు స్పర్శలు. నీలపతాదులు రూపములు. కషాయ మధురాదులు రసములు. సురభ్యాదులు గంధములు. ఇవి పేర్ల చేత రూపములచేత కార్యములచేత ఒకదాని నుండి ఒకటి భిన్నముగా ఉన్నవి గాన వీటికి విశేషములని పేరు. పృథివిలో ఈ ఐదూ ఉండును. జలమునందు శబ్ద స్పర్శ-రూప-రసములు, తేజస్సులో శబ్ద-స్పర్శరూపములు, వాయువులో శబ్దస్పర్శలు, ఆకాశమునందు శబ్దము ఉండును. పృథివ్యాదులలో ఉన్న ఆకారాదులు ఈ క్రింది శ్లోకములలో చెప్పబడినవి.

"ఆకారో గౌరవం రౌక్ష్యం వరణం స్థైర్యమేవ చ,
వృత్తిర్భేదః క్షమా కార్ష్ణ్యం కాఠిన్యం సర్వభోగ్యతా".

ఆకారము (ఒక విధమైన అవయవసంఘటనము) బరువు, పెళుసుతనము, ఆవరించుట, స్థిరత్వము, సర్వభూతములకు ఆధారమగుట, పగులుట, ధరించే సామర్థ్యము, నలుపు, కాఠిన్యము అన్ని ప్రాణులూ అనుభవించుటకు వీలుగా ఉండుట ఇవి భూమి ధర్మములు.

"స్నేహః సౌక్ష్మ్యం ప్రభా శౌక్ల్యం మార్దవం గౌరవం చ యత్,
శైత్యం రక్షా పవిత్రత్వం సంధానం చౌదకా గుణాః".

కొంచెము జిడ్డు, సూక్ష్మత్వము, కాంతి, తెల్లదనము, మృదుత్వము, బరువు, చల్లదనము, రక్షించుట, పవిత్రత్వము, (వస్తువులను) దగ్గరకు చేర్చుట ఇవి ఉదకధర్మములు.

"ఊర్ధ్వభాక్ పాచకం దగ్ధృ పావకం లఘు భాస్వరమ్
ప్రధ్వంస్యోజస్వి వై తేజః పూర్వాభ్యాం భిన్నలక్షణమ్".

పైన చెప్పిన పృథివీ జలములకంటె వేరైన లక్షణములు గల తేజస్సు (అగ్ని) పైకి ప్రసరించును. పక్వము చేయును. కాల్చును. పవిత్రము చేయును. తేలిక యైనది. ప్రకాశించునది. నశించునది(తనంతట తానే శమించును) శక్తి గలది.

"తిర్యగానం పవిత్రత్వమాక్షేపో నోదనం బలమ్,
బలమచ్ఛాయతా రౌక్ష్యం వాయోర్ధర్మాః పృథగ్విధాః".

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

అడ్డముగా ప్రసరించుట, పవిత్రత్వము, పడద్రోయుట, గెంటుట, బలము, చపలత్వము, కాంతి లేదా నీడ లేకపోవుట. ఎండింపచేయుట ఇవి వాయుధర్మములు.

"సర్వతోగతిరవ్యూహో విష్టమ్భశ్చేతి తే త్రయః,

ఆకాశధర్మా వ్యాఖ్యాతాః పూర్వపూర్వవిలక్షణాః".

అంతటా వ్యాపించుట, పదార్థములను వేరు వేరుగా ఉంచుట, అవకాశము ఇవి ఆకాశధర్మములు. పైన చెప్పినవి భూతముల (1)స్థూలరూపములు. భూమిత్వ జలత్వ-తేజస్త్వ-వాయుత్వ ఆకాశత్వములు భూతముల (2) స్వరూపాఖ్యము లైన రూపములు. భూమిత్వము సహజమైన కాఠిన్యముతోను, జలత్వము స్నేహముతోను, తేజస్త్వము ఉష్ణత్వముతోను, వాయుత్వము వహనక్రియ (ప్రసరించుట)తోను, ఆకాశత్వము వ్యాపకత్వముతోను సమానాధికరణములై (కలిసి)ఉండును. ఆకాశత్వాదులు సామాన్యములు, శబ్దాదులు విశేషములు. ఈ సామాన్యవిశేషముల సంఘాతమే. ద్రవ్యము. అంతే కాని ద్రవ్యములో వేరుగా ఈ విశేషాదులు ఉండుట అనునది లేదు. వీటన్నింటి సముదాయము కంటె వేరుగా ద్రవ్యమనేది లేదు కదా? ఆ యా భూతముల తన్మాత్రలు వాటి (3) సూక్ష్మరూపము. వాటి ఒక పరిణామవిశేషము పరమాణువు, ప్రకృతి అను పేరు గల గుణత్రయము (4) అన్వయమను నామాంతరము కూడ గల-రూపము. ఇది అన్ని భూతములలో అనుస్యూతముగా ఉన్నది గాన **అన్వయము**. ఇది భూతముల చతుర్థరూపము. ఇంక పంచమరూపము (5) **అర్థవత్వము**. గుణములు భోగాపవర్గార్థములు గాన వాటిలో భోగాపవర్గార్థత (భోగాపవర్గము అనే ప్రయోజనము కలిగి ఉండుట) అనుగతముగా ఉన్నది. తత్కార్యములైన భూతములందు, భూతకార్యములైన గోఘటాదులందూ కూడ భోగాపవర్గార్థత ఉన్నది. అందుచే ఇది భూతముల పంచమరూపము. సంయమముచేత ఈ పంచభూతరూపములను జయించినవాడు భూతములను జయించును. అవులు లేగదూడల వెంట వచ్చినట్లు భూతప్రకృతులు అతని సంకల్పము ప్రకారము ప్రవర్తించును.

అవ. భూతజయమువలన కలుగు ఫలమును చెప్పుచున్నాడు.

సూ. **తతో ఽణిమాదిప్రాదుర్భావః కాయసంపత్తద్ధర్మానభిఘాతశ్చ.** 45

ప్ర.అ. తతః=భూతజయమువలన, అణిమాదిప్రాదుర్భావః=అణిమాదుల ప్రాదుర్భావము, కాయసంపత్=కాయసంపత్తు, తద్ధర్మానభిఘాతశ్చ = ఆ భూతముల ధర్మముల అడ్డు లేకపోవుట లభించును.

వ్యా. ఈ భూతజయమువలన మూడు సిద్ధులు లభించును.

"అణిమా మహిమా మూర్తేర్లఘిమా ప్రాప్తిరిన్ద్రియైః
ప్రాకామ్యం శ్రుతదృష్టేషు శక్తి: ప్రేరణమీశితా
గుణేష్వసఙ్గో వశితా యత్కామస్తదవస్యతి".

అని చెప్పిన అణిమాదిసిద్ధులు లభించును. శరీరము అణువంత చిన్నదగుట **అణిమ**, యోజనాల దూరము వ్యాపించునంతగా పెద్దదగుట **మహిమ**. దూదిపింజెవలె తేలిక అగుట **లఘిమ**. నేలమీదనే ఉండి వ్రేలితో చంద్రమండలమును ముట్టుకొనగలుగుట మొదలైనదానికి **ఇంద్రియముచే ప్రాప్తి** అని పేరు. విన్నవాటియందు, చూచినవాటి యందు ఎట్లు ఇష్టమైన అట్లు చేయ కలుగుట, నీటిలో మునిగినట్లు భూమిలో మునగ గలుగుట మొదలగునది **ప్రాకామ్యము**. తన శరీరావయవములను సంకల్పమాత్రముచేతనే ప్రేరేపించినట్లు భూతభౌతికములను సంకల్పమాత్రముచే ప్రేరేపింపగలుగుట **ఈశిత**. భూతభౌతికగుణములను వశములో ఉంచుకొనగలుగుట **వశిత**. **యత్కామస్తదవస్యతి** అనగా **సత్యసంకల్పత్వము**. ఏది సంకల్పించినా దానిని సాధించగలుగుట. విషమును కూడ అమృతము కావలెనని సంకల్పించి దానిని తినగలుగుట, తినిపించకలుగుట మొ. ఈ ఎనిమిదింటిలో ఐదవదైన **ప్రాకామ్యము** సూత్రములో **తద్ధర్మానభిఘాత** శబ్దముచేత చెప్పబడినది. దీనిచేత శిలలో కూడ ప్రవేశించును. జలము తడపదు. అగ్ని కాల్చదు. వాయువు కదల్చదు. ఆకాశములో కూడ శరీరమును ఆవరించుకొనగలిగి సిద్ధులకు కూడ కనబడదు.

అవ. కాయసంపద అనగా ఏమో చెప్పుచున్నాడు

సూ. **రూపలావణ్యబలవజ్రసంహననత్వాని కాయసంపత్.** 46

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ. రూప.....సంహననత్వాని=సౌందర్యము, శరీరకాంతి, బలము, శరీరావయవముల సంఘటనము వజ్రమువలె దృఢముగా ఉండుట అనునవి, కాయసంపత్=కాయసంపత్తు.

అవ. గ్రాహ్యములైన భూతాదులపై సంయమమునకు ఫలమును చెప్పి ఇప్పుడు గ్రహణ(ఇంద్రియ)సంయమమునకు ఫలమును చెప్పుచున్నాడు.

సూ. గ్రహణస్వరూపాస్మితాన్వయార్థవత్త్వసంయమాదిన్ద్రియజయః 47

ప్ర.అ. గ్రహణ...సంయమాత్=గ్రహణ-స్వరూప-అస్మిత-అన్వయ - అర్థవత్త్వములమీద సంయమమువలన, ఇన్ద్రియజయః=ఇంద్రియజయము లభించును.

వ్యా. నిశ్చయము, అభిమానము, సంకల్పము, శ్రవణము మొదలైన వృత్తులు **గ్రహణము**, ఏకాదశేంద్రియములు **స్వరూపము**. **అస్మితా** అను దానికి బుద్ధ్యహంకారములని అర్థము. ఇవి ఇంద్రియముల కారణములు. **అన్వయము అర్థవత్త్వము** అనువాటి అర్థము 44వ సూత్రములో చెప్పబడినది. వీటిపై సంయమము చేయుటవలన ఇంద్రియములను జయించగలుగును.

అవ. ఇంద్రియజయమువలన కలుగు సిద్ధులను చెప్పుచున్నాడు.

సూ. తతో మనోజవిత్వం వికరణభావః ప్రధానజయశ్చ 48

ప్ర.అ. తతః=ఇంద్రియజయమువలన, మనోజవిత్వమ్=మనస్సువంటి వేగము కలిగి ఉండుట, వికరణభావః=విడిపోయిన ఇంద్రియములు కలుగుట, ప్రధానజయశ్చ=ప్రధానముయొక్క జయము లభించును.

వ్యా. ఇంద్రియజయము సాధించిన యోగికి మనోవేగమువంటి వేగము లభించును. ఇంద్రియములు స్థూలదేహమును విడిచి కూడ వృత్తిని పొందగలుగుటచేత ఏ దేశమునకు ఏ కాలమునకు సంబంధించిన వస్తువుల జ్ఞానము కావలెనన్నను అది లభించును. ఆ యోగి ప్రధానమును జయించి తనకు ఇష్టము వచ్చినట్లు ప్రధానమునందు పరిణామమును చేయగలుగును. ఈ మూడు సిద్ధులకు **మధుప్రతీకములు, మధుమతులు** అని పేరు. తేనెలోని ప్రతి అంశము రుచిగానే ఉన్నట్లు ఈ సిద్ధులలో ప్రతిఒక్కటి ఇష్టముగా ఉండును గాన వీటికి మధుప్రతీకములని పేరు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. ఇప్పుడు గ్రహీతృసంయమమువలన కలుగు సిద్ధిని చెప్పుచున్నాడు.

సూ. సత్త్వపురుషాన్యతాఖ్యాతిమాత్రస్య సర్వభావాధిష్ఠాతృత్వం సర్వజ్ఞాతృత్వం చ. 49

ప్ర.అ. సత్త్వపురుషాన్యతాఖ్యాతిమాత్రస్య=సత్త్వ (బుద్ధి) పురుషుల అన్యత్వముయొక్క జ్ఞానము మాత్రమునందే స్థితిగల సంయమమునకు, సర్వభావాధిష్ఠాతృతమ్=సర్వభావములకు అధిష్ఠాతగా నుండుట, సర్వజ్ఞాతృత్వమ్=అన్నింటిని తెలిసికొనుట అనునవి ఫలములు.

వ్యా. చిత్తము రజస్తమోగుణములచే ఉపప్లుతము (నింపబడినది) అయినపుడు చిత్తసత్త్వము వశ్యము కాదు. ఆ రజస్తమోమలము తొలగించినపుడు బుద్ధిసత్త్వమునకు వైశారద్యము (స్వచ్ఛత్వము) కలుగును. అపుడు బుద్ధిసత్త్వము యోగికి వశ్యమగును. ఆ విధముగ వశీకారమను పేరు గల వైరాగ్యమునందున్న యోగి సత్త్వము వేరు పురుషుడు వేరు అను ఖ్యాతియందు సంయమముచేసి దానియందు ప్రతిష్ఠితుడై (స్థిరుడై) ఉన్నప్పుడు ప్రకృతిపురుషవికారములను స్వేచ్ఛానుసారము ప్రేరేపింపగలుగుట, సర్వవిషయములను సాక్షాత్కారించుకొనగలుగుట అను రెండు సిద్ధులు కలుగును. ఈ సిద్ధిద్వయమునకు **విశోకా** అని పేరు.

అవ. వివేకసంయమమువలన కలిగేది, అన్ని సిద్ధులలో శ్రేష్ఠమూ అయిన మోక్షమనే సిద్ధిని చెప్పుచున్నాడు. దీనికి ద్వారము పరవైరాగ్యము.

సూ. తద్వైరాగ్యాదపి దోషబీజక్షయే కైవల్యమ్. 50

ప్ర.అ. తద్వైరాగ్యాత్= ఆ వివేకఖ్యాతియందు, తత్సిద్ధియందు వైరాగ్యము వలన, దోషబీజక్షయే=దోషముల బీజము క్షీణించగా, కైవల్యమపి =కైవల్యము కూడ కలుగును.

వ్యా. వివేకఖ్యాతినిష్ఠ కలిగిన పిమ్మట ఆ వివేకఖ్యాతివలననే సంసార బీజములైన క్లేశకర్మరూపములైన అఖిలవాసనలు పూర్తిగా క్షీణించి అగ్నిలో మాడిపోయిన బీజములవంటివి అగును. దాని విషయమునందు కూడ వైరాగ్యము కలుగును. సత్త్వధర్మమైన వివేకప్రత్యయమునందు, సత్త్వముకూడ హేయమే అను భావము కలుగును. పురుషుడు సత్త్వముకంటె భిన్నుడు,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శుద్ధుడు, పరిణామశూన్యుడు అను దృఢజ్ఞానము కలుగును. అపుడు పూర్తిగా ప్రకృతినుండి(గుణత్రయమునుండి)విడివడిపోవుట(అదే కైవల్యము)జరుగును.

అవ. కైవల్యమును సాధించుటకై యత్నించుచున్న యోగికి కొన్ని అంతరాయములు కలుగవచ్చును. వాటిని ఎట్లు తొలగించుకొనవలెనో చెప్పుచున్నాడు.

సూ. స్థాన్యుపనిమన్త్రణే సంగస్మయాకరణం పునరనిష్టప్రసజ్గాత్. 51

ప్ర.అ. స్థాన్యుపనిమన్రణే=ఆయా స్థానముల అధిపతులైన ఇంద్రాదుల ఆహ్వానము లభించగా, పునః=మరల, అనిష్టప్రసంగాత్=అనిష్టమైన సంసార బంధము కలిగే అవకాశముండుటవలన, సంగస్మయాకరణమ్=ఆ స్థానములందు ఆసక్తిని గాని, గర్వమును కాని చేయకుండుట.

వ్యా. యోగులలో ప్రాథమకల్పికుడు, మధుభూమికుడు, ప్రజ్ఞాజ్యోతి, అతిక్రాంతభావనీయుడు, అని నాలుగువిధాల యోగులుందురు. 1. పరచిత్తాది విషయక మైన జ్ఞానము ప్రారంభ మైనది గాని వశము కాలేదు. ఆ స్థితిలో ఉన్న వాడు **ప్రాథమకల్పికుడు** 2. భూతేంద్రియములను జయించుటకై ప్రయత్నము చేసే ఋతంభరాప్రజ్ఞావంతుడు **మధుభూమికుడు**. 3. స్థూలాది సంయమము చేతను, గ్రహణాది సంయమముచేతను భూతేంద్రియములను జయించిన వాడు **ప్రజ్ఞాజ్యోతి**. 4. భావనీయములన్నింటిని దాటిన జీవన్ముక్తుడు **అతిక్రాంతభావనీయుడు**. వీరిలో మధుభూమికుని వద్దకు వచ్చి ఇంద్రాదులు "నీవు చేసిన తపస్సుకు ఫలితముగా ఈ స్వర్గాదిసుఖమును అనుభవింపుము" అని చెప్పినపుడు ఆతడు వాటియందు ఆసక్తి చూపకూడదు. నేను ఎంత గొప్పవాడను; ఇంద్రుడే వచ్చి నన్ను ఆహ్వానించుచున్నాడు. అని గర్వపడ కూడదు, అట్లు ఆసక్తి చూపినా, గర్వపడినా మరల సంసారబంధములో చిక్కుకొనును.

మొదటి రకము యోగి ఇంకా ప్రారంభదశలోనే ఉన్నాడు గాన దేవాదులు ఆతనివద్దకు రారు. మూడవరకమువాడు తానే అన్నింటికి సంపాదించుకొనగలడు. నాల్గవతరగతివానికి ఆవేవీ అవసరము లేదు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. ఆ యా వస్తువులపై సంయమమువలన సర్వజ్ఞత లభించునని చెప్పబడినది. కాని అది పూర్తిగా అన్నీ తెలిసికొనే సర్వజ్ఞత కాదు. **అన్ని వ్యంజనాలు (శాకాదులు) వేసికొని భుజించినాను** అన్నప్పుడు అప్పుడు లభించిన అన్ని వ్యంజనాలు అని మాత్రమే అర్థమైనట్లు ఆ యా వస్తువులన్నీ తెలియునని మాత్రమే అర్థము. **అయితే ఉన్న అన్నము నంతా తినేసినాడు** అన్నప్పుడు మొత్తము అన్నము అంతా అని అర్థము. అట్లే సృష్టిలోని సకలపదార్థములను తెలిసికొనుట అనే అర్థము **సర్వజ్ఞత్వము** అను దానికి అర్థము. అట్టి సర్వజ్ఞత్వమునకు సాధనమైన సంయమమును చెప్పుచున్నాడు.

సూ. క్షణతత్క్రమయోః సంయమాద్వివేకజం జ్ఞానమ్. 52

ప్ర.అ. క్షణతత్క్రమయోః=క్షణమునందు, క్షణముల క్రమమునందు, సంయమాత్=సంయమమువలన, వివేకజమ్=వివేకమువలన కలిగిన, జ్ఞానమ్ =జ్ఞానము లభించును.

వ్యా. చాల చిన్నదైన ద్రవ్యము పరమాణువైనట్లు చాల చిన్నదైన కాలము **క్షణము**. కదిలిన పరమాణువు ఒకచోటినుండి మరొక చోటికి జరుగుటకు పట్టే కాలము క్షణము. ఆ క్షణముల అవిచ్ఛిన్న ప్రవాహము క్రమము. వాస్తవమున ఈ క్రమము బుద్ధికల్పితము. ఎందుచేతననగా రెండు క్షణములు ఒక సమయమునందు ఉండవు గాన వాటికి క్రమమనునది కూడ ఉండదు. వృక్షాదులు ఒక దాని ప్రక్కన ఒకటి వరసగా ఉన్నట్లు క్షణము లుండవు కదా? ముహూర్తము, పగలు రాత్రి మొదలైనవి కూడ బుద్ధికల్పితములే. ఈ విధముగా బుద్ధినిర్మితమై, వస్తుశూన్యమైన ఈ కాలమునకు పేర్లు కల్పించి, తద్వారా దాని జ్ఞానము కలుగుచున్నట్లు, అది వాస్తవమన్నట్లు సామాన్యజనులు భావించుచుందురు. క్షణము మాత్రము వాస్తవమే. ఒక క్షణము తరువాత మరొక క్షణము వచ్చుటయే క్షణక్రమము. కనుక వర్తమానక్షణము ఒక్కటే. పూర్వక్షణము కాని ఉత్తరక్షణము కాని (ఇప్పుడు) లేవు. అందుచే క్షణాల సమాహారమనునది లేదు. భూతభావిక్షణ ములు కూడ పరిణామాన్వితములే అనగా పూర్వక్షణములలోను, ఉత్తరక్షణములలోను కూడ భూతాదులందు పరిణామముండును. సమస్త ధర్మములు (పదార్థములు) క్షణముతో సంబంధించినవే గాన ఒక క్షణములో

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

సమస్తలోకము పరిణామమును చెందుచునే ఉండును. ఆ క్షణతత్క్రమములందు సంయమము చేయుటచే వాటి సాక్షాత్కారము, తద్వారా వివేకజజ్ఞానము కలుగును. క్షణసాక్షాత్కారము పొందగలిగినవానికి అతిసూక్ష్మములైన మహదాద్యన్యతత్త్వముల సాక్షాత్కారము కూడ కలుగును. (భో.వృ.).

అవ. వివేకజ్ఞానమునకు ఒక ఉదాహరణము చెప్పుచున్నాడు.

సూ. జాతిలక్షణదేశైరన్యతానవచ్ఛేదాత్తుల్యయోస్తతః ప్రతిపత్తిః. 53

ప్ర.అ. తుల్యయోః=సమానమైన రెండు వస్తువులలో, జాతిలక్షణదేశైః =జాతిచేత, లక్షణముచేత, దేశముచేత, అన్యతానవచ్ఛేదాత్=అన్యత్వమును (భేదమును) నిర్ణయించకపోవుటవలన, (నిర్ణయము) కుదరనప్పుడు, తతః= క్షణతత్క్రమసంయమమువలన, ప్రతిపత్తిః=భేదజ్ఞానము కలుగును.

రెండు వస్తువుల భేదమును జాతిని పట్టి తెలుసుకొనవచ్చును. ఉదా -గోత్వము, మహిషత్వము అనే జాతుల భేదమును పట్టి గోమహిషముల భేదమును గుర్తించవచ్చును. అవస్థాదిలక్షణములను పట్టి బాలునికీ, వృద్ధునికీ భేదమును నల్లకళ్ళవానికి ఎఱ్ఱకళ్ళవానికీ భేదమును గుర్తించినట్లు రెండు వస్తువుల భేదమును గుర్తించవచ్చును. తూర్పువైపున ఉసిరి కాయకు, ఉత్తరాన ఉన్న ఉసిరికాయకు భేదమును గుర్తించినట్లు రెండు సమానవస్తువుల భేదమును ప్రదేశభేదమును పట్టి గుర్తించవచ్చును. కాని ఆ ఉసిరికాయలనే ఎదుటివాడు చూడకుండగా ఉన్నప్పుడు దానిని ఇక్కడ దీనిని అక్కడ పెట్టి చోటు మార్చివేసిన అతడు వాటి భేదమును గర్తించజాలడు. కాని ఆ ఉసిరికాయలు ఆ యా దేశములందున్న క్షణముపై సంయమము చేసిన యోగి వాటి చోటు మార్చినను వాటి భేదమును తెలుసుకొనగలడు. ఇట్లే పరమాణువులతో సంబంధించిన ఆ యా క్షణములమీద సంయమము చేయుటచే వాటి భేదమును తెలిసికొనవచ్చును గాన "పరమాణువులలో విశేషములనేవి ఉన్నవి; వాటిని పట్టి పరస్పరభేదమేర్పడుచున్నది" అని వైశేషికులంగీకరించిన సిద్ధాంతము అనావశ్యకము. ఇట్టి యోగి ముక్తులైనవారి పూర్వశరీరసంబద్ధక్షణములమీద సంయమము చేసి వారి భేదమును కూడా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తెలిసికొనగలడు. ఇది క్షణసంయమమునకుదాహరణము. క్షణక్రమము నందు సంయమము చేసి యోగి జ్యేష్ఠకనిష్ఠత్వాదులను తెలిసికొనగలడు.

అవ. వివేకజజ్ఞానమునకు ఒక ఉదాహరణము చూపి ఇది మోక్షమునకు ఎట్లుపయోగించునో సహేతుకముగా చెప్పుచున్నాడు.

సూ. తారకం సర్వవిషయం సర్వథావిషయక్రమం చేతివివేకజం జ్ఞానమ్. 54

ప్ర.అ. వివేకజం జ్ఞానమ్=ఈ వివేకజజ్ఞానము, సర్వవిషయమ్ అన్నీ విషయములుగా గలది, సర్వథావిషయమ్=అన్నివిధములూ విషయములుగా గలది; అక్రమం చ=క్రమము లేనిది, తారకమ్=సంసారమునుండి తరింప చేయునది.

వ్యా. ఈ వివేకజజ్ఞానమునకు విషయము కానిది ఏదీ ఉండదు. అందుచే ఇది సర్వవిషయము. అతీతము, అనాగతము, ప్రత్యుత్పన్నము (పుట్టినది) అయిన సర్వమూ, దానిలోని అవాంతరవిశేషములతో సహా దీనికి విషయమై ఉండును గాన ఇది "సర్వథావిషయము". ఒక క్షణమునకు సంబంధించిన వాటిని అన్నింటినీ ఒకేమారు గ్రహించగలదు గాన ఇది అక్రమము. ఇది పరి పూర్ణము. సంప్రజ్ఞాతము కూడ దీని అంశమే. మధుమతి అనే పేరు గల ఋతంభరాప్రజ్ఞ దీని మొదలు. **సప్తధా ప్రాన్తభూమి ప్రజ్ఞ** దీని అవసానము. ఇది సంసార తారకము. దీనిలోని అంశమైన యోగప్రదీపమే (సంప్రజ్ఞాతమే) వాస్తవమున తారకము. (తత్త్వవైశారది).

అవ. ఇంతవరకు పరంపరయా కైవల్యమునకు హేతువులైన సంయమములను, తజ్జన్యవిభూతులను చెప్పి సాక్షాత్తుగా కైవల్యమునకు.సాధన మైనది సత్త్వ (బుద్ధి) పురుషుల భేదజ్ఞానమే అని చెప్పుచున్నాడు.

సూ. సత్త్వపురుషయోః శుద్ధిసామ్యే కైవల్యమితి. 55

ప్ర.అ. సత్త్వపురుషయోః=బుద్ధిపురుషులయొక్క శుద్ధిసామ్యే=శుద్ధి యందు సామ్యము కలుగగా, కైవల్యమ్=కైవల్యము సిద్ధించును. **ఇతి** అనునది సూత్రసమాప్తి సూచకము (త.వై.). (భోజవృత్తిప్రకారము **ఇతి** లేదు).

వ్యా. పురుషుడు అభిమానశూన్యుడగుట పురుషుని శుద్ధి. సాక్షి యైన పురుషుడు నిరభిమానుడైనప్పుడు చిత్తము కూడ నిరభిమానము

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

అగును. అప్పుడు సత్త్వపురుషాన్యతాజ్ఞానముచే అజ్ఞానము నివృత్తమగును. క్లేశబీజములు దగ్ధములగును. అప్పుడు సిద్ధులు సంపాదించుకొన్నవానికైనా, సంపాదించుకొననివానికైనా తప్పక మోక్షము కలుగును. యోగమును అభ్యసించేవానికి తప్పక ఆ యా సిద్ధులు కలుగునను నియమము లేదు; సిద్ధుల విషయములో వానికి వైరాగ్యమున్నచో వానికి సిద్ధులు కలుగవు. అందుచేత సంయమములవలన ఆ యా సిద్ధులను సంపాదించుకొననివానికి కూడ సత్త్వపురుషాన్యతాజ్ఞానము కలిగినచో తప్పక మోక్షము కలుగునని భావము.

"బాలానందిని" అను పాంతజలయోగసూత్రాంధ్రవ్యాఖ్యానమునందు మూడవదైన విభూతిపాదము సమాప్తము.

అథ చతుర్థః కైవల్యపాదః

అవ. ప్రథమద్వితీయతృతీయపాదములలో సమాధి, సమాధికి సాధనములు, సమాధివలన లభించు విభూతులు చెప్పబడినవి. సమాధివలన కలుగు కైవల్యమును చెప్పవలసి ఉన్నది. పరలోకమును గూర్చి, పరలోకమునకు సంబంధించినవాడు, విజ్ఞానముకంటె భిన్నమైన చిత్తమనే కరణముతో (సాధనముతో) సుఖాద్యాత్మకములైన శబ్దాదులను అనుభవించువాడు అయిన పురుషుని గూర్చి, వివేకజ్ఞానపరాకాష్ఠను గూర్చి చెప్పనంతవరకు కైవల్యోపయుక్తమైన చిత్తమును గూర్చి తెలిసికొనుట కుదరదు. అందుచే ఆ విషయములన్నీ ఈ పాదములో చెప్పబడుచున్నవి. ముందు సిద్ధచిత్తములలో కైవల్యార్హమైన కైవల్యభాగీయమైన చిత్తమును నిర్ధారణ చేయుటకై ఐదు విధముల సిద్ధిని చెప్పుచున్నాడు. (తత్త్వవైశారది).

మోక్షమనేది ఉన్నదా అను విప్రతిపత్తివలన కలుగు భ్రాంతిని నిరాకరించి యుక్తిచే కైవల్యస్వరూపమును తెలుపుటకై కైవల్యపాదము ప్రారంభింపబడుచున్నది. పూర్వము చెప్పబడిన సిద్ధులకు నానావిధజన్మాదులు కారణము అను విషయమును ప్రతిపాదించుట ద్వారా ఈ విధముగ బోధింపబడినది - "నాకు లభించిన ఈ సిద్ధులన్నీ పూర్వజన్మలలో నేను అభ్యసించిన సమాధుల బలమువలన కలిగినవి. అందుచేత అనేకజన్మలచేత సాధింపదగిన కైవల్యానికి లోపమేదీ ఉండదు. ఎప్పటికైనా అది లభించును" అని యోగికి నమ్మకము కలిగించుటకు, సమాధిసిద్ధి అన్నింటికంటే ప్రధానము అని సూచించుటకు చెప్పుచున్నాడు. (భో.వృ.)

ఇతర సిద్ధులన్నింటికంటే సమాధిసిద్ధి ఉత్తమదని ప్రతిపాదించుటకై ఐదువిధముల సిద్ధులను చెప్పుచున్నాడు.

సూ. జన్మౌషధిమన్త్రతపఃసమాధిజాః సిద్ధయః. 1

ప్ర. అ. సిద్ధయః=సిద్ధులు, జన్మ... సమాధిజాః=జన్మవలన, ఓషధులవలన, మంత్రములవలన, తపస్సువలన సమాధివలన కలుగునవి.

వ్యా. దేవతలకు జన్మమాత్రముచేతనే (దేవతలుగా పుట్టగానే) అణిమాదిసిద్ధులు కలుగును. అవి జన్మజసిద్ధులు. అసురులు రసాయనముల వలన సిద్ధులను సాధింతురు; అవి ఓషధిజసిద్ధులు. వాటిని మనుష్యుడు కూడ తెలిసికొని సాధించవచ్చును. మంత్రోపాసనవలన కలిగిన ఆకాశగమన-అణిమాదిసిద్ధులు మంత్రజములు. తపస్సువల్ల కలిగే సంకల్పసిద్ధి (కోరినదానిని

In Public domain. Digitization Muthulakshmi Research Academy
పొందగలుగుట) తపోజసిద్ధి. సమాధిజసిద్ధులు పూర్వపాదమునందు వర్ణించబడినవి.

సమాధిజసిద్ధులకువలె ఇతరసిద్ధులకు కూడ జన్మాంతరమునందు అభ్యసించిన సమాధియే కారణము. మంత్రాదులు నిమిత్తమాత్రము. (భో.వృ.)

అవ. మనుష్యాదిశరీరముతో ఉన్నవాడు దేవత్వమును పొందినప్పుడు, అణిమాదిసిద్ధులను పొందినప్పుడు శరీరములు మారుటకు సంకల్పజధర్మము, యోగజధర్మము మాత్రమే కారణములా మరొక కారణ మేదైనా ఆవశ్యకమా అనుదానికి సమాధానము చెప్పుచున్నాడు.

సూ. జాత్యన్తరపరిణామః ప్రకృత్యాపూరాత్. 2

ప్ర.అ. ప్రకృత్యాపూరాత్=ప్రకృతియొక్క ఆపూరమువలన, ప్రకృతియైన భూతాదికము ఆ యా అవయవములను నింపుటవలన, జాత్యన్తర పరిణామః=మరొక జాతిరూపమున పరిణామము కలుగును.

వ్యా. దేవతాశరీరములకు అవసరమైన సత్త్వాదివిశేషరూపములు నింపబడుటచే (సమకూర్చబడుటచే) ఆ యా శరీరములు ఏర్పడుచున్నవి. దేహములకు భూమ్యాదులు ప్రకృతి, ఇంద్రియములకు అస్మిత ప్రకృతి. ప్రకృత్యాపూరమునకు యోగిసంకల్పము, యోగజధర్మము మొదలగునవి సహకారి కారణములు. ఇవి ఉన్నప్పుడే ఆ విధముగ ప్రకృత్యాపూరణము జరుగును. విజాతీయమైన దేవాది శరీరములను పుట్టించుటకే కాక సిద్ధుల ద్వారా ఒక యోగి దేహమును అణు ప్రమాణముగా చేయదలచినపుడు అంతవరకు ఉన్న సత్యాదివిశేషములను తొలగించుట, మహిమను (చాలా పెద్ద శరీరమును గ్రహించ సంకల్పించినపుడు అత్యధికముగా సత్త్వాదివిశేషములను సమకూర్చుట మొదలైనవి కూడ ధర్మాదిసహకారముచే ప్రకృతి తగ్గుట, పెరుగుట అనుదానివలన జరుగును. ప్రకృత్యాపూరణముచేతనే వామనుడు శరీరము పెంచి త్రివిక్రముడైనాడు. సముద్రములోని ప్రకృత్యాపూరణము తొలగించి అగస్త్యుడు దానిని త్రాగగలిగినాడు. ప్రకృత్యారణమే హిరణ్య గర్భాదులు చేయు జగత్సృష్ట్యాదులకు కారణము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. యోగిసంకల్పముచేతను, యోగజధర్మములచేతను ప్రకృతులు బలాత్కారముగా ఆకర్షింపబడు నని చెప్పినచో "ప్రకృతి స్వతంత్ర మైనది" అను సిద్ధాంతమునకు భంగము కదా అని అశంకించుకొని చెప్పుచున్నాడు.

సూ. నిమిత్తమప్రయోజకం ప్రకృతీనాం వరణభేదస్తు తతః క్షేత్రికవత్. 3

ప్ర.అ. నిమిత్తమ్=ధర్మాదిరూపమైన నిమిత్తకారణము, ప్రకృతీనామ్= మహత్తు మొదలైన కారణములకు, అప్రయోజకమ్=ప్రవర్తకము కాదు. తతః= నిమిత్తకారణమువలన, క్షేత్రికవత్=క్షేత్రమును పరిరక్షించే వ్యవసాయ దారుని చేత వలె, వరణభేదః తు=ఆవరణభంగము మాత్రమే జరుగును.

వ్యా. జలమును ఒక ప్రదేశమునుండి మరొక ప్రదేశమునకు తీసికొని వెళ్లదలచినపుడు వ్యవసాయదారుడు అడ్డముగా గట్టును తెగగొట్టును. అప్పుడు నీరు తనంతట తానే మరొకచోటికి ప్రవహించును. అట్లే ధర్మాది రూపనిమిత్తకారణము ప్రతిబంధకములుగా ఉన్న అధర్మాదులను తొలగించును. అవి చేయు పని అంతమాత్రమే. అప్పుడు మహదాదిప్రకృతులు (మూలకారణములు) వాటంతట అవి ఆపూరణాదికార్యమును చేయును.

ఈశ్వరుడు పురుషార్థరూపప్రయోజనమును ఉద్దేశించి ప్రకృతులను ప్రవర్తింపచేయుచుండును. పురుషార్థము ఉద్దేశింపబడుటచే పురుషార్థమే ప్రవర్తకమని చెప్పబడుచున్నది. వాస్తవమున ప్రవర్తకత్వము ఈశ్వరునిదే. అయితే ధర్మాధర్మాదుల నిమిత్తకారణత్వము ఎందుకు అని శంకించరాదు. ఎందుచేతననగా ఈశ్వరుడు కూడ క్షేత్రికుడువలెనే ధర్మాదులను అధిష్ఠించి ప్రతిబంధములను తొలగించుట అను పని మాత్రమే చేయుచుండును (త.వై.)

వ్యవసాయదారుడు వరి మొదలైన ధాన్యాలలో కావలసిన రసాదులను తాను నింపజాలడు. అతడు కేవలము ఆ చేనులో ఉన్న విజాతీయములైన తృణాలను పెరికివేయును. అప్పుడు రసాదులు ఆ ధాన్యాదులలో వాటంతట అవే ప్రసరించును. అట్లే ధర్మము అధర్మమును నివర్తింపచేయుటకు మాత్రమే నిమిత్తము. అంతే కాని ప్రకృతుల ప్రవృత్తికి హేతువు కాదు. నందీశ్వరుడనే బ్రాహ్మణుని ధర్మము అధర్మమును నివర్తింపచేయుటచే దేవదేహమునకు కావలసిన ప్రకృత్యాపూరము జరిగి అతనికి దేవతాశరీరము లభించినది. అధర్మము కూడ ధర్మమును నివర్తింపచేయవచ్చును. ఉదాహరణమునకు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఇంద్రపదములో ఉన్న నహుషుని అధర్మము ధర్మమును నివర్తింపచేయగా ఆతనికి అజగరదేహమునకు కావలసిన ప్రకృత్యాపూరము జరిగి అజగర శరీరము వచ్చినది. (వ్యా. భా.)

అవ. ఒక యోగి అనేకకాయముల నిర్మాణము చేసికొన్నప్పుడు ఆ కాయములన్నింటిలోను ఒకే మనస్సు ఉండునా, చాల మనస్సులుండునా అని ఆశంకించుకొని రెండు సూత్రములు చెప్పుచున్నాడు -

సూ. నిర్మాణచిత్తాన్యస్మితామాత్రాత్. 4

ప్ర.అ. అస్మితామాత్రాత్=మనస్సునకు కారణమైన అస్మిత (అహంకారము)నుండి, నిర్మాణచిత్తాని=నిర్మాణచిత్తములు (నిర్మించబడిన చిత్తములు) ఏర్పరుపబడును.

వ్యా. యోగి యోగబలముచేత ఎన్ని దేహములను నిర్మించునో అన్ని చిత్తములను కూడ అహంకారమునుండి నిర్మించును. అందుచేత ఎన్ని నిర్మాణదేహములుండునో అన్ని నిర్మాణచిత్తములు కూడ ఉండునని అర్థము.

అవ. వేరు వేరు నిర్మాణకాయాలలో వేరు వేరు నిర్మాణచిత్తములు ఉన్నచో ఒక దేహములో జరిగిన కర్మాదుల జ్ఞానము ఇతరదేహములలో ఉన్న చిత్తమునకు ఉండదు కదా? అందుచేత యోగికి తాను నిర్మించిన వివిధదేహముల కార్యముల ప్రతిసంధానము (గుర్తించుట) స్మరణాదికము ఎట్లు? అను ఆశంకకు సమాధానము చెప్పుచున్నాడు -

సూ. ప్రవృత్తిభేదే ప్రయోజకం చిత్తమేకమనేకేషామ్. 5

ప్ర.అ. అనేకేషామ్ = అనేకచిత్తములయొక్క ప్రవృత్తిభేదే = ప్రవర్తనల భేదములందు, ప్రయోజకమ్ = ప్రేరకమైన, ఏకం చిత్తమ్ = ఒక చిత్తమును నిర్మించును.

ఆ యోగి వివిధదేహములకు సంబంధించిన తత్సమసంఖ్యాక-ములైన చిత్తములను నిర్మించి వాటి అన్నింటిని ప్రవర్తింపచేయు ఒక నాయకచిత్తమును కూడ నిర్మించును. తద్వారా వివిధకాయకృతకర్మ ప్రతిసంధానాదికము జరుగును అని అర్థము (వ్యా. భా.) యోగి చిత్తము

ఇతరచిత్తములనన్నింటినీ నియమించుచు ప్రేరేపించుచుండునని కొందరు వ్యాఖ్యాతలు (భా.గ.వృత్తి)

అవ. ఐదు సిద్ధులలో మోక్షయోగ్యమైన చిత్తమేదో చెప్పుచున్నాడు.

సూ. తత్ర ధ్యానజమనాశయమ్. 6

ప్ర.అ. తత్ర = ఆ పంచవిధసిద్ధులు గల చిత్తములలో, ధ్యానజమ్ సమాధిచేత జనించిన (సంస్కరింపబడిన) చిత్తము, అనాశయమ్= కర్మక్లేశాది సంస్కారములు లేనిది అగును.

ద్వివిధయోగములద్వారా సమాధిచేతనే సకలవాసనలను ఉన్మూలింప శక్యమగును. మంత్రాదిసంస్కృతచిత్తము వాసనలను ఉన్మూలింపజాలదు. అందుచే సమాధిసంస్కృతచిత్తమే మోక్షోపయోగి అని అర్థము.

అవ. ఈ విషయమునే స్పష్టీకరించుచున్నాడు.

సూ. కర్మాశుక్లాకృష్ణం యోగినస్త్రివిధమితరేషామ్. 7

ప్ర.అ. యోగినః=యోగియొక్క, కర్మ=కర్మ, అశుక్లాకృష్ణమ్= శుక్లము కాని కృష్ణము కాని కాదు. అనగా పుణ్యరూపము కాని, పాపరూపము కాని కాదు. ఇతరేషామ్ = ఇతరులయొక్క కర్మ, త్రివిధమ్=మూడు విధములైనది.

వ్యా. కర్మజాతిలో–కృష్ణ, శుక్లకృష్ణ, శుక్ల, అశుక్లాకృష్ణ అని నాలుగు విధము లున్నవి. దురాత్ముల కర్మజాతి కృష్ణ (పాపము). బాహ్యసాధనములచేత సాధ్యమైనది శుక్లకృష్ణ (పుణ్యాపాపమిశ్రము) బాహ్య సాధనములచే సాధింపదగిన కర్మలో కొంత పరపీడ (పశుహింసాదికము), కొంత పరానుగ్రహము (బ్రాహ్మణ దక్షిణాదికము) ఉండుటచే అది శుక్లకృష్ణ. తపఃస్వాధ్యాయ ధ్యానాదికర్మజాతి శుక్ల (కేవలపుణ్యము) దీనిలో బాహ్యసాధనాపేక్ష లేదు గాన పరపీడ ఉండదు. క్లేశములన్నీ క్షీణించిన సంన్యాసులు కర్మజాతి అశుక్లాకృష్ణ (పుణ్యాపాపములు రెండూ ఉండవు). యోగుల కర్మమాత్రమే ఇట్టిది. ఇతరుల కర్మ కృష్ణ–శుక్లకృష్ణ – శుక్ల రూపములతో త్రివిధములుగ ఉండును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. కర్మాశయములను గూర్చి వివరించిన పిమ్మట క్లేశాశయములు పనిచేయు రీతిని చెప్పుచున్నాడు.

సూ. తతస్తద్విపాకానుగుణానామేవాభివ్యక్తిర్వాసనానామ్. 8

ప్ర.అ. తతః=ఆ వివిధకర్మలనుండి, తద్విపాకానుగుణానామేవ=ఆ కర్మల విపాకమునకు మాత్రమే అనుగుణములు అయిన, వాసనానామ్= వాసనలయొక్క, అభివ్యక్తిః=అభివ్యక్తి జరుగును.

వ్యా. పుణ్యజాతీయము కాని పాపజాతీయము కాని అయిన కర్మ విపాకము చెందుటకు, అనగా జాత్యాయుర్భోగములను ఇచ్చుటకు, తగిన వాసనలే ఉద్బుద్ధములగును. మనుష్యజన్మ లభించవలసినప్పుడు దానికి తగిన వాసనలే అభివ్యక్తములగును. పశుజన్మకు సంబంధించిన వాసనలున్నను అవి అభివ్యక్తములు కావు. అందుచేతనే మనుష్యజన్మ లభించినవాడు తృణభక్షణాదికము చెయ్యడు. ఇట్లే దివ్యభోగమనుభవించవలసిన జన్మ వచ్చినప్పుడు నారక వాసనలు, నరకదుఃఖమును అనుభవించవలసివచ్చిన- ప్పుడు దివ్యవాసనలు ఉద్బుద్ధములు కావు.

అవ. ఒక మనుష్యుడు మరణానంతరము వచ్చిన జన్మలో మార్జార భావమును పొందినప్పుడు చాల దగ్గరగా ఉన్న మనుష్యవాసనయే అభివ్యక్తము కావలెను కాని చాల దూరముగా ఉన్న మార్జారవాసన ఎట్లు అభివ్యక్త మగును? అనగా ఆ మార్జారము మనుష్యునివలెనే ప్రవర్తించవలెను కదా అని ఆశంకించు కొని చెప్పుచున్నాడు -

సూ. జాతిదేశకాలవ్యవహితానామప్యానన్తర్యం స్మృతి
సంస్కారయోరేకరూపత్వాత్. 9

ప్ర.అ. స్మృతిసంస్కారయోః = స్మృతీ, సంస్కారమూ, ఏకరూపత్వాత్ = ఒకేరూపము కలవగుటవలన, జాతిదేశకాల-వ్యవహితానామపి=జన్మలచేత, దేశములచేత, కాలముచేత వ్యవధానముకలవైనను తగిన వాసనలకే (సంస్కారములకే), ఆనన్తర్యమ్ = అనంతరత్వము.

వ్యా. పూర్వసంస్కారము ఎట్లుండునో స్మృతి కూడ అట్లే ఉండును. సంస్కారము ఒక విధముగాను స్మృతి మరొకవిధముగాను ఉండదు. ఏ కర్మను

పట్టి ఒకనికి మార్జాలజన్మ వచ్చినదో ఆ కర్మ ఆ మార్జాలవాసనలనే (సంస్కారమునే) అభివ్యక్తము చేయును. కొన్ని వందల జన్మలకు పూర్వము, అతిదూర దేశములో, అతిదీర్ఘకాలమునకు ముందు ఈ జీవునకు మార్జారజన్మ, తత్కృత వాసనలు ఏర్పడి ఉండవచ్చును. ఆ వాసనలే ఇప్పుడు మరల మార్జాలజన్మ వచ్చినప్పుడు ఉద్బుద్ధములగును. ఈ విధముగా ఆ వాసనలు ఈ జన్మకు అనంతరములు (పక్కనే ఉన్నవి) అగును.

అవ. పూర్వపూర్వజన్మలున్నచో వాటి సంస్కారములు అభివ్యక్తములు కావచ్చును. కాని అనంతపూర్వపూర్వజన్మలున్నవనుటకు ప్రమాణము లేదు కదా. పుట్టగానే ప్రాణికి హర్షశోకాదులు కలుగుచున్నవి గాన దానిని పట్టి పూర్వపూర్వజన్మలు, తజ్జనితసంస్కారములు ఉండునని చెప్పవలెను కదా అనుటకు అవకాశము లేదు. పద్మాదులలో సంకోచవికాసాదులు స్వాభావికముగానే కలుగుచున్నట్లు హర్షశోకాదులు కలుగవచ్చును కదా అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

సూ. తాసామనాదిత్వం చాశిషో నిత్యత్వాత్. 10

ప్ర.అ. ఆశిషః=కోరిక, నిత్యత్వాత్=నిత్యమగుటవలన, తాసామ్ = ఆ వాసనలకు, అనాదిత్వమ్=అనాదిత్వము.

వ్యా. పుట్టినవెంటనే "ప్రతిప్రాణీ నేను ఇట్లే ఉందునుగాక; లేకపోవుట అనునది (మరణము) నాకు కలగకపోవుగాక" అని కోరుకొనును. ఈ జన్మలో మరణదుఃఖమును అనుభవించలేదు; దానిని గూర్చి విననుకూడ లేదు. ఐనా మరణమును గూర్చి భయపడుచున్నాడు. దీనిని పట్టి పూర్వజన్మమున కలిగిన అనుభవమును పట్టి ఏర్పడిన మరణవాసన అతనికున్నట్లు ఊహింపబడు చున్నది. అందుచేతనే తల్లి ఒడిలోనుంచి జారినపుడు ఆ పసికందు కంపించుచు ఆమె మెడలోని మంగళసూత్రము గట్టిగా పట్టుకొనుచున్నాడు. దీనినిపట్టి ఈ క్రింది అనుమానప్రయోగములు చేయవచ్చును "వీనికి కలిగిన ఈ విధమైన కంపము భయమువలన కలిగినది; ఈ విధమైన కంపము కాబట్టి; అస్మదాదుల కంపము వలె" "వాని భయమునకు దుఃఖద్వేషస్మృతి నిమిత్తము, భయము కాబట్టి; అస్మదాదిభయము వలె" "భయజనక మైన ఈ స్థలనాదికమును ఇతడు దుఃఖజనకమని భావించుచున్నాడు; భయజనకము కాబట్టి;

In Public domain. Digitization Muthulakshmi Research Academy
అస్మదాదుల స్థలనాదికము వలె" "వీని స్మృతి పూర్వానుభవమువల్ల ఏర్పడినది; స్మృతి కాబట్టి, నా స్మృతి వలె". ఈ అనుమానములచేత పూర్వవాసనల ఉనికి తెలియబడుచున్నది. అందుచే ఇది స్వాభావికమని చెప్పుట కుదరదు. అట్లయితే ఆస్మదాదుల స్మృత్యాదికము కూడ స్వాభావికము, నిర్హేతుకము అని చెప్పవలసి ఉండును. ఇంక పద్మాదుల సంకోచవికాసాదులు కూడ స్వభావమాత్రముచేత కలుగుట లేదు. సూర్యరశ్మిసంపర్కము వికాసమునకు, స్థితిస్థాపకసంస్కారము సంకోచమునకు హేతువు. (చుట్టి ఉంచిన తాటాకుల చాప ఒక ప్రక్క విప్పుచున్నను మరొక ప్రక్కనుండి ముడుచుకొని పోవుచుండును. చాలా కాలము చుట్టి ఉంచుటచే ఏర్పడిన సంస్కారము అందుకు కారణము. దీనికి స్థితిస్థాపక సంస్కారమని పేరు.)

ఈ సందర్భమునందు భాష్యకారులు చిత్త (మనః) ప్రమాణమును గూర్చి చర్చించి ఉన్నారు. వైశేషికాదులు చెప్పినట్లు మనస్సు అణుప్రమాణము కాదు. దీర్ఘమైన జంతిగ మొదలైన వాటిని తినుచున్నప్పుడు ఒకే సమయమునందు ఐదు ఇంద్రియముల జ్ఞానము కలుగుచున్నది. దీర్ఘ మగుటచే కంటికి కనబడుచున్నది. సువాసన తెలియుచున్నది. కమ్మతనం మొదలైన రుచి, కరకరలాడించిన శబ్దము, స్పర్శ కూడ తెలియుచున్నవి. మనస్సు అణుప్రమాణమైనచో ఒకే సమయములో పంచేంద్రియములతో అది సంబంధించి తత్తద్ జ్ఞానములను కలిగింపజాలదు కదా? అందుచేత మనస్సు మధ్యమపరిమాణమని కొందరు చెప్పుచున్నారు. అనగా దేహప్రమాణమెంతో మనః పరిమాణము కూడ అంతే. ఘటములో సంకుచితముగా ఉన్న దీపప్రకాశము ఆ దీపమునే ప్రాసాదములో పెట్టినపుడు ప్రాసాదమునం దంతటా విస్తరించుచున్నది. అట్లే మనస్సుకూడ చిన్న మూషికాదిశరీరములలో సంకుచితముగా ఉన్నను హస్త్యాదిశరీరములలో విస్తరించును. మనస్సు శరీరము బైట ఉండి కార్యము ఏమీ చేయుట లేదుకదా. అందుచేత మనఃప్రమాణము దేహప్రమాణముతో తుల్యము. మరణానంతరము మృతదేహము విడచి ఈ మనస్సు ఆతివాహికశరీరముతో సంబంధించి దేహాంతరము చేరుచుండును గాన సంసారము కూడ యుక్తమే. (మరణానం

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తరము జీవుడు ఒక శరీరమును విడచిన పిమ్మట మరొక శరీరంలో ప్రవేశించే లోగా అర్చిరాద్యధిష్ఠానదేవతల (అగ్న్యాద్యధిష్ఠానదేవతల) అధీనములో ఉండును. వారు ఆతనిని ఆ క్రొత్తదేహములో చేర్చుదురు గాన వారికి ఆతివాహికులు అని పేరు బ్రహ్మసూత్రాదులలో చెప్పబడినది). అందుచేతనే "అంగుష్ఠమాత్రం పురుషం నిశ్చకర్ష యమో బలాత్" (యముడు సత్యవంతుని శరీరమునుండి అంగుష్ఠప్రమాణము గల పురుషుని బలాత్కారముగా లాగెను) అని భారతములో చెప్పబడినది. ఈ మతము యుక్తము కాదు. మనస్సు మధ్యమపరిమాణమైనచో అది ప్రలయములో నశించిపోవును గాన అది పురుషుని అదృష్టమునకు ఆధారముగా ఉండుట కుదరదు. అందుచే గగనమండలమువలె సర్వవ్యాపియైన అహంకారమునుండి జనించిన కార్యము గాన మనస్సు కూడ సర్వవ్యాపి. ధర్మాధర్మరూప నిమిత్తములను పట్టి ఈ మనస్సునకు శరీరదేశమునందు కలుగు వృత్తులకు (జ్ఞానాలకు)మాత్రమే సంకోచవికాసములు కాని మనస్సుకు సంకోచ వికాసములు లేవు. ఈ విధముగ మనస్సు అనంతవాసనలకు ఆధారమగుట కుదురును. పూర్వసూత్రమునందు చెప్పినట్లు వాసనలకు దేశవ్యవధానము కూడ కుదురును.

మధ్యమప్రమాణము గల చిత్తము ఆతివాహికశరీరముతో (ఆతివాహికుల శరీరముతో) కలియుట కుదరదు. ఆశ్రయము లేకుండగ ఇది ఆతివాహికశరీరములోనికి ఎట్లు వెళ్ళును? మరణానంతరము అతివాహిక శరీరములో ప్రవేశించేలోగా మరొక శరీరము పొందును అని కల్పించినచో అనవస్థాదోషము. అతివాహికశరీరముతో సంబంధించిన పిమ్మట దీనిని దేహమునుండి లాగుట అనేది కూడ కుదరదు. పూర్వముదేహమునుండి విడివడిన పిమ్మటనే అది అతివాహికదేహములో ప్రవేశించినది కదా? ఈ దోషమును తప్పించుటకు ఇట్లు చెప్పవచ్చును - "సృష్టి మొదలు మహాప్రళయము వరకు నశించకుండ, షాట్కౌశికమైన (ఆరు కోశములు గల) శరీరము మధ్యయందున్న సూక్ష్మశరీరము చిత్తమునకు ఆశ్రయము. చిత్తము ఆ శరీరములలో సంచరించుచుండును. ఈ షాట్కౌశిక శరీరమునుండి దీనిని

In Public domain. Digitization Muthulakshmi Research Academy

లాగుట కూడ యుక్తమే". ఇట్లు చెప్పుటకు కూడ ప్రమాణము లేదు. ప్రత్యక్షము లేదు. సంసారమును పట్టి ఊహించవచ్చును గాన అనుమానప్రమాణమున్నది కదా అనుటకు వీలులేదు. పైన చెప్పిన చిత్తవిభుత్వ (చిత్తము సర్వవ్యాపి అను) సిద్ధాంతమును అనుసరించి కూడ సారమును సమర్థించవచ్చును కదా. మరొక విషయ మెమనగా పురుషునిలాగెనని కదా శాస్త్రము చెప్పినది. చిత్తము కాని సూక్ష్మశరీరము కాని పురుషుడు కాదు. పరిణామశూన్యమైన చైతన్యమే పురుషుడు. ఆ పురుషుని లాగుట కుదరదు. అందుచేత లాగెను అని చెప్పుట ఔపచారికము. చైతన్యమునకు గాని, చిత్తమునకు గాని అక్కడ (ఆ శరీరమునందు) వృత్తి (జ్ఞానము) లేక పోవుటయే ఇక్కడ వికర్షణశబ్దార్థము. మరణానంతరము ప్రేతశరీరము వచ్చు నని, సపిండీకరణాదులచే అది తొలగిపోవునని స్మృతిపురాణాదులలో చెప్పినది అంగీకరింతుము గాని అది ఆతివాహికశరీరము కాదు. అది ఆతివాహిక శరీరమని ఏ ఆగమము చెప్పుటలేదు కదా? శరీరము లభించిన పిమ్మటనే యమ పురుషులచేత లాగబడును కాని ఆతివాహికశరీరముతో సంబంధించి ఉన్నప్పుడు కాదు. అందుచేత చిత్తము అహంకారజన్యము గాన, అహంకారము ఆకాశమువలె సర్వవ్యాప్తము గాన చిత్తము (మనస్సు) కూడ విభువే. అందుచేత దీనియందు కలిగే వృత్తి కూడ సర్వవ్యాపి. అందుచేతనే సర్వజ్ఞత్వము కుదురును (తత్త్వవైశారది).

విభువైన ఈ చిత్తమునందు వృత్తివికాససంకోచములు కలుగుటకు ధర్మాధర్మములు నిమిత్తము. ధర్మము బాహ్యము, ఆధ్యాత్మికము అని రెండు విధములు. శరీర ఇంద్రియ ధనాదుల అపేక్ష ఉన్న స్తుతి - దాన - అభివాద నాదికము బాహ్యానిమిత్తము. చిత్తమునకు మాత్రమే అధీన మైన శ్రద్ధా - వీర్య, స్మృత్యాదులు ఆధ్యాత్మికనిమిత్తము. అందుచేతనే బాహ్యాసాధనాపేక్ష లేని మైత్ర్యాదులు అధికముగా ధర్మవర్ధకములు అని చెప్పబడినది. అందుచేత మానసనిమిత్తము బలవత్తరము. కావుననే బాహ్యాసాధనమువలన కలిగిన ధర్మములు చిత్తజన్యములైన జ్ఞానవైరాగ్యములను మించజాలవు. చిత్తబలము లేనిచో కేవలశారీరకర్మచే ఎవరైన దండకారణ్యమును జనశూన్యమును

In Public domain. Digitization Muthulakshmi Research Academy

చేయగలరా? (శుక్రుడు దండకదేశరాజుపై కోపించి ఏడు రోజుల రాళ్ళవాన కురిపించి అక్కడి మనుష్యులనందరినీ నశింపచేసెనట) (అగస్త్యునివలె ఎవరైన సముద్రమును త్రాగగలరా) (వ్యా.భా)

అవ. ఈ చిత్తవృత్తులు, వాసనలు అనాదులైనచో అవి ఎట్లు ఉచ్ఛిన్నము లగును? అనాదియైన చైతన్యము ఉచ్ఛిన్నమగుట లేదు కదా? అవి ఉచ్ఛిన్నము కానిచో మోక్షమెట్లు వచ్చును? అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

సూ. హేతుఫలాశ్రయాలమ్బనైః సంగృహీతత్వాదేషామభావే తదభావః. 11

ప్ర.అ. హేతుఫలాశ్రయాలమ్బనైః = హేతువుచేత, ఫలముచేత, ఆశ్రయము చేత, ఆలంబనము చేత, సంగృహీతత్వాత్=సంగ్రహింపబడిన వగుట వలన, ఏషామ్ = ఈ హేత్వాదులయొక్క అభావే = అభావమునందు, తదభావః = వాసనల అభావము.

వ్యా. హేతువు – ధర్మమువలన సుఖము, అధర్మమువలన దుఃఖము, సుఖమువలన దానిపై రాగము, దుఃఖమువలన దానిపై ద్వేషము పిమ్మట ప్రయత్నము. దానిచే మనోవాక్కాయముల ద్వారా స్పందించుచు ఇతరుని అనుగ్రహించును లేదా చంపును. ఈ విధముగా నిరంతరమూ తిరుగుచున్న ఈ సంసారచక్రమునకు ధర్మాధర్మములు, సుఖదుఃఖములు, రాగద్వేషములు అనునవి ఆరు అరములు (ఆకులు). ప్రతిక్షణమూ తిరుగుచున్న ఈ సంసార చక్రమును నడిపించునది అవిద్య. కావున సర్వకేశములకు హేతువు అవిద్య, దేనిని ఉద్దేశించి ధర్మాధర్మములు ప్రవర్తించుచున్నవో అది ఫలము. వాసనలకు కూడా అదే ఫలము. వాసనల ఆశ్రయము మనస్సు, వాసనలను అభివ్యక్తము చేయు కామినీ దర్శనాదికము (వాసనలకు) ఆలంబనము. వాసనలు అన్నీ ఈ హేత్వాదులచేత వ్యాప్తములై ఉన్నవి. అనగా ఎక్కడెక్కడ హేత్వాదులు ఉండునో అక్కడ వాసనలుండును. ఇవి తొలగిపోయినచో వాసనలు కూడా నశించును. అనాదులైనను వాసనలు నశించును గాన మోక్షము లభించును. చైతన్యము నశించుటకు కారణమేదీ లేదు గాన అది నశించుటలేదు కాని అది నశించకుండుటకు అనాదిత్వము కారణము కాదు. 11

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ. లేనిది పుట్టదు; ఉన్నది నశించదు కదా? ఉన్న వాసనలు ఎట్లు నశించును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు. (ఇది వ్యాసభాష్యం ప్రకారము అవతారిక. కాని దీనికి సమాధానము రాబోవు సూత్రములలో లభించదు. రాబోవు సూత్రము మొదలు కొన్ని సూత్రములలో లభించును). భావాగణేశ వృత్తిలోని అవతారిక ఈ విధముగా ఉన్నది - ఇంతవరకు మోక్షయోగ్యమైన చిత్తమును గూర్చి, తద్భిన్నమైన చిత్తమువలన బంధము కలుగుటను గూర్చి వాసనల ఉచ్చేదము సంభావ్యమే అను విషయమును గూర్చి చెప్పబడినది. ఇటుపై "విశేషదర్శినః........నివృత్తిః" అను సూత్రము వరకు (25) ఉన్న సూత్రములలో మోక్షకారణమైన వివేకజ్ఞానాపరనామధేయము గల సమ్యగ్ జ్ఞానమునకు విషయము, లక్షణము మొదలైనవాటిని సవిస్తరముగా చెప్పవలసి ఉన్నది. ఈ విషయములన్నీ ద్వితీయ పాదములోనే చెప్పబడినవి కదా అని ఆశంకించవచ్చును. ఆ విషయములనే యుక్తులచే సమర్థించుటకు అక్కడ చెప్పని విషయాలను చెప్పుటకు ఇక్కడ ప్రయత్నము జరుగుచున్నది. ముందు వికారముల స్వరూపము పరీక్షింపబడుచున్నది.

సూ. అతీతానాగతం స్వరూపతోఽస్త్యధ్వభేదాద్ధర్మాణామ్. 12

ప్ర.అ. ధర్మాణామ్=కార్యములకు, అధ్వభేదాత్=మార్గభేదము-వలన, అతీతానాగతమ్=అతీతము, అనాగతము కూడ, స్వరూపతః= స్వరూపము వలన అస్తి = ఉన్నది.

వ్యా. కార్యములు అతీత (భూత) అనాగత (భవిష్యత్ వర్తమాన కాలములలో సంచరించుచుండును (సంబంధించును) గాన వాటికి "అధ్వ" (మార్గము) అని పేరు. కార్యములు భూతభవిష్యద్వర్తమానములలో వివిధావస్థలను పొందుచుండును. అవి వర్తమానమునందున్నట్లే భూత భవిష్యత్తులలో కూడ స్వరూపముచేత ఉన్నవి. కేవలము వర్తమానమునందు అభివ్యక్తమగుచున్నవి. భూతభవిష్యత్కాలములకు సంబంధించినంతవరకు అవి అభివ్యక్తములు కావు అంతే భేదము. ధర్మిరూపమున వాటికి భూతభవిష్యత్తులలో కూడ సత్త ఉన్నది. ధర్మి లేకపోయినచో అతీతత్వాది ధర్మములు కూడ ఉండవు కదా!

భవిష్యత్తులో అభివ్యక్తి పొందనున్న అనాగతము, అనుభవింపబడిన అభివ్యక్తి గల అతీతము, స్వవ్యాపారమునందున్న వర్తమానము ఈ విధముగ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

త్రివిధములైన వస్తువులు కూడ జ్ఞానమునకు విషయములగుచున్నవి. ఇవి స్వరూపముతో ఉండకపోయినచో విషయమే లేని జ్ఞానము పుట్టినదని చెప్పవలసి ఉండును. విషయములేని జ్ఞానముండదు కదా? అందుచేత అతీతము, అనాగతము కూడ వాటి స్వరూపముచేత ఉన్నవని చెప్పవలెను. భోగమును గాని, అపవర్గమును గాని ఉద్దేశించి కుశలులు కర్మ చేయుచున్నారు కదా? ఆ ఫలము గగనకుసుమమువలె తుచ్ఛమైనచో అట్లు కర్మచేయుట అయుక్తము కదా? ఇపుడు చేయు కర్మ ఉన్న ఫలమునే వర్తమానముగా చేయుటకు ఉపకరించును గాని లేనిదానిని పుట్టింపజాలదు. ధర్మి అనేకధర్మములు (కార్య ములు) కలది. కాలభేదముచేత దాని ధర్మములు వేరు వేరుగా కనబడుచుండును. అభివ్యక్తిని పొందిన వర్తమానధర్మము ధర్మియందు ఉన్నట్లే అతీత అనాగత ధర్మములు కూడ ధర్మియం(ద్రవ్యమునం) దున్నవి. అనాగతము అభివ్యక్తము కావలసిన స్వరూపముతోను, భూతము పూర్వమే అభివ్యక్తిని పొందిన స్వరూపము తోను ధర్మియందు ఉండును. వర్తమానమైన ధర్మమునకు మాత్రమే స్వరూపాభివ్యక్తి ఉన్నది గాని అతీతానాగతములు అభివ్యక్తి లేదు. ఈ విధముగ ఒక ధర్మము ఉన్న సమయమునందు మిగిలిన రెండు ధర్మములు ధర్మితో సంబంధించి ఉండును గాన మూడు అధ్వలలో ఏ ఒక్కదానికీ కూడ లేనిది పుట్టుట అనునది లేదు. (వ్యా భా.)

అవ. కార్యస్వరూపమును పరీక్షించి కారణస్వరూపమును పరీక్షించు చున్నాడు -

సూ. తే వ్యక్తసూక్ష్మా గుణాత్మానః. 13

ప్ర.అ. వ్యక్తసూక్ష్మాః = వ్యక్తములు సూక్ష్మములు అయిన, తే = ఆ ధర్మములు (కార్యములు), గుణాత్మానః = గుణస్వరూపములు.

వ్యా. వ్యక్తములైనా, అవ్యక్తములగుటచేత సూక్ష్మములైనా ఆ కార్య రూపములైన ధర్మములు సత్వాదిగుణత్రయస్వరూపములే. "వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్" "ఘటాది వికారములు మాటచేతనే ప్రారంభింపబడుచున్నవి. పేరు మాత్రమే; అసలు సత్యమైనది మట్టి మాత్రమే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అని శ్రుతి చెప్పుచున్నది. ఈ విషయమును షష్ఠిశాస్త్రములోని ఈ క్రింది కారిక కూడ స్పష్టీకరించుచున్నది.

"గుణానాం పరమం రూపం న దృష్టిపథమృచ్ఛతి,

యత్తు దృష్టిపథం ప్రాప్తం తన్మాయేవ సతుచ్ఛకమ్".

గుణముల అసలు స్వరూపము కనబడదు కనబడేది మాయవలె చాల తుచ్ఛము; అనగా అత్యంతము అనిత్యము అని దీని భావము. వికారములన్నీ మాయవంటివి, మాయ కాదు. మాయ చూచుచుండగానే నశించినట్లు త్రిగుణవికారము కూడ నశించును గాన మాయవంటివని చెప్పబడినది. గుణత్రయము మాత్రము అట్టిది కాదు గాన నిత్యము. ఒకే విధముగా ఉండే గుణత్రయమునుండి ప్రధానమునుండి, ఇంత విచిత్రమైన సృష్టి ఎట్లు కలుగుచున్నది? అని ఆశంకకు తావు లేదు, ఎందుచేతననగా అనాది క్లేశవాసనలచే ఆ వైచిత్ర్యము కలుగుచున్నది. ఈ విధముగా దృశ్యపదార్థము లన్నీ గుణముల పరిణామములే అగుటచే గుణస్వరూపములే. కార్యమునకు కార్యాత్మకము, కారణాత్మకము అయిన రెండు రూపములున్నవి. వీటిలో కార్యరూపత్వము ఆద్యంతములలో లేదు; కారణరూపత్వము మాత్రము సర్వదా ఉన్నది. అందుచేత అదే కార్యముల పారమార్థికరూపము. అందుచేతనే జగత్తు మాయామాత్రమని అందురు. ఆది యందు కాని అంతమునందు కాని లేని మిథ్యయైన వస్తువును రచించుటకు హేతువైన వ్యామోహకశ క్తినే 'మాయ' అనుచున్నారు.

అవ. లోకములోని పదార్థములన్నీ అనేకగుణ (త్రిగుణ) రూపములు కదా; "ఒక శబ్దతన్మాత్రము" "ఒక చక్షురింద్రియము" ఇత్యాది వ్యవహారము ఎట్లు కలుగును? కారణములనేకములైనపుడు కార్యములు కూడ అనేకములు కావలెను కదా అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు. –

సూ. పరిణామైకత్వాద్వస్తుతత్త్వమ్. 14

ప్ర.అ. పరిణామైకత్వాత్ = పరిణామముయొక్క ఏకత్వమువలన, వస్తు తత్త్వమ్ = వస్తువులకు ఏకత్వము చెప్పబడుచున్నది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యా. గుణములు అనేకములే అయినను వాటి పరిణామము ఏకజాతీయకముగా ఉండుటచే ఆ యా శబ్దాదివిషయములు, శ్రోత్రాందీంద్రియములు కూడ ఏకరూపములని వ్యవహారము జరుగుచున్నది. గుణములలో సత్త్వమునకు ప్రాధాన్యమున్నపుడు ఇంద్రియరూపపరిణామము, తమస్సు ప్రధానముగా ఉన్నప్పుడు విషయరూపపరిణామము జరుగుచున్నది. సత్త్వాదుల ప్రాధాన్యమున్నను శబ్దాదులు మూడు గుణములనుండి పుట్టుచున్నవి గాన ఒక శబ్దము అని కాక "మూడు శబ్దములు" ఇత్యాది ప్రతీతి ఉండవలెను. అయినా ఆ మూడు గుణాల పరిణామము ఒక్కటే అగుటచే "ఒక శబ్దము" ఇత్యాది వ్యవహారము అనుపపన్నము కాదు. నూనె, వత్తి, అగ్ని ఈ మూడింట పరిణామఫలితముగా ఒక దీపము కనబడుచున్నది కదా అని భావము.

ఈ సందర్భమున భాష్యకారుడు విజ్ఞానవాదులైన బౌద్ధుల మతమును ప్రదర్శించి నిరాకరించినాడు. తన్నిరాకరణము రాబోవు సూత్రములలో ఉండు టచే భాష్యకారుడు ముందుగానే ప్రారంభించినాడు. విజ్ఞానవాదుల అభిప్రాయము ప్రకారము విజ్ఞానముకంటె వేరుగా భూతములు కాని, భూతజన్యములైన పదార్థములు కాని వాస్తవముగా లేవు. అందుచేత ఆ పదార్థములకొక కారణము ప్రధానమనేది ఉన్నదనీ, ఆ పదార్థములను గ్రహించే అహంకారవికారములైన ఇంద్రియములు ఉన్నవనీ చెప్పుట అనావశ్యకము. జడపదార్థము స్వయముగా ప్రకాశింపజాలదు. విజ్ఞానముచేతనే అది ప్రకాశించును. అందుచేత విజ్ఞానసంబంధము లేని జడపదార్థము లేదు. ఇంక విజ్ఞానము స్వప్రకాశము గాన విజ్ఞానము ప్రకాశించుటకు జడపదార్థాపేక్ష లేదు గాన పదార్థ సంబంధము లేని విజ్ఞానమున్నదని అంగీకరించవలెను. ఈ విధముగ రెండు అనుమాన ప్రయోగములచే విజ్ఞానమునకు, పదార్థములకు అభేదమును అనగా విజ్ఞానముకంటె వేరుగా పదార్థము లేదను విషయమును సాధించవచ్చును. 1. ఏది ఏ జ్ఞానముచేత తెలియబడునో అది ఆ జ్ఞానముకంటె భిన్నముకాదు. ఉదా. విజ్ఞానస్వరూపమువలె. 2. ఏది దేనితో సహోపలంభమో (దేనితో కలిసి మాత్రమే తెలియబడునో) అది దానికంటె

In Public domain. Digitization Muthulakshmi Research Academy
భిన్నము కాదు. ఉదా – ద్వితీయచంద్రుడు వలె. కంటి దోషము ఉన్న వానికి చంద్రుని ప్రక్కనే కనబడే రెండవ చంద్రుడు అసలు చంద్రునికంటె వేరు కాదు కదా. అందుచేత విజ్ఞానముకంటె భిన్నముగా కనబడుచున్న పదార్థము, స్వప్నపదార్థము వలె కల్పితము మాత్రమే.

ఈ విజ్ఞానవాదము యుక్తము కాదు. ప్రతిజ్ఞానములోను విషయమై వేరు వేరుగా "ఇది, ఇది" అని పదార్థము కనబడుచున్నప్పుడు అది లేదని చెప్పుట ఎట్లు కుదురును? గ్రాహ్యమైన పదార్థము తనలోని ఒక విధమైన శక్తిచేత విజ్ఞానమును పుట్టించుచున్నది. ఆ విజ్ఞానము అప్రమాణము (భ్రాంతి) అని చెప్పుచు ఉన్న పదార్థమును కప్పివేయుచున్న (లేదని చెప్పుచున్న) ఈ విజ్ఞానవాదుల వాక్యము విశ్వాసార్హ మెట్లగును?

అవ. విజ్ఞానముకంటె భిన్నముగా పదార్థము (గ్రాహ్యము) ఉన్నదని యుక్తిని చెప్పుచున్నాడు.

సూ. వస్తుసామ్యే చిత్తభేదాత్తయోర్విభక్తః పన్థాః. 15

ప్ర.అ. వస్తుసామ్యే=వస్తువునకు ఏకత్వముండగా, చిత్తభేదాత్ చిత్తముల యొక్క(విజ్ఞానములయొక్క)భేదమువలన, తయోః= వస్తుచిత్తముల యొక్క పన్థాః = మార్గము, విభక్తః = వేరైనది.

వ్యా. బౌద్ధమతము ప్రకారము క్షణికవిజ్ఞానపరంపరయే చిత్తము గాన ఇక్కడ చిత్తశబ్దమునకు విజ్ఞానమని అర్థము. ఒకే ఘటము అనేకజ్ఞానములకు ఆలంబనముగా ఉన్నది. అనగా చాలామందికి ఒకే ఘటమును గూర్చిన జ్ఞానము కలుగుచున్నది. ఒకే కాంతయందు ఆమె కాంతునికి సుఖజ్ఞానము; సపత్నులకు దుఃఖజ్ఞానము ఆమెను పొందజాలని దేవదత్తునికి మూఢత్వజ్ఞానము కలుగుచున్నది. ప్రమాతలు (తెలుసుకొన్నవారు అందరూ ఒకరినొకరు సంప్రదించుకొని తాము అందరూ ఒక ఘటమును చూచినట్లు నిర్ణయించుకొనుచున్నారు. అందుచే విజ్ఞానములు వేరు. వాటికి విషయమైన పదార్థము వేరు. అది వాస్తవమని తెలియుచున్నది. కావున చిత్తమాత్ర పరికల్పితమగుటచే అంతా స్వప్నపదార్థమువలె అసత్తు అని చెప్పుట కూడ కుదరదు. సాంఖ్య మతప్రకారము ఒక వస్తువు త్రిగుణాత్మకము గాన వేరు వేరు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనుష్యులకు వేరు విధముల జ్ఞానమును కలిగించునని చెప్పుట కుదురును. జ్ఞానము కూడ ధర్మాదులను పట్టి కలుగుచుండును. అందుచేత అందరికీ ఒక వస్తువు విషయమున ఒకే విధమైన జ్ఞానము కలుగదు. ధర్మాపేక్షమైన సత్త్వము రజోగుణసహితమై దుఃఖజ్ఞానమును కలిగించును. అధర్మాపేక్షమైన రజోగుణము తమోగుణసహితమై సుఖజ్ఞానమును కలిగించును. బలవదధర్మాపేక్షమైన తమోగుణము రజోగుణసహితమై మూఢవిజ్ఞానమును కలిగించును. విద్యాపేక్షమైన సత్త్వగుణము రజస్తమోగుణములు తొలగిపోగా మోక్షహేతువైన మాధ్యస్థ్యజ్ఞానమును కలిగించును.

అవ. జ్ఞానముకంటె వేరుగా పదార్థము ఉన్నదని అంగీకరించినను ఆది జ్ఞానముచేతనే ప్రకాశింపచేయబడును గాన జ్ఞానసమయమునందే ఉన్నది గాని ఇతర సమయములలో లేదు. సుఖదుఃఖాదులవలె పదార్థము కూడ భోగ్యమే గాన సుఖదుఃఖజ్ఞానసమయమునందే సుఖదుఃఖములున్నట్లు జ్ఞానసమయమునందు మాత్రమే ఉండుటచే అది జ్ఞానముతో పాటు పుట్టుచున్నది అని కొందరు చెప్పుదురు. దీనికి "దృష్టి సృష్టివాదము" అని పేరు. దానిని నిరాకరించుచున్నాడు.

సూ. న చైకచిత్తతన్త్రం వస్తు తదప్రమాణకం తదా కిం స్యాత్. 16

ప్ర.అ. వస్తు=పదార్థము, ఏకచిత్తతన్త్రమ్ = ఒక చిత్తమునకు మాత్రము అధీనమైనది. న చ=కాదు, తదప్రమాణకమ్ = ఆ విజ్ఞానము ప్రమాణముగా= కలది కానిచో, తదా=అప్పుడు, కిం స్యాత్=ఉండునా?

వ్యా. భావాగణేశనాగేశులు తత్ప్రమాణకమ్ అను పాఠమును గ్రహించి వ్యాఖ్యానించినారు కాని సమన్వయము కుదురుటలేదు. వ్యాసభాష్యము ప్రకారము "తదప్రమాణకమ్" అని పాఠము, పై మతము ప్రకారము ఒక జ్ఞానము ఒక పదార్థమును సృష్టించుచున్నది గాని ఆ పదార్థము ఆ జ్ఞానమునకు ఆధీనమై ఉండునని చెప్పవలెను. అది యుక్తము కాదు. పుటజ్ఞానము కలిగివరికి వెంటనే పటజ్ఞానము కలిగినప్పుడు ఆ పటము లేకుండ పోవలసి వచ్చును. అనగా ఘటము ఆ జ్ఞానమువలన పుట్టినది గాన ఆ జ్ఞానము పోయిన వెంటనే ఘటము కూడ పోవలెను కదా! అప్పుడు మరు క్షణమును ఆ ఘటజ్ఞానము కలుగదు. ఘటాదికార్యములన్నియు వాటి వాటికి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నియతములుగా ఉండవలసిన కారణములద్వారా జనించును గాని జ్ఞానముద్వారా జనించవు. అట్లైనదో అశామోదకములతో (ఊహించుచున్న మోదకములతో) నిజమైన మోదకములతో కలిగినట్లు తృప్తి కలుగవలెను. ఒక వస్తువు మధ్యభాగము జ్ఞానము కలుగుచున్నప్పుడు దాని పూర్వపశ్చాద్భాగాదుల జ్ఞానము లేదు గాన అవి లేవని చెప్పవలెను. అవి లేనిచో వాటిని అంటిపెట్టుకొని ఉందు మధ్యభాగము కూడ ఉండ కూడదు. అందుచే సర్వపురుషసాధారణములైన పదార్థములు స్వతంత్రముగా ఉన్నవి. ప్రతి పురుషుని విషయమున చిత్తములు స్వతంత్రముగా ప్రవర్తించుచున్నవి, ఆ చిత్తపదార్థముల సంబంధము పురుషుని భోగమునకు హేతువు అని అంగీకరించవలెను (భోజవృత్తి ప్రకారము ఈ సూత్రము లేదు)

అవ. పదార్థము స్వతంత్రమైనచో అది ఒడస్వభావము గాన అది ఎన్నడూ ప్రకాశించకూడదు. ప్రకాశించినచో దాని జడత్వస్వభావము తొలగిపోయినప్పుడు ఆ భావమే (పదార్థమే) తొలగిపోవలసి ఉండును. స్వభావము పోయినచో దానిని విడిచి భావము కూడ ఉండదు కదా? జడస్వభావమే అయినను పదార్థమునందు ఇంద్రియాదులచే ఆహితమై (ఉంచబడి) ఒక ధర్మము ప్రకాశించుచుండును అని చెప్పుటకు కూడ వీలు లేదు. నీలాదులవలె అది పదార్థధర్మమైనచో శాస్త్రార్థము సర్వపురుషులకు సాధారణము గాన అందరూ పండితులే అయిపోవుదురు. మూర్ఖుడనువాడే ఉండదు. అతీతానాగతవిషయముల మీద ఇప్పుడు ధర్మము (ఇంద్రియాదులచే) పుట్టింపబడుట అనునది కూడ కుదరదు. అందుచే స్వతంత్ర మైన పదార్థము ఉన్నదనీ, అది జ్ఞానవిషయమనీ చెప్పుట కేవలము మనోరథమే కాని యుక్తి సంగతము కాదు అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు. (తత్త్వవైశారది).

సూ. తదుపరాగాపేక్షిత్వాచ్చిత్తస్య వస్తు జ్ఞాతాజ్ఞాతమ్. 17

ప్ర.అ. చిత్తస్య=చిత్తము, తదుపరాగాపేక్షిత్వాత్=పదార్థముల యొక్క ఉపరాగమును ఆపేక్షించుటచే, వస్తు=పదార్దము, జ్ఞాతాజ్ఞాతమ్= జ్ఞాతముగాను అజ్ఞాతముగాను ఉండవచ్చును.

వ్యా. పదార్థము జడస్వభావమే అయినను అది ఇంద్రియముల ద్వారా చిత్తమును ఉపరంజింపచేయును (తన ఛాయను చిత్తముపై ప్రసరింప చేయును). పదార్థము అయస్కాంతము వంటిది. చిత్తము అయస్సు వంటిది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

చిత్తమునందు ప్రతిబింబించిన చైతన్యశక్తి చిత్తమును ఉపరక్తము చేసిన పదార్థమును అనుభవించును. అంతే కాని పదార్థమునందు విశేషధర్మమేదీ ఆహితము కాదు. వెనుక చెప్పినట్లు సర్వగతమైన అహంకారము కార్యములైన చిత్తేంద్రియములు కూడ సర్వగతములే అగుటచే వాటికి విషయసంబంధము ఎల్లప్పుడూ ఉన్నను ఏ శరీరమునందు చిత్తమునకు వృత్తి కలిగినదో ఆ చిత్తముతో విషయములకు సంబంధము కలిగినపుడు భోగము కలుగునని గ్రహించవలెను. (తత్త్వ వైశారది). ఈ విధముగ ఇంద్రియముల ద్వారా విషయ సంబంధము ఏర్పడినపుడు ఆ విషయము జ్ఞాతమగును. కానిచో అజ్ఞాతముగా ఉండును. స్వభావము చేతను, జ్ఞాతాజ్ఞాతవస్తుస్వరూపము కలదగుటచేతను చిత్తము పరిణామము కలది. వస్తుజ్ఞానసమయమున ఒకవిధమైన పరిణామము తదభావసమయమున మరొకవిధమైన పరిణామము చిత్తమునకుండునని అర్థము.

అవ. చిత్తముకంటె భిన్నముగ విషయములు (పదార్థములు) ఉన్నవను విషయమును స్థాపించి పరిణామస్వభావములైన విషయములకంటె వ్యతిరిక్తుడైన పురుషుని నిరూపించుటకును, విషయములవలె పురుషుడు పరిణామి కాడని ప్రతిపాదించుటకును చెప్పుచున్నాడు.

సూ. సదాజ్ఞాతాశ్చిత్తవృత్తయస్తత్ప్రభోః పురుషస్యాపరిణామిత్వాత్.18

ప్ర. అ. తత్ప్రభోః = చిత్తవృత్తుల భోక్తయై, వాటి ప్రభువైన, పురుషస్య పురుషుడు, అపరిణామిత్వాత్=పరిణామము లేనివాడగుట-వలన, చిత్తవృత్తయః = చిత్తవృత్తులు, సదా=ఎల్లప్పుడు, జ్ఞాతాః = (పురుషునకు) తెలియబడినవి.

వ్యా. చిత్తమునకు ఉపరక్తత్వాదులుండును. అందుచే దానికి విషయములను ఒకప్పుడు గ్రహించుట ఒకప్పుడు గ్రహించకుండుట ఉండును. అందుచే అది పరిణామము కలది. కాని చిత్తవృత్తి భోక్తయైన పురుషునకు ఉపరక్తత్వాదులుండవు. గాన పరిణామము లేదు. అందుచేత చిత్తవృత్తులు సర్వదా పురుషునకు తెలిసియే ఉండును. తెలియకపోవుట అనేది

In Public domain. Digitization Muthulakshmi Research Academy
లేదు. ఈ విధముగ వృత్తిసహిత మైన మనస్సును సర్వదా తెలిసికొనుటను బట్టి పురుషుడు పరిణామరహితుడని ఊహించ వలెను.

అవ. చిత్తవృత్తులే అగ్నివలె స్వప్రకాశములని చెప్పవచ్చును కదా? ఆ వృత్తులను తెలిసికొనే పురుషుడొకడున్నట్లు అంగీకరించుట ఎందుకు? అను బౌద్ధుల ఆశంకకు సమాధానము చెప్పుచున్నాడు.

సూ. న తత్స్వాభాసం దృశ్యత్వాత్. 19

ప్ర.అ. తత్ = ఆ చిత్తము, దృశ్యత్వాత్ = దృశ్యమగుటవలన, స్వాభాసమ్ = స్వప్రకాశము, న = కాదు.

